

న్యూఢిల్లీ: తాను రచించిన 'స్పీకింగ్ ట్రూత్ టు పవర్' పుస్తకావిష్కరణకు మంగళవారం విచ్చేసిన మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీతో మాజీ ఆర్థికమంత్రి పి.చిదంబరం కరచాలనం

ఆంధ్రప్రభ


Estd. 1938
www.prabhanews.com
Journalism first!

సంపుటి: 62 • సంచిక: 21 • బుధవారం 31 జనవరి 2018 • విజయవాడ * పేజీలు: 14 • వెల: 5.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం
శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం, తిథి: పూర్ణిమ రా. 7.45 వరకు; నక్షత్రం: పుష్యమి సా. 6.35 వరకు, అనంతరం ఆశ్లేష; అమృతకాలం: మ. 12.40 నుండి 2.10 వరకు; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ. 11.36 నుండి 12.24 వరకు; రాహుకాలం: మ. 12.00 నుండి 1.30 వరకు; యమగండం: ఉ. 7.30 నుండి 9.00 వరకు; విశిష్టత: రాహుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం



పోలవరంలో నవయుగం



- తొలగిన ప్రతిష్టంభన
- కేంద్రమంత్రి గడ్కరీ ఆమోదం
- పాత ధరలకే కాంట్రాక్ట్
- నవయుగ సంస్థకు స్పిల్‌వే, స్పిల్ ఛానల్ పనులు
- ఢిల్లీలో ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశం

జమిలికి బీజేపీ, టీడీపీ జోడీ సిద్ధం!

ఇది రాజకీయ నిర్ణయమేనని అంచనాలు

బడ్జెట్‌లోనూ భారీగా నిధుల కేటాయింపు?


ఏలూరు, ప్రభ న్యూస్: కేంద్ర సర్కారు పోలవరంపై సానుకూలంగా స్పందించింది. సకాలంలోనే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అడుగులు వడివడిగా వేస్తోంది. కీలకమైన పోలవరం స్పిల్‌వే..స్పిల్ చానల్ పనులకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పోలవరంపై మంగళవారం ఢిల్లీలో జరిగిన కీలక భేటీలో కేంద్ర జలవనరుల మంత్రి నితిన్‌గడ్కరీ ఈ మేరకు ఏపి ప్రజలకు తీపి కబురు అందించే నిర్ణయం తీసుకున్నారు. గత చాలా రోజులుగా మంత్రి గడ్గరీ నోట వెంట ఈ సానుకూల నిర్ణయం వినేందుకే రాష్ట్ర ప్రజానీకం తహతహలాడింది. చివరకు ప్రధాని మోడీ ఏపీ ప్రజానీకాన్ని కాస్తంత ఆలస్యంగానైనా సరే తృప్తి పర్చే నిర్ణయాన్నే గడ్గరీ నోట చెప్పించారు. స్పిల్‌వే పనులపై ఎంతకూ కేంద్రం మౌన ముద్ర వీడకపోవడంతో విపక్షాలు సైతం ఇదో అవకాశంగా తీసుకుని మిత్రులైన చంద్రబాబు, మోడీలపై విమర్శలు

3వ పేజీలో...

ఎన్నికలకు సిద్ధంకండి!

ఇక పార్టీపైనే దృష్టి

- జన్మభూమి కమిటీలతో చెడ్డపేరు
- వెంటనే మార్పులు, చేర్పులు అవసరం
- సమన్వయంతో కమిటీలు పనిచేయాలి
- విపక్ష నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి
- దళిత తేజం తరహాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్యక్రమాల రూపకల్పన
- సమన్వయ కమిటీ భేటీలో చంద్రబాబు



అమరావతి, ఆంధ్రప్రభ : సార్వత్రిక ఎన్నికలు ముందుగా వస్తాయన్న వార్తల నేపథ్యంలో అందుకనుగుణంగా పార్టీ నాయకులు సన్నద్ధంగా ఉండాలని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. సచివాలయంలో మంగళవారం జరిగిన పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, జన్మభూమి కమిటీలు, సాధికార మిత్ర, ముందడుగు, ఆదరణ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఇప్పటివరకు పరిపాలనపై దృష్టి సారించారని, ఇక నుంచి పార్టీ పురోగతిపై దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, లోక్‌సభ ఇన్‌చార్జిలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు ఇన్‌చార్జిలు నెలకు 4,5 రోజులు దృష్టి కేంద్రీకరించాలన్నారు. ప్రతి గ్రామం పార్టీకి కంచుకోటగా మారేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాభివృద్ధితోపాటు పార్టీ కూడా అభివృద్ధి చెందాలన్నారు. పంచాయతీ సభ్యులు, జన్మభూమి కమిటీలు, సేవామిత్ర, సాధికార మిత్ర, సమన్వయంతో పనిచేసి పార్టీని పటిష్టపరచాలన్నారు. జన్మభూమి

3వ పేజీలో...

భారత్‌లో బీపీ, షుగర్ ఎక్కువ!

- పురుషుల్లోనే అధికం
- అధ్యయనంలో వెల్లడి

7లో

రూ.35 లక్షల నగల చోరీ!

- ఆభరణాల బ్యాగు మాయం

7లో

నల్లధనం ఎంతొచ్చింది?

- లెక్క చెప్పాలని ఆర్థిక శాఖకు సీఐసీ ఆదేశం

2లో

జడ్జిల జీతం రెండు రెట్లు!

- పెంపునకు రాష్ట్రపతి ఓకే

2లో



వేర్పాటు పిడికిళ్లపై మోడీ గురి!

- ఎన్నికల తర్వాత కార్యాచరణ
- బలం పుంజుకుని బలప్రయోగం
- ఎమర్జెన్సీ పెట్టైనా పెకలించాలి
- ఇదే ప్రధాని మోడీ భావి వ్యూహం
- అస్థిత్వం కోసం దక్షిణాది తహతహ
- ఏకాకులమయ్యామని బెంగాలీలు



(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)
అఖండ భారతంలోని అన్నిమతాలు, కులాలు, వర్గాలు, ప్రాంతాలకతీతంగా భారతీయులంతా ఏకతాటిపైకొచ్చి దీర్ఘకాలం సాగించిన సంగ్రామ ఫలితంగా సాధించుకున్న స్వతంత్ర భారత్‌లో ఏడు దశాబ్ధాల అనంతరం తిరిగి వేర్పాటువాద ఆకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవలె ప్రముఖ తమిళనటుడు కమలహాసన్ ద్రావిడల పట్ల ఆర్యసంతతికి చెందిన ఉత్తరాది పాలకుల అణివేత ధోరణిని ఇక సహించేది లేదంటూనే దక్షిణభారతం మరోదేశంగా ఏర్పడి తన అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరమొచ్చిందంటూ పేర్కొన్నారు ఢిల్లీ పాలకులు దక్షిణ భారతీయుల్ని ఇప్పటికీ కూడా రెండోజాతి పౌరులుగానే పరిగణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉనికి కోసం సమానత్వం కోసం తామెంతగా ప్రాకులాడుతున్నా పట్టించుకోని కేంద్రానికి తగిన బుద్ధి చెప్పాలంటే దేశం నుంచి విడిపోవడమొక్కటే దారంటూ ప్రతిపాదించారు. పశ్చిమబెంగాల్ లో కూడా గతకొన్నేళ్ళుగా ఇలాంటి వేర్పాటుధోరణి పెరుగుతోంది. మమత ముఖ్యమంత్రి అయ్యాక కేంద్రం తమను చిన్నచూపు చూస్తోందన్న భావం బెంగాలీల్లో నాటుకుపోతోంది. కేంద్రప్రభుత్వ పథకాల అమలునుంచి అన్నింటా బెంగాలీల పట్ల సవతితల్లి ప్రేమ వ్యక్తమౌతోందన్న ఆవేదన వారిలో పెరుగుతోంది. స్వతంత్ర పోరాటంలో బెంగాలీలు కీలకపాత్ర పోషించారు. ఆ తర్వాత కమ్యూనిస్ట్ ఉద్యమంలో వారు రాటుదేలారు. ఒకప్పుడు బెంగాలీ అంటే దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపునకు నోచుకునేవారు. ఏ రంగంలోనైనా వారే ముందుండేవారు. అలాంటి బెంగాలీలు గతకొన్నేళ్ళుగా వెనుకబాటుకు గురౌతున్నారు. ముఖ్యంగా తామెన్నుకున్న

3వ పేజీలో...



ఆకాశంలో అద్భుతం

నేడు 3 చందమామలు

సూపర్ మూన్.. బ్లూ మూన్.. బ్లడ్ మూన్

ఏకబిగిన ఐదు గంటల పాటు చంద్రగ్రహణం

బుధవారం సాయంత్రం అతి పెద్దగా దర్శనమిచ్చే చందమామ కొద్దిసేపటికే చిన్నబోతాడు. నీలిరంగును పులుముకున్న చంద్రుణ్ణి భూ ఛాయ కమ్ముకోవడం ప్రారంభిస్తుంది. అనతికాలంలోనే ఓ అర్ధనిమీలిత నేత్రంలా గోచరమవుతుంది. అది చూసే లోపు వెన్నెల జల్లులు మాయమవుతాయి. చంద్రుడి స్థానంలో నా అంతరంగాన్ని చూడండన్నట్లు చంద్రగోళం నిరాకారంగా మారుతుంది. అలా ఓ గంట గడిచిన తరవాత భూఛాయ మెల్లిగా వీడుతుంది. కదిలికదిలి పూర్తి గ్రహాన్ని ఆవిష్కరింపజేస్తుంది. గ్రహణం వీడిన చంద్రుడు అప్పుడే పుట్టిన పసికందులా ఎర్రగా నెత్తురోడుతున్నట్లు కనిపిస్తాడు. మొత్తం మీద అందరినీ అలరించే చందమామ మూడు భిన్న రీతుల్లో దర్శనమిస్తాడు. అతి పెద్ద చందమామ నీలిరంగులో మిలమిలలాడి.. ఆఖరుకు కందగడ్డలా బయటపడతాడు.

9లో

ఔరా..!





గూగుల్‌నీ తీసుకొస్తా!

- అమెజాన్, ఇండియా క్లౌడ్‌లను కూడా...
- అభివృద్ధిని కేంద్రీకృతం కానివ్వం
- హైదరాబాద్ తరహా తప్పు జరుగనివ్వం
- అమెరికాలో పలు కంపెనీల ప్రతినిధులతో లోకేష్ భేటీ

7లో

సేవారంగం వైపే యువతరంగం

- నైపుణ్యాలతో స్వయం ఉపాధి
- మెరుగైన జీవన ప్రమాణాలపై ఆసక్తి
- ఉపాధి కల్పనకు మరింత ప్రోత్సాహం అవశ్యం
- సామర్థ్య నిరూపణకే యువత పోటీ
- కేంద్ర బడ్జెట్‌లో పథకాలపై సర్వత్రా ఆసక్తి



(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)
ఎన్‌డిఎ ఈసారి పాలనలో పూర్తిస్థాయి చిట్టచివరి బడ్జెట్‌ను గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. ఈ ఏడాది చివర్లో ఎన్నికలున్నందున ఈసారిబడ్జెట్‌కు అత్యంత ప్రాధాన్యతుంది. పైగా జిఎస్‌టి అమల్లోకొచ్చాక కేంద్రం ప్రవేశపెడుతున్న తొలిబడ్జెట్ ఇదే. దీంతో ఈ బడ్జెట్‌లో ఏ వర్గానికి ఏవిధమైన వరాల్ని కేంద్రం ప్రకటిస్తుందోనన్న ఆసక్తి సర్వత్రా వ్యక్తమౌతోంది. ఆదినుంచి భారత బడ్జెట్‌లో వ్యవసాయానికి పెద్దపీట వేయడం సంప్రదాయంగా వస్తోంది. అయితే రాన్రాను వ్యవసాయంపై ఉపాధి అవకాశాలు తగ్గుముఖం పడుతున్నాయి. పరిశ్రమల ప్రోత్సాహానిక్కూడా గత బడ్జెట్‌లో భారీగానే నిధులు కేటాయించారు. కానీ ప్రస్తుతం ఆశించిన స్థాయిలో పారిశ్రామికీకరణ జోరందుకోవడం లేదు. సేవల రంగమే ఇప్పుడు దేశంలో అత్యధిక సంఖ్యలో ఉపాధి అవకాశాల్ని కల్పిస్తోంది. ఈ రంగానికి కేంద్రం ఏ మేరకు ప్రాధాన్యతను ఇస్తుందన్న అంచనాలిప్పుడు సాగుతున్నాయి. గతంతో పోలిస్తే ఐటిరంగం ఆశించిన స్థాయిలో ఉద్యోగాల్ని కల్పించడంలేదు. ఈ రంగం దినదినాభివృద్ధి చెందుతున్నప్పటికీ అది ఎగుమతులకే పరిమితమౌతోంది. దేశీయంగా ఐటి రంగంలో ఉద్యోగాలకు కోతపడుతోంది. ఈ దశలో తగినంత విద్యార్హతల్లేనప్పటికీ నైపుణ్యంతో సేవల రంగంలో ఉపాధి అవకాశాల్ని సృష్టించుకుంటున్న వర్గం రోజురోజుకు పెరుగుతోంది. ఇప్పటికే దేశంలో సుమారు 14కోట్ల మంది పెద్దగా చదువు సంధ్యల్లేని నైపుణ్య కార్మికులు. వివిధ రంగాల్లో తమ సామర్థ్యాన్ని నిరూపించుకుంటున్నట్లు ఓ అంచనా. గత పదేళ్ళుగా ప్రభుత్వాలు ఉపాధి హామీకి పెద్ద పీట వేస్తున్నాయి. రాష్ట్రాలు కూడా

3వ పేజీలో...

'సేతు భారతం'లో భాగంగా

ఏపీలో 32 ఆర్‌వోబీలు

● పీవీ ఎక్స్‌ప్రెస్ తరహాలో బెంజిసర్కిల్ ఫ్లైఓవర్ ● రాజమహేంద్రవరం-విజయవాడ రహదారికి మరమ్మతులు ● 6 లేన్లుగా నెల్లూరు-తడ రహదారి ● వైకుంఠపురం రహదారి నాయుడుపేట, చిత్తూరు, మదనపల్లె ప్రాంతాలకు అనుసంధానం ● డస్సాల్ట్ సహకారంతో ఫిబ్రవరి నాటికి డ్రోన్ల సాయంతో గుంతలు లేని రహదారులు ● అమరావతి-అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ జాప్యంపై సీఎం అసంతృప్తి ● ఆర్ అండ్ బీ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



అమరావతి, ఆంధ్రప్రభ: విజయవాడ బెంజిసర్కిల్ ఫ్లైఓవర్‌ను నిర్దేశిత సమయానికి పూర్తిచేయాలని ముఖ్యమంత్రి ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్-పీవీ ఎక్స్‌ప్రెస్ ఫ్లై ఓవర్ తరహాలో విజయవాడ నగరంలో కీలమైన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాల్సి ఉందని చెప్పారు. మంగళవారం రాత్రి సచివాలయంలో ఆయన ఆర్ అండ్ బీ అధికారులతో రాష్ట్రంలో జరుగుతున్న అనేక నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, విజయవాడ బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్ నిర్మాణం నవంబరు నాటికి పూర్తవుతుందన్నారు. విజయ వాడ నగర అవసరాల దృష్ట్యా ప్రస్తుత ప్రతిపాదిత మార్గాన్ని మరి కొంత దూరం పొడిగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. విజయ వాడ కనకదుర్గమ్మ ఫ్లై ఓవర్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యం రాష్ట్ర ప్రభుత్వ పరువు తీస్తోందని ఆయన అసహనం వ్యక్తం చేశారు. మార్చినాటికి ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తికాకుంటే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ సందర్భంగా కనకదుర్గమ్మ వారధి నిర్మాణానికి సంబంధించి కాలువ ప్రవాహాన్ని ఆపడానికి జల వనరుల శాఖతో మాట్లాడాలని, రేపటినుండి సంబంధిత పనులను ఆరంభిస్తామని అధికారులు చెబుతున్న తరుణంలో నిర్మాణ సంస్థ చేతగానితనం, అసమర్థత వల్ల ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బ తింటుండటంపై ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వంతెన పై భాగాన్ని 13వ పిల్లర్ వరకు పూర్తిచేసి మార్చి నాటికి ప్రధాన రహదారిపై రాకపోకలు పునరుద్ధరించకపోతే తీవ్ర చర్యలు తీసుకోవాల్సివుంటుందని హెచ్చరించారు. నిర్మాణసంస్థకోరినట్టుగా రూ. 10కోట్లు ఇవ్వడానికి ముఖ్య మంత్రి అంగీకరించారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా గుంతలు లేని రహదారుల నిర్మాణం జరగాల్సి ఉందన్నారు. చెన్నై-కోల్‌కత్తా ఐదవ నెంబర్ జాతీయ రహదారి మార్గంలోని 1025 కిలోమీటర్ల మేర జరుగుతున్న రహదారి అభివృద్ధి పనుల పురోగతిపై జాతీయ రహదారుల శాఖ ఉన్నతాధికారులు ఈ సమావేశంలో ముఖ్యమంత్రికి అధికారులు వివరాలు అందజేశారు.

విజయవాడ-గుండుగొలను, గుండుగొలను- రాజమహేంద్రవరం రెండు దశల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నెల్లూరు-తడ మార్గాన్ని 6 లేన్లుగా మార్చాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మార్గంలో కృష్ణపట్నం ఓడరేవు, శ్రీసిటీ, స్పెషల్ ఎంప్లాయిమెంట్ జోన్ ఇతర పెరిగిన అవసరాల దృష్ట్యా 6 లేన్ల రహదారిగా విస్తరణ అవసరమన్నారు. విజయవాడ-మచిలీపట్టణం జాతీయ రహదారి మార్గం 38 శాతం పూర్తయ్యిందని, నిర్దేశించిన సమయానికి పూర్తిచేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. నందిగామ-కంచికచర్ల బైపాస్ రహదారి పనులను ఫిబ్రవరిలో ప్రారంభిస్తామని చెప్పారు. తిరుపతి-చిత్తూరు రహదారి పనులను ఫిబ్రవరిలో ప్రారంభిస్తామన్నారు. ఇచ్ఛాపురం నుండి నరసన్నపేట వరకు 6 లేన్ల రహదారిగా విస్తరించాలని సూచించగా, ఆ మార్గంలో రాకపోకలు పెద్దగా లేకపోవడం వల్ల దాన్ని నాలుగు వరుసలకే పరిమితం చేశామని జాతీయ రహదారుల శాఖ అధికారులు వివరించారు. వైకుంఠపురం రహదారిని నాయుడుపేట, చిత్తూరు, మదనపల్లె తదితర ప్రాంతాలకు అనుసంధానం అయ్యేలా చూడాలన్నారు. దీనికి సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలను వచ్చే సమావేశంలోగా రూపొందించి తీసుకురావాలని ఆదేశించారు. కృష్ణపట్నం నుండి సత్యవేడు మీదుగా తిరుపతికి ఒంపులు లేని రహదారిని నిర్మించే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. విశాఖపట్నం-రాయపూర్ రహదారి నిర్మాణానికి సంబంధించి అక్టోబరు నాటికి డీపీఆర్ సిద్ధం చేస్తామని అధికారులు చెప్పారు. ఈ మార్గంలో సాలూరు నుంచి విజయనగరం వరకు 70 కి.మీ. మాత్రమే ఏపీ భాగమని, మిగిలినదంతా చత్తీస్‌గఢ్ రాష్ట్ర పరిధిలోకి వస్తుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అమరావతి-అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి సంబంధించి పనులలో వేగం పుంజుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. జూన్ నాటికి భూ సేకరణ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. తన కలల ప్రాజెక్టు పూర్తి చేయడంలో ఇప్పటికే జాప్యం జరగడం విచారకరమన్నారు. సవరించిన అలైన్‌మెంట్ ప్రకారం 189 కి.మీ. మేర అమరావతి బాహ్యవలయ రహదారిని రూ. 17,762 కోట్ల అంచనాతో నిర్మాణాన్ని చేపడుతున్నామని అధికారులు వివరించారు. దీనికోసం 3,404 హెక్టార్ల మేర భూమి అవసరం ఉంటుందని చెప్పగా, సాధ్యమైనంత మేరకు భూ సమీకరణ విధానంలోనే భూమలును తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. సేతు భారతం'లో భాగంగా ఏపీలో 32 రోడ్ ఓవర్‌బ్రిడ్జి (ఆర్‌వోబీ)ల నిర్మాణం చేపట్టామని, అందులో రూ. 474.21 కోట్ల అంచనాతో తలపెట్టిన 7 ఆర్వోబీలకు ఇప్పటికే డీపీఆర్‌లను సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. రాష్ట్ర రహదారులకు సంబంధించి చిత్తూరు-పుత్తూరు, మైదుకూరు-జమ్మలమడుగు రహదారుల పనులను ఇప్పటికే పూర్తిచేశామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పెడన-నూజివీడు-విన్నపేట, కర్నూలు-దేవనకొండ రహదారులను మార్చి నాటికి సిద్ధం చేస్తామని తెలిపారు. ఏపీఆర్‌ఎంఎస్‌కింద 42 వేల కి.మీ. మేర ఉన్న రాష్ట్ర రోడ్ నెట్‌వర్క్‌కు సంబంధించిన సమాచారాన్ని ఆర్‌డీబీఎంఎస్ సాఫ్ట్‌వేర్‌లో క్రోడీకరించామని అధికారులు చెప్పారు డ్రోన్లు వినియోగించుకుని రహదారుల నిర్వహణ ఎలా ఉందో ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఫిబ్రవరి నాటికి ఎక్కడా గుంతలు కనిపించకూడదని, తన పరిశీలనలో గుంతలు కనిపిస్తే సంబంధిత జీఈ, ఏఈలను అసమర్థులుగా జమకట్టి సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడబోనని హెచ్చరించారు. ప్రమాదాలకు ఆస్కారం లేని రహదారులుగా రాష్ట్ర రహదారులు ఉండాలని, ఈ అంశంపై ప్రభుత్వానికి సహకరించేందుకు డస్సాల్ట్ అనే సంస్థ త్వరలో రాష్ట్రానికి రానుందని ముఖ్యమంత్రి చెప్పారు. 2014 నుండి 2017 డిసెంబరు వరకు మొత్తం 20,33.58 కి.మీ. రహదారిని జాతీయ రహదారులుగా ప్రకటించామని ఆర్ అండ్ బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వివరించారు. విశాఖ-చెన్నై పారిశ్రామిక వాడలో భాగంగా చేపట్టిన రహదారి ప్రాజెక్టులను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పంచాయతీరాజ్ శాఖకు చెందిన మిగిలిన 4,186 కి .మీ. మేర నాన్ బీటీ రోడ్లను బీటీ రోడ్లుగా మార్చడానికి రూ.2,660 కోట్లు అవసరమవుతాయని ముఖ్య మంత్రికి చెప్పారు. సమావేశంలో మంత్రి అయ్యన్న పాత్రుడు, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి సాయి ప్రసాద్, కార్యదర్శి ఏవీ రాజమౌళి, ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ అనిల్ దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.



గుంతలు లేని రహదారులు నిర్మించండి

రాజమహేంద్రవరం-విజయవాడ మధ్య దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు వెంటనే చేయాలని ఆదేశించారు. రహదారి సక్రమంగా లేక పోవడంతో ఈ మార్గంలో ప్రయాణం చేసే వారంతా అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏప్రిల్ నాటికి మరమ్మతు పనులు పూర్తి చేస్తామని జాతీయ రహదారుల శాఖ అధికారులు చెప్పగా, పనులలో పురోగతిని ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలని సీఎంవో అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి నాటికి గుంతలు కనిపిస్తే సంబంధిత జేఈ, ఏఈలపై చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. డస్సాల్ట్ అనే సంస్థ ఈ విషయంలో తమ సహకా రాన్ని అందించబోతుందని తెలిపారు. డ్రోన్ల సహాయంతో రోడ్ల పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటికి వెనువెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు.

చిప్ డిజైన్ హబ్‌గా ఏపీ

● ఐఓటీ సెన్సార్లు, డ్రోన్ల ద్వారా రియల్ టైం సమాచారం ● పైలెట్ ప్రాజెక్టును ఏపీలో చేపట్టండి ● రాష్ట్రంలో సెమీ కండక్టర్ పార్కు ఏర్పాటు ● అమెరికాలో పలు కంపెనీల సీఈఓలతో మంత్రి లోకేష్ భేటీ



గూగుల్ టీమ్ అంజలి జోషి, సూరి, డెవిడ్‌తో మంత్రి లోకేష్ భేటీ

అమరావతి, ఆంధ్రప్రభ; ఐఓటీ సెన్సార్లు, డ్రోన్లు ద్వారా ఎప్పటికప్పుడు రియల్ టైంలో సమాచారం తెలుసుకుంటు న్నామని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీశాఖా మంత్రి నారా లోకేష్ అన్నారు. మంగళవారం శాన్ ఫ్రాన్సిస్కోలో అరిస్తా కంపెనీ సీఈఓ ఆండీ, చీఫ్ కస్టమర్ ఆఫీసర్ అన్షుల్‌తో మంత్రి భేటీ అయ్యారు. మాట్లాడుతూ సర్టిఫికెట్ లెస్ గవర్నమెంట్ తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నామని, గూగల్ ఎక్స్‌తో ఒప్పందం చేసుకొని మారుమూల ప్రాంతాలకు ఎఫ్సాక్ టెక్నాలజీ ద్వారా ఇంటర్నెట్ అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. క్లౌడ్ హబ్ పాలసీ తీసుకొచ్చామని, పింఛన్, రేషన్, వాతావరణం, భూసార పరీక్షలు, పిడుగులు పడటం ఇలా అనేక విషయాలను రియల్ టైంలో తెలుసుకుంటున్నామన్నారు. దీనిపై స్పందించిన ఆండీ త్వరలోనే మీ రాష్ట్రానికి మాకంపెనీ బృందాన్ని పంపిస్తామని, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఫైబర్ గ్రిడ్‌తో సహా వివిధ శాఖల్లో ఏపీ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలకు మావంతు సహకారం అందిస్తామన్నారు.

అతి తక్కువ సమయంలో ఫైబర్ గ్రిడ్ ఏర్పాటు చేశామని మంత్రి లోకేష్ అన్నారు. రూ.149కే వైఫై, టెలిఫోన్, టెలివిజన్ సేవలు అందిస్తున్నామని, ఫైబర్ గ్రిడ్ ద్వారా అందిస్తున్న సేవలు మరింత విస్తరించడానికి గూగుల్ సహకరించాలన్నారు. మీనూతన ఉత్పత్తులను ఏపీలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాలని మంత్రిలోకేష్ కోరారు. అనంతరం మాట్లాడిన గూగుల్ టీ అంజలీ జోషీ, సూరి కొడుకుల్లా, డేవిడ్ షాపిర్ మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. జి స్టేషన్, క్రోమ్ బుక్స్, టెలీ మెడిసిన్‌లో ఫైబర్ గ్రిడ్‌తో కలిసి పని చేస్తామన్నారు. త్వరలోనే మా బృందాన్ని రాష్ట్రానికి పంపించి పూర్తి స్థాయి ప్రణాళిక సిద్ధం చేస్తామని, త్వరలోనే ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని స్పష్టంచేశారు.

గ్లోబల్ ఫౌండరీస్ సీఈఓ సంజయ్ జాహుతో భేటీ

ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నామని, ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టరు ఏర్పాటు చేశామని మంత్రి లోకేష్ తెలిపారు. ఫాక్స్ కాన్, సెల్ కాన్, డిక్సన్, కార్బన్ కంపెనీలు ఇప్పటికే కార్యకాలాపాలు ప్రారంభించాయని, ఎలక్ట్రానిక్ తయారీ రంగంలో సెమీ కండక్టర్ దగ్గర నుండి పూర్తి స్థాయి ఉత్పత్తుల తయారీ ఏపీలో జరగాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. చిప్ డిజైనింగ్‌లో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, ప్రపంచ వ్యాప్తంగా చిప్ డిజైనింగ్‌లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో యువతి, యువకులకు చిప్ డిజైనింగ్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. దీనికి మీ సహకారం కావాలని, చిప్ డిజైన్ హబ్‌గా ఏపీని తీర్చిదిద్దాలనుకుంటున్నామన్నారు. సెమీ కండెక్టర్ పార్కుని ఏర్పాటు చేస్తున్నామని, ఎలక్ట్రానిక్ కంపెనీలను ఆకర్షించేందుకు నూతన పాలసీలు తీసుకొచ్చి రాయితీలు కల్పిస్తున్నామన్నారు. అనంతరం సంజయ్ జాహ్ మాట్లాడుతూ చిప్ డిజైనింగ్‌లో శిక్షణ, సెమీ కండక్టర్స్ పార్కు ఏర్పాటుకు సహాకారం అందిస్తామన్నారు. ఏపీలో అమలు చేస్తున్న పాలసీలు గురించి అధ్యయనం చేస్తామని, ఇండియాలో విస్తరించాలనే ఆలోచన తమకు ఉందన్నారు.

ఆర్మ్ సీఈఓ సైమన్‌తో...



రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఐఓటీ పరికరాలు, సెన్సార్లు వినియోగిస్తున్నామని, సెన్సార్లు వినియోగించి తాగునీటి నాణ్యత తెలుసుకోబోతున్నామని మంత్రి లోకేష్ అన్నారు. బ్లాక్ చైన్ పెద్ద ఎత్తున వినియోగిస్తున్నామని, ల్యాండ్ రికార్డ్సుతో పాటు ప్రభుత్వ సమాచారాన్నంత అన్నీ బ్లాక్ చైన్ వేదికపైకి తీసుకొచ్చామన్నారు. ఐఓటి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ త్వరలోనే ఏర్పాటు కాబోతుందన్నారు. ఆర్మ్ తయారు చేసిన స్మార్ట్ మీటర్లతో విద్యుత్ సరఫరాలో లోటపాట్లు తెలుసుకోవడం మెరుగైన విద్యుత్ సరఫరా, విద్యుత్ వాడకం పక్కాగా తెలుసుకునే అవకాశం ఉందన్నారు. మీరు తయారు చేసిన ఉత్పత్తులను ఏపీలోని ఒక నగరంలో పైలెట్ ప్రాజెక్టుగా చేయాలని, హెల్త్ కేర్, అగ్రిటెక్‌లో ఐఓటి వినియోగంపై ఏపీ ప్రభుత్వానికి సహకారం అందిచాలన్నారు. దీనిపై స్పందిచిన సైమన్‌పీలో స్మార్ట్ మీటర్లతో పైలెట్ ప్రాజెక్ట్ త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఐఓటి పరికరాల వినియోగంలో ఏపీ ప్రభుత్వానికి సహకరిస్తామని, తాగునీటి నాణ్యత, వ్యవసాయం తదితర రంగాల్లో ఐఓటి వినియోగంపై రూపొందించిన పరికరాలను ఏపీలో ప్రయోగిస్తామన్నారు.

జడ్జిల జీతం రెండు రెట్లు!

● పెంపునకు రాష్ట్రపతి ఓకే

న్యూఢిల్లీ: సుప్రీం కోర్టు, హైకోర్టు జడ్జీలకు వేతనాలు దాదాపు రెట్టింపు పెరిగాయి. ఈ మేరకు పార్లమెంట్ ఆమోదం పొందిన బిల్లుకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అంగీకారం తెలిపారు. ఇప్పటి దాకా లక్ష రూపాయల నెలసరి వేతనాన్ని పొందుతున్న భారత ప్రధాన న్యాయమూర్తి ఇకపై రూ.2 లక్షల 80 వేలు తీసుకుంటారు. ప్రస్తుతం రూ.90 వేలు పొందుతున్న సుప్రీం కోర్టు ఇకపై రూ.2 లక్షల 50 వేలు తీసుకుంటారని కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖ నోటిఫై చేసిన చట్టంలో ఉంది. హైకోర్టుల జడ్జీల నెలసరి వేతనం ప్రస్తుతం రూ.80 వేల నుంచి రూ.2 లక్షల 25 వేలకు పెరిగింది. అఖిలభారత సర్వీసుల అధికారుల కోసం ఏడవ వేతన సవరణ సంఘం సిఫారుసులకు తగ్గట్టుగా ఉన్న వేతనాల పెంపుదల 2016, జనవరి ఒకటవ తేదీ నుంచి వర్తిస్తుంది.

2018 నాటి హైకోర్టు మరియు సుప్రీంకోర్టు జడ్జీల (వేతనాలు, సర్వీసు స్థితిగతులు) సవరణ చట్టం 2017, జులై ఒకటవ తేదీ నుంచి అమల్లోకి వచ్చేలా ఇంటి అద్దె అలవెన్సు రేట్లు, అదే ఏడాది సెప్టెంబర్ 22వ తేదీ నుంచి అమల్లోకి వచ్చేలా అతివ్యయ నియంత్రణ అలవెన్సు రేట్లను సవరిస్తుంది.

రెండేళ్ళ నాటి లేఖ ఫలితం

సుప్రీం కోర్టు, హైకోర్టు జడ్జీల వేతనాల పెంపుదలను కోరుతూ 2016లో అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి టి.ఎస్.ఠాకూర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. సుప్రీంకోర్టులో 31 మంది న్యాయమూర్తులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 25 మంది మాత్రమే ఉన్నారు. మొత్తం 24 హైకోర్టులకు 1,079 జడ్జీల సామర్థ్యానికి ఆమోదం తెలపగా ప్రస్తుతం 682 మంది జడ్జీలు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. వేతనాల పెంపుదల పదవీ విరవుణ చేసిన 2,500 మంది జడ్జీలకు కూడా ప్రయోజనం చేకూరుస్తుంది. ఏడో వేతన సవరణ సంఘం సిఫార సుల అమలుతో ప్రస్తుతం జడ్జీల వేతనాలు బ్యూరోక్రాట్ల జీతాలకు సరిసమానంగా ఉంది.

నల్లధనం ఎంతొచ్చింది?

● నోట్ల రద్దు తర్వాత లెక్క చెప్పాలని ఆర్థికశాఖకు సీఐసీ ఆదేశం

న్యూఢిల్లీ: నోట్ల రద్దు చేసిన అనంతరం వసూలు చేసిన నల్లధనంపై సమాధానం ఇవ్వాలని కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ) ఆర్థిక మంత్రిత్వ శాఖను ఆదేశించింది. నోట్ల రద్దు అనంతరం ప్రభుత్వం ఎంత మొత్తం నల్లధనం వసూలు చేసింది కోరుతూ ఏడాది క్రితం దాఖలైన సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) దరఖాస్తుకు బదులు ఇవ్వాలని ఆదేశించింది. అయితే ఆర్టీఐ దరఖాస్తుకు స్పందించడంలో జాప్యంపై ప్రధాన మంత్రి కార్యాలయం(పీఎంఓ) అధికారులు క్షమాపణ చెప్పడంతో ప్రధాన సమాచార కమిషనర్ ఆర్.కె.మాథూర్ పీఎం కార్యాలయానికి పెనాల్టీ వేయకుండా వదిలేశారు. సంబంధిత సెక్షన్ ఇన్‌చార్జ్ సెంట్రల్ పబ్లిక్ ఇన్‌ఫర్మేషన్ ఆఫీసర్ (సీపీఐఓ) భవిష్యత్తులో అప్రమత్తంగా ఉంటూ ఆర్టీఐ చట్టంలో నిర్దేశించిన కాలవ్యవధులకు కట్టుబడి ఉండాలని ఆయన హెచ్చరించారు. కేసు విషయానికి వస్తే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 2016, నవంబర్ ఎనిమిదవ తేదీన రూ.1,000, రూ.500 నోట్లను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. నోట్ల రద్దు వెనుక కారణాల్లో నల్లధనం సమస్య ఒకటిగా ప్రధాని పేర్కొన్నారు. దీనిపై ఖలీద్ ముందపల్లి అనే వ్యక్తి ఆర్టీఐ చట్టం కింద అదే ఏడాది నవంబర్ 26న ప్రధాని కార్యాలయాన్ని సంప్రదించారు. దయచేసి ఎంత మొత్తం నల్లధనం వసూలైందీ నాకు తెలియపరచగలరు అని ముందపల్లి కోరారు. కానీ నిర్దేశిత 30 రోజుల కాలవ్యవధిలో ఆయన దరఖాస్తుకు ఎలాంటి స్పందన రాక పోవడంతో 2017, జనవరి తొమ్మిదవ తేదీన పీఎంఓపై కమిషన్‌కు ఒక ఫిర్యాదు చేశారు. గతేడాది జనవరి 25న సదరు దరఖాస్తును రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌కు పంపించినట్టు, అయితే రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌కు దరఖాస్తును పంపించి ఏడాది అయినప్పటికీ ఎలాంటి స్పందన లేదని ముందపల్లి కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఆదేశం అందిన 30 రోజుల్లోగా సీపీఐఓ, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ ఆర్టీఐ దరఖాస్తుకు సమాధానం ఇవ్వాలని ఆదేశించడమైనది అని మాథుర్ తెలిపారు.

నేతన్నలకు ప్రత్యేక కార్పొరేషన్

● రాజకీయాల్లో వారికి ప్రాధాన్యత కల్పిస్తా ● ముడిసరుకు కొనుగోలుపై రూ.2 వేలు సబ్సిడీ ● చేనేత కార్మికుల ఆత్మీయ సదస్సులో జగన్



వెంకటగిరి నియోజకవర్గం సైదాపురం మండలం కలిచేడులో జరిగిన చేనేత ఆత్మీయ సమ్మేళన సదస్సులో ప్రసంగిస్తున్న జగన్

నెల్లూరు, ప్రభ న్యూస్ బ్యూరో: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేనేత కార్మికులను నిలువునా మోసం చేశారు. అధికారంలోకి రాగానే వారికోసం బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు. ముడి సరుకు కొనుగోలుపై సబ్సిడీ ఇస్తామన్నారు. ప్రతి చేనేత కార్మికుడికి లక్షన్నర రుణాలు, మరో లక్షన్నరతో ఇళ్ళు కట్టిస్తామని చెప్పి ఒక్క హామీని కూడా నెరవేర్చకపోగా కనీసం చేనేత కష్టాలు తెలుసుకునే ప్రయత్నం కూడా చేయకపోవడం బాధాకరమని వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం ఆయన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలోని వెంకటగిరి నియోజకవర్గం సైదాపురం మండలంలో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా కలిచేడులో ఏర్పాటుచేసిన చేనేత కార్మికుల ఆత్మీయ సమ్మేళన సదస్సులో జగన్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంపై విమర్శల వర్షం కురిపించారు. రాష్ట్రంలో 34 మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదన్నారు. ధర్మవరంలో చేనేత కార్మిక కుటుంబాలకు చెందిన మహిళలు 37 రోజులపాటు నిరాహారదీక్షలు చేస్తే కనీసం పట్టించుకునే నాధుడే లేరన్నారు. వారిని పరామర్శించేందుకు ఆ సమయంలో ధర్మవరం వెళ్ళిన నేను వారి దీనస్థితిని చూసి ఎంతో బాధపడ్డానన్నారు. ఇటువంటి ప్రభుత్వంపై కనికరం చూపితే రాష్ట్రంలో చేనేత కార్మికులు మరిన్ని కష్టాలు ఎదుర్కోవలసివస్తుందని జగన్ ఈ సందర్భంగా సీఎంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. వైకాపా అధికారంలోకి వస్తే చేనేత కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. చేనేత కుటుంబాలకు మంచిచేసి చూపిస్తానని జగన్ వారికి భరోసా ఇచ్చారు. అంతేకాకుండా రాజకీయాల్లో కూడా చేనేత కార్మికులకు ప్రాధాన్యతనిచ్చి భవిష్యత్తులో వారిని ఉన్నత స్థాయికి తీసుకువెళ్ళే ప్రయత్నం కూడా చేస్తామన్నారు. అలాగే ముడి సరుకు కొనుగోలుపై రూ.2వేలు సబ్సిడీని అందిస్తామని, ఏటా చేనేత కార్మికులకు ఖర్చులక్రింద రూ.20వేలు అందిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా దీర్ఘకాలిక రోగాలతో బాధపడే చేనేత కార్మికులకు ప్రత్యేకంగా రూ.10వేలు పింఛన్‌ను అందిస్తామన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో పెత్తనం చెలాయిస్తున్న జన్మభూమి గ్రామ కమిటీలను రద్దు చేసి గ్రామ సచివాలయాన్ని ఏర్పాటుచేస్తానన్నారు.

ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్‌లకు పూర్తి అధికారాలు ఇచ్చి అక్కడినుండే గ్రామపాలన సాగిస్తామన్నారు. పంచాయతీ పరిధిలో పింఛన్ల మంజూరు, రేషన్ కార్డులు, ఫీజు రీఎంబర్స్‌మెంట్ వంటి కార్యక్రమాలన్నీ గ్రామ సచివాలయం నుంచే మంజూరయ్యేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. అంతకుముందు ఆయన సైదాపురం శివారు ప్రాంతం నుంచి పాదయాత్ర ప్రారంభించి సిద్ధలయ్య కోన, ఊటుకూరు, తురిమెర్ల మీదుగా 14.9కి.మీలు మేర నడిచి కలిచేడుకి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయనవెంట జిల్లాపరిషత్ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, శాసనసభ్యులు మేకపాటి గౌతమ్ రెడ్డి, కలివేటి సంజీవయ్య, పోలుబోయిన అనీల్ కుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు.

మహిళా సంక్షేమానికి సీఎం పెద్దపీట

● ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : మహిళల భద్రత, సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనేక కార్యక్రమాలు చేపట్టారని ఆ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి అన్నారు. జాతీయ మహిళా కమిషన్ 25వ వార్షికోత్సవం సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలో నేటి నుంచి నిర్వహించే వేడుకలకు హాజరయ్యేందుకు 55 మంది మహిళా ప్రతినిధులతో కలిసి ఆమె ఢిల్లీ వచ్చారు. ఈ సందర్భంగా ఏపీ భవన్లో మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో పెన్షన్లు, ఇళ్లు, తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్, గర్భిణులకు ప్రత్యేక కిట్లు, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ప్రత్యేక ఆర్థిక సహాయం అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమంలో ఆదర్శప్రాయంగా నిలుస్తోందని కొనియాడారు. ప్రభుత్వం కేవలం సంక్షేమానికే పరిమితం కాకుండా కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు సహా వివిధ రంగాల్లో మహిళలను ప్రోత్సహిస్తోందని ఆమె తెలియజేశారు. బాధిత మహిళలకు తక్షణమే ఆర్థిక సహాయం అందించే విషయంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అత్యంత చురుగ్గా వ్యవహరి స్తున్నారని, అలాగే బాధితులకు ఉద్యోగం, ఇంటి స్థలం, చదువు కునే వయస్సు బాధితులకు తగిన విద్యా ఏర్పాట్లు చేయడంలో ప్రత్యేక చొరవ చూపుతున్నారని నన్నపనేని రాజకుమారి అన్నారు. రాష్ట్రంలోని మహిళల సమస్యలను పరిష్కరించ డంలో, వారికి సత్వర న్యాయం అందించడంలో మహిళా కమిషన్ నిర్విరామంగా పనిచేస్తోందని ఆమె చెప్పుకొచ్చారు. అలాగే మహిళలపై జరిగే నేరాల విషయంలో గ్రామ స్థాయి నుంచి అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నామని నన్నపనేని అన్నారు. మీడియా సమావేశంలో పాల్గొన్న జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రేఖా శర్మ ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్‌ను అభినందించారు. మహిళా సమస్యలపై చర్చించి, పరిష్కార మార్గాలు అన్వేషించడం కోసం ఆంధ్రప్రదేశ్ నుంచి పెద్ద సంఖ్యలో మహిళా ప్రతినిధులను తీసుకొచ్చినందుకు ఆమె మెచ్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన మహిళా ప్రతినిధుల్లో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, మేయర్ స్వరూప, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వి. రజని, డా. సుమితా శంకర్ తదితరులున్నారు.

నా పాదయాత్రతో బాబుకు జ్వరం పట్టుకుంది

● ధరల స్థిరీకరణ నిధి ఏమైంది? నవరత్నాలను ఖచ్చితంగా అమలుచేస్తా: జగన్



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో సుదీర్ఘంగా తాను చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుండి వస్తున్న విశేష స్పందన చూసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు, టీడీపీ నేతలకు జ్వరం పట్టుకుందని ప్రతిపక్షనేత, వైకాపా అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్ రెడ్డి చెప్పారు. నెల్లూరు జిల్లా పాదయాత్రలో ఉన్న ఆయన్ను ఒక టీవీ ఛానెల్ ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసింది. ఆయన అనేక అంశాలపై మాట్లాడారు. తన పాదయాత్రతోనే ప్రజల్లో చంద్రబాబు ప్రభుత్వంపై ఎంత మేర ప్రజా వ్యతిరేకత ఉందో వారికి కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తోందన్నారు. ఈ ప్రజా వ్యతిరేకతను చూసి చలి జ్వరం వచ్చి లేని ఆరోపణలకు తెరలేపుతున్నారన్నారు. పాదయాత్రలో ఇచ్చే హామీలన్నీ అమలయ్యేవేనా అని టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారని అడగ్గా ఇప్పుడు తాను ఇస్తున్న హామీ లన్నీ గతంలో ప్లీనరీ వేదికగా నవ రత్నాలు పేరుతో ఇచ్చినవేనన్నారు. అప్పుడు అడగని నేతలు ఇప్పుడెందుకు అడుగుతున్నారని ఆయన ప్రశ్నించారు. పాదయాత్ర ద్వారా తన నవ రత్నాలను కొంచెం మార్పులు చేర్పులు చేసి ప్రజలకు, బాధితులకు భరోసా ఇస్తున్నానని చెప్పారు. అత్యధికంగా వస్తున్న అర్జీలేమిటని ప్రశ్నించినప్పుడు, రైతాంగ సమస్యలపై అత్యధికంగా ఫిర్యాదులందుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా రూ.87,612 కోట్ల మేర ఉన్న రైతు రుణాలను బేషరతుగా మాఫీ చేస్తానని చెప్పి చేయలేదని, దీంతో రైతులు బ్యాంకుల దగ్గరకు వెళ్లి రుణాలు పొందే అవకాశం లేకుండా పోయిందన్నారు. రైతులకు, పొదుపు సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఆయన అధికారంలోకి వచ్చినప్పటినుండి కనీసం ఒక్క రూపాయి కూడా బ్యాంకులకు వడ్డీ బకాయిలు చెల్లించకపోవడంతో ఇప్పుడు బ్యాంకులు రైతులకు, పొదుపు సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇవ్వడం లేదన్నారు. రూ. 5 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి అని చెప్పి హామీ ఇచ్చారన్నారు. ఈ నాలుగేళ్ళ పాలనలో కనీసం ఒక్క రూపాయితో అయినా ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశారా అని ప్రశ్నించారు.

ఎన్నికలకు సిద్ధంకండి!

(మొదటిపేజీ తరువాయి)



కమిటీలు ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయ్యిందని కొన్ని చోట్ల కమిటీల చర్యల వలన పార్టీకి చెడ్డపేరు వస్తుందని అసం తృప్తి వ్యక్తం చేశారు. జన్మభూమి కమిటీల్లో మార్పులు చేర్పు లు చేసి సమ ర్థవంతంగా పనిచేసే విధంగా చర్యలు చేపట్టాల న్నారు. ఇన్‌చార్జి మంత్రులకు పూర్తి అధికారాలు ఇచ్చామని, నిరంత రం పార్టీ వర్గాలకు చేరువలో ఉండి సమ స్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల్లో ప్రభుత్వం పట్ల సంతృప్తిని పెంచాలని సూచించారు. గతేడాది డిసెంబ రులో 55 శాతం ఉన్న సంతృప్తి జన్మభూమి అనంతరం 62 శాతం పెరిగిందన్నారు. పెళ్ళి కానుకలు, తదితర కార్యక్రమా లతో మార్చి నాటికి మరో 8 శాతం పెరిగి 70 శాతానికి చేరు తుందన్నారు. నిరుద్యోగ భృతి, అన్న క్యాంటీన్‌ల ఏర్పాటుతో మరో 10 శా తం సంతృప్తి పెరుగుతుందని సీఎం విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల్లో 80 శాతం సంతృప్తిని సాధించగలిగితే రానున్న ఎన్నికల్లో విజయం టిడిపిదేనన్నారు.

దళిత తేజం తెలుగుదేశం కార్యక్రమాల్లో నాయకులం దరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దళిత యువతతో మమేకమై వారిని పార్టీ పట్ల ఆకర్షితులను చేయాలన్నారు. 111 నియోజకవర్గాల్లో దళితవాడలో కమి టీలు పూర్తి చేశామని మిగిలిన కమిటీలను కూడా తక్షణమే వేయాలన్నారు. వీరందరితో లోక్‌సభల వారీగా వర్క్‌షాప్ నిర్వహించి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రధా నంగా విపక్ష పార్టీ ప్రతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో పార్టీ పటిష్టతపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా పార్టీ గుర్తించిన 70 నియోజకవర్గాల్లో టీడీపీ కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు. నియోజకవర్గాలకు ఏ,బీ,సీ,డీ కేట గిరీలు ఇచ్చానని, ఈ డీ కేటగిరిలపై ఎక్కువ దృష్టి పెడతాన న్నారు. ఎన్నికలు త్వరలో రానున్న నేపథ్యంలో ప్రణాళికబ ద్ధంగా పనిచేయాలని ఆదేశించారు. క్రమశిక్షణకు భంగం కలి గిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మీరు మారాలి.. మీ మార్పులు ప్రజలు గమనించాలి.. తద్వారా ప్రజల్లో మంచి పేరు తీసుకురావాలని సీఎం హితవు పలికారు.

దళిత తేజం తరహాలో బీసీ, ఎస్టీ మైనార్టీ వర్గాలకు కూ డా కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. అంబేద్కర్, జగ జ్జీవన్‌రామ్ స్మృతివనం తరహాలో జ్యోతిరావు పులేకు కూడా స్మృతి వనం ఏర్పాటు చేయనున్న ట్లు చంద్రబాబు పేర్కొ న్నారు. ఆదరణ-2 అన్ని నియోజకవర్గా ల్లో విజయవంతం చేయాలన్నా రు. ఏయే నియోజకవర్గాల్లో తెలు గుదేశం పార్టీ చేసిన సంక్షేమాలపై విస్తృత ప్రచారాన్ని ఇవ్వాలన్నా రు. వారిని చైతన్యవంతులను చేయడం ద్వారా పార్టీకి, ప్రభు త్వానికి ఆయా వర్గాలను చేరువ చేయాలన్నారు. ఎకనమిక్ సర్వేలో ఏపీ అభివృద్ధిని గుర్తిం చడం రాష్ట్రానికి శుభపరిణామంగా సీఎం అభిప్రాయప డ్డారు. రాష్ట్రం రెండంకల వృద్ధి రేటును ఎకనమిక్ సర్వే స్ప ష్టం చేసిందన్నారు. పర్యాటక రంగంలో ఆంధ్రప్రదేశ్ దేశం లోనే మూడవ స్థానంలో ఉండడం మనం సాధించిన ప్రగ తికి నిదర్శనమన్నారు. ఏపీలో పెరిగిన జీవన ప్రమాణాలను ఎకనమిక్ సర్వే నిర్ధారించిందన్నారు. శిశు మరణాలు, సాధారణ మరణాల రేటు తగ్గడంతో పాటు జననాల రేటు కూడా తగ్గడం పెరిగిన జీవన ప్రమాణాలకు నిదర్శనంగా సీఎం పేర్కొన్నారు.

ఫిబ్రవరిలో నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిపై సమీక్షిస్తానని చంద్రబాబు చెప్పారు. పార్లమెంట్ ఇన్‌చార్జిల తో పాటు ఫోర్‌మెన్ కమిటీలతో భేటీ అవుతానన్నారు. ప్రతీ నియోజకవర్గంలో గెలుపు టీడీపీదే కావాలని, ఇప్పటి నుండే సీరియస్‌గా పనిచేసి ప్రజా ఆమోదం పొందాలని సీఎం పిలుపునిచ్చారు. వందశాతం సీట్లు టీడీపీ గెలుస్తుందనే విశ్వాసం, నమ్మకాన్ని ఇప్పటి నుండే ప్రజల్లో కలగజేయా లని, దానికి అనుగుణంగా పార్టీ నాయకులంతా సీరియస్‌గా పనిచేయాలని పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశించారు. సమావేశంలో కొంత మంది నాయకుల పనితీరు పట్ల ముఖ్య మంత్రి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. కొందరికి చురకలు వేయగా, మరికొందరికీ క్లాస్ పీకినట్లు సమాచా రం. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి కె.ఈ కృష్ణమూర్తి, ఆర్ధిక శాఖా మంత్రి యనమల రామకృ ష్ణుడు, రాష్ట్ర మం త్రులు పత్తిపాటిపుల్లారావు, నారాయణ, కాల్వ శ్రీనివాసులు, దేవినేని ఉమామహేశ్వరరావు, పార్టీ నాయ కులు వర్ల రామయ్య, సుబ్బరాయుడు, రావునారాయ ణరెడ్డి, జనార్ధణ్, వి.వి.వి చౌదరి, ధూళిపాల నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేర్పాటు పిడికిళ్లపై మోడీ గురి!

(మొదటిపేజీ తరువాయి)

తృణమూల్ పట్ల గతంలో యుపిఎ, ఇప్పుడు ఎన్‌డిఎ ప్రభుత్వాలు అక్కసు పెంచుకుని తమను కృంగదీస్తున్నాయంటూ వారు వాపో తున్నారు. ఈ దశలో దేశం నుంచి విడివడి ప్రత్యేక బెంగాల్ ఏర్పాటు ద్వారానే తమ ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకునే వీలుంటుందంటూ ప్రకటనలిస్తున్నారు. కాగా జమ్మూకాశ్మీర్ స్టేట్ ముస్లిం పర్సనల్ బోర్డ్ ఉపాధ్యక్షుడు ముఫ్తీనసీర్‌ఉల్‌ఇస్లాం అయితే ఏకంగా భారతీయ ముస్లింలకు ఓ ప్రత్యేక దేశం కావాలంటూ ఇప్పుడు డిమాండ్ మొదలెట్టారు. స్వతంత్ర సమయంలో 17కోట్లమంది ముస్లింల్తో పాకిస్థాన్ ఆవిర్భవించింది. అప్పటికి కొన్ని కోట్లమంది భారత్‌లోనే ఉండిపోయారు. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో ముస్లింలున్న దేశాల్లో భారత్ మూడోదిగా ఉంది. ఇప్పటికే ఇక్కడ 18.90కోట్ల మంది ముస్లింలున్నారు. వీరంతా గతకొంతకాలంగా దాడులకు గురౌతున్నారు. దేశంలో హిందూమతవాదుల్నుంచి అణచివేతకు గురౌతున్నందున ప్రత్యేకదేశ డిమాండ్ ఒకటే తమముందున్న ప్రస్తుత కర్తవ్యంగా ఆయన పేర్కొన్నారు. గతంలో కూడా దేశంలో ఇలాంటి వేర్పాటువాద ఉద్యమాలొచ్చాయి. సిక్కులు ప్రత్యేక దేశం కావాలంటూ ఖలిస్థాన్ ఉద్యమాన్ని నిర్వహించారు. అప్పటి ప్రధాని ఇందిర తన ప్రాణాల్ని కూడా లెక్కచేయకుండా ఈ ఉద్యమాన్ని అణిచేశారు. అలాగే అస్సోంను ప్రత్యేక దేశంగా ప్రకటించాలంటూ ఉల్ఫా ఉద్యమం సాగింది. దీన్ని కూడా కేంద్రం కఠినంగా అణిచేయగలిగింది. గూర్ఖాల కోసం ప్రత్యేక దేశ ఏర్పాటుకు పశ్చిమ బెంగాల్‌లోని ఓ ప్రాంతంలో జరిగిన ఉద్యమాన్ని కూడా వారికి కొన్ని ప్రయోజనాలు కల్పించి కేంద్రం అణిచేసింది. అలాగే ప్రత్యేక దేశం కోసం నాగాలు చేసిన ఉద్యమాన్ని నీరుగార్చేసింది. ఓ దశలో త్రిపుర కూడా ప్రత్యేక దేశహోదా కోసం పట్టుబట్టింది.

దేశంలో పెరుగుతున్న వేర్పాటువాద ఉద్యమ ఆలోచనలు భారత సార్వభౌమత్వానికి సవాల్‌గా మారే ప్రమాదముంది. ఇప్పటికే కేంద్రం వీటిని సీరియస్‌గా పరిగణిస్తున్నట్లు సమాచారం. అయితే ఇప్పటికిప్పుడు ఈ ఉద్యమాలపై అణిచివేత ధోరణికి సాహసించేపరిస్థితులు కనిపించడంలేదు. ఈ ఏడాది చివర్లో ఎన్నికలకెళ్ళాలని మోడి తలపోస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బిజెపి గతంలో కంటే కూడా అధిక సంఖ్యలో సీట్లు సాధిస్తుందన్న విశ్వాసం పాలకపార్టీలో కనిపిస్తోంది. మూడింట రెండొంతుల స్థానాల్ని కైవసం చేసుకోవడం ద్వారా అవసరమైన రాజ్యాంగ సవరణలకు తగిన బలాన్ని ప్రదర్శించాలని ఉత్సుకతతో ఇంది. ఇందుకనుగుణంగానే మోడీ, షాలు వ్యూహాలు అమలు చేస్తున్నారు. అంచెల వారీగా అన్ని రాష్ట్రాల్లోనూ కమలపాలనకు తెరదీస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం లభించే మెజార్టీని దృష్టిలో పెట్టుకుని అవసరమైతే దేశంలో అత్యయిక పరిస్థితి విధించైనా సరే ఇలాంటి వేర్పాటువాద ఉద్యమాల్ని కూకటివేళ్ళతో పెకలించేసి దేశ సార్వభౌమత్వానికి ఎదురౌతున్న సవాల్‌ను అధిగమించాలని కేంద్రం యోచిస్తున్నట్లు సమాచారం.

సేవారంగం వైపే యువతరంగం

(మొదటిపేజీ తరువాయి)

ఈ పద్దు క్రింద అధిక నిధులు పొందాలన్న తాపత్రయం వ్యక్తం చేస్తున్నాయి. అయితే ఇప్పటికీ దేశంలో సగ టున ఉపాధి కూలీకి 87రూపాయలే కిట్టుబాటౌతోంది. ఇది కార్మికశాఖ నిర్దేశించిన కనీస రోజువారి వేతనంలో మూడోవంతు కూడా కాదు. అలాగే గరిష్టంగా 150రోజుల పనిదినాల్ని కల్పించాలన్న నిబంధ నున్నా జాతీయ స్థాయిలో సగటు 37రోజులుగానే ఉంది. దీంతో ఈ పథకం ప్రచారానికే తప్ప వాస్తవ స్థితిలో ఉపాధి కల్పనకు సుదూరంగా మిగిలిపోయింది. ఈ పథకంలో వయసుపైబడ్డ కూలీలు, మహిళలకు కాస్తో కూస్తో ఉపాధి అవకాశాలు లభిస్తున్నా కనీస అవసరాలు తీర్చుకోవడాని క్కూడా ఈ వేతనాలు సరిపోవు. ప్రపంచ వ్యాప్తంగా ఆధునిక జీవనశైలి అలవడుతోంది. భారత్‌గతంతో పోలిస్తే అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలోకి చేరిపోయింది. ఇక్కడ సంపద సృష్టివేగంగా జరుగుతోంది. విదేశాల్నుంచి కూడా బిలియన్ల కొద్దీ డాలర్లు దేశంలో కొచ్చి పడుతున్నాయి. జాతీయ వృద్ధి రేటు ఆశాజనకంగా ఉంటోంది. ఈదశలో సాధారణ వ్యక్తులక్కూడా మెరుగైన జీవన ప్రమాణాల్తో కూడిన పరిస్థితులపై ఆసక్తి కలుగుతోంది. ప్రస్తుతం స్వయం ఉపాధి కల్పనారంగమే యువతనాకర్షిస్తోంది. అంతర్జాతీయ స్థాయి జీవన ప్రమా ణాలకనుగుణంగా ఆదాయం పొందేందుకు ఇదొక్కటే అనువైనదిగా ఉంది. ప్రస్తుత యువతరం వ్యవసాయంవైపు మొగ్గుచూపడంలేదు. బ్రిటీష్ కాలం నుంచి సాగుకు ప్రత్యేక ప్రోత్సాహకాలిచ్చేవారు. ఆనాడే ఆనకట్టలు కట్టి సాగునీటి సౌఖ్యం కల్పించారు. తద్వారా దేశీయంగా ఆహారోత్పత్తుల్ని పెంచేవారు. లేనిపక్షంలో భారతీయులు తిరుగుబాటుకు పాల్పడతారన్న భయంతోనే ఆంగ్లేయులు వ్యవసాయానికి ఇంతగా ప్రోత్సాహాన్నిచ్చారు. ఆ తర్వాత స్వతంత్ర భారతంలో కూడా ఇదే విధానం కొనసాగింది. అయితే ప్రస్తు తం పరిస్థితులు మారాయి.

సాగుద్వారా వచ్చే ఆదాయం సాధారణ జీవనానిక్కూడా సరిపోవడం లేదు. వ్యవసాయం పరిశ్రమగా అభివృద్ధి చెందడంలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో స్వయం ఉపాధి కల్పనారంగానికి అత్యధిక ప్రోత్సాహకాల్నివ్వాల్సిన ఆవశ్యకతుంది. 21నుంచి 34ఏళ్ళ మధ్యవయస్కులు ఇప్పుడు ప్రభుత్వోద్యోగాలంటూ ఎగబడ్డంలేదు. వీరంతా వివిధ రంగాల్లో తమ సామర్ధ్యాన్ని నిరూపించుకునేందుకు పోటీలు పడుతున్నారు. అయితే వీరి కోసం ఇతమిద్ధంగా పథకాలేవీ ప్రభుత్వాలు అమలు చేయడంలేదు. జిఎస్‌టి ప్రవేశపెట్టిన అనంతరం సహ జంగానే బడ్జెట్‌లో పన్నులకు సంబంధించిన ప్రస్తావన పెద్దగా ఉండదు అంతకుముందైతే వస్తువుల వారీగా పన్నుల శాతాల్లో హెచ్చుతగ్గులుండేవి.

ఇప్పుడు పన్నుల నిబంధనకు బడ్జెట్‌తో సంబంధంలేకుం డా పోయింది. నెలనెలా జరిగే జిఎస్‌టి కౌన్సిల్ సమావేశాల్లోనే వస్తువుల పన్నుశాతాల హెచ్చుతగ్గులపై నిర్ణయాలు తీసుకునే పరిస్థితేర్పడింది. ఇటీవల జరిగిన ప్రతి ఎన్నికలోనూ బిజెపి గ్రామాల్లో కంటే పట్టణ, నగర ప్రాంతాల్లోనే అత్యంత జనాధరణ నమోదు చేసింది. పన్నుల ప్రస్తావన పెద్దగా లేని ఈ బడ్జెట్‌లో పట్టణాలు, నగరాల్లో అత్యధికంగా స్వయం ఉపాధి పథకాలవైపు మొగ్గుచూపుతున్న ఆధునిక యువతరాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా తగిన పథకాల్ని ప్రకటిస్తారన్న ఆశాభావం సర్వత్రా నెలకొంది.

గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో
కోల్డ్‌స్టోరేజీల నిర్మాణం


- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ ఎల్‌విఎస్‌ఆర్‌కె ప్రసాద్
- మంత్రి కళా వెంకట్రావుతో కలిసి గిడ్డంగుల ప్రారంభం



భామిని (శ్రీకాకుళం), ప్రభన్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో కోల్డు స్టోరేజీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ ఎల్‌విఎస్‌ఆర్‌కె ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లాలోని భామిని మండల కేంద్రంలో రూ. 5.20 కోట్ల వ్యయంతో నిర్మించిన 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గిడ్డంగులను మంగళవారం ఆయన మంత్రి కళావెంకటరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో సంస్థ చైర్మన్ మాట్లాడుతూ, శ్రీకాకుళం జిల్లాలో ధాన్యం దిగుబడి బాగుందని తెలిపారు. వంశధార ప్రాజక్టు త్వరలో పూర్తి అవుతుందని దానివల్ల అదనంగా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని, జిల్లా సస్యశ్యామలవుతుందని తెలిపారు. దీనివల్ల జిల్లాలో ధాన్యం దిగుబడి మరింతగా పెరుగుతుందని, మొత్తం పంట నిల్వకు అవసరమైన గిడ్డంగులు జిల్లాలో నిర్మించాల్సివుందని ఆయన తెలిపారు. రెండు పంటలు పండించడం జరుగుతున్న నేపథ్యంలో గిడ్డంగుల సామర్థ్యం కూడా పెంచాలన్నారు. ఇప్పటికే 70 నుండి 80 వేల టన్నుల సామర్థ్యం గిడ్డంగులు జిల్లాలో అవసరమని గుర్తించామని,భామినిలో మరో 5వేల టన్నుల నిల్వ గల గిడ్డంగులు నిర్మించనున్నామని వివరించారు. రాష్ట్రంలో 6 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గిడ్డంగులను ప్రైవేటు సంస్థలనుండి తీసుకుని నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ పరంగా 6 లక్షల టన్నులు నిల్వచేసే గిడ్డంగులు ఉన్నాయని, మరో 4 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గిడ్డంగుల నిర్మాణానికి ముఖ్యమంత్రి అనుమతికోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలియజేశారు.

స్వేచ్ఛాయుత జీవితం
సమరయోధుల త్యాగఫలితమే

- డీజీపీ డాక్టర్ మాలకొండయ్య



అమరావతి, ఆంధ్రప్రభ: ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుత జీవితం గడపడానికి మహాత్మాగాంధీ సహా ఇతర సమరయోధులు చేసిన త్యాగఫలితమేనని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ డాక్టర్ పి.మాలకొండయ్య అన్నారు. మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించడంతో పాటు ఆయన చేసిన కృషి, త్యాగాన్ని మననం చేసుకుంటూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా డీజీపీ మాలకొండయ్య మాట్లాడుతూ నాటి స్వాతంత్ర సమరయోధులు దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసి జైలు జీవితం గడిపారన్నారు. తద్వారా స్వాతంత్ర స్వేచ్ఛను ప్రసాదించి శాంతి యుత సమాజం నెలకొనేందుకు కృషి చేసినట్లు కొనియాడారు. వీరికి ప్రతి భారతీయుడు ఎంతగానో రుణపడి ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐడీ అదనపు డీజీ సిహెచ్.ద్వారకా తిరుమలరావు, శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ హరిష్ కుమార్ గుప్తా, రైల్వేస్ అదనపు డీజీ కె.ఆర్.ఎం.కిషోర్‌కుమార్, ఐజీలు అమిత్ గార్గ్, ఎన్.శ్రీధరరావు, ఇతర అధికారులు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరంలో నవయుగం

(మొదటిపేజీ తరువాయి)



గుప్పించారు. చివరకు నిర్ణయం తీసుకోడంలో జరుగుతున్న జా ప్యం కారణంగా మిత్రబంధంపైనే నీలి నీడలు కమ్ముకున్నాయి. ఐతే నష్ట నివారణకు ఇరు పార్టీల అధిష్టానాలు దృష్టిని సారించడంతో చివ రకు పోలవరం ప్రధాన కట్టడమైన స్పిల్‌వే, స్పిల్ ఛానల్ పనులను పరుగులు పెట్టించాలనే నిర్ణయానికి కేం ద్రం వచ్చింది. కలిసి ఉంటే కలదు సుఖం.. అన్న చందాన బిజెపి అధిష్టానం ఏపీ ప్రజల సెంటి మెంట్.. జీవ నాడైన పోలవరంపై కనికరం చూపింది. పాత రేట్లుకే ఈ పనులు చేసేందుకు ముందుకు వచ్చిన నవయుగ కంపెనీకే పను లు అప్పగించేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక పై పోలవరం ప్రధాన కట్టడం స్పి ల్ వే కాంక్రీట్ పనులు ముమ్మరంగా జరగనున్నా యి. అనుకున్నట్లుగానే 2019 నాటికల్లా పోలవరం ప్రాజెక్టును సాకా రం చేసి తమ జోడీ శాశ్వతమైందనే సంకేతాలను ఇచ్చేందుకే ఈ నిర్ణ యం జరిగిందని రాజకీయ పరిశీలకులు సైతం అభిప్రాయపడుతు న్నారు. గత రెండు రోజులుగా ఢిల్లీలో జరుగుతున్న రాజకీయ పరి ణామాలు చూస్తే తప్పక టిడిపి అధినేత చంద్రబాబు కేంద్రంపై తీసు కువచ్చిన వత్తిళ్లు ఫలిం చాయనే చెప్పుకోవచ్చు. కేంద్రం బడ్జెట్ రూప కల్పనలో అత్యంత బిజీగా ఉన్నా..టిడిపి మిత్ర పక్షాన్ని గుర్తుంచుకునే కేంద్ర మంత్రి నితిన్ గడ్గరీ నోట పోల వరంపై వరమైన ఈ మాటను బిజెపి పలికించిందంటున్నారు. గడ్గరీ ప్రకటనతో సిఎం చంద్రబాబు మో ములో ఆనందం వెల్లి విరిసింది. ఇంత కాలం తాను అనుసరించిన మౌనరాగం..మూగనోము ఫలించిం దన్నట్లుగా చంద్రబాబు తన కేబినెట్ సహచరులతో, కేంద్రంలోని పెద్దలతో ఉత్సాహంగా మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టుపై తీసుకున్న తాజా నిర్ణయం టిడిపికి నూతనోత్సాహాన్నిచ్చిందనడంలో సందేహం లేదు. అలాగే బిజెపి సైతం రానున్న సార్వత్రిక ఎన్ని కలకు టిడిపితోనే తిరిగి జట్టు కట్టేందుకే సిద్దమనే పరోక్ష సంకేతాలు ఇచ్చినట్లుగా అంతా భావిస్తున్నా రు. నవయుగ కంపెనీ సైతం ఇప్పటికే నిష్ణాతులైన ఇంజనీరింగ్ అధికారుల్ని, అధునాతన భారీ యంత్రా లను సిద్ధం చేసుకుంది. కేంద్రం నుండి సానుకూల సం కేతాలను టీడీపీ అధినేత చంద్రబాబు ఊహించిందే అన్నట్లుగా ప్రచారం సాగుతోంది. కేంద్ర మంత్రి సుజ నా చౌదరి, ఎంపి తోట నర్సింహం ఢిల్లీలో చంద్ర బాబు డైరెక్షన్లో చక్రం తిప్పారు. ప్రస్తుతం బీజేపీకి రాజకీయంగా ఎంతో కీలకమైన ఆర్ధిక సంస్కరణలను ముందుకు తీసుకువెళ్లాల్సి ఉంది. దీంతో మిత్ర పక్షాలను దూరం చేసుకోవడం సరైంది కాదనే భావన లోకి రావడంతోనే పోలవరంపై కీలకమైన నిర్ణయం తీసుకున్నారంటున్నారు. పైగా జమిలీ ఎన్నికలు కూ డా మోడీకి ప్రతిష్టాకరంగా నిలిచాయి. ట్రిపుల్ తలాక్ నిర్ణయం రాజ్యసభలో ఇంకా నెగ్గాల్సి ఉంది. ముస్లిం మహిళా ఓటు బ్యాంకుపై మోడీ కన్నేశారు. యు.పి ఎన్నికల్లోనూ బీజేపీ ముస్లిం ఓట్లను భారీగానే ఎగరేసుకుపోయారు. మున్ముందు కూడా ముస్లీం లపై బిజెపి సానుకూల వైఖరితోనే ఉందనే నిర్ణయాన్ని చాటాలన్నా..మిత్ర పక్షాల తోడ్పాటు ఎంతైనా మోడీకి అవసరమే. సరే రాజకీయ కారణాలైనా, లేక అభివృద్ధి..ఇతర లక్ష్యాలై నా కానీ పోలవరంపై సానుకూల నిర్ణయం తీసుకోవడంపై ఏపిలో సంతృప్తి కరమైన వ్యాఖ్యానాలే విన్పిస్తున్నాయి. అలాగే రేపటి కేంద్ర బడ్జెట్లో నూ పోలవరంకు భారీగానే వేలాది కోట్లు రూపాయల నిధులు కేటా యింపులును మనం ఆశించవచ్చు. ఇదే జరిగితే కనుక విపక్షాలు మూగనోము పట్టా ల్సిందేమో మరి.. !

గాంధీజీ ప్రత్యక్షదైవం

- మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య




అమరావతి, ఆంధ్రప్రభ: స్వాతంత్రోద్యమంతో ఆంగ్లేయుల కబంద హస్తాల నుంచి భారత దేశానికి విముక్తిని ప్రసాదించిన మహాత్మా గాంధీజీ దేశ ప్రజలకు ప్రత్యక్ష దైవమని మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య పేర్కొన్నారు. మంగళవారం గుంటూరులో జాతిపిత బాపూజీ 70వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి, మండలి ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న రోశయ్య మాట్లాడుతూ బానిస పాలన నుంచి దేశానికి స్వేచ్ఛను కల్పించాలన్న లక్ష్యంతో అహింస, శాంతిలను ఆయుధంగా చేసుకొని నిరంతరం పోరాడిన మహోన్నత వ్యక్తి బాపూజీ అన్నారు. ఎందరో మహానుభావులకు జన్మనిచ్చిన భరత భూమిలో గాంధీజీ కూడా జన్మించడం భారతీయులు చేసుకున్న అదృష్టమని చెప్పారు. ప్రస్తుతం మనం అనుభవిస్తున్న స్వతంత్ర ఫలాలు ఎందరో త్యాగ మూర్తుల కృషి ఫలితమని, అటువంటి వారందరికీ నాడు గాంధీజీ స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని గుర్తు చేశారు. విద్యార్ధిగా చదువుకుంటున్న రోజుల్లో గాంధీని దగ్గర నుంచి చూసే అదృష్టం తనకు కలిగిందని, నేటి యువతరం గాంధీ చూపిన మార్గంలో పయనిస్తూ శాంతి, సహనం, అహింసలతో ఆయన ఆశయాలను, ఆకాంక్షలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.

విపత్కర పరిస్థితుల్లో గవర్నర్‌లదే కీలకపాత్ర

ప్రభుత్వాలు విపత్కర పరిస్థితుల్లో ఉన్నపుడు ప్రజా సంక్షేమ పాలన కోసం గవర్నర్‌లు కీలక పాత్ర పోషిస్తారని రోశయ్య తెలియజేశారు. లౌకిక రాజ్యమైన భారత దేశంలో గవర్నర్ల వ్యవస్థ ఉండాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. తాను ఎప్పటికీ కాంగ్రెస్ వాదిగానే ఉంటానంటూ పార్టీ తనకు కీలక పదవులను ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ వయసు పైబడటంతో రాజకీయాల్లో క్రియాశీలకంగా పనిచేయడం సాధ్యం కావడం లేదన్నారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోన శశిధర్, టీడీపీ ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, రాయపాటి శ్రీనివాస్, గాదె వెంకట రెడ్డి, మస్తాన్ వలీ, సూర్యా నాయక్, మాదాల శ్రీనివాస్, మాటూరి బాలకృష్ణ పావులూరి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో దళితుల సంక్షేమానికి పెద్దపీట

- ప్రతి కుటుంబానికి రూ.10 వేల ఆదాయానికి ప్రణాళిక
- దళిత తేజం తెలుగుదేశం ద్వారా అవగాహన : మంత్రి నక్కా ఆనందబాబు



అమరావతి, ఆంధ్రప్రభ: రానున్న బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి పెద్దపీట వేయనున్నట్లు సాంఘికసంక్షేమ, గిరిజనశాఖ మంత్రి నక్కా ఆనంద బాబు వెల్లడించారు. ఈ ఏడాది ఎస్సీ, ఎస్టీ నిధుల వినియోగంపై అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం మంత్రి మంగళవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. గతంతో పోలిస్తే నిధుల వినియోగంలో కొంత మెరుగు కనిపిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ నిధులు 70 నుంచి 75 శాతం ఖర్చు అయ్యాయన్నారు. మిగిలిన వాటిని కూడా ఈ రెండు నెలల్లో ఖర్చు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. గేదెల కొనుగోలుకు సంబంధించి అధికారులు చెప్పే ధరలకు రైతులు మార్కెట్‌లో కొనుగోలు చేసే ధరలకు వ్యత్యాసం ఉన్నట్లు గ్రహించామన్నారు. వచ్చే బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు ఉపయోగపడే, ఆర్థికంగా భరించగలిగే పథకాలను రూపొందించనున్నామన్నారు. ట్రాక్టర్ల కొనుగోలు వంటి పథకాలను సబ్సిడీ భాగాన్ని పెంచేందుకు కృషి చేస్తామన్నారు. ఎస్టీ కాంపొనెంట్ కింద ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.8,847 కోట్లు కేటాయించగా, నోడల్ ఏజెన్సీలకు చెందిన 44 ప్రభుత్వ శాఖలు జనవరి 25 వరకు రూ. 7,469 కోట్లు వ్యయం చేసినట్లు పేర్కొన్నారు.

ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రకారం రూ. 10,916 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఎస్టీ కాంపొనెంట్ కింద ఈ ఏడాది రూ.3,528 కోట్లు కేటాయించగా నోడల్ ఏజెన్సీకి చెందిన 45 శాఖలు జనవరి 27 వరకు రూ. 2,610 కోట్లు ఖర్చు చేశారన్నారు. సవరించిన బడ్జెట్ ప్రకారం రూ. 4,025 కోట్లు కేటాయించినట్లు మంత్రి పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో చర్చించడం జరిగిందన్నారు. గిరిజనులకు ప్రయోజనం కలిగించేలా వారికి అవసరమైన నూతన పథకాలను ప్రవేశపెట్టనున్నామన్నారు. పౌష్టికాహార లోపంగా ఉన్న ఏజెన్సీ ప్రాంతాలను గుర్తించి ప్రతి నెల రూ.500 విలువగల న్యూట్రి బాస్కెట్‌ను మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా పంపిణీ చేసే పథకానికి ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. దళిత తేజం తెలుగుదేశం కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని అన్ని దళిత వాడల్లో ప్రభుత్వం వారి సంక్షేమానికి చేపట్టిన కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తామన్నారు. విలేఖరుల సమావేశంలో కార్మిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.ఎస్.రావత్ పాల్గొన్నారు.

సీఎంకు మంత్రి కాల్వ కృతజ్ఞతలు




అమరావతి, ఆంధ్రప్రభ: రాయలసీమను సస్యశ్యామలం చేసే భైరవవాని తిప్ప ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసిందుకు తన ప్రాంత ప్రజలతోపాటు తా ను కూడా జీవితాంతం రుణపడి ఉంటానని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గ్రామీణ గృహ నిర్మాణ శాఖా మంత్రి కాల్వ శ్రీనివాసులు ముఖ్యమంత్రికి చెప్పారు. మంగళవారం మ ధ్యాహ్నం వెలగపూడి సచివాల యంలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలోని గుమ్మఘట్ట మండలంలో గల భైరవాని తిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాలను తీసుకుని రావడానికి అవసరమైన పనుల నిమిత్తం రూ. 969 కోట్లకు పైగా నిధులను విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి కాల్వ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సాగునీటితో రాయదుర్గం సస్యశ్యామలం అవుతుందని, తమ నియోజకవర్గ ప్రజలు, రైతులతో పాటు తాను కూడా జీవితాంతం తమకు రుణపడి ఉంటామని మంత్రి కాల్వ ఈ సందర్భంగా చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

గృహ నిర్మాణంపై వెనుకడుగు లేదు
ఏపీయూడబ్ల్యూజే నేతలకు మంత్రి హామీ

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని జర్నలిస్టులకు వారి అవసరాలకు అనుగుణంగా 3రకాల గృహాలను నిర్మించాలని, అదనపు సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించినట్లు రాష్ట్ర సమాచార శాఖా మంత్రి కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఆ మేరకు ఫిబ్రవరి 2వ తేదిన ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం మంత్రి కాలవ చాంబర్‌లో మంత్రితో పాటు సమాచార కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్‌తో ఏపీయుడబ్ల్యుజె నేతలు జర్నలిస్టుల సమస్యలపై చర్చించారు. ప్రధానంగా హౌసింగ్ సమస్యపై మంత్రి మాట్లాడుతూ సింగల్ , డబల్, త్రిబుల్ బెడ్‌రూమ్‌ల గృహాలు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. జర్నలిస్టులు ఏ క్యాటగిరీ ఇళ్లు కావాలంటే దానిని ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. బిపిఎల్ లబ్ధిదారులకు ఇచ్చే సబ్సిడీనీ జర్నలిస్టులకు పెంచనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అందుకు గాను సమాచార శాఖ నుండి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కొత్త అక్రిడేషన్‌లు మార్చికి ఇచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను మంత్రి ఆదేశించారు. మంత్రితో సమావేశమైన వారిలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐవి సుబ్బారావు, అమరావతి ఏపీయుడబ్ల్యుజె కన్వీనర్ చందుజనార్ధన్, సభ్యులు రెడ్డెం అప్పాజీ, వాసుదేవన్, సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ కిరణ్ ఉన్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
బుధవారం 31 జనవరి 2018

నల్లేరు బండి కాదు



పెంటపాటి పుల్లారావు
రాజకీయ విశ్లేషకులు, న్యూఢిల్లీ
ppr193@gmail.com

కుటుంబానికైనా, వ్యాపారానికైనా, దేశానికైనా ఆదాయ వ్యయాల అంచనా తప్పనిసరి. ఈ అంశంలో ఒక ప్రణాళిక లేకుంటే అంతా గందరగోళంగా తయారవుతుంది. భారత దేశానికి షణ్ముఖం చెట్టి మొట్టమొదటి ఆర్థిక మంత్రి. 1947 నుంచి 1949 వరకూ ఆయన బాధ్యతలను నిర్వహించారు. ఆర్థిక మంత్రులలో అనేకమంది స్వభావం మితభాషిత్వం. చాలా తక్కువ మాట్లాడతారు. సిసలైన ఆర్థిక మంత్రులకు మొరార్జీ దేశాయ్, మన్మోహన్ సింగ్, సిడి దేశ్‌ముఖ్ మంచి ఉదాహరణ. వారా పదవిలో చక్కగా ఇమిడిపోయారు. టెలివిజన్ చానెళ్ళు, 24గంటల వార్తా స్రవంతుల ప్రవేశానంతరం ఆర్థిక మంత్రులు కూడా మిత భాషిత్వాన్ని వదిలిపెట్టారు. వీలైనప్పుడల్లా నోరు విప్పుతున్నారు. మిగిలిన మంత్రులతో పోటీపడుతున్నారు. పి. చిదంబరం దీనికి దారి తెరిచారు. అరుణ్ జైట్లీ ఆయన సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. జైట్లీ గొప్ప రాజకీయవేత్తే కాక మంచి న్యాయవాది కూడా. చిదంబరం మాదిరిగానే తన వాగ్ధాటిని సాగిస్తున్నారు. టీవీ తెరపై ఎక్కువగా కనిపించే రాజకీయవేత్త ప్రతిష్ట అంతే వేగంగా తగ్గిపోతుంది. టూత్ పేస్ట్ ప్రకటన ప్రసారం చేసిన కొద్దీ ప్రముఖంగా మారుతుంది. రాజకీయవేత్తలు మాత్రం తమ ప్రచార యావ, లేదా దురదను తగ్గించుకోవాలి.

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 1991లో పివి నరసింహారావు, డాక్టర్ మన్మోహన్ సింగ్ వరకూ భారత్ విదేశీ నగదు మార్పిడి రేటుతోనే ఆర్థిక వ్యవస్థను నిర్వహించుకుంటూ వచ్చింది. భారతీయ కరెన్సీకీ, విదేశీ కరెన్సీకీ రేట్ల మధ్య కచ్చితమైన సాపత్యముండేది. మన్మోహన్ సింగ్ 1991లో భారత ఆర్థిక మంత్రి అయిన తరవాత, విదేశీ మారక ద్రవ్య మార్పిడిని తేలిగ్గా చేసే దశకు మారింది. దీన్నే సరళీకరణగా వ్యవహరించాం. ఆ సమయం నుంచి భారతీయ రూపాయి విలువను అంతర్జాతీయ అవసరం, సరఫరాలకు అనుగుణంగా లెక్కగట్టడం ప్రారంభమైంది. 1991 వరకూ భారతీయ బడ్జెట్ మొత్తం పన్నుల వసూలు, ఖర్చులను లెక్కగట్టడమే కాకుండా చమురు, ఆహారం, ఆయుధాలు, ఔషధాలు, అత్యవసర సరకులను విదేశాల నుంచి కొనుగోలు చేయడానికి విదేశీ మారకాన్ని కనుగొనడంలోనే తలమునకలయ్యేది. ప్రపంచవ్యాప్తంగా తిరుగుతూ విదేశాల నుంచి విదేశీమారక ద్రవ్యాన్ని రుణంగా తెచ్చుకునేందుకు ప్రయత్నించాల్సి వచ్చేది. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థల తలుపులను తట్టాల్సి వచ్చేది. బ్యాంకుల్లో విదేశీ మారక నిధులు ఎన్నున్నాయో చెప్పడం ప్రస్తుత ఆర్థిక మంత్రి ప్రధాన విధి.

భారత్‌లాంటి ప్రజాస్వామ్య దేశంలో ప్రజలు తమపై ఎక్కువ ఖర్చుపెట్టాలని అభిలషిస్తారు. ప్రజలు అన్నీ ఉచితంగా కావాలని కోరుకుంటారు. రాజకీయ పార్టీలు కూడా అందుకు తగ్గట్టుగానే ప్రజలకు అన్నీ ఉచితంగా ఇవ్వజూపుతుంటాయి. అంటే ప్రభుత్వం వీలైనంత ఎక్కువ మొత్తాన్ని కనుగొనాల్సి ఉంటుంది. ప్రజలకు ఉచితంగా అందించడానికి నిధులు అవసరమే కదా. అలా చేయకపోతే, అధికారంలో ఉన్న పార్టీలు ఎన్నికల్లో ఓడిపోవచ్చు. ఇదే ప్రభుత్వాలకు కష్టంతో కూడుకున్న పని. హిమాచల్ ప్రదేశ్, వంటి చిన్న రాష్ట్రాలలో బడ్జెట్ జీతాలకూ, ప్రభుత్వ సేవకుల ఖర్చులకే సరిపోతుంది. ఈ రాష్ట్రాల అవసరాలకు కేంద్రమే నిధులను కేటాయించాల్సి ఉంటుంది.

బీజేపీకి బడ్జెట్లు నల్లేరుపై నడకలే

2014 నుంచి మోడీ ప్రభుత్వానికి ఆర్థికంగా చాలా సులభతరంగా ఉంది. అదేదో అద్భుతం మాదిరిగా చమురు బ్యారెల్ ధర 140 అమెరికన్ డాలర్ల నుంచి 50 డాలర్లకు తగ్గిపోయింది. ఈ నాలుగేళ్లూ ప్రభుత్వానికి ఎటువంటి కష్టమూ లేకుండా గడిపేయడానికి ఇదే ప్రధాన కారణం. భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం గొప్ప అవకాశాన్ని వృధా చేసిందని నేను భావిస్తున్నాను. 1947 నుంచి ఏ ప్రభుత్వానికీ ఇలాంటి అవకాశం చిక్కలేదు. ప్రస్తుతం చమురు బ్యారెల్ ధర 71 డాలర్లకు ఎగబాకింది. ఇది మరింత పెరగవచ్చుననే భయాందోళనలు ఎన్డీయే ప్రభుత్వంలో కనిపిస్తున్నాయి. అదే సంభవిస్తే, దేశంలో ద్రవ్యోల్బణం బీజేపీ ప్రభుత్వ ప్రతిష్టను మసకబారుస్తుంది. ఇప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ దిగుమతి చేసుకునే చమురు ధరపైనే ఆధారపడి ఉండడం దీనికి కారణం.

చమురు ధర మరి కొద్ది సంవత్సరాల పాటు పెరగదని బీజేపీ ప్రభుత్వం తప్పు లెక్కలు వేసుకుంది. ఎన్నికలకు ఇక ఏడాది మాత్రమే సమయముంది. ఈలోగా పెరిగిన చమురు ధర ఆర్థిక వ్యవస్థపై పెను ప్రభావం చూపుతుంది. ఇది బీజేపీని దిగ్భ్రమకు గురిచేస్తోంది. చమురు ధరలు పెరిగితే సామాజిక ప్రయోజనం కోసం చేసే ఖర్చులను తగ్గించుకోవాలి. చమురు కోసం అదనపు మొత్తాన్ని కేటాయించాలి. ఈ నాలుగేళ్ళ పాటు ధరలు పెరగకపోవడం మోడీ అదృష్టం. ఈ అదృష్టం ఆయనకు కీలకమైన మరో ఏడాది కొనసాగుతుందా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఎవరినైనా తన దగ్గరకి ఉద్యోగం కోసం తీసుకొచ్చినప్పుడు ఫ్రాన్స్ చక్రవర్తి నెపోలియన్.. ఇతను అదృష్టశాలేనా? అని



ప్రశ్నించేవారట. ఇది నరేంద్ర మోడీకి అతికినట్లు సరిపోతుంది. మోడీ, జైట్లీ తమకు ఐదేళ్ళు సమయముందని వేసుకున్న లెక్కలు తప్పాయి. అకస్మాత్తుగా సమయం తమకు వ్యతిరేకంగా మారిపోయిందని వారు గ్రహించారు. విధానాలు, పన్నులలో మార్పులు ఫలితాన్నివ్వడానికి ఎంతో సమయం పడుతుంది. ప్రపంచంలోనే మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన భారత్‌లో ఇది మరింత సమయాన్ని తీసుకుంటుంది. మిలియన్ టన్నుల చమురు మోసుకెళ్ళే అతి పెద్ద ఓడ లాంటిది భారత్. ఉన్నట్టుండి ఆ ఓడను ఆపాలనుకున్నా.. ఆగడానికి 20నిముషాల సమయం పడుతుంది. అదే మాదిరిగా ప్రధాన మంత్రి నరేంద్రమోడీ తన ప్రసంగాన్ని మార్చుకున్నట్లు భారత ఆర్థిక వ్యవస్థను మార్చలేం.

మోడీ ప్రభుత్వానికి 2018 బడ్జెట్ చివరిది. ఇదే ఎన్నికల బడ్జెట్ కూడా. వచ్చే బడ్జెట్‌లో ఏం చేసినప్పటికీ 2019లో ప్రభుత్వ అదృష్టాన్ని మార్చలేరు. మార్చడానికి సమయం మించిపోయిందని చెప్పడమే దీని ఉద్దేశం. 2013లో యూపీఏ ప్రభుత్వం ప్రజలను సంతోషపరచడానికి అన్ని రకాల యుక్తులూ ప్రదర్శించింది. అప్పటికే ఎంతో ఆలస్యమైపోయింది. రాజకీయ సంగతులు లేదా 2019లో మోడీ ప్రభుత్వ భవిష్యత్తు గురించి కాకుండా, రానున్న బడ్జెట్‌లో ఏముంటాయో ఊహించవచ్చు.

● 1) రక్షణ కోసం భారీ మొత్తంలో కేటాయింపులు:

రక్షణ శాఖకు భారీ స్థాయిలో కేటాయింపులుంటాయని ఎవర్నడిగినా తేలిగ్గా చెబుతారు. రక్షణకు ఎక్కువ కేటాయిస్తున్నామంటే మెరుగైన రక్షణకోసం అనుకోవడం పెద్ద తప్పిదమే కాగలదు. సున్నితమైన సరిహద్దులలో ఎలక్ట్రానిక్ ఫెన్సను ఏర్పాటు ప్రారంభించడానికి లభించిన సువర్ణావకాశాన్ని ప్రభుత్వం గడిచిన నాలుగేళ్ళలో జారవిడిచింది. రక్షణకు ఎక్కువ మొత్తాన్ని కేటాయించడం మనకు ఆయుధ విక్రయదేశాలతో స్నేహాన్నీ, స్నేహితులను పెంచుతుంది తప్ప, సరిహద్దుల్లో తీవ్రవాదం, చొరబాట్లు అంశంలో ఎటువంటి మార్పునూ చూపించలేదు.

● 2) అందరు ఆర్థిక మంత్రుల్లాగే ఆదాయ పన్ను పరిధిని అరుణ్ జైట్లీ కూడా పెంచుతారు. ఇప్పుడు మధ్య తరగతి ఎంతో సంతోషంగా ఉంది.. ఎందుకంటే వారు కొన్ని వేల రూపాయలను వెనకేసుకుంటారని చప్పట్ల మధ్య ప్రకటిస్తారు. బడ్జెట్‌లో ఇదే ముఖ్యమైన అంశం కావచ్చు. సాగునీటి రంగానికి కూడా అరుణ్ జైట్లీ కేటాయింపులను పెంచుతారు. రైతులకు చాలా పెద్ద రాయితీ ఇచ్చామని ప్రకటించుకుంటారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ మినహా మన ఆర్థిక మంత్రులంతా పట్టణ ప్రాంతానికి చెందిన వారే. ఇలాంటి కేటాయింపులతో రైతులు సంతోషంగా ఉంటారని వారు భావిస్తారు. సాగునీటి రంగమే అత్యంత ప్రధానమైనదైనే, పంజాబ్, హర్యానా రాష్ట్రాలలో వ్యవసాయం అంత సంక్షోభాన్ని ఎందుకు ఎదుర్కొంటోంది? ఈ రెండు రాష్ట్రాలు బ్రిటిష్ కాలం నాటి నుంచి వందశాతం వ్యవసాయాన్ని చేస్తున్నాయి. సాగునీటి రంగం వ్యవసాయంలో ఒకభాగం మాత్రమే.

● 3) ఎరువుల మీద రాయితీకి కేటాయింపులూ పెంచుతారు. ఈ పెంపుతో రైతులు పట్టపగ్గాల్లేని సంతోషానికి గురవుతారని మంత్రి భావిస్తారు. వాస్తవంలో చూస్తే.. ఎరువులపై ఇచ్చే సబ్సిడీ రైతు ఆర్థిక పరిస్థితిని ఏమీ మెరుగు పరచలేదు. మహారాష్ట్రలో రైతులు పెద్దస్థాయిలో చెరకు సాగుచేస్తారు. ఎక్కువ మొత్తంలో రాయితీలూ అందుతాయి. అయినప్పటికీ ఆ రాష్ట్రంలోనే రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా ఉంటున్నాయి. ఇలా ఎందుకు?

● 4) ఆరోగ్య మంత్రిత్వ శాఖకు మరిన్ని కేటాయింపులు ఉంటాయి. గడిచిన నాలుగేళ్ళలో ఈ శాఖ కోసం ప్రభుత్వం చేసిందేమీ లేదు. అందువల్ల మరిన్ని కేటాయింపులున్నప్పటికీ మార్పుండకపోవచ్చు. వైద్య, ఆరోగ్య మంత్రిత్వ శాఖలో వచ్చిన ఒకే ఒక మార్పు ఏమిటంటే, గతంలో కన్నా ప్రజలు ఇప్పుడు కార్పొరేట్ ఆస్పత్రులపై ఆధారపడడం.

● 5) మౌలిక సదుపాయాలు, రైల్వేలకు ఈసారి ఎక్కువ నిధులు రావచ్చు. మౌలిక సదుపాయాలపై ఖర్చుకు తగ్గట్టు ఉపాధి అవకాశాలు పెరగడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో నాగార్జున సాగర్ నిర్మాణంలో రోజా పాతికవేలమంది పనిచేశారు. అలా సంవత్సరాల తరబడి వారికి ఉపాధి లభించింది. ప్రస్తుతం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలిస్తే, ఖర్చంతా ట్రక్కులపైనా, ఆఫీసులు, కాంట్రాక్టర్లు, పొక్లైన్ యంత్రాలపైనే కనిపిస్తోంది. మౌలిక సదుపాయాల కోసం లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నా, ఉపాధి అవకాశాలు పెరగడంలేదు. జాతీయ రహదారుల విభాగంలోనూ ఎన్నో పనులు చేపడుతున్నారు. కార్మికులకు ఉపాధి అవకాశాలు లేవు. మౌలిక సదుపాయాలపై కోట్లు ఖర్చు చేస్తే ఉపాధి అవకాశాలు పెరగవన్నదే నా వాదన. మౌలిక సదుపాయాలకు భారీగా నిధులు అవసరమే. ఆ నిధులను జాగ్రత్తగా లెక్కించాలి.

బడ్జెట్‌లో ఏం చూడాలనుకుంటున్నానంటే...:

బడ్జెట్ 2018

● ఎ) వ్యవసాయ రంగంలో ఎరువులు, విత్తనాలు, ఇతర పథకాలపై లక్షలు కోట్లు ఖర్చు చేయడం కన్నా, రైతులకు ప్రభుత్వం నుంచి నేరుగా నగదు బదిలీ అవ్వాలి. రైతులందరి చేత జన్ ధన్ యోజన కింద జీరో బ్యాలెన్స్ ఖాతాలను తెరిపించారు కనుక, ఇది కష్టం కాదు. గ్రామీణాభ్యుదయానికి ఇదే సరైన మార్గం. గ్రామీణ ప్రాంతంలో ఒక గ్రామంలో ఐదువేల జనాభా ఉన్నారనుకుందాం. ఐదువందల కుటుంబాలకు పదివేల వంతున నగదు అందితే, మొత్తం ఆ గ్రామానికి 50 లక్షల రూపాయలవుతుంది. నెలలోగా ఆ డబ్బు ఆ గ్రామంలో ఖర్చు చేస్తారు. డబ్బు చేతులు మారడం వల్ల కలిగే ప్రయోజనాన్ని ఊహించగలరా? ఆ డబ్బుతో ఆ గ్రామంలో ఉన్న వారందరికీ వెంటనే ప్రయోజనం లభిస్తుంది. లక్షల కోట్లు ఖర్చు చేయడం వల్ల 50 లక్షలతో గ్రామీణులకు ఎంతో ఊరట కలుగుతుంది.

● బి) ట్రాఫిక్ ఎక్కువ ఉన్న చోట రహదారులు, జాతీయ రహదారులు నిర్మించడం అవసరమే. అవసరం లేని రోడ్ల కోసం ఎక్కువగా ఖర్చు చేయవద్దు. అవసరం లేని రోడ్ల కోసం చైనా పదివేల బిలియన్ డాలర్లు ఖర్చు చేసి భారీ మొత్తంల నిధులను వృధా చేసిన సంగతి గుర్తుండే ఉంటుంది. మౌలిక సదుపాయాలపైన అతిగా పెట్టుబడులు పెట్టి చైనా ఎంతో మానసిక ఒత్తిడికి గురవుతోంది. చైనీయులు ఎన్నికల మీద ఆధారపడరు. ప్రజాగ్రహాన్ని వారు ఎన్నడూ చూడలేదు.

● సి) కార్పొరేట్లపైనా, వ్యక్తులపైనా అన్నిపన్నులూ తగ్గించండి:

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కార్పొరేట్ పన్నును 35 శాతం నుంచి 20 శాతానికి తగ్గించారు. పన్నులు ఎగవేయడానికి విదేశీ బ్యాంకుల్లో దాచుకున్న డబ్బును అమెరికన్లు వెనక్కి తీసుకుని రావాలని ట్రంప్ పిలుపునిచ్చారు. కంప్యూటర్ రంగంలో ప్రసిద్ధి చెందిన ఆపిల్ కార్పొరేషన్ విదేశీ బ్యాంకుల్లో 400 బిలియన్ డాలర్లు ఉంచింది. ఆ సంస్థ ఆ మొత్తం డబ్బును అమెరికాకు తెస్తోంది. ఇది అమెరికన్లకు నిస్సందేహంగా వరమే. పన్ను రేట్లను తగ్గిస్తే, ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయి. ప్రజలు పరోక్ష పన్నులు మరింతగా చెల్లిస్తారు. ఎక్సైజ్ సుంకాల విషయంలో కూడా. దానికి ధైర్యం కావాలి. ప్రధానమంత్రి నరేంద్రమోడీకీ, ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీకి ఎంతో ప్రతిభగల ఆర్థికశాస్త్రవేత్తలు సలహాదారులుగా ఉన్నారు. పన్ను తగ్గింపు సూచనలు వారు చేస్తారా అన్నది అనుమానమే.

● డి) పెద్ద నోట్ల రద్దు ఘోర తప్పిదమనీ, జీఎస్‌టి పూర్తిగా విఫలమైందనీ ప్రభుత్వం ఇప్పటికైనా ఒప్పుకుని తీరాలి. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో నోట్ల రద్దు, జీఎస్‌టిలను పట్టించుకోకుండా ప్రజలు తాను చేస్తున్న మంచి పనులను గుర్తించాలని అన్నారు. ప్రభుత్వం ఈ వైఫల్యాలను పూడ్చడానికి ఇతరత్రా ప్రోత్సాహకాలు ఇవ్వాలి. ప్రభుత్వం అలా చేస్తుందా అన్నది సందేహమే.

● ఈ) ప్రభుత్వం చేసే ఖర్చుల్లో దుబారాను బాగా తగ్గించాలి. ఆకర్షణీయ నగరాలు, ఇతర పథకాలకు చేసే ఖర్చుల్లో దుబారా తగ్గించాలి.

● ఎఫ్) మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత బాగా అమలు జేసింది స్వచ్ఛ భారత్ పథకం ఒక్కటే. ఇది ప్రభుత్వానికీ, మోడీకీ మంచి పేరు తెచ్చింది. దేశంలోని అనేక ప్రాంతాల్లో ఈ పథకం బాగా అమలైంది. దేశంలోని నగరాల్లో, పట్టణాల్లో ఇప్పటికీ టాయిలెట్లు లేవు. స్వచ్ఛ భారత్ పథకం విజయవంతం కావడానికి మోడీ వంద శాతం నిధులు కేటాయించాలి. మిగిలిన పథకాల్లో చాలా మటుకు దుబారాయే. ఆకర్షణీయ నగరాల పథకం ఘోరంగా విఫలమైంది. దీనిపై పెట్టిన ప్రజాధనం బాగా దుర్వినియోగమైంది. ఆకర్షణీయమైన పేర్లు ఘోరమైన వైఫల్యాలుగా మిగిలాయి.

నల్ల హంస(బ్లాక్ స్వాన్) ఉందని చెబుతుంటారు. ఎక్కువమంది దాన్ని చూడలేదు. బ్లాక్ స్వాన్ ఉన్నపళంగా కనిపిస్తుంది. వచ్చే బడ్జెట్ బ్లాక్ స్వాన్ వంటిదే. అది అద్భుతమైన బడ్జెట్ కాకపోవచ్చు. బ్లాక్ స్వాన్ బడ్జెట్ వస్తుందనే అనుకుందాం. మన్మోహన్‌సింగ్ తర్వాత సమర్థులైన ఆర్థికమంత్రులెవరూ రాలేదు. ఆర్థికమంత్రి అని పేరు తెచ్చుకునేందుకు అరుణ్ జైట్లీకి అవకాశం లభించింది. నాలుగేళ్ళుగా ఆయన బడ్జెట్లు సాధారణ స్థాయిలోనే ఉన్నాయి. ఆయనకూ ఇదే చివరి బడ్జెట్. ఇందులో అయినా ఆయన మంచి పేరు తెచ్చుకోవాలి. మాజీ ఆర్థిక మంత్రులు ప్రణబ్ ముఖర్జీ, చిదంబరం, యశ్వంత్ సిన్హాలు మంచి మంత్రులని ఎవరైనా అనగలరా?

సాగుపైనే దృష్టి పెట్టాలి

ఆర్థిక సర్వేలు ఎప్పుడూ ఆశావహంగానే ఉంటాయి. సాధారణ బడ్జెట్‌లో కేంద్రం చేసే ప్రతిపాదనలు స్థూలంగా ఆర్థిక సర్వేలో పొందు పర్చడం సాధారణమే. అంతే. బడ్జెట్‌లో ఆదాయానికి సంబంధించిన అంచనాలు తప్పినట్టే, సర్వేలో చేసే ప్రతిపాదనలూ, పేర్కొనే లక్ష్యాలు అమలు జరగకపోవడమూ సాధారణమే. ఉదాహరణకు గత ఏడాది ఆర్థిక సర్వేని ప్రవేశపెట్టినప్పుడు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) ని 7 నుంచి 7.5 శాతం సాధిస్తామని ప్రకటించారు. కానీ, వాస్తవం వేరు. జిడిపి 6.5 శాతం మించలేదు. ఇందుకు చమురు ధరల పెరుగుదలే కారణమని ఇప్పుడంటున్నారు. అది కొంతవరకూ నిజమే. కానీ, చమురు ధర తక్కువగా ఉన్నప్పుడు ఆర్థిక పరిస్థితిని మెరుగు పర్చేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటన్న ప్రశ్నకు సమాధానం దొరకదు. ఎన్నికల ముందు సమర్పించే ఓట్ ఆన్ అకౌంట్ లో ప్రతిపాదనలు చేసేందుకు పెద్దగా అవకాశం ఉండదు. కనుక, ఆర్థిక మంత్రి జైట్లీ ప్రవేశపెట్టే పూర్తి స్థాయి చివరి బడ్జెట్ ఇదేనని ఇప్పటికే విశ్లేషణలు వచ్చాయి. ఈ నాలుగు సంవత్సరాలలో ఒక్క సంవత్సరమైనా జిడిపి అంచనాలను ప్రభుత్వం చేరుకుందా అంటే లేదని సమాధానం వస్తుంది. వాతావరణ పరిస్థితులు సక్రమంగా లేకపోవడం వంటి అరిగిపోయిన రికార్డు వంటి సమాధానం ఆర్థిక మంత్రి నోటంట వస్తుంది. అసలు కారణం ఏమిటో ప్రభుత్వం చెప్పకపోయినా, జనానికి తెలుసు. పెద్ద కరెన్సీ రద్దు, జిఎస్‌టి వంటి ఆకస్మిక, అనాలోచిత నిర్ణయాలను జనం మీద రుద్దడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందన్నది తిరుగులేని వాస్తవం. అయితే, ఈ రెండు నిర్ణయాల వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురైనా పరిస్థితి మళ్ళీ గాడిలో పడిందనీ, ఆర్థిక పరిస్థితి పుంజుకుంటోందని ఆర్థికమంత్రి అంటున్నారు. పెద్ద కరెన్సీ రద్దు వల్ల కొత్తగా 18 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు నమోదు అయ్యారని ఆర్థిక మంత్రి అంటున్నారు. కొత్తగా నమోదు అయిన పన్ను చెల్లింపుదారుల వల్ల అదనంగా వచ్చిన రాబడి అంతంత మాత్రమేనని ప్రభుత్వమే చెబుతోంది. వ్యవసాయ రంగానికి సంబంధించి ప్రభుత్వ లెక్కలే నిరాశా జనకంగాఉన్నాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం వల్ల వార్షిక ఆదాయం సగటున 15 నుంచి 18 శాతం పడిపోవచ్చని ప్రభుత్వమే చెబుతోంది. జిఎస్‌టి ద్వారా రాబడి అక్టోబర్, నవంబర్‌లలో తగ్గినా, డిసెంబర్‌లో ఆశావహంగానే ఉంది. అంతే, ఇదేనికరమని చెప్పలేం. జిఎస్‌టి ఇంకా బాలారిష్టాల దశలోనే ఉంది. జిఎస్‌టి వల్ల 96 వేల కోట్ల రూపాయిల ఆదాయం లభించిందని ఆర్థికమంత్రి చెబుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకునే కార్పొరేట్ దిగ్గజాలు కార్పొరేట్ పన్నును 30 నుంచి 20 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తున్నారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, కార్పొరేట్, పారిశ్రామిక సంస్థల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తోందన్నది వాస్తవమే. అదే సందర్భంలో దేశంలో అత్యధిక సంఖ్యాకులకు వ్యాపకమైన వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించకపోతే ఉత్పత్తులు దారుణంగా పడిపోతాయి. వ్యవసాయం గిట్టుబాటు కాకపోయినా, రైతుల మాటల్లోనే అది ఒక వ్యసనంలా కొనసాగిస్తున్నవారెంతో మంది ఉన్నారు. ఈసారి కాకపోతే, వచ్చే సారైనా ఆదాయం రాకపోతుందా అన్న ధీమాతో అప్పులు చేసి పెట్టుబడులు పెడుతున్నారు. రాజకీయ నాయకుల్లో అధిక సంఖ్యాకులు తాము కూడా వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చిన వారమేననీ, రైతుల సమస్యలపై సంపూర్ణమైన అవగాహన ఉందని తరచూ ఊదరగొడుతుంటారు. కానీ, వారంతా సంపన్న రైతుల ప్రయోజనాలనే కాపాడుతున్నారన్న ఆరోపణలకు తగిన సమాధానం లేదు. ఆత్మహత్యలు చేసుకునే రైతుల్లో అధిక సంఖ్యాకులు బడుగు, బలహీన వర్గాలకు చెందినవారే. ప్రభుత్వం ఈ వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకుని వ్యవసాయ రంగానికి కేటాయించే నిధులు నేరుగా రైతులకే చేరేలా చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. మద్దతు ధరను ముందే ప్రకటించాలన్న డాక్టర్ స్వామినాథన్ సూచనను ఇంతవరకూ ఏ ప్రభుత్వమూ అమలు జేయలేదు. పెట్టుబడి వ్యయం రైతులకు చేరేట్టు తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలు అమలు జరిగితే రైతులకు మేలు జరిగినట్టే. ఇలాంటి ప్రతిపాదనలను మరింత మెరుగుపర్చి కేంద్రమే ప్రకటిస్తే రైతాంగానికి ఎంతో మేలు చేసినట్టు అవుతుంది. ఆర్థిక సర్వేలోని ప్రతిపాదనలను భారత పారిశ్రామిక మండలుల సమాఖ్య, వాణిజ్య సంఘాల సమాఖ్య సమర్థించాయి. జిడిపి అంచనాల సాధనలో ప్రభుత్వానికి పూర్తి సహకారాన్ని అందిస్తామని ప్రకటించాయి కనుక, పారిశ్రామిక రంగం గురించి బెంగపడాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం వ్యవసాయరంగం మీదనే దృష్టి పెట్టాలన్నది నిపుణుల సూచన. మధ్యతరగతి వర్గాలకు ఊరట కలిగించేందుకు పన్ను రాయితీలు ప్రకటించడం వల్ల లబ్ధిపొందేది కొన్నివర్గాలు మాత్రమే. వ్యవసాయ రంగానికి రాయితీలు ఇచ్చి, అవి సక్రమంగా అమలు జరిగేట్టు చేస్తే అధిక సంఖ్యాకులకు మేలు జరుగుతుంది.

మంచిమాట

కీర్తి క్షణికమే కానీ, అప్రతిష్ఠ శాశ్వతం.
● నెపోలియన్ బోనాపార్టీ

జాతర చరిత్ర శోధించాలి..!

మేడారం ఓ ఆదివాసి గూడెం (పల్లె). మారుమూల అడవి ప్రాంతం. రెండేళ్ళకోసారి భక్తుల సందడితో నేల నలుచెరుగులా ఎటుచూసినా జనసంద్రమైపోతుంది. 20వ శతాబ్దం మధ్యకాలం నుండే బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. మొదట మేడారం జాతర బయ్యక్కపేట అనే కుగ్రామంలో జరిగేది. కాలక్రమంలో చందావంశీయుల మధ్య వివాదం రావడం వలన మేడారం పూజారులైన వడ్డెలు నిర్వహిస్తున్నారు. 1940 వరకు చిలకలగుట్టపైనే గిరిజనులు మాత్రమే జాతర చేసేవారు. 1946 నుంచి జాతరను మేడారంలో నిర్వహించడం మొదలైంది. ఆ తర్వాత 1962 సంవత్సరంలో సమ్మక్క తల్లిని కీకారణ్యంలోని మేడారం గద్దెలపై ప్రతిష్ఠించారు. అక్కడి కోయ కుటుంబాలు, ఇతరులు కలిసి ఈ జాతరను నిర్వహిస్తున్నారు. 1968 లో జాతర దేవాదాయ శాఖ పరిధిలోకి వచ్చింది. 1996లో ఈ జాతరను ఎపి ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించింది. మన రాష్ట్రం నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిస్సా, చత్తీస్‌ఘడ్, ఝార్ఖండ్ రాష్ట్రాలనుండి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు.

ఆసియా ఖండంలోనే మహాజాతరగా వెలుగొందుతోంది. బంగారం(బెల్లం)తో తులాభారం, మొక్కులు చెల్లిస్తారు. ప్రజలకు, పాలకులకు, జవసత్వాలు, శక్తిసామర్థ్యాలు ప్రసాదించమని కోరుకుంటారు. నేటి ఉద్యమనేత మన ముఖ్యమంత్రి నాడు తెలంగాణ ఉద్యమ కాలంలోని సమ్మక్క సారలమ్మ మొక్కు వల్లనే స్వరాష్ట్రం వచ్చిందన్న మాటలు ఎలా విశ్లేషించాలి? కాకతీయ రాజుల చరిత్రను పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు పొందుపరిచినట్లే? సమ్మక్క సారలమ్మ వీరగాథలను గ్రంథాల్లో ముద్రించాలి. పాఠ్యాంశాలుగా పొందుపరచాలి. శాశ్వతమైన జాతర ఏర్పాట్లకు పాలకులు పూనుకోవాలి. అరకొర గుడార సంస్కృతికి, తాత్కాలిక విధానాలకు స్వస్తి పలకాలి.

ఆదివాసీ అస్థిత్వాలకు విఘాతం కలగకుండా కార్పొరేట్ వ్యాపారీకరణ రూపుమాపాలి. ఈ ప్రాంతాన్ని జాతర వరకే మాత్రం కాకుండా అన్ని విధాల ఆ ప్రాంత ప్రజలు అభివృద్ధి చెందేలా దృష్టి పెట్టాలి. అడవి విధ్వంసాన్ని ఆపాలి. ఎన్నో ఏళ్ళ ప్రజల కోరిక ఆదివాసీ గిరిజన మ్యూజియం అందుబాటులోకి రావడం అభినందనీయం, సేకరించిన వాటిని పొందుపరచాలి. రోడ్లు, లైట్లు, తాగునీరు, శాంతి భద్రతలు, భక్తులకు మంచి సౌకర్యాల ఏర్పాట్లలో నాణ్యతతో కూడా స్థిరాభివృద్ధికి ప్రానుకోవాలి. రవాణా సౌకర్యంలోని కష్టాలను అధిగమించాలి. గిరిజన ఆచార వ్యవహారాలకు

నేటినుంచి సమ్మక్క సారలమ్మ జాతర



భంగం కలగకుండా వారి సంప్రదాయ, సంస్కృతిలోనే (పండుగ) జాతరను నిర్వహించాలి. అత్యాధునిక వైఫై సేవలు అన్ని హంగులతో విశేషంగా జనం భక్తిపారవశ్యంలో మునిగితేలేలా సకల సౌకర్యాలతో వెలుగొందాలని భావిస్తూ వనం కాస్త జనారణ్యంగా మారుతున్న వేళ, విగ్రహారాధన, కులమాత, ప్రాంతాల కతీతంగా జాతర రారమ్మంటుంది. దారులన్నీ జనసంద్రమై జాతరవైపే వెళుతున్నాయి. ప్రజలను, పాలకులను... పరిశోధించమంటుంది, చూసొద్దాం... మనం కూడా...

● మేకిరి దామోదర్, 9573666650

స్వయం పాలనకై పోరాడుదాం...


ఏ పురాణాలు, ఏ చరిత్ర కొనియాడని త్యాగమూర్తులు. ఆదివాసీలు తమ గుండెల్లో గుడికట్టుకొని పూజిస్తున్న వీరవనితలు. కప్పం కట్టను అన్న ప్రతివారికీ ఓ జ్ఞాపకం. తన జాతి కోసం, నమ్ముకున్న విలువల కోసం ఆదివాసీల స్వయంపాలన కోసం ప్రాణాలను త్యజించారు. మరణం తరువాత కూడా జనం గుండెల్లో బతకొచ్చు అని నిరూపించిన వీరవనిత సమ్మక్క సారక్క. ఇంతటి చారిత్రక సాంస్కృతిక పోరాట చరిత్ర పట్ల నిర్లక్ష్యం చూపుతున్నారు. వక్రీకరిస్తున్నారు. ఆదివాసీల మనోభావాలకూ ప్రాధాన్యత ఇవ్వలేదు. ఆదివాసీల చరిత్రనూ చరిత్రగా లిఖించలేదు. ప్రభుత్వాలు కూడా పట్టించుకోవట్లేదు. ఆదివాసీ జాతరలో అభివృద్ధిలో, జాతర ఆదాయంలో భాగమయ్యారు. తెలంగాణలోని మేడారం జాతర ప్రతి రెండేళ్ళకోసారి జరుగుతుంది.

అది పోరుబిడ్డల జాతర. అవునన్నా కాదన్నా అది ఉద్యమ స్మరణ జాతరే. సమ్మక్క సారలమ్మగా కొలవబడుతున్న ఆదివాసీ ముద్దుబిడ్డలు వారు. ఎలా పిలిచినా వారు పోరు ప్రతీకలు. 12వ శతాబ్దంలో కాకతీయులకు సామంతులుగా ఉన్న రోజులలో అడవి బిడ్డలనూ చిత్రహింసల పాలు చేశారు. ఎదిరించిన వారిని మట్టుబెట్టారు. ఆ నేపథ్యంలోనే సమ్మక్క సారలమ్మ దండయాత్ర కొచ్చిన సైన్యాన్ని ఎదుర్కొన్నారు. ఆ రాజరికపు ప్రభువుల్ని ఆదివాసీ బిడ్డలు ఎదిరించారు. రాజ్యం పేరుతో పన్నుల రూపంలో దోచుకునే తీరును నిరసించారు. కాకతీయ రాజు రుద్రదేవుడు రాజ్యకాంక్షతో మేడారంపై దండెత్తాడు. భీకర పోరులో పగడిద్దరాజు (సమ్మక్క భర్త) సారలమ్మ నాగులమ్మ గోవిందరాజులు వీరమరణం పొందారు. జంపన్న సంపెంగ వాగులో దూకి చనిపోయాడు. సమ్మక్క వీరోచిత పోరాట ధాటికి తట్టుకోలేని శత్రువులు వెనకనుంచి బల్లెంతో పొడిచారు. శత్రువులను హతమారుస్తూ మేడారానికి తూర్పు దిశగా నీలకల గుట్టవైపు సాగుతూ సమ్మక్క అదృశ్యమైంది. ఆమె జాడ తెలియదు. ఆ తరువాత చిలకలగుట్ట వద్ద పసుపు కుంకుమ భరణిలతో ప్రత్యక్షమైనదని ఒక నమ్మకం. ఎలాంటి కల్మషం లేని ఆదివాసీలు తమ హక్కుల కోసం, స్వయం పాలన కోసం ప్రాణత్యాగం చేసిన వారిని గుర్తుంచుకున్నారు. ఒకతరం కాదు, రెండు తరాలు కాదు, దశాబ్దాలు గడుస్తున్నకొద్దీ సమ్మక్క సారలమ్మ పై మమకారం ఎక్కువైంది. దైవాలుగా కొలుస్తున్నారు. మనుష్యులే దైవాలు అని చెప్పినమాట ఈ వీరవనితల విషయంలో నిజమని నిర్ధారిస్తుంది చరిత్ర. యావత్ ప్రపంచం అంతా ఆశ్చర్యపోయేలా జరిగే మహత్తర జాతర ఈ ఆదివాసీ జాతర. కేవలం ప్రకృతి ఆరాధన, పసుపు కుంకుమలు తప్ప మరే ఇతర ఆచారాలు ఉండని జాతర మేడారం జాతర. మరోవైపు మేడారం జాతరనూ జాతీయ హోదా ఇచ్చి జాతీయ పండుగగా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. మరో రెండు సంవత్సరాలలో ఆ హోదా కూడా మేడారం జాతరకూ రాబోతోంది. అదే కనుక వస్తే ఆదివాసీల అస్థిత్వం అంతం అవుతుంది. మేడారం జాతరపై పాలకవర్గాల వత్తిడి, ఆధిపత్యం ఎక్కువవుతాయి. ఆదివాసీల పోరాట చరిత్ర కనుమరుగు అవుతోంది. మేడారం జాతరనూ జాతీయాకరణ చేయటం వల్ల ఆదివాసీ సమాజానికి చాలా ప్రమాదం పొంచి ఉంది. మరోవైపు మేడారం ఆదివాసీలలో అసంతృప్తి పెరుగుతుంది. ఆదివాసీల పరిస్థితులు చాలా అధ్వానంగా ఉన్నాయి. అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నారు. ఆదివాసీల అస్థిత్వంపై దాడి జరుగుతోంది. ఆదివాసీలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరిపే మేడారం జాతరనూ సైతం ఆక్రమించుకోవాలని, గిరిజనేతరులు, లంబాడీలు ప్రయత్నించడం ఆదివాసీలనూ అణగద్రొక్కడమే అవుతుంది. మేడారం జాతరపై గిరిజనేతరుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడాలి. ఆదివాసీ మేలుకో...! సమ్మక్క సారలమ్మ జాతర ఏలుకో.

● వూకె రామకృష్ణ దొర, 9866073866

భారత్ సహనాన్ని పరీక్షించొద్దు


పాక్‌కు రాజ్‌నాథ్ హెచ్చరిక



చండీగఢ్ : కాల్పుల విరమణ ఒప్పందాన్ని పాకిస్తాన్ అదేపనిగా ఉల్లంఘిస్తూ భారత్ సహనాన్ని పరీక్షిస్తోందనీ, ఇలాఎంత కాలం ఊరుకోబోమని కేంద్ర హోం మంత్రి రాజ్ నాథ్ సింగ్ హెచ్చరించారు. భారత సహనాన్నీ, హుందా తనాన్ని పాక్ నేతలు చేతగాని తనంగా భావిస్తే, సరైన సమయం చూసి గట్టి గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు. భారతీయ జనతా యువమోర్చా సభ్యుల సమావేశంలో పాల్గొనేందుకు ఇక్కడికి వచ్చిన రాజ్‌నాథ్ సింగ్ విలేఖరులతో మాట్లాడుతూ జనవరి 16 తేదీ నుంచి పాక్ దళాలు జరుపుతున్న నిరవధిక కాల్పుల్లో ఎనిమిది మంది పౌరులతో సహా 14 మంది మరణించారని అన్నారు.జనావాస ప్రాంతాలపై పాక్ దళాలు కాల్పులు జరపడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని అన్నారు.పాక్ దళాలు ఈరోజు కూడా రాజౌరీ జిల్లాలో జనావాస ప్రాంతాలపై దాడులు జరిపినట్టు సమాచారంఅందిందని అన్నారు.పొరుగుదేశం కావడంవల్ల పాక్ పట్ల ఇప్పటికీ ఓరిమి వహిస్తున్నామని ఆయన అన్నారు. పరిస్థితి చేజారితో గట్టిగుణపాఠం చెబుతామని అన్నారు. కాశ్మీర్‌లో పరిస్థితిగతంలో కన్నా మెరుగుగా ఉందని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.మన సైనికులు సమర్ధవంతులే అయినప్పటికీ, సహనాన్ని పాటిస్తున్నారని ఆయన అన్నారు. ఎవరో కొందరు వ్యక్తిగత హోదాలో చేసిన ప్రకటనలను పట్టించుకోనవసరం లేదని ఆయన అన్నారు. జమ్ము- కాశ్మీర్ డిప్యూటీ గ్రాండ్ ముఫ్తీ బషీర్ ఉద్దీన్ ముస్లింలకు ప్రత్యేకదేశం కావాలన్న ప్రకటనను పట్టించు కోనవసరంలేదని అన్నారు. కుల, మత, ప్రాంత, భాషా బేధాలు లేకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వంకృషి చేస్తోందని ఆయన చెప్పారు.

బీజేపీలో భయంతో ఉన్నారు

●మాజీ ఆర్థికమంత్రి యశ్వంత్ సిన్హా ● రాజకీయేతర వేదిక రాష్ట్ర మంచ్ ఏర్పాటు ● హాజరైన కాంగ్రెస్, ఆప్ ఎంపీలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : బీజేపీలో ఉన్నవారంతా భయంభయంతో ఉన్నారని, అయితే తమకెలాంటి భయంలేదని బీజేపీ వృద్ధ నేత, మాజీ ఆర్థికశాఖ మంత్రి యశ్వంత్ సిన్హాఅన్నారు. మంగళవారం న్యూఢిల్లీలో ఆయన రాష్ట్రమంచ్ అనే నూతన రాజకీయేతర వేదికను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ ఎంపీ శత్రుఘ్న సిన్హా, ఎన్‌సిపి ఎంపీ మాజిద్ మెమన్, ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్, గుజరాత్ మాజీ సీఎం సురేష్ మెహతా, జెడియూ నేత పవన్ వర్మ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ వేదిక ఉద్యమిస్తుందని యశ్వంత్ సిన్హాచెప్పారు. మహత్మాగాంధీ హత్య నాటి పరిస్థితులు ఈ నాడు తలెత్తాయని అన్నారు. ప్రజాస్వామ్య సంస్థలన్నీ ప్రస్తుతం దాడికి గురవుతున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల రైతులు బిచ్చగాళ్లుగా మారారని విమర్శించారు. రాష్ట్ర మంచ్ రాజకీయేతర గ్రూప్‌గా పనిచేస్తుందని, జాతీయ సమస్యలను ప్రముఖంగా లేవనెత్తుతుందని చెప్పారు. ఇది కేవలం సంస్థ కాదని, జాతీయ ఉద్యమమని తెలిపారు. ప్రభుత్వ ఆర్థిక, విదేశాంగ విధానాలను తీవ్రంగా విమర్శించారు. బీజేపీలో అందరూ భయంతో గడుపుతున్నారని, తాము మాత్రం కాదని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఏకపక్ష చర్చ శ్రేయస్కరం కాదన్నారు. తన అభిప్రాయాలను చెప్పే పరిస్థితి పార్టీలో లేకపోవడం వల్లే ఈ వేదికలో చేరాల్సిన పరిస్థితి వచ్చిందని బీజేపీ ఎంపీ శత్రుఘ్నసిన్హాచెప్పారు. యశ్వంత్ సిన్హాకు మద్దతు ఇవ్వడాన్ని పార్టీ వ్యతిరేక చర్యగా భావించొద్దని, జాతీయ ప్రయోజనాల కోసమే తాను ఈ పనిచేస్తున్నానని తెలిపారు.


'హేరామ్' పదం
బాపు నోటి వెంట వినలేదు

బాపు వ్యక్తిగత సహాయకుడు వెంకట కళ్యాణం

చెన్నై : దేశం యావత్తూ అనుకుంటున్నట్లు మహాత్మాగాంధీ హత్యకు గురైనప్పుడు ఆయన నోటి వెంట 'హేరామ్' అనే పదం ఉచ్చరించగా తాను వినలేదని గాంధీజీ నాటి వ్యక్తిగత సహాయకుడు వెంకట కళ్యాణం (96) వెల్లడించారు. 1943 నుంచి గాంధీజీ మరణించే వరకూ కళ్యాణం వ్యక్తిగత సహాయకుడిగా పనిచేశారు. అయితే బాపును గాడ్సే తుపాకీతో కాల్చినప్పుడు ఆయన నోటి వెంట 'హేరామ్' అనే పదం రాలేదని 2006లో కొల్లాంలో ఆయన మీడియాతో అన్నట్లుగా వచ్చింది. అయితే ఆరోజు మహాత్ముని నోటి వెంట ఆపదం తాను వినలేదని మాత్రమే అన్నానని మంగళవారం వివరణ ఇచ్చారు. గాంధీజీని షూట్ చేసిన వెంటనే రేగినకల్లోలంలో ఆ మాటలు నా చెవిని సోకలేదు అన్నారు. మహాత్ముణ్ణి గాడ్సే ఒక్కసారే హత్య చేశాడని, కానీ రాజకీయ పార్టీలు మాత్రం ఆయన సిద్ధాంతాలకు పాతర వేయడం ద్వారా ప్రతిరోజూ హత్య చేస్తున్నాయి అని అన్నారు.

2006 నాటి కళ్యాణం వ్యాఖ్యలను మహాత్మా మనవడు తుషార్ గాంధీ కొట్టిపారేశారు. గాడ్సే ఈ ఘాతుకానికి పాల్పడిన వెంటనే మహాత్ముడు రెండు చేతులను దగ్గరకు తీసుకుని 'హేరామ్' అంటూ నేలకొరిగారని తుషార్ గాంధీ వివరించారు.

మహాత్మునికి ప్రధాని ఘన నివాళి



జాతి పిత మహాత్మా గాంధీజీ 70వ వర్ధంతి సందర్భంగా ప్రధాని మోడీ ట్విట్టర్‌లో తన సందేశాన్ని పోస్ట్ చేశారు. అందులో ఈ దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన మహాత్ముని సేవలను ఈ జాతి ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటుంది. వారు చూపిన మార్గంలో పయనించడం ద్వారా ఈ దేశ ప్రజలు వారిని ఎల్లప్పుడూ గౌరవించుకుంటూనే ఉంటారు. మహాత్ముని వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నాను అని పేర్కొన్నారు. ~రిపై టెక్నాలజీ దుర్వినియోగం, మార్కెట్‌లను మోసగించడానికి కృత్రిమ కొరత సృష్టి, స్పూఫింగ్ వంటి నేరాలను మోపారు.

'నిరాధార ఆరోపణలపై చర్యలు తీసుకోలేం'

భారత్ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఓం ప్రకాశ్ రావత్

న్యూఢిల్లీ: విశ్వసనీయమైన ఆధారం లేకుండా ఆరోపణలు చేస్తే ప్రజలకు, పార్టీలకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టాలని న్యాయస్థానాన్ని ఎన్నికల కమిషన్ తరపున కోరలేమని ప్రధాన ఎన్నికల కమిషనర్ స్పష్టం చేశారు. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ ఓం ప్రకాశ్ రావత్ విలేఖరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఎన్నికల కమిషన్‌కు నిరాధార ఆరోపణలు చేసేవారిపై రాజ్యాంగపరమైన చర్యలు తీసుకునేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ప్రతిపాదన వచ్చిందన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే అబద్ధ, నిరాధార ఆరోపణలను చేసేవారిని ప్రతిఘటించేలా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారన్నారు. న్యాయమంత్రిత్వ శాఖ ఈ విషయంలో న్యాయపరమైన ప్రకటనలను కూడా పరిగణనలోకి తీసుకుందన్నారు. సుప్రీంకోర్టు ఎన్నికల కమిషన్‌కు ధిక్కార శక్తులును అదుపుచేసేలా అధికారాన్ని కల్పించవచ్చని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత ఏప్రిల్‌లో ఎన్నికల కమిషన్ న్యాయశాఖకు ఎన్నికల చట్టాల సవరించేలా ఒక లేఖ రాసిందని తెలిపారు.



న్యూఢిల్లీ: మహాత్మాగాంధీ 70 వర్ధంతి సందర్భంగా గాంధీ స్మృతివనంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ

న్యాయప్రక్రియ పూర్తి కాకుండానే
గాడ్సేను ఉరితీశారు

సుప్రీంకోర్టులో పిటిషన్

న్యూఢిల్లీ : జాతిపిత మహాత్మాగాంధీ 70వ వర్ధంతి సందర్భంగా యావత్ జాతి ఆయనకు నివాళులర్పించింది. ఈ తరుణంలో గాంధీజీ హత్యపై తిరిగివిచారణ జరిపించాలనీ, ఈ కేసులో ఉరితీయబడిన నాథూరామ్ గాడ్సే, నారాయణ్ దత్తాత్రేయ ఆప్టేలకు న్యాయపరంగా లభించవలసిన సాయం పూర్తిస్థాయిలో అందక ముందే వారిద్దరిని ఉరితీశారని ముంబాయికి చెందిన అభినవ్ భారత్ ట్రస్టీ డాక్టర్ పంకజ్ ఫడ్నవిస్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గాడ్సే, ఆప్టేలను సుప్రీం కోర్టు ఏర్పడకముందే ఉరి తీశారని పిటిషనర్ పేర్కొన్నారు.ఈ కేసులో నిందితులైన వీరిద్దరికీ తూర్పు పంజాబ్ హైకోర్టు విధించిన ఉరిశిక్షపై వారి కుటుంబ సభ్యులు అప్పట్లో సర్వోన్నత న్యాయవ్యవస్థ అయిన ప్రీవీ కౌన్సిల్‌కి దరఖాస్తు చేస్తే, కొద్ది రోజుల్లో భారత్ సుప్రీంకోర్టు అవతరించనున్న దృష్ట్యా తాము జోక్యం చేసుకోబో మన్నారనీ, సుప్రీంకోర్టు 1950 జనవరి 26వ తేదీన అవతరించగా, అంత వరకూ ఆగకుండా,71 రోజులు (1949 నవంబర్ 15వ తేదీన) ముందే ఉరితీశారని పిటిషనర్ వాదించారు. అయితేఆయన వాదాన్ని కోర్టు తరపు న్యాయవాది అమరీందర్ సహరాన్ తోసిపుచ్చారు. గాంధీజీ హత్యకేసును తిరగతోడాల్సిన అవసరం లేదని కోర్టు గతంలోనే తీర్పు ఇచ్చిందనీ, మళ్లీ ఇప్పుడు పిటిషన్ దాఖలు చేయడంలో అర్థం లేదని ఆయన వాదించారు. రాజకీయ కారణాలతోనే పంకజ్ ఫడ్నవిస్ ఈ పిటిషన్‌ని దాఖలు చేశారని అన్నారు.

ఈసీఆర్ పాస్‌పోర్టులకు పాత రంగే

●నారింజ రంగు నిర్ణయం వెనక్కి ● వ్యక్తిగత వివరాల ఆఖరి పేజీ ఉండదు ● కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకటన




న్యూఢిల్లీ: ప్రవాస తనిఖీ తప్పని సరిగా (ఈసీఆర్) చేయించు కోవాల్సిన వారికి నారింజ రంగు పాస్‌పోర్టును జారీ చేయాలంటూ తాను తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించు కున్నట్టు కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ(ఎంఈఏ) మంగళవారం రాత్రి ప్రకటించింది. అలాగే పాస్‌పోర్ట్ చివరి పేజీలో వారి వ్యక్తిగత వివరాలను ముద్రించడాన్ని సైతం వెనక్కి తీసుకుంటున్నట్టు తెలిపింది. విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ అధ్యక్షతన సహాయ మంత్రి వి.కె.సింగ్, తదితరులు హాజరైన సోమవారం నాటి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఎంఈఏ, మహిళా, శిశు సంక్షేమాభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారులతో కూడిన త్రిసభ్య కమిటీ సిఫారసులు ప్రాతిపదికగా పాస్‌పోర్టు పుస్తకంలో ఆఖరి పేజీ ముద్రించరాదని నిర్ణయించినట్టు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. సంబంధిత వర్గాలతో విస్తృతంగా చర్చలు జరిపిన అనంతరం పాస్‌పోర్టు ముద్రణలో ప్రస్తుత విధానాన్నే కొనసాగించాలని, ఈసీఆర్ పాస్‌పోర్టు దారులకు విడిగా నారింజ రంగు పాస్‌పోర్టు జారీ చేయరాదని ఎంఈఏ నిర్ణయించుకుందని వివరించింది. ఎంఈఏ నిర్ణయాన్ని రాజకీయపక్షాలు తప్పుపట్టాయి. ఈసీఆర్ కేటగిరికి విడిగా నారింజ రంగు పాస్‌పోర్టుల జారీ బీజేపీ వివక్షాపూరితమైన ఆలోచనాధోరణిని ప్రదర్శిస్తోందని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది.

ఐదేళ్లకుపైగా ఖాళీగా ఉండే ఉద్యోగాలు రద్దు..?

న్యూఢిల్లీ: ఐదేళ్లకు పైగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈ విషయంలో సమగ్ర నివేదికలు అందజేయాలని అన్ని ప్రభుత్వ శాఖలను ఆదేశించింది. ఐదేళ్లకు పైగా ఖాళీగా ఉండే ఉద్యోగాలకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ ను సిద్ధం చేసి పంపాలని ఆర్థిక మంత్రిత్వ శాఖ అన్ని శాఖలకు అధికారిక తాఖీదులు జారీ చేసింది. ఆర్థిక శాఖ ఆదేశాలపై కొన్ని ప్రభుత్వ శాఖలు స్పందించగా.. మరికొన్ని మాత్రం ఇంతవరకు ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. అయితే సమగ్ర నివేదికకు బదులు అవసరమైన సమాచారాన్ని మాత్రం అందజేశాయి. దీంతో ఆర్థిక శాఖ సలహాదారులు, జాయింట్ సెక్రటరీలు(అడ్మినిస్ట్రేషన్)ఆయా శాఖల్లో ఐదేళ్లకు పైగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను గుర్తించాలని ప్రభుత్వం ఆదేశించింది.ఉద్యోగాల రద్దుకు సంబంధించిన తాఖీదులు కేంద్రం ఈనెల 16న జారీ చేసింది. కేంద్రం ఆదేశాలతో హోంశాఖ తమ పరిధిలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు సంబంధించిన సమగ్ర నివేదికను అందజేయాలని అధికారులను ఆదేశించింది. ప్రాథమిక అంచనాల ప్రకారం కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఐదేళ్లకు పైగా వేలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. ఈనేపథ్యంలో అలాంటి పోస్టులను రద్దు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

వృద్ధుల సంక్షేమం పట్టదా?

రాష్ట్రాలకు సుప్రీం మందలింపు



న్యూఢిల్లీ: దేశంలోని వివిధ రాష్ట్రా ల్లో ఓల్డ్ ఏజ్ హోం లు ఏర్పాటు చేసేట్టు ఆదేశాలు జారీచేయాలన్న పిటిషన్‌పై అఫిడవిట్ దాఖలు చేయమని రాష్ట్రాలను సుప్రీంకోర్టు గతంలో ఆదేశించింది. ఆ ఆదేశాన్ని రాష్ట్రాలు పట్టించుకోకపోవడం పట్ల ఈరోజు ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. వృద్ధుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యంతగదని రాష్ట్రా లను జస్టిస్ బి లోకూర్ జస్టిస్ దీపక్ మిశ్రాలతోకూడిన సుప్రీంకోర్టు బెంచ్ చురక అంటించింది.వృద్ధుల తరపున సీనియర్ న్యాయవాది అశ్విని కుమార్ ప్రొటెక్షన్ ఫర్ సీనియర్ సిటిజన్స్ రైట్స్ తరపున ఈపిటిషన్‌ని దాఖలు చేశారు.వృద్ధులకు కేంద్రం నెలకు200రూపాయిల పెన్షన్ ఇస్తోందనీ, అది ఏమాత్రంచాలదని అశ్విని కుమార్ అన్నారు. కాగా, వృద్ధులసంక్షేమం కోసం కేంద్రంఒక నూతన విధానాన్ని తీసుకుని రానుందని ప్రభుత్వంతరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు.

ఆప్ ఎమ్మెల్యేల వేటుపై సమగ్ర నివేదికివ్వండి

న్యూఢిల్లీ : ఆమ్ ఆద్మీపార్టీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటుపై వాస్తవాలతో కూడిన సమగ్ర నివేదికను తమ ముందుంచాలని ఢిల్లీ హైకోర్టు కేంద్ర ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఇందుకు సంబంధించిన అపిడవిట్ ను దాఖలు చేయాలని న్యాయస్థానం ఈసీకి సూచించింది. తమపై వేసిన అనర్హత వేటును ఎత్తివేసేలా ఆదేశాలివ్వాలని ఆప్ ఎమ్మెల్యే దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన జస్టిస్ సంజీవ్ కన్నా, జస్టిస్ చంద్రశేఖర్ లతో కూడిన ధర్మాసనం.. అనర్హత వేటుకు సంబంధించిన వాస్తవాలతో కూడిన అఫిడవిట్ దాఖలు చేయాలని ఈసీని ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను ఫిబ్రవరి 7వ తేదీకి వాయిదా వేసింది.

కూచిబొట్ల భార్యకు అరుదైన గౌరవం



వాషింగ్టన్ : అమెరికా జాత్యాంహంకార దాడిలో ప్రాణాలు కోల్పోయిన భారత ఇంజనీర్ కూచిబొట్ల శ్రీనివాస్ భార్యకు ఆదేశంలో అరుదైన గౌరవం దక్కింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశ కాంగ్రెస్‌ను ఉద్దేశించి చేసే ప్రసంగ కార్యక్రమంలో కూచిబొట్ల భార్య సునయనను ఆహ్వానించారు. అమెరికా ప్రజలనుద్దేశించి ట్రంప్ చేసే తొలి ప్రసంగ కార్యక్రమంలో భారతీయ మహిళకు ఆహ్వానం అందడం విశేషం. కూచిబొట్ల మరణంతో అమెరికా పౌరసత్వం కోల్పోయిన సునయన అక్కడే నివసించేందుకు అనుమతి తీసుకున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రంప్ చేసే మొదటి వార్షిక ప్రసంగంలో కీలకాంశాలున్నాయి. తన హయాంలో చేపట్టిన సంస్కరణలు.. అమెరికన్ల హక్కుల పరిరక్షణ కోసం తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలను ట్రంప్ తన ప్రసంగంలో చేర్చినట్లు తెలుస్తోంది. అమెరికాలో పన్ను చెల్లింపుదారులు ఇచ్చిన భారీ ఊరట అంశాన్ని కూడా ట్రంప్ తన ప్రసంగంలో చేర్చినట్లు సమాచారం. అమెరికా రక్షణ, పటిష్టత, గౌరవం మొదలైన అంశాలు ట్రంప్ ప్రసంగంలో ఉన్నాయని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ సారా సాండర్స్ తెలిపారు.తాను అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ప్రజల కోసం చేసిన కార్యక్రమాలపై ట్రంప్ ఎక్కువగా ఫోకస్ పెట్టారని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన అతిథులు అమెరికా ఫస్ట్ లేడీ పక్కనే కూర్చునే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. అయితే ట్రంప్ విధానాలను వ్యతిరేకిస్తున్న పలువురు డెమోక్రాట్లు వార్షిక ప్రసంగం కార్యక్రమానికి హాజరుకాబోమని ప్రకటించారు.

గ్రీన్‌కార్డు ఆశావహుల నుంచి
అదనంగా 2500 డాలర్లు వసూలు

మెక్సికో సరిహద్దులో నిర్మించే గోడ ఖర్చుల కోసం వడ్డింపులు

వాషింగ్టన్ : అమెరికాలో చట్టబద్ధంగా శాశ్వత నివాసం కోసం ఉద్దేశించిన గ్రీన్ కార్డు ఫీజు మరింత ప్రియమైంది. గ్రీన్ కార్డు కోరుకునే వారు ప్రస్తుతం చెల్లిస్తున్న ఫీజుకు అదనంగా 2500 అమెరికన్ డాలర్లు(దాదాపు లక్షా60వేలు) ఒకేసారి చెల్లించాలని గ్రీన్ కార్డు అనుకూలవాదులు వెల్లడించారు. గ్రీన్ కార్డు ఆశావహులు చెల్లించే ఈ నిధులను అమెరికా, మెక్సికో మధ్య నిర్మిస్తున్న సరిహద్దు గోడకు వినియోగించనున్నారు. అమెరికాకు దక్షిణాన ఉన్నమెక్సికో దేశ నుంచి అక్రమ వలసలు నియంత్రించేందుకు దుర్భేధ్యమైన గోడను నిర్మిస్తానని ఎన్నికల ప్రచారంలో ట్రంప్ ప్రజలకు హామీ ఇచ్చారు. తన హామీ నెరవేర్చడంలో భాగంగా కొన్ని రోజుల క్రితం ఈ గోడ నిర్మాణం ప్రారంభించారు. సరిహద్దుల్లో నిర్మిస్తున్న గోడకు అయ్యే ఖర్చును కొంత వరకు అమెరికన్లు.. మరికొంత మెక్సికన్లు భరించాలని గతంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలను మెక్సికో నిద్వంధంగా వ్యకిరేకిచింది. అమెరికన్లలో చాలా మంది నిధులు ఇచ్చేందుకు సుముఖంగా లేకపోవడంతో ట్రంప్ ప్రభుత్వం గ్రీన్ కార్డు ఆశావహులపై నిధులపై ఆశలు పెట్టుకున్నారు. ఈనేపథ్యంలో గోడ నిర్మాణానికి అయ్యే ఖర్చులో గ్రీన్ కార్డు ఆశావహుల నుంచి 4 అమెరికన్ బిలియన్ డాలర్లు వసూలు చేయాలని నిర్ణయించారు. మెక్సికో సరిహద్దు గోడకు అమెరికన్ పన్ను దారుల నుంచి ఎలాంటి డబ్బు వసూలు చేయకూడదని గతంలో ట్రంప్ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో వారు చెల్లించాల్సిన భారం కూడా గ్రీన్ కార్డు ఆశావహులపై పడింది.

గ్రీన్ కార్డుల జారీ జాప్యంపై భారత అమెరికన్ల ఆందోళన

అమెరికాలో శాశ్వత నివాసం కోసం ఉద్దేశించిన గ్రీన్ కార్డుల జారీ ప్రక్రియ మరింత ఆలస్యమవు తుండటంతో ప్రముఖ భారతీయ అమెరికన్లు గళమెత్తారు. గ్రీన్ కార్డుల జారీ ప్రక్రియ ఆలస్యం వల్ల దాదాపు మూడు లక్షల మంది భారతీయ దరఖాస్తుదారులపై ఈ ప్రభావం పడుతుందన్నా రు. పెండింగ్ గ్రీన్ కార్డులు మంజూరు చేస్తే మూడు లక్షల మంది అత్యంత నైపుణ్యం కలిగిన భారతీయలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఒక దేశానికి ఇన్ని గ్రీన్ కార్డులని కేటాయించడం వల్ల గ్రీన్ కార్డు కోసం ధరఖాస్తు చేసుకున్న భారతీయులు 25 నుంచి 92 ఏళ్లు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉందని గ్రీన్ కార్డ్ రిఫార్మ్. ఓఆర్‌జి నిర్వాహకులు తెలిపారు. వలసదారులకు సంబం ధించిన సంస్కరణల వివరాలను వైట్‌హౌస్ అమెరికన్ కాంగ్రెస్‌కు పంపిన నేపథ్యంలో భారతీయ అమెరికన్లు గ్రీన్ కార్డు ప్రచారం ప్రారంభిం చారు. మేము వలసదారుల సమస్యలపై పోరాటం చేస్తున్న వైద్యులతో పాటు న్యాయమైన గ్రీన్ కార్డు కేటాయింపుల ప్రక్రియ కోసం పోరాటం చేస్తున్న ఇంజనీర్లు, ఇతర వృత్తి నిపుణులకు కూడా మద్దతు పలుకుతున్నాం అని గ్రీన్ కార్డు రిఫార్మ్ డాట్ ఒఆర్‌జి సంస్థ అధ్యక్షుడు సంపత్ శివంగి తెలి పారు. గ్రీన్ కార్డుల జారీ ఆలస్యం వల్ల అమెరికాలో ఆవిష్కర ణలు, ఉద్యోగ కల్పనపై తీవ్ర ప్రభావం పడుతుందనిసంస్థ వ్యవస్థాపక సభ్యుడు తోట కిరణ్ కుమార్ అన్నారు. గ్రీన్ కార్డులు సకాలంలో జారీ చేయకపోవడం వల్ల అమెరికాలో ఏళ్లుగా పనిచేస్తున్న భారతీయ నిపుణులపై తీవ్ర ఒత్తిడి నెలకొంటోందని హిందూ అమెరికన్ ఫౌండేషన్ డైరెక్టర్ రిషి ఆందోళన వ్యక్తం చేశారు.

దళిత, గిరిజనుల కోసం
కొత్త చాంబర్ ఆఫ్ కామర్స్

●డా.అంబేద్కర్ చాంబర్ ఆఫ్ కామర్స్ పేరిట ఏర్పాటు ● వ్యవస్థాపక అధ్యక్షుడిగా వివేక్ ఏకగ్రీవ ఎన్నిక



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : దళిత, గిరిజన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం కోసం సరికొత్త వేదిక ఆవిష్కృతమైంది. దేశ రాజధాని ఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో ఫోరం ఆఫ్ ఎస్సీ, ఎస్టీ లెజిస్లేటర్స్, పార్లమెంటేరియన్స్ ఆధ్వర్యంలో జరిగిన ఓ సమావేశంలో కొత్త పారిశ్రామిక వేదికను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. డా. అంబేద్కర్ చాంబర్ ఆఫ్ కామర్స్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ కొత్త సంస్థకు అధ్యక్షుడిగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపీ జీ. వివేకానందను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దళిత, గిరిజనులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ సరికొత్త చాంబర్ ఆఫ్ కామర్స్ ఏర్పాటైందని సభకు హాజరైన నేతలు తెలిపారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వివేకానంద మాట్లాడుతూ, కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల అభివృద్ధి కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నప్పటికీ ఎక్కువ మందికి ఉపయోగపడడం లేదని అన్నారు. దళితులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు, ప్రోత్సహించేందుకు చాలా పథకాలున్నాయని, కానీ సరైన ప్రచారం లేకపోవడం వారు లబ్ధి పొందలేకపోతున్నారని వివేక్ అన్నారు. మంగళవారం ఏర్పాటైన ఈ కొత్త చాంబర్ ఆఫ్ కామర్స్ ద్వారా ఔత్సాహిక దళిత పారిశ్రామికవేత్తలకు శిక్షణనిస్తామని అన్నారు. ప్రభుత్వాలతో చర్చించి, దళితుల అభివృద్ధికి తమ సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. అలాగే ప్రభుత్వ పథకాల అమలులో జరుగుతున్న ఇబ్బందులపైనా తమ సంస్థ దృష్టి సారిస్తుందని వివేక్ అన్నారు. తాను సలహాదారుగా ఉన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచే అధునాతన క్లీనింగ్ మెషీన్లను దళితులకు ఇచ్చి, ఉపాధి కల్పించామని తెలిపారు.

'నిష్పక్షపాత న్యాయవ్యవస్థ కోసమే సంస్కరణలు'

న్యూఢిల్లీ : నిష్పక్షపాత న్యాయవ్యవస్థ కోసం సంస్కరణలు అవసరమని ఆర్థిక సర్వే స్పష్టం చేసిందని ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణ్యాన్ తెలిపారు. న్యాయవ్యవస్థపై ఉన్న గౌరవానికి సూచికగానే ఈ ఏడాది ఆర్థిక సర్వేలో లింగ సమాత్వం, సైన్స్ కు పోత్సాహం, టెక్నాలజీ వంటి అంశాలను ప్రస్తావించామన్నారు. సకాలంలో న్యాయం అనే కోణంలోనూ మనం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కోసం చాలా చాలా ఆలోచించాలి. అప్పుడు మనం సైన్స్ అండ్ టెక్నాలజీ, న్యాయవ్యవస్థలోని కొత్త విషయాలను తెలుసుకోగలుగుతాం. న్యాయవ్యవస్థ స్వచ్ఛంగా ఉండాలని ముందుగానే చెప్పాం.. కానీ మనం ఆ పరిధిలోకి వెళ్లిపోయాం. మీరు మేము ఎంత పటిష్ఠంగా ఉండాలని కోరుకుంటున్నామో అంతగా.. అని పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. 2017-18 ఆర్థిక సర్వేను కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సోమవారం లోక్ సభలో ప్రవేశపెట్టిన తర్వాత అందులోని అంశాలు తెరపైకి వస్తున్నాయి. వ్యాపారాన్ని మరింత సులభతరం చేసినట్లే న్యాయవ్యవస్థకు కూడా విస్తృతమైన సంస్కరణలు అవసరం. వాణిజ్య వివాదాల కేసుల పరిష్కారం పెండింగ్‌లో ఉండటం వల్ల ఆయా వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడుతుందని అరవింద్ ఆందోళన వ్యక్తం చేశారు. కిందిస్థాయి కోర్టుల్లోనూ న్యాయవ్యవస్థ మరింత పరిపుష్టం చేసి.. హైకోర్టులపై భారాన్ని తగ్గించాల్సిన అవసరముందన్నారు. పన్ను సంబంధిత కేసులను సత్వరమే విచారించేందుకు సుప్రీంకోర్టు స్వతంత్ర ప్యానల్ ను ఏర్పాటు చేయాలని కోరారు.

అవాంచిత భారతీయ బాలికలు 2 కోట్ల మంది

న్యూఢిల్లీ: భారత్‌లో లింగ వివక్షకు చరమాంకం పలికే దిశగా అనేక ఉద్యమాలు,అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుగుతున్నప్పటికీ భారతీయులు ఇప్పటికీ మగ సంతానానికే ప్రాధాన్యతనిస్తున్నారు. అనేక మంది భారతీయ తల్లిదండ్రులు తగినంత మగ సంతానం కలిగేంతవరకు పిల్లల్ని కంటూనే ఉన్నారని సోమవారం విడుదలైన ఆర్థిక సర్వే వెలెత్తి చూపింది. సంతానాన్ని ఎంచుకునే క్రమంలో లింగ నిర్ధారణ పరీక్షలకు చట్టాలు అనుమతించకపోవడంతో గర్భస్రావాలు గణనీయంగా పడిపోయాయి. అయినప్పటికీ బాలికలను బాధపెట్టేలా వారికి అందాల్సిన వనరులు అంతకంతకా దూరమైపోతున్నాయి. మగ పిల్లాడు పుట్టగానే సంతానానికి స్వస్తి చెప్పే కుటుంబాలతో పోల్చితే ఆడ పిల్ల పుట్టగానే అదే పని చేసే కుటుంబాలు అంతంతమాత్రంగా ఉన్నాయి. ఇది తల్లిదండ్రులు తమంతటతాముగా నిలుపుదల నియమాలు పెట్టుకుంటున్న వైనాన్ని సూచిస్తోందని సర్వే వెల్లడించింది.

నేరపూరిత వాణిజ్యం ఆరోపణల్లో
ఇద్దరు భారత సంతతికి చెందిన అమెరికన్లు

న్యూయార్క్ : నేరపూరిత వాణిజ్యం, స్పూఫింగ్ కేసుల్లో 8 మందిపై అమెరికాలో నేరం మోపడింది. ఇందులో భారత సంతతికి చెందిన ఇద్దరు అమెరికన్‌లు కూడా ఉన్నారు. వివరాల్లోకి వెళితే.. అమెరికా ఇల్లినాయ్‌లోని నాపర్విల్లే ప్రాంతానికి చెందిన 41 సంవత్సరాల జితేష్ టక్కర్, న్యూయార్క్‌కు చెందిన కృష్ణమోహన్‌తో సహా మరో 6గురు కలిసి మోసపూరిత విధానాలు, స్పూఫింగ్ ద్వారా అమెరికన్ మార్కెట్‌ను దెబ్బతీయడానికి ప్రయత్నించారు. దీనిపై అమెరికాలోని టెక్సాస్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. స్పూఫింగ్ అనేది చట్టవిరుద్ధ వ్యాపార పద్ధతి. ఇది వస్తువుల మార్కెట్‌లను మార్చడానికి ఉపయోగించబడుతుంది. వీరిలో ఐదుగురు గతంలో పలు ప్రపంచ ఆర్థిక సంస్థల్లో పనిచేశారు. ఇద్దరు స్వంతంగా భారీ వాణిజ్య సంస్థలను కలిగి ఉండగా, ఒకరు టెక్నాలజీ కన్సల్టెన్సీ ఓనర్ ఉన్నారు అని అమెరికన్ న్యాయశాఖ తెలిపింది. ముద్దాయిలు, వారి సహ కుట్రదారులు కలిసి వేలాదిగా కృత్రిమ ఆర్డర్‌లు, సరఫరా ద్వారా వాణిజ్య మార్కెట్‌లను మోసగించడానికి ప్రయత్నించారు. వీరు చికాగో మర్కంటైల్ ఎక్స్ఛేంజ్‌ను మోసం చేయడానికి పలు విధాలుగా ప్రయత్నాలు చేసినట్లు నిఘా సంస్థలు పసిగట్టాయి.



పీఎస్‌యు బ్యాంకులకు మూలధనం

● ఆరు రకాల బాండ్ల విడుదల

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకులకు మూలధనం సమకూర్చడానికి ప్రభుత్వం ఆరు కాలపరిమితుల బాండ్లను విడుదల చేయనున్నట్లు మంగళవారం నాడు ఒక సర్క్యూలర్‌లో పేర్కొంది. ఈ బాండ్ల మేచురిటి 10,11,12,13,14, 15 సంవత్సరాల కాలపరిమితులకు సంబంధించి ఉంటుంది. కాగా ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ జనవరి 24వ తేదీన 20 ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులకు రూ.88,139 కోట్ల మూలధనం సమకూరుస్తామని ప్రకటించారు. ఈ మూలధనం కూడా ఈ ఆర్థిక సంవత్సరంలో బాండ్ల ద్వారా సేకరించి ఇస్తామని చెప్పారు. రీ క్యాపిటలైజేషన్ బాండ్లపై 7.35శాతం ఇస్తుంది. ప్రస్తుతం పది సంవత్సరాల జీ-సెక్షన్ ప్రభుత్వ సెక్యూరిటీపై ఇదే వడ్డీరేటును ఆఫర్ చేస్తోంది. కాగా ప్రభుత్వం రూ.35,826 కోట్లను మొత్తం తొమ్మిది బ్యాంకులకు ప్రాంప్ట్ కరెక్టివ్ యాక్షన్ (పీసీఏ) కింద రూ.35,828 కోట్లు సమకూర్చింది. వాటిలో స్టేట్ బ్యాంకు ఆఫ్ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంకు, బ్యాంకు ఆఫ్ బరోడాలున్నాయి. మిగిలిన రూ.52,311 కోట్లు 11 బ్యాంకులకు సమకూరుస్తుంది. అవి ఐడిబీఐ బ్యాంకు, సెంట్రల్ బ్యాంకు, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు, యూకో బ్యాంకులు.





ఊరట వట్టిమాటే!

● ద్రవ్యలోటు లక్ష్యం అదుపు కష్టమే ● ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం పెద్ద మొత్తంలో వ్యయంచేస్తుంది ● రాయిటర్స్ పోల్స్‌లో ఆర్థికవేత్తల అభిప్రాయం

న్యూఢిల్లీ : ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ గురువారం 2018-19 ఆర్థిక సంవత్సరానికి పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నారు. ఇప్పటికే దేశంలోని వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు తమ తమ కోరికల చిట్టాను జైట్లీ ముందుంచారు. మొత్తానికి అన్నీ రంగాలకు చెందిన ప్రతినిధులు ఆదాయపు పన్ను పరిమితిని రూ.2.50 లక్షల నుంచి రూ.3.00లకు పెంచాలని జైట్లీకి విజ్ఞప్తులు చేశారు. ప్రజల చేతిలో డబ్బు ఉంటే ఆ డబ్బును వస్తువులు కొనుగోలు చేయడానికి వినియోగించుకుంటారని, తమ వ్యాపారాలు పుంజుకుంటాయని, దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

ఈ బడ్జెట్‌లో అరుణ్‌జైట్లీ సామాన్యులను పెద్దగా కరుణించరని రాయిటర్స్ నిర్వహించిన పోల్‌లో మెజారిటీ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. వచ్చే ఏడాదికి ఎన్నికల నేపథ్యంతో ఎన్‌డీఏ ప్రభుత్వానికి ఇది చివరి బడ్జెట్ అవుతుంది. ద్రవ్యలోటు తగ్గించుకోడానికి ప్రభుత్వం వ్యయాన్ని కూడా తగ్గించుకుంటుందని వారు అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

కేంద్రంలో నరేంద్రమోడీ సర్కార్ 2014/15 మొదటి బడ్జెట్ సందర్భంగా తమ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణకు పెద్దపీట వేస్తుందని స్పష్టం చేశారు. గతంలోని ప్ర భుత్వాల మాదిరిగా మార్కెట్ల నుంచి పెద్దమొత్తంలో అప్పులు తెచ్చి ఖర్చు చేయమని ఆయన ఆ సందర్భంగా చెప్పారు. అటు తర్వాత బడ్జెట్‌లలో ఎన్‌డీఏ ప్రభుత్వం ద్రవ్యలోటును జీడీపీలో 3.0 శాతానికి పరిమితం చేయాలని లక్ష్యాన్ని వెనక్కినెట్టింది. ఈ ఏడాది కూడా ప్రభుత్వం ద్రవ్యలోటు లక్ష్యాన్ని మరోఏడాది పాటు పొడిగించే అవకాశం కనిపిస్తోందని చెబుతున్నారు. ఎందుకంటే గత మూడు సంవత్సరాల నుంచి ఆర్థిక వ్యవస్థ ఒడిదుడుకులకు గురికావడమేనని వారు వివరిస్తున్నారు.

రాయిటర్స్ నిర్వహించిన పోల్స్‌లో మొత్తం 40 మంది ఆర్థికవేత్తలను జనవరి 24-29 వరకు సంప్రదించింది. వీరంతా చెప్పేదేమిటంటే 2018-19 ఆర్థికసంవత్సరంలో స్థూలదేశీయోత్పత్తి లేదా జీడీపీలో 3.2 శాతం వరకు మార్కెట్ నుంచి నిధులు సేకరిస్తుందని చెబుతున్నారు.

వచ్చే ఏడాది 2019లో లోకసభకు ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది. చాలా మంది ఈ బడ్జెట్‌లో పెద్దెత్తున తాయిలాలు ప్రకటిస్తుందని ఆశిస్తున్నారు. కానీ ప్రభుత్వం వద్ద నిధులు పరిమితిస్థాయిలో ఉన్నాయి. పేదలను ప్రసన్నం చేసుకోవడానికి ప్రభుత్వానికి నిధుల కొరత అడ్డంకిగా మారిందని చెబుతున్నారు. అలాగే ఆదాయపు పన్నులో ఊరట కలిగించే అవకాశాల్లేవని మిడ్‌సైజ్ కంపెనీలకు కార్పొరేట్ పన్నుల్లో కొంత తగ్గించవచ్చునని చెబుతున్నారు. ప్రభుత్వం సోమవారం నాడు పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థికసర్వేలో కూడా ద్రవ్యలోటు లక్ష్యాన్ని మరింత పెంచితే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత జోరందుకుంటుందని ప్రకటించింది.

ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు లక్ష్యం జీడీపీలో 3.2 శాతం సాధించడం సాధ్యమయ్యే పని కాదు. ఎందుకంటే ఇప్పటికే ద్రవ్యలోటు పూర్తి సంవత్సరం లక్ష్యాన్ని నవంబర్‌లోనే దాటిపోయింది. ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇక మిగిలింది కేవలం ఒక త్రైమాసికం మాత్రమే. కాబట్టి ప్రభుత్వం ఈ ఆర్థికసంవత్సరం ద్రవ్యలోటు లక్ష్యం చేరడం అసాధ్యం.

సర్వేలో పాల్గొన్న 40 మంది ఆర్థికవేత్తల్లో మూడోవంతు మంది భారత్‌తో పాటు సింగపూర్, యూరోప్ ఆర్థికవేత్తలు మాత్రం గురువారం నాడు ఆర్థికమంత్రి పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టేటప్పుడు ఆర్థిక క్రమశిక్షణ గురించి ప్రముఖంగా ప్రస్తావిస్తారని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. మిగిలిన పది మంది ఆర్థికవేత్తలు మాత్రం ప్రభుత్వం సబ్సిడీలకు పెద్దపీట వేస్తారని చెప్పారు. కాగా 18 శాతం మంది మాత్రం ప్రభుత్వం పెద్దమొత్తంలో నిధులు సేకరించి పెద్దమొత్తంలో వ్యయం చేస్తుందని చెప్పారు.

ప్రజాకర్షక బడ్జెట్ ప్రవేశపెడతారన్న ఆర్థికవేత్తల అంచనా ప్రకారం ప్రభుత్వం కొత్త కొత్త సబ్సిడీలు ప్రకటిస్తుందని, ఉదాహరణకు రైతులకు రుణాల మాఫీ, వైద్యరంగంపై ఎక్కువ మొత్తంలో వ్యయం చేస్తున్నట్లు ప్రకటించే అవకాశం ఉందని, ఇంధనంపై పన్ను రేట్లు తగ్గించడం, గ్రామీణ గృహ నిర్మాణ పథకాన్ని మరింత వేగవంతం చేయడమని వారు అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

గ్రామీణ ప్రాంతాల్లో రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దేశవ్యాప్తంగా రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. వాటిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించే అవకాశాలున్నాయి.

తమ అంచనా ప్రకారం వచ్చే బడ్జెట్ ప్రభుత్వం ఎక్కువగా వ్యవసాయ రంగంపై దృష్టి పెడుతుందని, ఎన్నికలకు ఇక మిగిలింది కేవలం ఒక సంవత్సరం మాత్రమే కాబట్టి ఎన్నికల్లోగా ప్రజాదరణ పొందడానికి గ్రామీణ ఆర్థికవ్యవస్థపై దృష్టి పెడుతుందని సొసైటీ జనరలీ ఆర్థికవేత్త కునాల్‌కుందు చెప్పారు. నవంబర్ 2016లో ప్రభుత్వం పెద్దనోట్ల రద్దును చేయడం, గతేడాది జులై 1నుంచి వస్తు సేవల పన్నును అమల్లోకి తేవడంతో ఆర్థిక వ్యవస్థ గత నాలుగు సంవత్సరాలతో పోలిస్తే అత్యంత బలహీనంగా ఉంది.

పెద్దనోట్ల రద్దు, జీఎస్టి షాక్‌ల నుంచి ఇంకా తేరుకోవాల్సి ఉంది. మరి కొంత మంది ఆర్థికవేత్తలు, ఈ ఆర్థికసంవత్సరం, వచ్చే ఆర్థిక సంవత్సరం కూడా ప్రభుత్వం ద్రవ్యలోటు లక్ష్యాన్ని చేరుకోలేదని చెబుతున్నారు. భారత ఆర్థిక వ్యవస్థ ఈ ఆర్థిక సంవత్సరం 6.6 సాధించే అవకాశాలున్నాయి. 2014-15 ఆర్థికసంవత్సరం నుంచి ప్రభుత్వం జీడీపీని లెక్కించడానికి కొత్త విధానాన్ని తీసుకొచ్చిన తర్వాత అతి తక్కువ వృద్ధిరేటు ఇదే. కాగా వచ్చే ఆర్థికసంవత్సరం 2018-19లో జీడీపీ వృద్ధిరేటు 7.3శాతం సాధించే అవకాశాలున్నాయని ఆర్థికవేత్తలు అంచనా వేశారు.



దుమ్మురేపిన ఇండియన్ ఆయిల్

● క్యూ3లో 97% వృద్ధి ● కలిసొచ్చిన చమురు నిల్వలు

ముంబై : ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఫలితాలు అంచనాలను మించిపోయాయి. గ్లోబల్ మార్కెట్లో ధరలు పెరగిపోవడంతో కంపెనీ వద్ద ఉన్న ముడి చమురు నిల్వలు విలువ పెరిగిపోవడమే కారణం. ఈ ఏడాది జనవరి నుంచి ముడి చమురు ధరలు ఏకంగా 30 శాతం పెరిగి పోయాయి. దీంతో ఇండియన్ ఆయిల్‌కు లాభాల పంట పడింది. డిసెంబర్ త్రైమాసికంలో నికరలాభం 97 శాతం పెరిగి రూ.7,883 కోట్లకు చేరింది. కాగా క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.3,051 కోట్లని కంపెనీ డైరెక్టర్ ఫైనాన్స్ ఎకె శర్మ మంగళవారం మీడియాకు తెలిపారు. సరాసరి రిఫైనింగ్ మార్జిన్ (జీఆర్ఎం) ఏప్రిల్ - డిసెంబర్ నాటికి పీపాపై 8.28 డాలర్లకు చేరగా ఏడాది క్రితం ఇది 7.36 డాలర్లని ఆయన పేర్కొన్నారు.

జీసీపీఎల్ లాభం రూ. 430 కోట్లు


● క్యూ3లో 22% వృద్ధి



ముంబై : ఎఫ్ఎంసీజీ దిగ్గజం గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (జీసీపీఎల్) డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 22.05 శాతం వృద్ధితో రూ.429.87 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.352.20 కోట్లు ఆర్జించినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది మొత్తం రెవెన్యూ విషయానికి వస్తే 6.45 శాతం పెరిగి రూ.2,666.23 కోట్లు పెరిగి రూ.2,056.85కోట్లకు చేరింది. బీఎస్ఈలో దీని షేరు 0.04 శాతం పెరిగి రూ.1,061 వద్ద ముగిసింది.

విస్తరణ బాటలో దివీస్

● ఈ ఏడాది రూ. 300 కోట్ల వ్యయం



హైదరాబాద్ : ఫార్మా కంపెనీ దివీస్ లేబరేటరీస్ ప్రస్తుతం ఉన్న ప్లాంట్‌ను మరింత విస్తరించడానికి రూ.300 కోట్ల వరకు పెట్టుబడులు పెడుతున్నట్లు మంగళవారం నాడు తెలిపింది. కాకినాడ ప్లాంట్‌లో కొంత ఇబ్బందులున్నా వాటిపైకూడా పెట్టుబడులు పెడుతామని కంపెనీ ఉన్నతాధికారి ఒకరు తెలియజేశారు. గత ఏడాది డిసెంబర్ వరకు రూ.400 కోట్ల వరకు వ్యయం చేశామని, ఈ ఏడాది రూ.300 కోట్లతో విస్తరణ చేపడుతున్నట్లు కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ ఎల్ కిశోర్‌బాబు చెప్పారు.

కాకినాడ ప్లాంట్ గురించి ప్రస్తావిస్తూ.. ఇక్కడ కొంత సమయం పడుతుందని, ప్రభుత్వం ఇక్కడి రైతుల సమస్యలను పరిష్కరించాల్సి ఉందని, అప్పటి వరకు వేచి చూడాల్సి ఉంటుందన్నారు. అప్పటి వరకు ప్రస్తుతం ఉన్న ప్లాంట్‌లను విస్తరిస్తామని ఆయన వివరించారు. వచ్చే ఏడాది మూలధనం వ్యయం గురించి ఇంకా నిర్ణయించలేదన్నారు. బహుశా మార్చి చివరి నాటికి ఖరారు చేస్తామని ఆయన వివరించారు. తూర్పు గోదావరి జిల్లా ఒంటి మామిడి గ్రామం (కోన) తుండంగా మండలంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 505 ఎకరాల భూమిని కేటాయించిందన్నారు. త్వరలోనే ఈ భూమిని స్వాధీనం చేసుకుంటుందన్నారు. గత ఏడాది భూమితో పాటు సివిల్ పనులపై రూ.34.35 కోట్లు వ్యయం చేస్తామని ఆయన తెలిపారు.

త్వరలో డిపాజిట్లపై వడ్డీరేట్లు పెంపు

● రేటింగ్ ఎజెన్సీ ఇక్రా

ముంబై : గత కొన్ని నెలల నుంచి డిపాజిట్ల కంటే రుణాలకు డిమాండ్ పెరిగిపోతోది. క్రెడిట్... డిపాజిట్ నిష్పత్తి వ్యత్యాసంలో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. దీంతో రాబోయే రోజుల్లో డిపాజిట్లపై వడ్డీరేట్లు పెరిగే అవకాశం ఉందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం జనవరి 5వ తేదీ వరకు రుణాల డిమాండ్ రూ.2.02 లక్షలకు చేరింది. దీనికి వ్యతిరేకంగా రూ.1.27 లక్షల కోట్లు డిపాజిట్లు మాత్రమే బ్యాంకుల్లో డిపాజిట్ అయ్యాయి. రేటింగ్ ఏజెన్సీ ఇక్రా మంగళవారం నాడు విడుదల చేసిన నివేదిక ప్రకారం ఇటీవల ప్రభుత్వం పీఎస్‌యు బ్యాంకులకు రూ.88,139 కోట్ల మూలధనం సమకూరుస్తామని ప్రకటించడంతో రాబోయే నెలలో పీఎస్‌యు బ్యాంకులకు రుణాలు ఇవ్వడానికి కాస్తా వెసులుబాటు చిక్కుతుందని తెలిపింది. అయితే బ్యాంకులకు ఎస్ఎల్ఆర్ హోల్డింగ్‌ను తగ్గించుకొనే అవకాశం కూడా ఉంటుంది. ఈ మొత్తాన్ని రుణాలు ఇచ్చుకోవచ్చు. అయితే బ్యాంకులు మాత్రం దీని జోలికిపోవు.. ఎందుకంటే బాండ్ ఈల్డింగ్ పెరిగి ట్రెజరీ నష్టాలను చవిచూడాల్సి వస్తుందని దూరంగా ఉంటాయని ఇక్రా పేర్కొంది. వీటిని దృష్టిలో ఉంచుకొని బ్యాంకులు డిపాజిట్లు సేకరించడానికి పెద్దపీట వేసి అదే సమయంలో డిపాజిట్లపై వడ్డీరేట్లు పెంచుతాయని నివేదికలో వివరించింది. సెప్టెంబర్ 29, 2017 నుంచి జనవరి 5, 2018 వరకు బ్యాంకులు రూ.1.85 లక్షల కోట్ల రుణాలు ఇచ్చాయి. అదే సమయంలో డిపాజిట్లు 0.30 లక్షల కోట్లు మాత్రమే సేకరించగలిగాయి. బ్యాంకులకు డిపాజిట్లు రావడం లేదని.. సెప్టెంబర్ 29,2017 నుంచి జనవరి 5, 2018 వరకు ప్రజల వద్ద సుమారు 1.36 లక్షల కోట్లున్నాయని తెలిపింది. బ్యాంకుల్లో డిపాజిట్లు సన్నగిల్లడం వల్ల బల్క్ డిపాజిట్లపై వడ్డీరేట్లను పెంచుతున్నాయి.

డిపాజిట్లపై వడ్డీరేట్లు పెంచిన ఎస్‌బీఐ

ముంబై : దేశంలోని అతి పెద్ద బ్యాంకు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా దేశీయ బల్క్ టర్మ్ డిపాజిట్లపై వడ్డీరేట్లను మంగళవారం నుంచి 75-140 బేసిస్ పాయింట్ల వరకు పెంచింది. పెంచిన వడ్డీరేట్లు తక్షణమే అమల్లోకి వస్తాయి. రెండు నెలల క్రితం ఎస్‌బీఐ వడ్డీరేట్లను పెంచిన విషయం తెలిసింది. గతేడాది నవంబర్‌లో బల్క్ డిపాజిట్లపై ఒక శాతం వడ్డీరేట్లను పెంచింది. వడ్డీరేట్లను పెంచడానికి దారితీసిన పరిస్థితులను గురించి బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ (రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్) పీకె గుప్తా మాట్లాడుతూ పోటీ బ్యాంకులతో పోల్చుకుంటే తమ బ్యాంకు వడ్డీరేట్లు తక్కువన్నారు. తాజాగా సవరించిన వడ్డీలతో పోల్చుకుంటే ఇప్పుడు పోటీ బ్యాంకులతో సమాన స్థాయికి వచ్చాయన్నారు. బ్యాంకుల వద్ద సరిపడేంత ద్రవ్యం ఉంది కాని..వ్యవస్థలో కొంత ఇబ్బందులు తలెత్తుతున్నాయని, సుమారు రూ.10,000 కోట్ల నుంచి రూ.15,000 కోట్ల వరకు లోటు ఉంటోందని గుప్తా వివరించారు.

రిటైల్ టెర్మ్ డిపాజిట్ల వడ్డీరేట్లలో ఎలాంటి మార్పుల్లేవని ఆయన స్పష్టంచేశారు. బల్క్ డిపాజిట్ల విషయానికి వస్తే కనీసం ఒక రూ.1 కోటి డిపాజిట్లపై సవరించిన వడ్డీలు అమలవుతాయి. స్వల్పకాలానికి అంటే 46-179 రోజులు 180-210 రోజులకు బ్యాంకు 6.25 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. గతంలో ఇది 4.85 శాతం మాత్రమే. అలాగే ఈ డిపాజిట్లపై ఒక సంవత్సరం నుంచి రెండు సంవత్సరాలకంటే తక్కువ కాలానికి 6.25 శాతం వడ్డీ రేటును ఆఫర్ చేస్తోంది. గతంలో ఇది 5.25 శాతం మాత్రమే. రెండు రోజుల నుంచి 10 రోజుల మేచురిటీపై కొత్త రేటు 6 శాతం, గతంలో 5.25 శాతంగా ఉంది. ఇదిలా ఉండగా నవంబర్ 2016లో ఎస్‌బీఐ బల్క్ డిపాజిట్లపై వడ్డీరేట్లను 1.9 శాతం తగ్గించింది. పెద్దనోట్ల రద్దు తర్వాత బ్యాంకుల్లో ఇబ్బడి ముబ్బడి డిపాజిట్లు వచ్చి పడ్డంతో వడ్డీరేట్లను తగ్గించింది.

ఛోళ మండలం లాభంలో 53% వృద్ధి

● మధ్యంతర డివిడెండ్ 45 శాతం

చెన్నై : చోళమండటం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ (సీఐఎఫ్‌సీఎల్) డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 53 శాతం వృద్ధితో రూ.249 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నికరలాభం రూ.163 కోట్లు నమోదు చేసింది. దీనికి ప్రధాన కారణం పెద్దెత్తున రుణాలు ఇవ్వడమే.

మురుగప్ప గ్రూపునకు చెందిన ఈ కంఎనీ మొత్తం ఆదాయం 18 శాతం పెరిగి రూ.1383 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.1,176 కోట్లని తెలిపింది. నికరవడ్డీ మార్జిన్ 9.6 శాతం పెరిగితే, క్రితం ఏడాది 8.4 శాతంగా ఉందని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. రుణాల విషయానికి వస్తే 55 శాతం పెరిగి రూ.6,761 కోట్లకు చేరగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.4,373 కోట్లు పంపిణి చేసింది. ఇక డివిడెండ్ విషయానికి వస్తే మధ్యంతర డివిడెండ్ 45 శాతం షేరుకు రూ.4.5 ప్రకటించింది.

మ్యాజిక్‌బ్రిక్స్ రెవెన్యూ రూ. 41.1 కోట్లు

హైదరాబాద్ : రియల్ ఎస్టేట్ లిస్టింగ్ పోర్టల్ మ్యాజిక్‌బ్రిక్స్ సంవత్సరం ప్రాతిపదికన డిసెంబర్ త్రైమాసికంలో రెవెన్యూలో 11 శాతం వృద్ధితో రూ.41.1 కోట్లు ఆర్జించింది. త్రైమాసికం ప్రాతిపదికన చూస్తే రెవెన్యూలో 36 శాతం వృద్ధి కనిపించింది. కంపెనీ సీఈవో సుధీర్ పాయ్ మాట్లాడుతూ.. గత రెండు త్రైమాసికాల నుంచి కంపెనీ వ్యాపారం బాగా వృద్ధి చెందిందన్నారు. ఈ ఆర్థికసంవత్సరం మొదటి త్రైమాసికంలో కొన్ని సవాళ్లను ఎదుర్కొన్నా అటు తర్వాత నుంచి గాడిన పడ్డామని ఒక ప్రకటనలో తెలియజేశారు. టైమ్స్ ఇంటర్నెట్ లిమిటెడ్ అనుబంధ సంస్థ మ్యాజిక్‌బ్రిక్.

ఐడియా సెల్యూలార్ కార్బన్ ఫోన్లపై క్యాష్‌బ్యాక్ ఆఫర్



హైదరాబాద్ : టెలికం ఆపరేటర్లలో పెద్ద ఎత్తున ధరల యుద్ధం కొనసాగుతుంటే.. ఐడియా సెల్యూలార్ తమ కస్టమర్లకు కార్బన్ స్మార్ట్‌ఫోన్‌లతో పాటు ఫీచర్‌ఫోన్ల కొనుగోలుపై క్యాష్‌బ్యాక్ ఆఫర్‌లను మంగళవారం నాడు ప్రకటించింది. ఈ క్యాష్ బ్యాక్ ఆఫర్ రూ.1,000 నుంచి రూ.2,000 వరకు ఉంటుంది. ఇది హ్యాండ్‌సెట్ మోడల్‌ను బట్టి మారుతుంటుంది. ఈ ఆఫర్లు ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వస్తుంది. క్యాష్ బ్యాక్ ఆఫర్ కార్బన్ స్మార్ట్‌ఫోన్స్ ఏ41 పవర్ ఏ9 ఇండియన్‌లపై రూ.1,500 వరకు, రూ.2,000 (యువ2)పై ఉంటుందని ఐడియా సెల్యూలార్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఏ41 పవర్, ఏ9 ఇండియన్ ధర రూ.2,999 నుంచి రూ.3,699 వరకు ఉంటుంది. దీనిపై రూ.500ను ఐడియా మనీవ్యాలెట్‌లో 18 నెలల తర్వాత జమ చేస్తుంది. మిగిలిన రూ.1,000 36 నెలల ముగిసిన తర్వాత జమ చేస్తుంది. ఏ41 పవర్, ఏ9 ఇండియన్, యువ2 క్యాష్‌బ్యాక్ కావాలనుకునే కస్టమర్ మొదటి 18 నెలల కాలంలో రూ.3,000 విలువ చేసే రీచార్జి చేసుకోవాల్సి ఉంటుంది, అటు తర్వాత మరో 18 నెలల కాలంలో ఇంతే మొత్తంలో రీచార్జి చేసుకోవాల్సి ఉంటుందని ఐడియా ప్రకటనలో వివరించింది.

సంపన్నదేశాల్లో భారత్ ర్యాంకు ఆరు

● మొత్తం సంపద 8,230 బిలియన్ డాలర్లు

న్యూఢిల్లీ : ప్రపంచంలోని సంపన్నదేశాల్లో భారత్ ఆరవ స్థానాన్ని ఆక్రమించింది. మొత్తం సంపద 8,230 బిలియన్ డాలర్లుగా తేలింది. (రూ.5,34,95,000)కోట్లుగా చెప్పుకోవచ్చు. జాబితాలో అమెరికా అగ్రస్థానం దక్కించుకుంది.

న్యూవర్ల్డ్ వెల్త్ నివేదిక ప్రకారం అమెరికా మొత్తం సంపద 2017లో 64,584 బిలయన్ డాలర్లు, తర్వాత స్థానం చైనా 24,803 బిలియన్ డాలర్లు, జపాన్ 19,522 బిలియన్ డాలర్లతో మూడవ స్థానాన్ని ఆక్రమించింది. మొత్తం సంపద ఎలా లెక్కిస్తారంటే.. ప్రతి దేశంలోని నగరంలో నివసించే ప్రజల వ్యక్తిగత సంపదను పరిగణలోకి తీసుకొని వారి ఆస్తులు, నగదు, ఈక్విటి, వ్యాపారాల నుంచి -- నుంచి అప్పులు తీసివేస్తారు. అయితే వీటిలో ప్రభుత్వం ఆస్తులు, నిధులు పరిగణనలోకి తీసుకోరు. జాబితాలో స్థానం దక్కించుకున్న మిగతా దేశాల్లో నాలుగవ స్థానంలో బ్రిటన్ 9,919 బిలియన్ డాలర్లు, జర్మనీ ఐదవ స్థానంతో 9,660 బిలియన్ డాలర్లు, ఫ్రాన్స్ ఏడవ స్థానంతో 6,649 బిలియన్ డాలర్లు, కెనెడా ఎనిమిదవ స్థానంతో 6,393 బిలియన్ డాలర్లు, ఆస్ట్రేలియా తొమ్మిదవ స్థానంతో 6,142 బిలియన్ డాలర్లు, ఇటలీ పదవ స్థానంలో 4,276 బిలియన్ డాలర్లతో టాప్ 10 జాబితాను ఆక్రమించాయి.



న్యూ వరల్డ్ వెల్త్ నివేదిక ప్రకారం భారత్ అత్యుత్తమ ప్రదర్శన నిర్వహించిందని, 2016లో 6,584 బిలియన్ డాలర్ల నుంచి 2017 నాటికి ఏకంగా 8,230 బిలియన్ డాలర్లకు చేరిందని.. సంపద ఏకంగా 25 శాతం పెరిగిందని పేర్కొంది. ఇదే కాలంలో చైనా సంపద 22శాతం పెరిగితే.. గ్లోబల్ సంపద 12 శాతం పెరిగింది. 2016 చివరి నాటికి 192 ట్రిలియన్ డాలర్ల నుంచి 2017 చివరి నాటికి 215 ట్రిలియన్ డాలర్లకు ఎగబాకింది. దశాబ్దం కాలం ప్రకారం చూస్తే 2007-2017 వరకు లెక్కిస్తే .. భారత్ సంపద 2007లో 3,165 బిలియన్ డాలర్ల నుంచి 2017 నాటికి 8,230 బిలియన్ డాలర్లకు చేరింది. ఈ పదేళ్లలో 160 శాతం పెరిగింది.

ఇదే నివేదికలో భారత్‌లో సుమారు 3,30,400 మంది హెచ్ఎన్‌డబ్ల్యుఐలు (హైనెట్‌వర్త్ ఇండివ్యాడ్యువల్స్) సంపన్నులుగా చెప్పుకోవచ్చు. ఒక మిలియన్‌డాలర్లు లేదా అంతకంటే ఎక్కువ ఆస్తులు కలిగిన వారుగా చెప్పుకోవచ్చు. హెచ్ఎన్‌డబ్ల్యుఐలలో భారత్ ర్యాంకు 9 కాగా .. అమెరికా నెంబర్ వన్ స్థానాన్ని దక్కించుకుంది. ఇక్కడ 50,47,400 మంది హెచ్ఎన్‌డబ్ల్యుఐలున్నారు. ఇక భారత్‌లో 20,730 మల్టీ మిలియనీర్లున్నారు. ప్రపంచదేశాలతో పోల్చుకుంటే 7వ స్థానం ఆక్రమించింది. దేశంలో బిలియనీర్లు 119 మంది ఉండగా.. ప్రపంచదేశాల సరసన చూస్తే టాప్ మూడులో ఆక్రమించింది. అమెరికా, చైనా తర్వాత భారత్ పేరు వినిపిస్తోంది. బిలియనీర్ అంటే రూ.6,500 కోట్లు లేదా అంత కంటేఎక్కువ ఆస్తులు కలిగి ఉండాలి. మొత్తానికి టాప్ 10 మార్కెట్లకు గత ఏడాది బాగా కలిసొచ్చింది. గ్లోబల్ స్టాక్‌మార్కెట్లు బాగా దూసుకుపోయాయి. చైనా, భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా స్టాక మార్కెట్లు గత ఏడాది బుల్‌రన్‌లో దూసుకుపోయాయి. సంపన్నుల సంపద మరింత పెరగిందని న్యూ వరల్డ్ వెల్త్ నివేదిక వివరించింది.



ఆటో మెషిన్‌తో ఉద్యోగాలూడవు!

● వ్యాపారాలు పుంజుకుంటాయి ● టీసీఎస్ సీఓఓ

దావోస్ : ఆటోమెషిన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా వ్యాపారాలు మరింత అభివృద్ధి చేసుకోవచ్చునని టీసీఎస్ టాప్ ఎగ్జిక్యూటివ్ చెప్పారు. ఐటి రంగంలో ఉద్యోగాలు కోల్పోతాయన్నది అపోహ మాత్రమేనన్నారు. ప్రజలు దీనిపై వాస్తవం కంటే ఎక్కువ ఊహించు కుంటున్నారని టీసీఎస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎన్ గణపతి సుబ్రహ్మణ్యం అన్నారు.

టెక్నాలజీ మారు తున్నప్పుడు యాజమాన్యం ఉద్యోగులకు కొత్త సాంకేతికతపై శిక్షణ ఇవ్వడం బాధ్యత అని ఆయన అన్నారు. ఐటి రంగంలో తరచూ మార్పులు సహజమేనని ఆయన వివరించారు. ఆయన ఇక్కడ జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుల్లో గత వారం పాల్గొన్నారు. ప్రతి మూడు నుంచి ఐదు సంవత్సరాలకు ఐటి రంగంలో మార్పులు చేర్పులు జరుగుతుంటాయి. అదే సందర్భంలో ఉద్యోగులకు కొత్త టెక్నాలజీపై శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి ఈ మార్పులను తాను గమనిస్తున్నానన్నారు. ఉద్యోగులకు శిక్షణ ఇచ్చి వారి ప్రయోజనాలను కాపాడుతుంటామని ఆయన అన్నారు. కొత్త సాంకేతికతను శిక్షణ ద్వారానే పొందవచ్చునన్నారు. ఆటోమెషిన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఉద్యోగాలకు ప్రమాదం ఉందా అని ప్రశ్నించగా.. భారత్‌లో ప్రతి రంగంలో పోటీ ఉంటుందన్నారు. నర్సరీ స్కూల్‌లో అడ్మిషన్ నుంచి ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు. పోటీలో ఎవరి నెగ్గితే వారికి ఢోకా ఉండదన్నారు. ఆటోమెషిన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఉద్యోగాలు పోతాయన్న ప్రకటనలో ఎలాంటి నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. టీసీఎస్ విషయానికి వస్తే తమ ఉద్యోగులకు కొత్త సాంకేతికపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉద్యోగుల్లో నైపుణ్యం పెంచడానికి పెద్దమొత్తంలో పెట్టుబడులు కూడా పెడుతుంటామని గణపతి అన్నారు.

భారత్‌లో బీపీ, షుగర్ ఎక్కువ!

• పురుషుల్లోనే అధికం • అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ: భారతీయుల్లో మధుమేహం, అధిక రక్తపోటు ప్రాబల్యం ఎక్కువగా ఉందని ఒక అధ్యయనంలో వెల్లడైంది. మహిళల్లో మధుమేహం 6.1శాతం ఉండగా, పురుషుల్లో 6.5శాతం ఉంది. అదేవిధంగా మహిళల్లో అధిక రక్తపోటు 20శాతం ఉంటే పురుషుల్లో 24.5శాతం ఉన్నట్టుగా వెల్లడైంది. భారతదేశంలో సుమారు 25శాతం ప్రజలు అధికరక్తపోటుతో బాధపడుతున్నారు. మధుమేహం, అధిక రక్తపోటు సైలెంట్ కిల్లర్స్‌లా పనిచేస్తాయని నివేదిక తెలిపింది. జర్నల్ ఆఫ్ ది అమెరికన్ మెడికల్ అసోసియేషన్ (జెఎఎంఎ) వెల్లడించిన నివేదిక ప్రకారం భారతదేశంలో మధుమేహం రేటు ఆరుశాతానికి పైగా ఉందని వెల్లడించింది. అధిక రక్తపోటు, మధుమేహం బాధితులు ముఖ్యంగా మధ్య వయస్కులు, వృద్ధుల్లో ఎక్కువగా ఉన్నారని నివేదిక వెల్లడిచేసింది. ఆంధ్రప్రదేశ్, గోవా, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో డయాబెటిస్ ఎక్కువగా ఉంది. పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, కేరళ, సిక్కిం, నాగాలాండ్ ప్రజలలో అధిక రక్తపోటు నమోదైంది. ఈ రెండు ప్రమాదకరస్థాయిలో వేగంగా పెరుగుతున్నాయనేది కఠోర వాస్తవం. ఆరోగ్యకరమైన ఆహారం, 30నిమిషాల శారీరక వ్యాయామంతో మధుమేహం, అధిక రక్తపోటు రెండింటినీ అదుపులో ఉంచుకోవచ్చని వైద్యులు తెలుపుతున్నారు.

35 వేల అడుగుల ఎత్తులో ప్రసవం చేసిన
భారత సంతతి వైద్య విద్యార్థి

న్యూయార్క్: వైద్యుడిని దేవుడితో సమానంగా చూస్తారు అందరూ. దీనికి తగ్గట్టుగానే ఎంతో మంది వైద్యులు తమ వృత్తి న్యాయం చేస్తూనే ఉన్నారు. ఈ కోవలోనే 27 సంవత్సరాల భారత సంతతికి చెందిన ఓ అమెరికన్ వైద్య విద్యార్థిభూమికి 35,000 అడుగుల ఎత్తున ఎగురుతున్న విమానంలో ఓ బాలింతకు పురుడు పోసే అరుదైన అవకాశాన్ని దక్కించుకున్నాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు పరిశీలిస్తే. అమెరికాలో నివశించేభారత మూలాలు కలిగిన 27 సంవత్సరాల డాక్టర్ సిజ్ హేమల్ క్లీవ్‌ల్యాండ్ క్లీనిక్ యొక్క గ్లిక్మన్ యూరోలాజికల్ మరియు కిడ్నీ ఇనిస్టిట్యూట్‌లో రెండవ సంవత్సరం యూరాలజీ వైద్య విద్యను అభ్యసిస్తున్నాడు. ఇటీవల ఢిల్లీకి వచ్చిన అతను తిరుగు ప్రయాణంలో పారిస్ నుంచి న్యూయార్క్‌కు అట్లాంటిక్ విమానంలో ప్రయాణిస్తున్నాడు. ఇదే విమానంలో ప్రయాణిస్తున్న ఓ గర్భిణికి అకస్మాత్తుగా నొప్పులు రావడంతో వెంటనే తానే డాక్టర్ అవతారం ఎత్తాడు. అదే విమానంలో ఉన్న ఫ్రాన్స్‌కు చెందిన శిశువైద్యుడు స్టెఫానీ ఓర్టోలన్తో సహకారంతో దాదాపు 30 నిముషాలు కష్టపడి గర్భిణీనికి ప్రసవం చేశారు. ఆమెకు పండంటి మగ శిశువు జన్మించాడు. యూరాలజీ వైద్య విద్యను అభ్యసిస్తున్నప్పటికీ గతంలో కూడా అతను 7గురు మహిళలకు ప్రసవం జరగడంలో కీలకపాత్ర పోషించాడు. తన తాజా అనుభవం గురించి చెబుతూ ఇది సమిష్ఠి కృషి. మేము ప్రశాంతంగా ఉండడం, అత్యవసర సమయాల్లో అతి వేగంగా స్పందించడం వంటి అంశాల్లో కూడా శిక్షణ పొందుతాము. కనుకనే పిల్లాడు 'జేక్' ఈ భూమి మీదకు రావడంలో పాత్రధారిని కాగలిగాను. ఖచ్చితంగా ఇది నా జీవితకాలం మరిచిపోలేని సంఘటన అన్నారు.

పీఆర్‌సీ ఎరియర్స్‌ని
వెంటనే విడుదల చేయాలి

• పీఆర్‌సీ కమిటీని నియమించాలి • సీపీఎస్‌ని రద్దు చేయాలి • సీఎంను కోరిన ఏపీఎన్జీవో అశోక్ బాబు



అమరావతి, ఆంధ్రప్రభ: పిఆర్‌సి ఎరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని, అదేవిధంగా వేతన సవరణ కమిటీ గడువు ముగిసినందున 2018 జులై నుండి నూతన వేతనాలు చెల్లించాల్సి ఉందని, తక్షణమే పీఆర్‌సి కమిటీని నియమించాలని ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు అశోక్ బాబు ముఖ్యమంత్రిని కోరారు. మంగళవారం సచివాలయంలో సీఎం చంద్రబాబుని కలిసిన ఏపీఎన్జీవో నాయకులు కలిసి దావోస్ పర్యటన విజయవంతంగా పూర్తిచేసుకొని వచ్చిన సీఎం చంద్రబాబుకి అభినందనలు తెలిపారు. అనంతరం అశోక్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు గత మూడు సంవత్సరాలుగా బకాయి ఉన్న పీఆర్‌సి ఎరియర్‌ను తక్షణమే విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా పీఆర్‌సీ కమిటీని నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులకు బకాయి ఉన్న డీఏ బకాయిలలో ఇటీవల ఒక బకాయినీ మంజూరు చేయడం పట్ల ఉద్యోగులు పక్షాన సీఎంకు కృతజ్ఞతులు తెలియజేశారు. ప్రకటించిన డీఏకు సంబంధించిన ఉత్తర్వులను కవాడా విడుదల చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, దేశ వ్యాప్తంగా ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారని, మన రాష్ట్రంలో సీపీఎస్ ఉద్యోగులకు ఫ్యామిలీ పెన్షన్, గ్రాట్యుయిటిని చెల్లించటం పట్ల ఉద్యోగులు కొంత ఊరట చెందారన్నారు. అయితే దేశవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల సమస్య కారణంగా సీపీఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని తాము కూడా కోరుతున్నట్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందిస్తూ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో తాను ఎల్లప్పుడు సానుకూల దృక్పదంతో ఉంటానన్నారు. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కొంత ఆలస్యమైనప్పటికీ ఉద్యోగులకు సంబంధించిన ప్రతి సమస్యను పరిష్కరిస్తానని, త్వరలో డిఏ ఉత్తర్వులను విడుదల చేయటంతో పాటు నూతన పిఆర్‌సి కమిటీ నియామకానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు అశోక్ బాబు తెలిపారు.

ముగిసిన విదేశీ విద్యా దీవెన కౌన్సిలింగ్

అమరావతి, ఆంధ్రప్రభ: ప్రభుత్వ విదేశీ విద్యా దీవెన పథకం కింద ఆర్థిక సహాయం మంజూరు నిమితం నిర్వహించిన కౌన్సిలింగ్‌కు విద్యార్థుల నుంచి విశేషస్పందన లభించింది. కాపు, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థినీ విద్యార్థులు ఈ కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు. మంగళవారం విజయవాడ తుమ్మల పల్లి కళాక్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్ధులకు అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇప్పటికు మూడు విడతలుగా కౌన్సిలింగ్ జరిగింది. మూడు దశలలో జరిగిన ఈ కౌన్సిలింగ్ 600 మందికి పైగా విద్యార్ధులు పాల్గొన్నారు. మొదటి దశ రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థి రెండో దశలో సర్టిఫికేట్లను పరిశీలించారు. మూడోదశలో స్టేట్ లెవిల్ కమిటీ ఇంటర్వ్యూ నిర్వహించింది. కాపుకార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కౌన్సిలింగ్ లో కాపు విద్యార్ధులు 310 మంది, బి.సి విద్యార్థులు 250 మంది, ఎస్సీ విద్యార్థులు 28 మంది, ఎస్టీ విద్యార్థులు 3, మైనార్టీ విద్యార్థులు 40 మంది హాజరై తమ సర్టిఫికేట్లు వెరిఫికేషన్ చేయించుకున్నారు. మిగిలిన విద్యార్థులకు నేడు కూడా కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు.

రూ. 35 లక్షల నగల చోరీ

ఒంగోలు క్రైం, ప్రభన్యూస్ : సికింద్రాబాద్ నుంచి గూడూరు వెళుతున్న సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో మంగళవారం చోరీ జరిగింది. ప్రకాశం జిల్లా ఒంగోలు రైల్వే పోలీసుల వివరాల మేరకు ఒంగోలుకు చెందిన రావిపాటి సుశీల అనే మహిళ సికింద్రాబాద్‌లో రైలు ఎక్కి ఒంగోలుకు వస్తున్నారు. ఏ1 కోచ్‌లో ఆమె ప్రయాణిస్తున్నారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఆమె వద్ద ఉన్న బ్యాగ్ కనబడకపోవడంతో విధి నిర్వహణలో ఉన్న టీటీఈని ఆశ్రయించారు. మరో కోచ్‌లో ఆమె కుమారుడు కూడా ప్రయాణం చేస్తున్నాడు. ఒంగోలు చేరే వరకు అన్ని కోచ్‌లలో వెతికి చూసినా బ్యాగ్ కనిపించలేదు. ఒంగోలు చేరుకున్న ఆమె రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాగులో సుమారు రూ.35 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఏపీ హైకోర్టును
రాయలసీమలో ఏర్పాటు చేయాలి

హైదరాబాద్,ఆంధ్రప్రభ : ఏపీ హైకోర్టును రాయలసీమలో ఏర్పాటు చేయాలని అభ్యర్థిస్తూ న్యాయవాదులు ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్‌కు వినతిపత్రం సమర్పించారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన న్యాయవాదుల ప్రతినిధి వర్గం మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఏసీజేను ఆయన చాంబర్ లో కలిశారు.



స్పార్క్ లాక్స్ ఫౌండర్ వెర్నార్డ్ మూన్‌తో భేటీ అయిన మంత్రి లోకేష్

గూగుల్‌నీ తీసుకొస్తాం!

అమెజాన్, ఇండియా క్లౌడ్‌లను కూడా..

• అభివృద్ధి కేంద్రీకృతం కానివ్వం • హైదరాబాద్ తరహా తప్పు జరుగనివ్వం • అమెరికాలో పలు కంపెనీలతో మంత్రి లోకేష్ భేటీ

అమరావతి, ఆంధ్రప్రభ: అమెజాన్, గూగుల్, ఇండియా క్లౌడ్ కంపెనీలను రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు చర్చలు జరుపుతున్నామని మంత్రి లోకేష్ అన్నారు. మంగళవారం శాన్ ఫ్రాన్సిస్కోలో వీఎంవేర్ సీఈవో రఘురాంతో భేటీ అయిన మంత్రి లోకేష్ అభివృద్ధి విషయంలో హైదరాబాద్ తరహా తప్పు మళ్లీ జరగకుండా జాగ్రత్త పడతామన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలనే లక్ష్యంతో ఐటీ రంగం అంతా ఒక చోట కాకుండా విశాఖపట్టణం, అనంతపురం, తిరుపతి, అమరావతిలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. బ్లాక్ చైన్, ఫింటెక్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. రాజ ధాని ప్రాంతంలో ల్యాండ్ రికార్డ్సు అన్ని బ్లాక్ చైన్ టెక్నాలజీ వేదికపైకి తీసుకొస్తున్నామన్నారు. దీని వలన రైతుల రుణాలు తీసుకోవడం సులభమవుతుందన్నారు. ప్రభుత్వ సమాచారం అంతా బ్లాక్ చైన్ వేదిక పైకి తీసుకొచ్చి సైబర్ ఎటాక్స్ జరగకుండా రక్షణ కల్పిస్తున్నామన్నారు. సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్ కోసం ఈప్రగతి ప్లాట్ ఫార్మ్ ఏర్పాటు చేశామని, సర్టి ఫికెట్ లెస్ గవర్నమెంట్ తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. క్లౌడ్ కంపెనీలు తీసుకొచ్చేందుకు క్లౌడ్ హబ్ పాలసీ రూపొందించామని, ఐఓటీ సెన్సార్లు, డ్రోన్లు పెద్ద ఎత్తున వినియోగిస్తున్నామన్నారు. పెన్షన్లు, రేషన్, వాతావరణం, పిడుగులు పడటం, భూగర్భ జలాలు ఇలా అన్ని రియల్ టైంలో తెలుసుకుంటున్నామన్నారు. డ్రోన్ల సహాయంతో భూసార పరీక్షలు చేయ్యబోతున్నామని, రియల్ టైం గవర్నెన్స్ ద్వారా అనేక సేవలు అనుసందానం చేసి ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నామన్నారు. రాష్ట్రంలో విమానాశ్రయాలు కూడా అభివృద్ధి చెందుతున్నాయని, గన్నవరం ఎయిర్ పోర్టులో త్వరలో అంతర్జాతీయ సేవలు కూడా ప్రారంభం కాబోతున్నాయన్నారు. దీనిపై స్పందించిన రఘురాం బ్లాక్ చైన్ అభివృద్ధిలో ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని, త్వరలో తమ బృందాన్ని ఏపీకి పంపిస్తామన్నారు. బెంగుళూరు, పూణేలో ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని, త్వరలోనే రాష్ట్రానికి వస్తామని, అక్కడ జరుగుతున్న అభివృద్ధిని స్వయంగా చూస్తామన్నారు. ఇండియాలో తమ కంపెనీ కార్యకలాపాలు విస్తరించాలనుకుంటున్నామని, ఏపీలో కంపెనీ ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలిస్తామన్నారు.

స్పార్క్ ల్యాబ్స్ ఫౌండర్ బెర్నార్డ్‌తో భేటీ

ఫింటెక్ అభివృద్ధికి యాసిలేటర్ ఏర్పాటు చేశామని, త్వరలోనే బ్లాక్ చైన్ అకాడమీ ఏర్పాటు చెయ్యబోతున్నామన్నారు. బ్లాక్ చైన్ టెక్నాలజీ అభివృద్ధికి, యాసిలేటర్, ఇంక్యుబేటర్ ఏర్పాటు చేయబోతున్నామని, ఏపీని బ్లాక్ చైన్ హబ్‌గా మార్చాలనుకుంటున్నామన్నారు. ప్రభుత్వ సమాచారం అంతా ఈప్రగతి ప్లాట్ ఫార్మ్ ద్వారా ఒకే వేదికపైకి తీసుకరావాలని అనుకుంటున్నట్లు తెలిపారు. దీనిపై స్పందించిన బెర్నార్డ్ టెక్నాలజీ వాడకంలో మీరు అందరికంటే ముందు ఉన్నారని కొనియాడారు. ఫింటెక్, బ్లాక్ చైన్ టెక్నాలజీకి ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ పెరుగుతుందని, ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. బ్లాక్ చైన్, ఫింటెక్ యాసిలిటేటర్ల ఏర్పాటుకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. స్టార్టప్ కంపెనీలను ఏపీకి తీసుకొచ్చి వాటి అభివృద్ధికి దోహదపడతామన్నారు. ఇప్పటికే స్పార్క్ ల్యాబ్స్ యాసిలిరేటర్ ప్లాట్ ఫార్మ్ ద్వారా స్టార్టప్ కంపెనీల అభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తుంది.

కలర్ టోకెన్స్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ కాజాంచితో భేటీ

ఏపీలో పెద్ద ఎత్తున టెక్నాలజీని ఉపయోగిస్తున్నామని టెక్నాలజీ అనుసంధానం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని మంత్రి లోకేష్ అన్నారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల దగ్గర ఉన్న సమాచారాన్ని అనుసంధానం చేసి ఒకే వేదిక పైకి తీసుకొస్తున్నామన్నారు. ఈప్రగతి ప్లాట్ ఫార్మ్ సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్‌గా ఉండబోతుందని, టెక్నాలజీ వినియోగం పెరగడంతోపాటు సైబర్ ఎటాక్స్ జరగకుండా బ్లాక్ చైన్ వినియోగిస్తున్నామన్నారు. అనంతరం రాజేష్ కాంజాంచి మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ సెక్యూరిటీ, డేటా బేస్ సెక్యూరిటీలో ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఏపీ ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తామని, త్వరలోనే రాష్ట్రానికి వచ్చి అక్కడ ఉన్న అవకాశాలపై అధ్యయనం చేస్తామన్నారు.

క్లౌడ్ లెండింగ్ సొల్యూషన్స్ స్నేహాల్‌తో భేటీ

ఇతర నగరాలతో పోల్చుకుంటే విశాఖపట్టణం కంపెనీల్లో ఉద్యోగస్తుల మార్పు చాలా తక్కువగా ఉందని, దీని వలన కంపెనీలు సుస్థిర అభివృద్ధిని సాధిస్తున్నాయన్నారు. పాత టెక్నాలజీలకు కాలం చెల్లిందని, అందుకే ఫిన్ టెక్, బిగ్ డేటా, బ్లాక్ చైన్ లాంటి టెక్నాలజీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టామన్నారు. బ్లాక్ చైన్ టెక్నాలజీలో స్టార్టప్ కంపెనీలు అభివృద్ధి చేసేందుకు అతి పెద్ద యూజ్ కేస్ రిపాజిటరీ సిద్ధం చేశామన్నారు. ఈవిషయాలపై స్పందించిన స్నేహాల్ ఇండియాలో కార్యకలాపాలు విస్తరించాలని అనుకుంటున్నామన్నారు. బ్లాక్ చైన్ టెక్నాలజీ వినియోగంలో ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి సిద్దంగా ఉన్నామని, ఏపీలో ఉన్న పాలసీలు, రాయితీలు గురించి అధ్యయనం చేసి కంపెనీ ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

ఫాల్కన్ ఎక్స్ ఇంక్యూబేటర్‌ను ప్రారంభించిన మంత్రి లోకేష్



స్టార్టప్ కంపెనీలకు ఫాల్కన్ ఎక్స్ వేదిక కాబోతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సాహం ఇచ్చేందుకు ఎన్నారైలు శాన్ ఫ్రాన్సిస్కోలో ఏర్పాటు చేసిన ఫాల్కన్ ఎక్స్ ఇంక్యూబేటర్‌ని మంత్రి లోకేష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2050నాటికి ప్రపంచంతోనే పోటీ పడాలని లక్ష్యంగా పెట్టుకున్నామని టెక్నాలజీ గ్రామాల అభివృద్ధికి ఉపయోగ పడాలని ప్రజలకు మెరుగైన సేవలు అందించేవిధంగా పనిచేస్తున్నామన్నారు. సర్టిఫికెట్ లెస్ గవర్నమెంట్ తీసుకొస్తున్నామని, విజిబుల్ గవర్నెన్స్, ఇన్విజిబుల్ గవర్నమెంట్ తీసుకరావటం కోసం ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఏపీలో ఉన్న స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సాహం ఇచ్చి సిలికాన్ వ్యాలీలో కంపెనీలు ఏర్పాటు చేసేలా ఫాల్కన్ ఎక్స్ పూర్తి సహకారమి స్తుందన్నారు. అలాగే అమెరికాలో ఉన్న ఎన్నారైలు స్టార్టప్ కంపెనీలు ఏర్పాటు చేసేందుకు వేదిక కాబోతుందని, సిలికాన్ వ్యాలీలో ఉండే స్టార్టప్ వాతావరణం ఏపీలో తీసుకొచ్చేందుకు ఫాల్కన్ ఎక్స్ కృషిచేస్తోందన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ద్వారా విద్యార్థి దశ నుండే స్టార్టప్ కల్చర్ పెంచడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఏపీ 2022 నాటికి దేశంలో అభివృద్ధి చెందిన మొదటి మూడు రాష్ట్రాలలో ఒకటిగా, 2029నాటికి దేశంలో నెంబర్ వన్ స్థానంలో ఉండే విధంగా పనిచేస్తున్నామన్నారు.

ఎన్నారైలూ భాగస్వామ్యం కండి

వీడియోకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు



ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ఎన్నారైలంతా భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మంగళవారం ఫాల్కన్ ఎక్స్ ఇంక్యుబేటర్ ప్రారంభోత్సవం సందర్భంగా ఎన్నారైలతో ముఖ్యమంత్రి చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌ను ఇన్నోవేషన్ వ్యాలీగా తయారుచేయడానికి జీ టెన్ గ్రూపు ఏర్పాటు చేశామన్నారు. జీ టెన్ గ్రూప్ ఆధ్వర్యంలో ఫాల్కన్ ఎక్స్ ఇంక్యూబేటర్ ప్రారంభమైందని, ఏపీలో ఉన్న ప్రతి వ్యక్తి ఆంధ్రా పెన్యూర్‌గా మారడానికి ఫాల్కన్ ఎక్స్ ఇంక్యూబేటర్ దోహదపడాలన్నారు. రియల్ టైం గవర్నెన్స్ ద్వారా ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నామని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఫైబర్ నెట్ ఏర్పాటు చేశామన్నారు. అధునాత టెక్నాలజీ వినియోగిస్తున్నామని, ఎన్ని సమస్యలు ఉన్నా రెంకెంల వృద్ధి సాధించామన్నారు. వ్యవసాయంలో టెక్నాలజీ వినియోగం ద్వారా పెద్ద ఎత్తున వృద్ధి సాధించగలిగామన్నారు.

గాజువాక స్థలాల క్రమబద్ధీకరణకు ఓకే



అమరావతి, ఆంధ్రప్రభ: గాజువాక పరిధిలోని స్థలాలను క్రయవిక్రయాలు చేసేందుకు కాలపరిమితిని 2 సంవత్సరాలకు తగ్గించాలన్న స్థానిక ప్రజల విజ్ఞప్తికి మంత్రివర్గ ఉపసంఘం సానుకూలంగా స్పందించింది. క్రయవిక్రయాల చేసేందుకు కాలపరిమితిని 2 సంవత్సరాలకు తగ్గించాలన్న స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. క్రయవిక్రయాల కాలపరిమితిని తగ్గిస్తూ ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని అధికారులను ఆదేశించింది. సచివాలయం వేదికగా జరిగిన ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి కేఈ.కృష్ణమూర్తితో పాటు ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్ సింగ్, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు, విశాఖపట్నం స్థానిక టిడిపి ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. విశాఖపట్నం జిల్లా గాజువాక పరిధిలో ప్రభుత్వం జారీ చేసిన జీవో 301 ప్రకారం స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న అర్జీలలో, ఇప్పటి వరకు మొత్తం 7,407 దరఖాస్తులను ఆమోదించడం జరిగింది. అయితే సదరు ఉత్తర్వులలో క్రమబద్ధీకరించిన స్థలాలను క్రయవిక్రయాలు జరపడానికి 5 సంవత్సరాల కాలపరిమితిని విధించారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా అభ్యంతరం లేని ఆక్రమణలో గల ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరిచేందుకు ప్రభుత్వం జీవో 388 జారీ చేసింది. ఈ జీవో మేరకు క్రమబద్ధీకరించిన స్థలాలను క్రయ విక్రయం చేయడానికి 2 సంవత్సరాల కాలపరిమితిని విధించారు. సదరు జీవోలో పొందుపర్చిన విధంగా గాజువాక స్థలాల విషయంలో క్రయవిక్రయాలు చేసేందుకు ప్రస్తుతం ఉన్న 5 సంవత్సరాల కాలపరిమితిని 2 సంవత్సరాలకు తగ్గించాలన్న స్థానిక ప్రజా ప్రతినిధుల, సామాన్య ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని, మంత్రి వర్గ ఉపసంఘం ఈ అంశాన్ని చర్చించి జీవో 301కి సవరణ చేయడానికి ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. అంతేకాక క్రమబద్ధీకరణ చేయబడిన స్థలాలను తనఖా పెట్టుకొనుటకు అనుమతించాలని ప్రభుత్వానికి సిఫారసు చేస్తూ మంత్రి వర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుంది. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న 388 జీవోకు కూడా క్రమబద్ధీకరణ చేయబడిన స్థలాలను నఖా పెట్టుకొనుటకు అనుమతించాలని ప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా అభ్యంతరం లేని ఆక్రమణలో గల ప్రభుత్వ స్థలాలు క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం జీవో 388 మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు ఎన్ని అర్జీలు వచ్చాయి. ఎన్ని పరిష్కరించారు. ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి అనే విషయంపై సమగ్ర సమాచారం అందించాలని మంత్రి వర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది.

కేంద్ర బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వ ఆశలు

అమరావతి, ఆంధ్రప్రభ బ్యూరో: ఆంధ్రప్రదేశ్ అధిక వృద్ధి రేటు సాధించడంలో కేంద్ర ప్రభుత్వం విభజన హామీల అమలు పాత్ర ఏమీ లేదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా రాబోయే కేంద్ర బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం అధిక అంచనాలు పెట్టుకుంది. జాతీయ వృద్ధి రేటు 7.5 శాతానికిపైగా ఉండగా, రాష్ట్రప్రభుత్వం వృద్ధి రేటు 11.34 శాతం వద్ద ఉన్నందున రాబోయే కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి పెద్దగా కేటాయింపులు ఉండకపోవచ్చని ఒక ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ విషయమై ఢిల్లీలోని రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి కంభంపాటి రామ్మోహన రావు 'ఆంధ్రప్రభ'తో ప్రత్యేకంగా మాట్లాడుతూ, రాష్ట్ర వృద్ధి రేటు పెరగడానికి, కేంద్రం బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవచ్చు అనే అంశాలకు సంబంధం లేదని చెప్పారు. తాము ఈ రెండు అంశాలను వేరువేరుగా చూస్తున్నామని చెప్పారు. లోటు బడ్జెట్‌తో మన రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని గురించి కేంద్రానికి వివరిస్తున్నామని చెప్పారు. విభజన సమయంలో ఏపీకు ఇచ్చిన హామీలను తూ.చ.తప్పకుండా అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని స్పష్టంచేశారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఇతర అంశాలతోపాటు రూ. 16 వేల కోట్లు మరియు ఇతర లోటులను కేంద్రం భర్తీ చేస్తుందని తాము ఆశిస్తున్నట్లు చెప్పారు. విభజన చట్టంలోని హామీలు నెరవేర్చే అంశంలో కేంద్రం ఆశించిన స్థాయిలో స్పందించలేదన్నారు. రూ. 16 వేల కోట్ల లోటు బడ్జెట్ పూడ్చాల్సి ఉండగా, కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం ఇప్పటి వరకూ రూ. 3,500 కోట్లు మాత్రమే మంజూరు చేసిందన్నారు. అయితే, తాజాగా లోటు బడ్జెను రూ, 7,500 కు కుదించారని, ఆ దామాషా ప్రకారం కూడా మిగి లిన మొత్తాన్ని అందించలేదన్నారు.

విశాఖ ట్రెజరీలో సిట్ రికార్డులు భద్రం



విశాఖపట్నం, ప్రభ న్యూస్: విశాఖలో ప్రకంపనలు సృష్టించిన భూముల కుంభకోణాలకు సంబంధించి సిట్ విచారణ పూర్తి చేసింది. ఈ మేరకు సిట్ బృందం తయారు చేసిన నివేదికను సంబంధిత అధికారులు నగర పోలీస్ కమిషనర్ యోగానంద్‌కు అందజేశారు. తదుపరి సిట్ రికార్డులు మంగళవారం కలెక్టరాఫీసు ప్రాంగణంలోని ఖజానాశాఖ కార్యాలయానికి రాత్రి 9.30 గంటలకు తీసుకువచ్చారు. 11 బాక్సుల్లో వీటిని భధ్రపరిచారు. విచారణ రికార్డులను ఖజానాశాఖ కార్యాలయంలో భద్రపరచాలని సిట్‌కి పోలీస్ కమిషనర్ టి.యోగానంద్ లేఖ రాయగా సంబంధిత అధికారులు ఈ విధమైన చర్యలు చేపట్టారు. దీంతో అక్కడ భద్రతాపరమైన అంశాలను అధికారులు పరిశీలించారు. పోలీస్ కమిషనర్‌కి సిట్ హెడ్ వినీత్ బ్రిజ్‌లాల్, జేసీ జి.సృజనలు సోమవారం నివేదికను అందజేయగా మంగళవారం రికార్డులు భద్రపరిచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతీ పిటిషన్‌కీ ఒక్కో ఫైలును రూపొందించారు. రికార్డుల్ని పెన్ డ్రైవ్‌లు, సీడీల రూపంలో కూడా భద్రపరిచారు. 314 అర్జీలు, 68 ఎన్‌ఓసీలపై జరిపిన విచారణ ఫైళ్లను ఇనుప పెట్టెల్లో భద్రపరిచి సీళ్లు వేశారు. సిట్ సిఫారసుల ఆధారంగా చర్యలకు రంగంలోకి దిగినప్పుడు పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఈ ఫైళ్లు అందుబాటులో ఉంచుతారు. సిట్‌లో విధులు నిర్వహించిన అధికారులు, ఉద్యోగులను మంగళవారం బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు. అతిథి గృహాన్ని జలవనరులశాఖకు, కంప్యూటర్లు, ఫర్నిచర్‌ని కలెక్టరాఫీసుకు అప్పగించారు. అయితే సిట్ నివేదికను ప్రభుత్వానికి అందజేయడంతో ఇప్పుడు అక్రమార్కులు చుట్టూ ఉచ్చు బిగుసుకోనుంది. కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు అక్రమాలకు పాల్పడినట్లు సిట్ బృందం నిర్ధారించడంతో ఇప్పుడు ప్రభుత్వ పరంగా చర్యలు ఏ విధంగా ఉంటాయన్నది ఆయా వర్గాల్లో ఆసక్తిగా మారింది.


ఎస్ఆర్ఆర్ కాలేజీ స్థలం కాపాడేందుకు
విద్యార్థుల ఆందోళన



అమరావతి, ఆంధ్రప్రభ: విజయవాడ నగరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలకు చెందిన 6.67 ఎకరాల స్థలం ఆక్రమణపై ఉద్యమం ఊపందుకుంది. ఆక్రమిత స్థలాల కోసం కొద్ది రోజులుగా పూర్వ విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. తాజాగా కళాశాలకు చెందిన సుమారు రెండువేల మంది పూర్వ విద్యార్థులు మంగళవారం మూకుమ్మడిగా ఆందోళనకు దిగారు. విద్యార్థుల ఉద్యమానికి రాజకీయపక్షాల నేతలు మద్ధతు పలికారు. 1937లో కళాశాలకు నూజివీడు జమిందార్ శ్రీరాజా రంగయ్యప్పారావు 7 ఎకరాల స్థలాన్ని ఇచ్చారు. 1945లో చుండూరు వెంకటరెడ్డి కళాశాల అభివృద్ధి చేశారు. అప్పట్లోనే రాజా రంగయ్యప్పారావు కళాశాల వెనుకభాగంలో ఉన్న 6.67 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసి కళాశాల అభివృద్ధి నిమిత్తం ఇచ్చారు. 1954లో ఒక వ్యక్తి ఈ స్థలాన్ని వ్యవసాయ అవసరాల నిమిత్తం కౌలుకు తీసుకున్నారు. ఖాళీ చేయాల్సిందిగా కళాశాల యాజమాన్యం కోరింది. దీంతో కౌలుదారు అడ్డం తిరిగాడు. కొందరు అవినీతి అధికారుల అండదండలతో దొంగపట్టాలు పుట్టించాడు. ఆక్రమిత స్థలంలో ఇటీవలే అక్రమ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కళాశాల స్థలాన్ని కాపాడుకొనే క్రమంలో పెద్ద సంఖ్యలో పూర్వ విద్యార్థులు ఆందోళనకు దిగడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి శాంతింప చేశారు. కాలేజీ స్థలం రక్షించుకునేందుకు రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామంటూ హెచ్చరించారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి..

మంత్రి శిద్దారాఘవరావు



అమరావతి, ఆంధ్రప్రభ: విద్యార్థులు చిన్ననాటి నుండి లక్ష్యంతో ముందుకు వెళ్లాలని రాష్ట్ర అటవీశాఖ మంత్రి శిద్దారాఘవరావు అన్నారు. మంగళవారం చీమకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983-84 పూర్వ విద్యార్థులు నిర్మించిన కళాప్రాంగణంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శిద్దారాఘవరావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ జన్మభూమి రుణము తీర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చీమకుర్తి నగర పంచాయతీ చైర్మన్ కె. రాఘవరావు, వైస్ చైర్మన్ కె. గంగాధర, జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్బారావు, డా. బి. జవహర్, పూర్వ విద్యార్థులు శిద్దా కాశీవిశ్వరరావు, అమినేని వెంగన్న, చాల్లా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం ఎయిర్‌పోర్టుపై ప్రధానికి ఫిర్యాదు

• తెలుగులోనే పేర్కొన్న అంశాలు • వైకాపా నేత బొత్స సత్యనారాయణ లేఖాస్త్రం



విశాఖపట్నం, ప్రభన్యూస్: కాంగ్రెస్ పార్టీలో సీనియర్ మంత్రిగా వ్యవహరించి ప్రస్తుతం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతగా ఉన్న బొత్స సత్యనారాయణ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఓ లేకాస్త్రం సంధించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించిన కొన్ని అంశాలను ప్రస్తావిస్తున్నానని చెబుతూ తొలి పేరాలో తనను తాను పరిచయం చేసుకున్నారు. విజయనగరం వాసిగా 13వ లోక్‌సభకు ఎన్నికైన ఎంపీగా, పదేళ్ల పాటు ఉమ్మడి క్యాబినెట్‌లో మంత్రిగా, పీసీసీ అధ్యక్షునిగా వ్యవహరించిన తాను ప్రస్తుతం వైకాపాలో సీనియర్ నాయకుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నానని విశదపరుచుకున్నారు. కోస్తాంధ్రలోని ఐదు జిల్లాల్లో అధికారికి రాజధాని విశాఖ అంటూ, ఇక్కడ ఉన్న విమానాశ్రయం నౌకాదళం హయాంలో ఉందన్నారు. పరిసరాల్లో మరో గ్రీన్ ఫీల్డు విమానాశ్రయం నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2013లో పరిశీలించి విజయనగరం జిల్లాలోని భోగాపురం లో నిర్ణయించగా ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా 2015 జూన్‌లో అనుమతిచ్చిందని ఆ లేఖలో పేర్కొన్నారు. కొత్త విమానాశ్రయాన్ని కట్టేందుకు ప్రాజక్టు నిర్మాణ ప్రతిపాదన 2016 జులైలో వచ్చిందన్నారు. నిర్మాణానికి రెండే రెండు బిడ్‌లు ముందుకు వచ్చాయని, ప్రభుత్వ రంగంలోని ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ప్రభుత్వ సంస్థ రాబడిలో 30.2 శాతం వాటా ఇస్తానని, , ప్రయివేట్ సంస్థ 21.6 శాతం వాటా ఇస్తానని బిడ్‌లు దాఖలు చేయగా 2017 ఆగస్టులో తెరిచారని ప్రకటించారు. అయితే 2018 జనవరి 21న రాష్ట్ర క్యాబినెట్ ఈ బిడ్‌లను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుని పీపీపీ ద్వారా విమానాశ్రయం నిర్మించేందుకు నిర్ణయించినట్లుగ ప్రకటించారని తెలియజేశారు. ప్రభుత్వ బిడ్ ద్వారా వచ్చే రాబడి ప్రభుత్వ ఖజానాకు బాగున్నా సాకులు అల్లి దాన్ని రద్దు చేసిన రాష్ట్ర ప్రభుత్వం తీరు గమనించాలని లేఖలో బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. ప్రభుత్వ సంస్థ ద్వారా లంచాలు రావనే ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్లుగా ఆయన భావించారు. ప్రభుత్వం ఇంత దుర్మార్గం చేస్తేకేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజు అభ్యంతరం చెప్పకుండా తనకే మీ పట్టనట్లుగా ఉన్నారని ఆరోపించారు. జిల్లా ప్రయోజనాలనూ, నియోజక వర్గ ప్రయోజనాలనూ ప్రాతినిధ్యం వహించే మంత్రిత్వ శాఖ ప్రయోజనాలనూ పట్టించుకోని వ్యక్తి అశోక్ గజపతిరాజు క్యాబినెట్‌లో కొనసాగడం దురదృష్టకరం అని పేర్కొన్నారు. ఈ నేపద్యంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాకు బిడ్ అవార్డు చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని బొత్స సత్యనారాయణ లేఖలో కోరారు. అలాగే, ఈ బిడ్‌ను రద్దు చేసే నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వంపైనా, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిపైనా చర్యలు తీసుకోవాలని ఇది ప్రజా ప్రయోజనార్ధం మీ ముందుకు తీసుకు వస్తున్న అంశమని లేఖలో బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. లేఖ సారాంశం మొత్తం తెలుగు భాషలోనే పేర్కొన్నారు.

మహాత్ముని వర్ధంతిని
అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా పాటిస్తున్నాం

అమరావతి, ఆంధ్రప్రభ: మహాత్మాగాంధీ వర్ధంతిని దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల సంస్మరణ దినంగా పాటిస్తున్నామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీసీనియర్ నేత బొత్స సత్యనారాయణ తెలిపారు. మహాత్మాగాంధీ 70వ వర్ధంతి కార్యక్రమం విజయవాడలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జరిగింది.

రెండోస్థానంలో వ్యవసాయ రంగం: గాలి ముద్దుకృష్ణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుసరిస్తున్న ప్రగతిశీలక విధానాలతో రాష్ట్ర వ్యవసాయ రంగం జాతీయ స్థాయిలో రెండోస్థానంలో నిలిచిందని తెలుగుదేశం పార్టీ శాసన మండలి సభ్యుడు గాలి ముద్దుకృష్ణమ నాయుడు చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబు ఎంతో కష్ట పడుతుంటే, కాంగ్రెస్ నాయకులు, కలెక్షన్ కింగ్ కేవీపీ రామచంద్రరావు పాదయాత్రలు అంటూ తిరుగుతున్నారని ఆయన దుయ్యబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్, వైకాపాలు అవినీతి చెట్టు కొమ్మలేనని ఎద్దేవా చేశారు.



కోర్టుల మధ్య కాకపుట్టిస్తున్న
కోడి పందెం...!

● హైకోర్టు ఆగ్రహంతో పోలీసు, రెవెన్యూ అధికారుల్లో అలజడి.. ● పందెం రాయుళ్లు.. నేతల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తున్న కోడికూత.. ● కోడిని సుప్రీం కోర్టుకు తీసుకెళ్లిన బీజేపీ నేత.. ● కోడి వాదన హైకోర్టులోనా.. సుప్రీంలోనా..?

ఏలూరు, ప్రభ న్యూస్ : సంక్రాంతి కోడి పందెం ఇక కోర్టుల తోనూ ఢీకొనేందుకు కాలు దువ్వుతోంది. తన సంక్రాంతి సంప్రదాయ కోడి పందెం తగవు తీర్చాలంటే ఏకంగా సుప్రీంకోర్టే తనకు సరైందంటోంది. అందుకే ఇప్పుడు అంతా కోడిపందెం పంచాయితీ హైకోర్టులో జరుగుతుందా..? లేక ఉమ్మడి రాష్ట్రాల అత్యున్నత న్యాయస్థానం హైకోర్టులోనా..? అన్నది ఆసక్తిని పెంచేస్తోంది. చివరకు సాదాసీదా అనుకునే కోడిపందెం వివాదం నేడు అత్యున్నత న్యాయస్థానాల మధ్యనే ప్రతిష్ఠాత్మకంగా మారబోతోంది. సంక్రాంతి కోడి పందెం మజా అంటే ఇంత రేంజ్‌లో ఉంటుందా..! అని నోరెళ్లబెట్టేలా మారింది.. నేరుగా నన్నాపటం మీ తరమా.. ! అంటూ పోలీసు, రెవిన్యూ అధికార యంత్రాంగానికే సవాల్ విసిరేదిగా ఉంది. చివరకు రాష్ట్ర ప్రభుత్వం సైతం ఆసక్తితో కోర్టుల వైపు కోడి తీర్పు ఎలా రాబోతుందా..అంటూ ఉత్కంఠగా చూస్తోంది. ఓ వైపు ఉమ్మడి రాష్ట్రాల ఉన్నత న్యాయస్థానం హైకోర్టు కావడం,మరో వైపున దేశానికే సర్వోన్నత మైన సుప్రీం కోర్టు కావడంతో సంక్రాంతి కోడి పందెం కాక రేపుతోంది. హైకోర్టు నిషేధ ఉత్తర్వులు ఉన్నా సంక్రాంతి కోడి పందెం యథేచ్ఛగా సాగిపోవడంతో రెవిన్యూ, పోలీసు యంత్రాంగానికి కోర్టుల భయం పట్టుకుంది. సంక్రాంతి పందెం ఆపేందుకు అధికారులు శతవిధాలా విఫల యత్నాలు చేశారు. పలువురు బడా రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధుల అండదండలతో సంక్రాంతి పందెం షరా మామూలే అన్నట్లుగా జరిగిపోయింది. మరో మారు బెట్టింగ్ రాయుళ్ల చేతుల్లోని నోట్ల కట్టలు కట్టలు తెంచుకున్నాయి. కాళ్లకు కత్తులు కట్టుకున్న కోళ్లు సై..రా..! అంటూ కాలు దువ్వుకున్నాయి. ఇవి తమ ప్రాణాలను పణంగా పెట్టి మరీ పందెం రాయుళ్ల సంక్రాంతి పంతాన్ని నెగ్గించడం విశేషం . హైకోర్టు ఆంక్షల్ని బేఖాతరు చేస్తూ ఖాకీలను సైతం కంగు తిన్పించిందీ రాజకీయ కోడి కాకి. జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, వివిపీలు పందెం బిరుల్లో రిబ్బన్ కటింగులు చేస్తూ హంగామా చేసారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు వారించినా కాని, అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతి నిధులు కోడి పందెం విషయంలో వెనుకాడలేదు. సానుకూల ప్రకటనలు చేసి పందెం రాయుళ్లతో జై కొట్టించుకుని మురిసిపోయిన నేతలే నేడు కోడి కూత వింటేనే తడబడాల్సిన దుస్తితి నెలకుంది. తాజా హైకోర్టు ఆగ్రహం, ఘాటైన వ్యాఖ్యానాలతో చివరకు తమ పదవులకే ఎక్కడ ముప్పోచ్చి పడ్తుందోననే ఆంధోళనలో పడ్డారు. చివరకు రాజకీయ నేతల తాకిడి తట్టుకోలేక ఆఖరి నిముషంలో చేతులెత్తేసిన యంత్రాంగం సైతం కోర్టు ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరి కావాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. అధికార పార్టీ నేతలు కదా అక్కరకు రాకుంటారా.. అనుకుంటే రేపు అసలకే మోసం వస్తుందేమో అనే సందేహంలో అధికారుల పడిపోయారు. ప్రజా ప్రతినిధులపై కేసులు పెడితే ఓ ఇబ్బంది..లేకుంటే కోర్టుతో చీవాట్లు, చర్యలు తప్పవనే చింతతో వీరు ఎటూ తేల్చుకోలేకున్నారు. చివరకు ఎక్కడైనా సరే అధికారులు..నేతలు ఎదురెదురు పడితే ఏం మాట్లాడుకోవాలో తెలియక పలువురు ముఖాలు చాటేస్తున్నారు. అసలు మూల విరాట్టుల సంగతేంటంటూ జస్టిస్ హుంకరించడంతో ముమ్ముందు ఏం జరగబోతుందా..? అనే ఆందోళనలో పడ్డారు. ప్రధానంగా గతేడాదే తమ తీర్పును అమలు చేయని తహసీల్దార్లు, ఎస్పైలపై చర్యలు తీసుకోకుంటే హైకోర్టు శాంతించేలా లేదని ఉన్నతాధికారులు సమాలోచనలో పడినట్లు తెలుస్తోంది. హైకోర్టు కేసును ఇంత సీరియస్‌గా తీసుకుంటుందని పోలీసు, రెవిన్యూ బాస్‌లు ఏ మాత్రం ఊహించలేకపోయారు. తహసీల్దార్లు, ఎస్పైలపై ముందుగానే కనీస చర్యలు తీసుకుని చేతులు దులుపుకుని ఉంటే నేడీ పరిస్థితి తమకు వచ్చేది కాదన్న భావనలో అధికారులు ఉన్నట్లు సమాచారం. కోర్టులంటే గౌరవం అంటూనే..తమ ఆదేశాలను అధికారులు పాటించడం లేదనే ఆగ్రహంతో న్యాయమూర్తి అధికారుల నిర్లక్ష్యాన్ని ఇక్కడ ఎత్తి చూపడంతో సిఎస్ దినేష్‌కుమార్ సైతం నీళ్లు నమలాల్సి వచ్చింది. జరుగుతున్న సంఘటనలు చూస్తుంటే రెవిన్యూ, పోలీసు అధికారులు తమపై తప్పక చర్యలు ఉంటాయనే ఆలోచనకు వచ్చారు. వెంప ప్రాంతానికి చెందిన కలిదిండి రామచంద్రరాజు అనే వ్యక్తి గతేడాది హైకోర్టులో వేసిన పిల్ తన ప్రతాపాన్ని నేడు ఇందరి మధ్యన సంకట పరిస్థితులు తెచ్చినట్లైందని అంతా ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. దీంతో హైకోర్టు గతేడాది సంక్రాంతి కోడి పందాలకు నోచెప్పేసింది. దీంతోనే భీమవరం ప్రాంతానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, బీజేపీ నేత కనుమూరి రఘురామకృష్ణంరాజు రంగ ప్రవేశం చేశారు. ఈయన ఏకంగా సంప్రదాయ సంక్రాంతి కోడిపందాలను ఆపితే సగటు వ్యక్తి మనోభావాలు, ఆచారాలకు విఘాతం కల్గినట్లేనంటూ సుప్రీంకోర్టు తలుపుల్నే తట్టారు. రాజ్యాంగంలోని పలు సెక్షన్లు, క్లాజులను లేవనెత్తుతూ సుప్రీంలో తనదైన వాదనలు లేవనెత్తారు. దీనికి పరోక్షంగా కత్తులు కట్టని ఢింకీ పందాలుకు సుప్రీం కోర్టు సానుకూలంగాస్పందించిందని రఘురాకృష్ణంరాజు చెబుతున్నారు. సుప్రీం కోర్టుకు కోడిపందెం వివాదంపై వెళ్లడంతో జిల్లా వ్యాప్తంగా అందరి చూపూ ఈయనపై పడింది. సంప్రదాయ సంక్రాంతి కోడి పందెం ఉంది కాబట్టే మేలురకం కోడిపుంజు జాతి ఇంకా సజీవంగా ఉందంటున్నారు. లేకుంటే మేలు రకం కోడిపుంజు జాతి కూర దాకలో మగ్గి మరుగైపోయేదని రఘురామకృష్ణంరాజు భావన. బెట్టింగులు పేరుతో సంప్రదాయ కోడి క్రీడనే బలి చేసేయడం ఏ మేరకు కరెక్టంటూ ఎదురు ప్రశ్నిస్తున్నారు. తమకు ఓటేసి గెలిపించిన ప్రభుత్వాలు ప్రజల మనోభావాలకు అనుగుణంగానే ఆలోచించాలం టున్నారు. అవసరమైతే సంప్రదాయ ప్రత్యేక ఆర్డినెన్సు తీసుకురావాలని ఏపీ సర్కారును కోరుతున్నారు. తాజాగా సిఎస్ దినేష్‌కుమార్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయాన్ని ఆంధ్రప్రభ ప్రతినిధి రఘురామకృష్ణంరాజు దృష్టికి తీసుకువెళ్ళారు. కోడిపందాల వివాదం ఇప్పటికే సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్నందున హైకోర్టులో ఏ విధమైన వాదనలు ఇక్కడ జరగబోవం టున్నారు. ఈ మేరకు తన లాయర్ అజయ్‌తో గత శుక్రవారమే హైకోర్టుని ఆశ్రయించామని, సుప్రీం కోర్టులో కోడి పందెం వివాదం పెండింగ్‌లో ఉన్నందున దీన్నిపై కోర్టులోనే తేల్చుకుంటామని, దీనికి సంబందించి ఇప్పటికే కేసు నెంబరు సైతం వచ్చిందని ఆయన చెబుతున్నారు. సుప్రీం కోర్టులో ఏ క్షణాన్నైనా ఇది విచారణకు రావచ్చన్నారు. సంక్రాంతి కోడి పందెం వివాదం పరోక్షంగా కోర్టుల మధ్య కూడా కాకను పుట్టించేదిగా మారబోతుం దని భావిస్తు న్నారు. హైకోర్టు ఫిబ్రవరి 12కు కోడి పందెం వివాదాన్ని వాయిదా వేసింది. ఈ లోగా సుప్రీంలో కేసు విచారణకు వస్తే సరే..లేకుంటే హైకోర్టు రియాక్షన్ ఏ హఠాత్ పరిణామాలకు దారి తీస్తుందన్నది ఆసక్తిగా మారుతోంది. ఏదేమైనప్పటికీ సంక్రాంతి కోడి పందెం పంచాయితీని సుప్రీం కోర్టు దాకా తీసుకువెళ్లిన రఘురామకృష్ణం రాజు రాష్ట్రవ్యాప్తంగానే మరో మారు వార్తల్లో వ్యక్తిగా మారారు.

నిబంధనలకు అనుగుణంగా
ఉంటేనే అనుమతులు

సీఆర్డీఏ డైరెక్టర్ నాగసుందరి

అమరావతి,ఆంధ్రప్రభ: నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే భవన నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నామని ఏపీసీఆర్డీఏ డెవలప్‌మెంట్ ప్రమోషన్ విభాగం డైరెక్టర్ కె. నాగసుందరి తెలిపారు. సీఆర్డీఏ కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు ప్రతి మంగళవారం అమరావతి రాజధాని గ్రామాల వారికి ప్రత్యేకంగా చేపట్టిన ఓపెన్ ఫోరం కార్యక్రమాన్ని తుళ్లూరులో నిర్వహించామని ఆమె తెలిపారు. రెండు దరఖాస్తులకు అప్పటికప్పుడే ప్రాథమిక అనుమతి మంజూరు చేసినట్లు తెలిపారు. అన్ని నిబంధనలను పాటించిన వారికి దరఖాస్తులు పరిశీలించి అప్పటికప్పుడే అనుమతులను మంజూరు చేయడం జరుగుతుందని చెప్పారు. రాజధాని గ్రామాల పరిధిలో భవన నిర్మాణ అనుమతుల కోసం ఎక్కువ దరఖాస్తులు వచ్చిన గ్రామంలో ప్రతి మంగళవారం ఓపెన్ ఫోరం నిర్వహిస్తామని తెలిపారు. విజయవాడ ఏపీసీఆర్డీఏ కార్యాలయంలో ఎప్పటిలాగే ప్రతి శుక్రవారం ఓపెన్ ఫోరం జరుగుతుందన్నారు. మంగళవారం నాడు తుళ్లూరులో నిర్వహించిన ఓపెన్ ఫోరంలో మొత్తం మూడు దరఖాస్తులు వచ్చాయని, నిబంధనలకు అనుగుణంగా ఉన్న రెండు భవన నిర్మాణ దరఖాస్తులను అప్పటికప్పుడే ఆమోదించి ప్రాథమిక అనుమతి పత్రాలు అందించామన్నారు. మరో దరఖాస్తుకు అదనపుసమాచారం కోరడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ ప్లానింగ్ ఆఫీసర్ జి. నాగేశ్వరరావు, జోనల్ డిప్యూటీ డైరెక్టర్ కె. హిమబిందు, జోనల్ అసిస్టెంట్ డైరెక్టర్ జుబిన్ సి. రాయ్, అసిస్టెంట్ ప్లానర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

అనుమతి లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై ఏపీసీఆర్డీఏ ఉక్కుపాదం మోపుతోంది. కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు ముందుగా చట్ట ప్రకారం



ఓపెన్ ఫోరంలో దరఖాస్తుల పరిశీలన

సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేసి కూల్చివేతకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీసీఆర్డీఏ డెవలప్మెంట్ ప్రమోషన్ విభాగం డైరెక్టర్ కె. నాగసుందరి తెలిపారు. పోరంకిలో అనుమతి లేకుండా నిర్మించిన ఎనిమిది కట్టడాలను అధికారులు మంగళవారం కూల్చివేశారు. ఎనిమిది భవనాలకు జి ప్లస్ టూ నిర్మాణానికి అనుమతి తీసుకుని అదనంగా ఫ్లోర్ శ్లాబులు, పిల్లర్లు నిర్మించడంతో వాటిని అధికారులు కూల్చివేయడం జరిగిందని నాగసుందరి తెలిపారు.

నిబంధనలకు అనుగుణంగా అనుమతి తీసుకుని వాస్తవమే నిర్మాణాలు చేపట్టాలని నాగసుందరి నిర్మాణ దారులకు సూచించారు. అధికారులు భవన నిర్మాణ నిబంధనలు, అనుమతులపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అనుమతిలేని నిర్మాణాల కూల్చివేతల కార్యక్రమంలో ఏపీసీఆర్డీఏ జోనల్ అసిస్టెంట్ డైరెక్టర్ గుమ్మడి ప్రసాదరావు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు బి. వెంకటేష్, వంశీకృష్ణ, స్టాలిన్ రాజేష్, అనిల్ కుమార్, సర్వేయర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ జాప్యంపై ప్రజల్లోకి: కొలనుకొండ

అమరావతి, ఆంధ్రప్రభ: కనక దుర్గ గుడి వద్ద నిర్మిస్తున్న ఫ్లైవర్ నిర్మాణ జాప్యంపై ప్రజల్లోకి వెళ్తామని, కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి కొలనుకొండ శివాజీ హెచ్చరించారు. నిర్మాణం పూర్తయేంత వరకు ద్విచక్ర వాహనాలకు, పాదచారులకు అనుమతించాలని అధికారులను ఆయన కోరారు. 2016లో కృష్ణా నదికి పుష్కరాలు వచ్చాయని, దానికి కొన్ని నెలల ముందు దుర్గగుడి ఫ్లైవర్ పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అట్టహాసంగా ప్రారంభించారన్నారు. పుష్కరాలకు విజయవాడకు తరలి వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, ఆలోగానే ఫ్లైవర్ పూర్తి చేస్తామని చంద్రబాబు నాయుడు, నితిన్ గడ్కరీలు ప్రకటనలు గుప్పించినా.. పుష్కరాల సమయంలో ప్రజలు పడ్డ అవస్థలు అన్నీఇన్నీ కాదని, ఒక్క ఫ్లైవర్ ను ప్రభుత్వం సకాలంలో పూర్తి చేయించలేకపోయిందని శివాజీ ఒక ప్రకటనలో విమర్శించారు. ఒక వంతెన నిర్మాణం విషయంలో ఇంత అసమర్ధంగా ఉంటే.. కృష్ణా నదిపై ప్రకాశం బ్యారేజీ తరహాలో మరో రెండు ఐకానిక్ వంతెనలు నిర్మిస్తామనడం జనానికి చెవిలో పువ్వు పెట్టడమేనన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి రెండో తేదిన కుమ్మరిపాలెం సెంటర్‌లో భారీ ఎత్తున ధర్నా నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

అప్పు తీర్చకుంటే ఆత్మహత్యే శరణ్యం

సచివాలయం వద్ద కేశవరెడ్డి బాధితుడి ఆక్రోశం



సచివాలయం వద్ద కేశవరెడ్డి బాధిత కుటుంబం

అమరావతి, ఆంధ్రప్రభ : తమ వద్ద తీసుకున్న అప్పు తీర్చకుంటే ఆత్మహత్యే శరణ్యమని కేశవరెడ్డి విద్యాసంస్థల బాధితుడు గంగుల శ్రీనివాసరెడ్డి కుటుంబం మంగళవారం సచివాలయం వద్ద మీడియా ముందు వాపోయారు. నాలుగు రోజుల్లో తమ వద్ద తీసుకున్న డబ్బులు చెల్లించకపోతే కుటుంబ సమేతంగా ప్రకాశం బ్యారేజ్ వద్ద ఆత్మహత్యకు పాల్పడతానని హెచ్చరించారు. తమ ఆత్మహత్యకు కారణం కేశవరెడ్డి వియ్యంకుడు మంత్రి ఆదినారాయణ రెడ్డి, రాజగోపాల్ రెడ్డిలే కారణమని బాధితులు ఆరోపించారు. డబ్బుల విషయమై గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలవడానికి ప్రయత్నించగా అడ్డుకున్నారని ఆ సమయంలో తాను ఆత్మహత్యకు పాల్పడబోగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే ఇప్పటి వరకు సమస్య పరిష్కారం కాలేదని సోమవారం సీఎంను కలిసేందుకు ప్రయత్నించగా రక్షణ సిబ్బంది అనుమతించలేదని మంగళవారం సీఎంను కలిసేందుకు సచివాలయం వచ్చినట్లు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీనివాస్ రెడ్డితో పాటు ఆయన భార్య హైమావతి, పిల్లలు ముగ్గురు సచివాలయంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించగా సిబ్బంది అనుమతించలేదు.

అప్పుతో సంబంధం లేదు .. మంత్రి ఆదినారాయణ రెడ్డి

కేశవరెడ్డి అప్పుతో తనకు ఎలాంటి సంబంధం లేదని మార్కెటింగ్‌శాఖ మంత్రి ఆదినారాయణ రెడ్డి స్పష్టం చేశారు. కేశవరెడ్డి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని తనకు ఈ విషయంలో ఎలాంటి జోక్యం లేదన్నారు. బాధితుడు చేసిన ఆరోపణను ఆయన ఖండించారు.

నన్నూరులో మద్యం షాపుపై మహిళల దాడి



మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న మహిళలు

ఓర్వకల్, ప్రభ న్యూస్: కర్నూలు జిల్లా ఓర్వకల్ మండల పరిధిలోని నన్నూరులో గ్రామంలో ఉన్న మోక్షిత్ మద్యం దుకాణంపై మహిళలు సీపీఎం ఆధ్వర్యంలో దాడి చేశారు. గత కొన్ని రోజులుగా గ్రామంలో మద్యం షాపులు తొలగించాలని మహిళలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా అధికారులు నాయకులు దుకాణం తొలగిస్తామని ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. మద్యం దుకాణం అలాగే కొనసాగు తోంది. మహిళలకు ఇబ్బంది కరంగా మారడంతో సిపిఎం నాయకులు రామకృష్ణ నాగన్న, షాజహాన్, ఐద్వా మహిళా సంఘం ఉపాధ్యక్షులు ప్రమీల ఆధ్వర్యంలో గ్రామమహిళలు మోక్షిత్ మద్యం దుకాణంపై మూకుమ్మడిగా దాడి చేశారు. రాళ్లతో దాడి చేయడంతో సిబ్బందికి గాయాలయ్యాయి. మద్యం దుకాణంలో ఉన్న మద్యం బాటిళ్లను బయటికి తీసుకవచ్చి పగలగొట్టారు. దీనితో గ్రామంలో గందరగోళ పరిస్థితి నెలకొంది. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ చంద్ర బాబు నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మహిళలను సముదాయించేందుకు ప్రయత్నించగా పోలీసులతో మహిళలు వాగ్వాదానికి దిగారు. దీనితో పోలీసులు ఎక్కడి వారిని అక్కడే చెదరగొట్టి మహిళలను శాంతింప చేసి పంపించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం దుకాణంపై మహిళలు దాడి చేశారని దీనితో ఫర్నిచర్, మద్యంబాటిళ్లు, ధ్వంసమ య్యాయని దాదాపు 2లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగిందన్నారు. సీపీఎం నాయకులు రామకృష్ణ, నాగన్న, షాజహాన్ తోపాటు ప్రమీల, వడ్ల మహాబూబ్‌బాష, మహాబూబ్‌బాష, మరి కొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టుతున్నామన్నారు.

నాయనపల్లిలో తల్లీకూతుళ్ళ ఆత్మహత్య

లేపాక్షి, ప్రభ న్యూస్: అనంతపురం జిల్లా లేపాక్షి మండల పరిధిలోని నాయనపల్లి బీసీ కాలనీలో మంగళవారం ఓ వివాహితతో పాటు ఇద్దరు చిన్నారులకు ఉరివేసి తాను ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం సోమందేపల్లి మండలం చందకచర్ల గ్రామానికి చెందిన కల్పనతో నాయనపల్లికి చెందిన వీరభద్రాచారి 9ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి మేఘన (4), యయశ్విని (3) అనే ఇద్దరు అమ్మాయిలు వున్నారు. కొద్ది నెలలుగా భార్య ప్రవర్తనపై భర్త వీరభద్రాచారికి అనుమానం రావడంతో గట్టిగా మందలించాడు. దీంతో భార్య కల్పన కూడా భర్తతో ఘర్షణ పడేది. ఇది ఇలా వుండగా ఐదు రోజుల క్రితం భార్యాభర్తల మధ్య తీవ్రంగా ఘర్షణ పడ్డారు. దీంతో గ్రామ సర్పంచ్ సదాశివరెడ్డి, గ్రామ పెద్దలు భార్యాభర్తల మధ్య పంచాయితీ చేశారు. కల్పన తన అత్త ఇంటిలో ఉండరాదని తెలుపడంతో వీరభద్రాచారి తల్లిని తన మేనమామ ఇంటికి పంపాడు. గత రెండు రోజులుగా కల్పన తన పిల్లలను పాఠశాలకు పంపలేదు. వీరభద్రాచారి మంగళవారం ఉదయం గార్మెంట్స్ ఫ్యాక్టరీలో పని కోసం వెళ్లాడు. ఆ తరువాత కల్పన తన పిల్లలకు ఉరివేసి తాను ఉరి వేసుకున్నట్లు వుండవచ్చునని కాలనీ వాసులు భావిస్తున్నారు. మరణించిన చిన్నారులను చూసినకాలనీ వాసులు బోరున విలపించారు. వీరభద్రాచారి కన్నీరు మున్నీరుగా విలపించారు. వెంటనే మృతదేహాలను ఎస్ఐ ఆంజనేయులు పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హామీలపై జగన్ స్పష్టతనివ్వాలి: మాజీ ఎంపీ కంభంపాటి

అమరావతి, ఆంధ్రప్రభ : ప్రజా సంకల్పయాత్ర సందర్భంగా విపక్షనేత జగన్ గుప్పిస్తున్న వాగ్దానాలను ఎలా అమలు చేస్తారో స్పష్టతనివ్వాలని మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో టీడీపీ ప్రకటించిన రైతు రుణమాఫీ అసాధ్యమని చెప్పిన జగన్, నేడు తాను చేసున్న అసంబద్ధ వాగ్దానాలను ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అవగాహన లేకుండా వాగ్దానాలు చేస్తారన్న విషయం ప్రజలకు అర్థమవుతోందన్నారు. ప్రతిపక్ష నేతకు సీఎం కావాలన్న కాంక్ష తప్ప ప్రజా సంక్షేమం పట్టదన్నారు. ఆయన పాదయాత్ర కాదని బ్రేక్ యాత్రగా అభివర్ణించారు. టీడీపీ గత ఎన్నికల సమయంలో పొందుపరిచిన మేనిఫెస్టోలోని నిరుద్యోగ భృతి, అన్న క్యాంటీన్‌ల మినహా అన్నింటిని అమలు చేసిందన్నారు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో 65 శాతం సంతృప్తి ఉందని 85 శాతానికి చేరాలని సమన్వయ కమిటీ సమావేశంలో సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. ఎకన మిక్ సర్వే వివరాలను ఆయన మీడియాకు చెప్పారు.

టీడీపీ, బీజేపీ సంకీర్ణ ధర్మాన్ని పాటిస్తూ విభజన హామీల అమలుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తామని కంభంపాటి స్పష్టం చేశారు. పార్లమెంట్ సాక్షిగా ప్రధానమంత్రికి చేసిన వాగ్దానాలను అమలు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. పార్టీ వ్యవహారాలపై సుజనా చౌదరి, అమిత్‌షాలు భేటీ కావడం జరిగిందన్నారు. కేంద్రంతో ఘర్షణ పడి సాధించేదేమి లేదన్నారు. పొత్తుల గురించి పార్టీల అధ్యక్షులు మాట్లాడుకుంటారని కంభంపాటి పేర్కొన్నారు.

తెనాలిలో నంది నాటక మహోత్సవ పోటీలు

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్, థియేటర్ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలోని తెనాలిలో నంది నాటక మహోత్సవ పోటీలను నిర్వహిస్తున్నట్లు సంస్థ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్ మంగళవారం తెలియజేశారు. తెనాలి పట్టణంలోని తెనాలి రామకృష్ణ కవి కళా క్షేత్రంలో ఫిబ్రవరి 2 నుంచి మార్చి 10 వరకు నాటకపోటీలను నిర్వహించనున్నట్లు, ప్రతి నిత్యం ఉదయం 10 గంటలకు నాటక ప్రదర్శనలు ప్రారంభమవుతా యని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి కళాపరిషత్‌లు, నాటక, రంగస్థల కళాకారులు పోటీపడి నటించే ఈ నాటక పోటీలు పూర్తయిన తరువాత విభాగాల వారీగా రాష్ట్రస్థాయి నంది నాటక అవార్డులను ప్రదానం చేయడం జరుగుతుందన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్‌కు
రూ.290 కోట్లు కేటాయించాలి

మంత్రి యనమలకు చైర్మన్ వేమూరి వినతి



అమరావతి, ఆంధ్రప్రభ : రానున్న బడ్జెట్‌లో బ్రాహ్మణ కార్పొరేషన్‌కు 290 కోట్లు కేటాయించాలని ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడిని కార్పొరేషన్ ఛైర్మన్ వేమూరి ఆనందసూర్య కోరారు. సచివాలయం లోని ఆర్థికశాఖ కార్యాలయంలో మంత్రిని ఆనందసూర్య మంగళవారం కలిశారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా సంక్షేమ పథకాల అమలుకు కొత్త బడ్జెట్‌లో 290 కోట్లు కేటాయించాలని కోరినట్లు ఆనందసూర్య తెలిపారు. తమ వినతికి మంత్రి సానుకూలంగా స్పందించారని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంపై రాష్ట్రంలోని బ్రాహ్మణులు అచంచల నమ్మకంతో ఉన్నారని ఆనందసూర్య తెలిపారు. ఆర్థికమంత్రిని కలసిన వారిలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉమా నాగరాజు, జనరల్ మేనేజర్ వెంకటశాస్త్రి కూడా ఉన్నారు.

బ్రాహ్మణులను మోసం చేస్తున్న ఆనందసూర్య

రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేష్ ఛైర్మన్ వేమూరి ఆనందసూర్య బ్రాహ్మణులను మోసం చేస్తున్నారని, మాజీ చైర్మన్ ఐవైఆర్ కృష్ణారావు సమయంలో బ్రాహ్మణులు టీడీపీకి దగ్గరైతే, ప్రస్తుత చైర్మన్ వ్యవహార శైలి వల్ల దూరమవుతున్నారని ఏపి బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కర్రి నాగలక్ష్మి మండిపడ్డారు. మంగళవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ బ్రాహ్మణ కార్పొరేషన్ పథకాలను ప్రస్తుత చైర్మన్ కంటే మాజీ చైర్మన్ ఐవైఆర్ కృష్ణారావే మెరుగ్గా అమలు చేశారని, ఆనందసూర్యకు చేతకాకపోతే చెప్పాలని, తామే ప్రభుత్వాన్ని అడుగుతామన్నారు. రాష్ట్రంలోని బ్రాహ్మణులకు చేయూతని చ్చేందుకు బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని, ఐవైఆర్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్నప్పుడు 4,600 మంది విద్యార్థులకు భారతీ స్కీమ్ కింద లబ్ధి చేకూరిందన్నారు. ప్రస్తుత చైర్మన్ ఆనందసూర్య వచ్చి సంవత్సరకాలం పూర్తి కావస్తున్నప్పటికీ, ఇంతవరకు ఒక్కరికి కూడా స్కాలర్‌షిప్ ఇవ్వలేదని ఆగ్రహించారు. ఈ సంవత్సరంలో మరో 18 వేల మంది ఈ స్కీమ్‌కి దరఖాస్తు చేసుకున్నారని, మరొక నెలలో ఈ విద్యా సంవత్సరం పూర్తి కావస్తున్నప్పటికీ స్కాలర్‌షిప్‌లు విడుదలచేసే దాఖలాలు కనిపించటం లేదన్నారు. చాణక్య స్కీమ్ పథకం కింద 4800 మంది దరఖాస్తు చేసుకోగా ఐవైఆర్ కృష్ణారావు 4380 మందికి నిర్ణయించి 3080 మందికి ఇచ్చారన్నారు. ఆనందసూర్య ఆర్‌బిఎస్‌లో చేరమని ఒత్తిడి తెస్తున్నారని, వారితో బేరసారాలు కుదుర్చుకుని 2017-18 సంవత్సరానికిగాను ఒక వారంలోనే 2 నుంచి 3 వేల మంది చేత దరఖాస్తు చేయించారన్నారు. పాతవాటికి ఇవ్వకుండా కొత్తవాటికి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ, బ్రాహ్మణులను మోసం చేస్తున్న ఆనంద్ సూర్య తక్షణమే స్కీములను విడుదల చేయాలని, లేనిపక్షంలో తామే ప్రభుత్వాన్ని అడుగుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య సభ్యులు ఆచంట సౌజన్య, సూర్యకుమారి పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల సత్యాగ్రహం

పలువురు అరెస్టు

అమరావతి, ఆంధ్రప్రభ; రాష్ట్రవ్యాప్తంగా కార్మిక సంఘాలు చేపట్టిన సత్యాగ్రహం, జైల్ భరో కార్యక్రమంలో వేలది మంది కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నేతలను, కార్మికులను పోలీసులు అరెస్టులు చేశారు. పది కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో సిఐటియు, ఏఐటియుసి, ఐఎన్‌టియుసి, టియుసిసి, వైఎస్ఆర్‌టియు, ఐఎఫ్‌టియు తదితర కేంద్ర కార్మిక సంఘాలు కార్మికులతో కలిసి సత్యగ్రహం పేరుతో ధర్నలు నిర్వహించారు. వేలాది మంది కార్మికులు, వివిధ కేంద్ర కార్మిక సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు స్వచ్ఛందంగా అరెస్టులయ్యారు. విజయవాలో జరిగిన సత్యాగ్రహంలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసుతో సహా పలువురు కార్యకర్తలను పోలీసులు ఆరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల ఆగ్రహాన్ని గ్రహించి కార్మిక సంఘాలతో చర్చలు జరిపి కనీస వేతనం రూ18 వేల రూపాయలతో సహా వివిధ కార్మిక సమస్యలను పరిష్కరిచాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమించడానికి కార్మిక వర్గం సన్నద్ధం కావాలాని ఆయన పిలుపు నిచ్చాయి.

సంపద, పేదరికాల
అనూహ్య కలయిక భారత్

● ప్రగతిశీల దార్శనికుల ఆలోచనల వల్లే దేశాభివృద్ధి: ఎన్వీఎస్ రెడ్డి
● రాజకీయ దృక్పథం లేనందునే వృద్ధి మందగింపు: హనుమాన్ చౌదరి



జ్యోతి ప్రజ్వలన గావిస్తు,,సెమినార్‌కు హాజరైన ప్రముఖులు

అమరావతి, ఆంధ్రప్రభ : భారతదేశం సంపద పేదరికాల అనూహ్య కలయిక కలిగిన అద్భుతమైన దేశంగా హైదరాబాద్ మెట్రో రైల్ ఎండి డాక్టర్ ఎన్వీఎస్ రెడ్డి అభివర్ణించారు. అద్భుతమైన జాతీయ రహదారులు ఒకవైపు, మురికివాడలు మరొకవైపు, ట్రాఫిక్ కష్టాలు ఒక వైపు, ప్రపంచలోనే ఎక్కువ టెలిఫోన్ ట్రాఫిక్ వినియోగం మరొకవైపు, రైతుల ఆత్మహత్యలు ఒకవైపు, వంద ఉపగ్రహాలు ఒకేసారి పంపే సామర్థ్యం మరోవైపు అని మన భారతదేశ పరిస్థితిని డాక్టర్ రెడ్డి వివరించారు. స్థానిక పివిపి సిద్ధార్థ కళాశాలలో ,నవ్యభారత్ సవాళ్ళు వంద కోట్ల ప్రజల ఆశలు, అనే అంశంపై జాతీయ స్థాయి సెమినార్ మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మేనేజింగ్ డైరెక్టర్ (హైదరాబాద్ మెట్రో రైలు) డాక్టర్ ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశ అభివృద్ధికి ఎంతో మంది ప్రగతిశీల దార్శనికుల ఆలోచనలు కారణమని, విద్యార్థులు, అందరూ ఆలోచించే విధగా గాకుండా భిన్నంగా ఆలోచించాలన్నారు. సృజనాత్మకంగా భిన్నంగా ఆలోచించి సవాళ్ళను ఎదుర్కొంటే అతి త్వరితంగా భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందన్నారు. ముఖ్య వక్తగా విచ్చేసిన పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ఐటీ సలహాదారు డాక్టర్ టి.హనుమాన్ చౌదరి మాట్లాడుతూ భారతదేశం ఏడవ అతిపెద్ద ఆర్థిక సంస్థగా రూపాంతరం చెందడంలో వ్యవస్థాపకత ఎంతో విలువైందని తెలిపారు. భారతదేశంలో ఎంతో విలువైన సంపద సృష్టి జరిగిందని, ఐతే సరైన రాజకీయ దృక్పథం లేకపోవడంతో అవినీతి వృథా వ్యయాలు వలన వృద్ధి మందగించిందని తెలిపారు. ఒకప్పుడు భారతదేశం ప్రపంచ దేశాలకి మార్గదర్శకత్వం ఇచ్చిందని, ప్రస్తుతం బానిసత్వ ఆలోచనల నుంచి బయటపడి ప్రపంచానికి తిరిగి మార్గదర్శత్వం ఇచ్చే స్థాయికి ఎదగాలని సూచించారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవడం ఆవశ్యం

అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.రమణమూర్తి మాట్లాడుతూ సానుకూల దృక్పథం, పట్టుదల కలిగిన నిర్వాహకుల అవశ్యకత ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఎంతో ముఖ్య భూమికని పోషిస్తుందని తెలిపారు. నేషనల్ హెచ్‌ఆర్‌టి నెట్‌వర్క్ విజయవాడ ఛాప్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజేష్, సి.జంపాల మాట్లాడుతూ సమస్యలు సహజంగా ఎల్లప్పుడూ వస్తూనే ఉంటాయని అయితే ప్రతి సమస్యని ఒక అవకాశంగా మలచుకునే దృక్పథం కలిగి ఉన్నప్పుడే భవిష్యత్తు అభ్యున్నతి పథంలో ఉంటుందని అన్నారు. విద్యార్థుల వారి సబ్జెక్టుతో పాటుగా సమకాలీన అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. భయాన్నీ వీడి ధైర్యంగా ముందడుగు వేసినప్పుడే విజయం సొంతమవుతుందని అన్నారు.

మిజోరం యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌విఆర్.జ్యోతికుమార్ మాట్లాడుతూ కేవలం విజ్ఞానం వలనే దేశాభివృద్ధి సాధ్యం అని, వ్యక్తిత్వం, విలువలు కలిగి ఉన్నప్పుడే వ్యక్తి తద్వార దేశాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఎల్లప్పుడూ మారుతుండే పని సంస్కృతి పరిసరాలతో సమర్థవంతంగా సర్దుబాటు చేసుకోవడం నేటి యువతకి అత్యంత అవశ్యకమని. తోటి వారిని కుల, మత, ప్రాంత, వర్ణ, జాతి వైవిధ్యాలతో గుర్తించే దురాచారాన్ని రూపుమాపాల న్నారు. సహనంతో వ్యవహరిస్తూ, తోటి వారిని గౌరవిస్తూ, నాయకత్వ లక్షణాలతో ముందుకు వెళ్ళడం నేటి యువతకు అత్యావశ్యకం అని అన్నారు. తాత్కాలికంగా సౌకర్యాలు, సుఖాలను ఇచ్చే ఏ వస్తువూ భవిష్యత్తులో శాశ్వతమైన ఆనందాలని ఇవ్వలేదని తెలియజేశారు. సంపద కొద్ది మంది చేతిలో ఉండి, అందరికి సమానంగా వితరణ జరగకపోవడం ప్రధాన సమస్య అని అన్నారు. జీబీఎస్ టాక్టిరల్ అచీవ్‌మెంట్ సెంటర్ నుంచి విచ్చేసిన జీఎస్.రమేష్ కుమార్ సెమినార్‌కు సంధానకర్తగా వ్యవహరించారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ మాజీ డీన్ ప్రొఫెసర్ ఎమ్.ఐ.సాయి కుమార్ మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ విద్యలు, అనేక మార్పులు తీసుకురావల్సిన అవసరం ఉందని తెలియజేశారు. హార్డ్‌వర్క్‌తో పాటు స్మార్ట్‌వర్క్, నెట్ వర్క్‌ను పెంపొందించుకోవాలని తెలియజేశారు. యాంత్రీకరణ వలన వచ్చే ప్రపంచీకరణ సమస్యలను ఎదుర్కొనే విధంగా విద్యార్థులను తయారు చేసే పాఠ్య ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. అవకాశాలు అందివచ్చినప్పుడు ఎవరైనా నిలబడతారని కానీ సమస్యలు సవాళ్ళు ఎదురైనప్పుడు నిలబడినవాడే నిజమైన నాయకుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, కళాశాల కన్వీనర్ బి.శ్రీరాములు, కళాశాల ప్రిన్సిపల్ కె.శివాజీబాబు పాల్గొన్నారు. సెమినార్ డైరెక్టర్ డాక్టర్ పి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ 50కి పైగా పరిశోధనా పత్రాలు వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్‌లు సమర్పించారని తెలిపారు. విశేష సంఖ్యలో విద్యార్థులు, అధ్యాపకులు, విభాగాధిపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు మూడు చందమామలు

● నేటిరాత్రి ఆకాశంలో కనువిందు
● ఏకబిగిన ఐదు గంటలకు పైగా చంద్రగ్రహణం



ఆకాశంలో చందమామ నేడు మూడు రూపాల్లో మనలకు కనువిందు చేయనున్నాడు. అనడానికి గ్రహణమే అయినా ఒక అద్భుత ప్రపంచం గగనవీధుల్లో నేటి రాత్రి ఆవిష్కారం కానుంది. ఉత్తర అమెరికా వాసులకు 150 సంవత్సరాల తర్వాత, మిగతా ప్రాంతాల వారికి 1982, డిసెంబర్ తర్వాత జాబిల్లిని ఇలా చూసే అవకాశం ఇవాళే లభిస్తున్నది.

గూడూరు, ప్రభన్యూస్: నేడు చంద్రుడు పెరిగి అనగా భూమికి అత్యంత దగ్గరగా వస్తున్నాడు. ఇది సూపర్ మూన్, ఒకేనెలలో రెండవసారి పౌర్ణమి ఏర్పడుతుంది. ఇది బ్లూమూన్ మరియు సంపూర్ణ చంద్రగ్రహణం ఇలా మూడు చిత్రాలు ఒకసారి తటస్థిస్తున్నాయి. ఇలా ప్రత్యేకతను సంతరించుకున్న సంపూర్ణ చంద్రగ్రహణాన్ని చూడడానికి ఖగోళ శాస్త్రవేత్తలు శాస్త్రీయ దృక్పథం ఉన్న ఔత్సాహికులు ఉత్సాహన్ని చూపిస్తున్నారు. ఈ నూతన సంవత్సర ప్రారంభంలో అనగా జనవరి 1 రాత్రి 2018 మరియు ప్రాంతాన్ని బట్టి కొన్ని ప్రాంతాలలో జనవరి 2వ ఉదయాన పౌర్ణమి సంభవించింది. చందమామ సరాసరి ప్రతి 29, 53 రోజులకొకసారి భూమిని చుట్టి వస్తుంది. కాబట్టి కొన్ని ప్రాంతాలలో జనవరి 31 రాత్రి మరికొన్ని ప్రాంతాల్లో ఫిబ్రవరి 1-2018 నాడు సంపూర్ణ చంద్రగ్రహణం సంభవించనుంది. సూపర్ మూన్ సంభవించేది నిజానికి జనవరి 30న అయినప్పటికి జనవరి 31న సంభవించే గ్రహణ సందర్భంలో కూడా సూపర్ మూన్ గా గోచరిస్తుందని నాసా పేర్కొంది.

కొందరికి నిరాశ మిగులనుంది ఎందుకు..

ప్రత్యేకతను సంతరించుకున్న ఈ చంద్రగ్రహణాన్ని చూసే అవకాశం భూమి మీద ఉన్న అందరికి లభించే అవకాశం లేదు. ఎవరైతే జనవరి 2న పౌర్ణమి చూడగలిగారో వారు అంటే తూర్పు ఆసియా, తూర్పు ఆస్ట్రేలియా లాంటి ప్రదేశాలలో రెండు గంటల సమయంతో ఈ సుందర దృశ్యాన్ని చూసే అవకాశాన్ని కోల్పోతున్నారు. అలాంటి కొన్ని ప్రాంతాలలో ఉదాహరణకు పెర్త్ లో ఉదయం 10-30 గంటల వరకు కూడా ఈ గ్రహణాన్ని చూసే అవకాశం ఉన్నట్లు నాసా తెలిపింది.

బ్లూమూన్ అంటే ఏమిటి..ఎన్ని రోజులకొకసారి బ్లూమూన్ సంభవిస్తుంది

ఒకనెలలో రెండు సార్లు పౌర్ణమి సంభవిస్తే రెండవసారి ఏర్పడిన పౌర్ణమి చంద్రుడిని బ్లూమూన్ అంటారు. సరాసరి చంద్రభ్రమణం 29-53 రోజులు కాబట్టి ప్రతి 27 సంవత్సరాల కోమారు సంభవించే అవకాశం ఉంటుంది. అలాగే ప్రతి నెలలో (ఫిబ్రవరి తప్ప) 30 లేదా 31 రోజులుంటాయి కాబట్టి ఏదో ఒక నెలలో బ్లూమూన్ సంభవించే అవకాశం ఉంటుంది. గ్రహణం సూపర్ మూన్ మరియు బ్లూమూన్ మూడూ ఒకేసారి సంభవించడమనేది అరుదైనది.

ప్రతి సంవత్సరం 12 చంద్ర భ్రమ ణాలు ఉంటాయి అలాగే 12 పౌర్ణమిలు మరియు అమావాస్య లు సంభవిస్తాయి కాని 27 సంవత్సరకాలంలో ఒక నెలలో సంభవించే రెండో పౌర్ణమి వలన ఒక సంవత్సరం 13 పౌర్ణమిలు సంభవిస్తాయి. ఈ సంవత్సరం అదే జరుగనుంది అన్నమాట.

సూపర్ మూన్ అంటే ఏమిటి..

ఈ సంవత్సరం జరిగే ఇంకో ప్రత్యేకత ఏంటంటే కొన్ని ప్రదేశాల్లో ఉండే వారికి ఫిబ్రవరి లో ఒక్క పౌర్ణమి కూడా సంభవించకుండా జనవరిలో మరియు మార్చిలో రెండు పౌర్ణమిలు సంభవిస్తున్నాయి అని నాసా తెలియచేసింది. సాధారణంగా చంద్రుడు భూమికి 3,84,400 కిలోమీటర్ల దూరంలో ఉన్నాడు. దాని భ్రమణ సమయంలో అది దీర్ఘవృత్తాకారంలో తిరుగుతంది. కనుక ఈ దూరం మారుతూ ఉంటుంది. అపోజి అనగా భూమికి దూరంగా ఉన్న చోటు, పెరిగి అనగా భూమికి అతి దగ్గరగా ఉన్న చోటు ఏరోజైతే భూమికి దగ్గరగా ఉన్న చోటుకి చంద్రుడు వస్తాడో దానిని సూపర్ మూన్ అంటారు. సూపర్ మూన్ ని అందరూ చూస్తారు. కాని గుర్తించదగినంత దగ్గరగా వచ్చినట్టు ఆకాశ పరిశీలకులందరికి సాధ్యంకాకపోవచ్చు. ఎందుకంటే అది 14 శాతం మాత్రమే పెద్దగా కనిపిస్తుంది. అది గుర్తించ దగినంత పెద్ద ఆకారం కాదుకదా..కాని సూపర్ మూన్ సంభవించినపుడు ఏర్పడే చంద్రగ్రహణం మాత్రం 30 శాతం ఎక్కువ ప్రకాశవంతంగా ఉంటాడు.

చంద్రగ్రహణాలు ప్రతి నెల ఎందుకు ఏర్పడవు..

చంద్రుడు భూమి నీడలోకి రావడాన్నే చంద్రగ్రహణం అంటాం. చంద్రుడు భూమి ఆర్బిట్ తో పోల్చినపుడు కొంచెం వంగి ఉన్నాడు. అందుకని ప్రతి నెల ప్రతి సారి చంద్రుడు, భూమి, సూర్యుడు ఒకే సరళ రేఖలోకి సంభవించే అవకాశం లేదు కనుక చంద్రుడు భూమి నీడలోకి రాడు.

అందరికి ఎందుకు కనపడదు..

చంద్రగ్రహణాన్ని అందరూ చూడలేరు ఎందుకంటే జనవరి 31న సంభవించే సమయానికి ఎవరైతే భూమి రాత్రి భాగంలో ఉంటారో వారే చూడగలుగుతారు. కొన్ని ప్రదేశాలలో చంద్రోదయం సమయంలో మరికొన్ని ప్రదేశాలలో చంద్రాస్తమయ సమయంలో సంభవిస్తుంది. అందుకని అందరికి చూసే అవకాశం ఉండదు.

భారత దేశంలో చంద్రగ్రహణం ఎంతసేపు ఉంటుంది..

భారత దేశంలో సాయంత్రం 4-21 గంటలకు మొదలుకొని రాత్రి 9-38 గంటల వరకు ఉంటుంది. అంటే కొన్ని దేశాలలో లాగానే మన దేశంలో కూడా ప్రారంభ సమయంలో గ్రహణాన్ని చూడలేము కాని చంద్రోదయం సమయానికి చంద్రుడు గ్రహణంలోనే ఉంటాడు కాబట్టి భారత దేశంలోని ప్రజలందరూ ఈ సుందర దృశ్యాన్ని చూసి తరించవచ్చు.

చంద్రోదయ సమయం ః సాయంత్రం 6-27 గంటలకు
సాయంత్రం 4-21 గంటలకు పెనంబ్రల్ గ్రహణం మొదలవుతుంది.
సాయంత్రం 5-18 గంటలకు పాక్షిక చంద్రగ్రహణం మొదలవుతుంది.
సాయంత్రం 6-22 గంటలకు అంబ్రల్ చంద్రగ్రహణం మొదలవుతుంది.
రాత్రి 7-00 గంటలకు సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడుతుంది.
రాత్రి 7-38 గంటలకు సంపూర్ణ చంద్రగ్రహణం పూర్తవుతుంది.
రాత్రి 8-41 గంటలకు పాక్షిక చంద్రగ్రహణం పూర్తవుతంది.
రాత్రి 9-38 గంలకు పెనంబ్రల్ చంద్రగ్రహణం పూర్తవుతుంది

రియల్‌కు ఊపిరి నాలా!

● పారిశ్రామిక వర్గాల్లో చిగురిస్తున్న ఆశలు
● అనువైన స్థలాల కోసం వెతుకులాట
● ప్రధాన నగరాల్లో మొదలైన కొనుగోళ్లు



అమరావతి, ఆంధ్రప్రభ : ఏళ్లుగా నానుతున్న నాలా చట్టం సవరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదం తెలపడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంటోంది. ఇదే అదనుగా పరిశ్రమవర్గాలు కూడా ధృవీకరిస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయంపై రియల్ ఎస్టేట్, పారిశ్రామికవర్గాల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఏపీలోని ప్రధాన నగరాలుగా ఉన్న విశాఖ పట్టణం, విజయవాడ, తిరుపతి, అనంతపురం, కాకినాడ, రాజమండ్రి, నెల్లూరు, గుంటూరు తదితర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు పర్యటనలు మొదలయ్యాయి. ముఖ్యంగా రాజధాని ప్రాంతమైన విజయవాడ, గుంటూరుతోపాటు విశాఖ, తిరుపతి నగరాల్లో అమ్మకాలు, కొనుగోళ్ల ప్రారంభమైనట్లు రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పటివరకు నిబంధనల ప్రకారం వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాలకు అంటే వాణిజ్యపరమైన అవసరాలకు వినియోగించుకోవాలంటే భూమి విలువలో 9 శాతం మేర కన్వర్షన్ ఫీజు చెల్లించాల్సి ఉండేది. పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వంకేటాయించేభూములకూ కూడా కంపెనీలు నాలాఫీజు చెల్లించాల్సివచ్చేది. పలుసందర్భాల్లో ప్రభుత్వం పారిశ్రామికవేత్తల వినతి మేరకు నాలాచార్జీల నుండి కేస్ టు కేస్ ప్రతిపాదిక మినహాయింపులు ఇస్తోందేతప్ప శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోలేదు. నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్న చంద్రబాబు ఈ అంశంపై దృష్టిసారించారు. ఆయన చొరవతో నాలా సవరణ చట్టం బిల్లును గవర్నర్ కూడా ఆమోదించడంతో ఇప్పుడు అమల్లోకి వచ్చింది. దీంతో గత రెండున్నరేళ్లుగా స్తబ్దుగా ఉన్న రియల్ ఎస్టేట్ రంగం ఇప్పుడిప్పుడే మళ్లీ ముందడుగులు వేస్తోంది. విశాఖ, విజయవాడ, తిరుపతి, అనంతపురం వంటి నగరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారుల హడావిడి ప్రారంభమైం ది. పారిశ్రామికవేత్తలు ఆయా ప్రాంతాల్లో తమ తమ సంస్థలను నెలకొల్పేందుకు అనువైన స్థలం కోసం వెతుకుతున్న పరిస్థితి లు కూడా కనిపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా రాజధాని ప్రాంతం లో ఈ పరిస్థితులు ప్రస్ఫుటమైనట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికే అధిక ధరలకు కొనుగోళ్లు చేసి నోట్ల రద్దు తరువాత చతికలపడ్డ రియల్ రంగంతో కుదేలైన వ్యాపారుల కళ్లలో ఆనందం కనిపిస్తోంది. వారి ఆలోచనలకు తగ్గట్లుగానే వారు కూడా అడుగులు వేస్తున్నారు. ఇక భూముల ధరలు కూడా అంతకు మించిన స్థాయిలో కనిపిస్తోంది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, సెమీ అర్బన్ ప్రాంతాల్లో నిత్యం ఖరీదైన భూమి కొనుగోళ్లు చేస్తున్నారు. గతేడాదిన్నర, రెండేళ్లుగా రియల్ రంగం కుదేలైంది. ఇప్పుడిప్పుడే మళ్లీ పిలుపుకుంటోందని రియల్ ఎస్టేట్ రంగంలోని ఒక ప్రముఖ సంస్థకు నిర్వాహకుడు 'ఆంధ్రప్రభ'కు తెలిపారు. నాలా చట్టం సవరణ చేసిన తరువాత తమ సంస్థ ఆధ్వర్యంలో 100కు పైగా డవలప్‌మెంట్ అగ్రిమెంట్లు జరిగినట్లు ఆయన చెప్పారు. ఇక తమ స్థాయిలో నిర్వహించే రియల్ ఎస్టేట్ సంస్థల్లో కూడా అదే తరహాలో ఇంచుమించు డవలప్‌మెంట్ అగ్రిమెంట్లు అయినట్లుగా తెలిసిందన్నారు. చిన్నా, చితక వ్యాపార సంస్థలు కూడా తమ ఆర్థిక కార్య కలాపాలను మొదలు పెట్టాయని చెప్పారు. అయితే, ఈ కదలిక తాత్కాలికమా లేక స్థిరం గా నిలిచి ఉంటుందా అనే దానిపై ఆయన స్పష్టత ఇవ్వలేకపోయా రు. ముఖ్యంగా భవన నిర్మాణ రంగం కన్నా పారిశ్రామిక రంగానికి చెందిన ప్రముఖులు భూములను కొనుగోలు చేసేందుకు వస్తున్నందున ఈ కదలికపై తామేమీ స్పష్టత ఇవ్వలేకపోతున్నామని ఆయన చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలోనే భవన నిర్మాణ రంగం, వెంచర్ల వంటివి కూడా పుంజుకునే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

రియల్ ఎస్టేట్‌కు భారీ లాభం

రాష్ట్రంలోని ప్రధాన నగరాలకు పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చే అవకాశం ఉంది. ఈ పరిశ్రమలు వెన్నంటి రియల్ ఎస్టేట్ కూడా ఊపందుకునే అవకాశాలు ఉన్నాయి. నాలా చార్జీల భారం తగ్గడం వల్ల రియల్ కంపెనీలు ఆవైపు ధరల్లోనూ వెసులుబాటును కల్పించే అవకాశం ఉంది. కొత్త చట్టం ప్రకారం ప్రస్తుతం ఉన్న నాలా ఫీజును విశాఖపట్టణం, విజయవాడ వంటి నగరాల్లో 5 నుండి 2 శాతానికి తగ్గించారు. మిగతా పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో నాలా ఫీజును 9 శాతం నుండి 3 శాతానికి తగ్గించారు. నిజానికి ఇప్పుడు పెద్ద ఎత్తున పరిశ్రమలు గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లోనే ఏర్పాటవుతున్నాయి. ఈ ప్రాంతాల్లోనూ రియల్ ఎస్టేట్ పుంజుకుంటోంది. నిజానికి నాలా వల్ల ప్రభుత్వానికి రెవెన్యూ తగ్గినా, భారీ పెట్టుబడులు వచ్చి కొత్త పరిశ్రమలు ఏర్పడితే దాని వల్ల ప్రభుత్వ ఖజానాకు రాబడి పెరుగుతుంది. ఉపాధి కల్పన అవకాశాలు పెరుగుతాయి. ఆర్థికరంగం ఊపందుకుంటుంది. రియల్ ఎస్టేట్ వల్ల అవ్యవస్థీకృత రంగంలోనూ ఉపాధి పెరుగుతుంది.

రేరా వచ్చే సరి..

రియల్ ఎస్టేట్ రంగం క్రమ పద్ధతిలో అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం ఇక రేరా అథారిటీని ఏర్పాటు చేయాల్సి ఉంది. రేరా నిబంధనలను నోటిఫై చేసినప్పటికీ నియంత్రణల అమలుకు రెగ్యులేటరీ అథారిటీని ఏర్పాటు చేయడంతోపాటు వెబ్‌సైట్ కూడా ప్రారంభించాల్సి ఉంటుంది. రియల్ ఎస్టేట్ సంస్థలు, బ్రోకర్లు, డెవలప్ వివరాలు, ప్రాజెక్టుల వివరాలను ఈ వెబ్‌సైట్‌లోనే నమోదు చేయాల్సి ఉంది. తెలంగాణ ప్రభుత్వం తాజాగా రెరా రెగ్యులేటరీ రెవెన్యూ సెక్రెటరీ రాజేశ్వర్ తివారీని నియమించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఈ విషయం లో చొరవ తీసుకుంటే వైజాగ్, విజయవాడతో పాటు కాకినాడ, రాజమండ్రి, తిరుపతి, కర్నూలు, అనంతపురం వంటి ప్రాంతాల్లోనూ రియల్ ఎస్టేట్ ఊపందుకునే అవకాశం ఉంది.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి

● రాష్ట్ర క్రీడలశాఖ మంత్రి కొల్లు రవీంద్ర



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో ఆలిండియా సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు క్రీడల అభివృద్ధికి విరివిగా నిధులను కేటాయించడంతోపాటు ఉత్తమ ప్రతిభతో అంతర్జాతీయంగా రాణిస్తున్న రాష్ట్ర క్రీడాకారులకు పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలను అందిస్తున్నారని చెప్పారు. ప్రజా రాజధాని అమరావతి పరిధిలోని ఏఎన్‌యూలో జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలోనే సింథటిక్ ట్రాక్ అభివృద్ధికి తాజాగా ప్రభుత్వ నిధులను మంజూరు చేయటం జరిగిందని గుర్తు చేశారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను, క్రీడా సదుపాయాలను సద్వినియోగం చేసుకొంటూ క్రీడల్లో రాణించడం ద్వారా నవ్యాంధ్రకు అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలను తీసుకురావాలని క్రీడాకారులకు మంత్రి సూచించారు. అనంతరం పలు రాష్ట్రాలకు చెందిన పురుష, మహిళా అథ్లెట్‌లు పరుగుపందెం, హైజంప్, లాంగ్ జంప్, షార్ట్ పుట్ తదితర పోటీల్లో నువ్వా నేనా అన్న రీతిగా పోటీ పడ్డారు. మూడు రోజులపాటు జరగనున్న ఈ పోటీల్లో క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయాలను కల్పించడంతోపాటు క్రీడల్లో రాణించిన వారికి వ్యక్తిగత మెడల్స్‌తో పాటు ఉత్తమ ప్రతిభ కనబరచిన రాష్ట్ర జట్లను పతకాలకు ఎంపిక చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఏఎన్‌యూ వీసీ రాజేంద్రప్రసాద్, ఎండి డాక్టర్ ఎన్.బంగారురాజు, వ్యాయమ విద్య సంచాలకులు ఆచార్య కిషోర్, ప్రిన్సిపల్ పాల్ కుమార్, ఏపీ స్పోర్ట్స్ అథారిటి ఓఎస్‌డి రామకృష్ణ ప్రభుత్వ జనరల్ అడ్మిన్‌స్ట్రేషన్ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, క్రికెట్ కెప్టెన్ అజయ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు చంద్రగ్రహణం

ఉ॥11నుంచి రాత్రి 9.30గ॥ వరకు శ్రీవారి ఆలయం మూసివేత



తిరుమల, ప్రభ న్యూస్ : చంద్రగ్రహణం కారణంగా బుధవారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు శ్రీవారి ఆలయ తలుపులు మూసివుంచుతారు. సాయంత్రం 5.18 గంటలకు చంద్రగ్రహణం ప్రారంభమై రాత్రి 8.41 గంటలకు పూర్తి అవుతుంది. చంద్రగ్రహణం కారణంగా రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు, దివ్యదర్శనం టోకెన్లు, వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు తదితర ప్రత్యేక ప్రత్యేక ప్రవేశ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. వీఐపీ బ్రేక్ దర్శనాలను ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే పరిమితం చేశారు. మాతృశ్రీ తరిగొండవెంగమాంబ అన్నప్రసాద భవనం కూడా మూసివేస్తారు. అన్నప్రసాదాల వితరణ లేని కారణంగా వైకుంఠం క్యూ కాంప్లెక్సులోని కంపార్టుమెంట్లలోకి భక్తులకు అనుమతి ఉండదు. అర్జిత సేవలైన సహస్రకళశాభిషేకం, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్రదీపాలంకార సేవలను కూడా టీటీడీ రద్దు చేసింది. శ్రీవారి ఆలయం ఉదయం, రాత్రి కలిపి దాదాపు 5 గంటల పాటు మాత్రమే తెరిచి ఉంచుతారు.

నేడు అప్పన్న ఆలయం మూసివేత

ఉ॥6.30 నుంచి 8.30 వరకే భక్తులకు దర్శనాలు



విశాఖపట్నం (సింహాచలం), ప్రభన్యూస్ బ్యూరో : చంద్రగ్రహణం సందర్భంగా సింహాచలం శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనం ఉదయం రెండు గంటలకు మాత్రమే పరిమితం చేశారు. బుధవారం ఉదయం 6.30 నుంచి 8.30 గంటల వరకు మాత్రమే భక్తులకు స్వామి దర్శన భాగ్యం కల్పిస్తున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 9 గంటలకు ఆలయం మూసివేయనున్నారు. రాత్రికి గ్రహణం విడిచిన అనంతరం సంప్రోక్షణ, శుద్ధి నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిత్య కళ్యాణ ఆర్జిత సేవలు రద్దు చేశారు. ఫిబ్రవరి 1న యదాతథంగా తెల్లవారు 6.30 నుంచి స్వామి దర్శనాలు భక్తులకు లభించనున్నాయి. నిత్యకళ్యాణ సేవలు యదాతథంగా జరపనున్నారు.

విశాఖలో ఫిబ్రవరి 15 నుంచి
భూగర్భ విద్యుత్ కేబుల్ పనులు ప్రారంభం

● ఇప్పటికే మూడు ప్యాకేజీల టెండర్లు ఖరారు ● రూ.130 కోట్లతో నాలుగో ప్యాకేజీ పనులకు టెండర్లు ఆహ్వానం



విశాఖపట్నం, ప్రభ న్యూస్ బ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ఏపీఈపీడీసీఎల్‌కు సంబంధించిన ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుకు అవసరమైన చర్యలను వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలోనే విశాఖలో ఫిబ్రవరి 15 నుంచి భూగర్భవిద్యుత్ కేబుల్ పనులు ప్రారంభం కానున్నా యి. ఈ ప్రాజెక్టును వరల్డ్ బ్యాంక్ సహా యంతో ఈపీడీసీఎల్ చేపడుతుంది. రూ.720 కోట్లతో నాలుగు ప్యాకేజీల కింద ఆయా పనులను వేర్వేరు కాంట్రాక్ట్ సంస్థలు చేపడుతున్నాయి. 20 సబ్‌స్టేషన్ల పరిదిలో భూగర్భ విద్యుత్ కేబుల్ పనులు దశల వారీగా పూర్తి చేయనున్నారు. ఆయా పనులు పూర్తి కావస్తే ఎటువంటి విపత్తులుసమయంలోనైనా విద్యుత్ సమస్యను అధిగమించడానికి అవకాశం కలుగుతుంది. దేశంలోనే తొలిసారిగా ఈపీడీసీఎల్ ఆయా పనులను శరవేగంగా పూర్తి చేసేందుకు కేవలం 18 నెలల కాలపరిమితి విధించింది. ఇప్పటికే మూడు ప్యాకేజీలు టెండర్లకు సంబంధించి రెండు ప్యాకేజీల పనులను విజయ్ ఎలక్ట్రికల్ సంస్థ దక్కించుకోగా మరోకటి ఎల్అండ్‌టి సంస్థ చేజిక్కించుకుంది. ఆయా మూడు కంపెనీలు తక్షణమే పనులు ప్రారంభించేందుకు వీలుగా రూ.65 కోట్లు మొబలైజేషన్ అడ్వాన్సులు కింద చెల్లించడం జరి గింది. మరో ప్యాకేజీ పనులను రూ.130 కోట్లతో చేపట్టనున్నా రు. అయితే జీఎస్‌టి కారణంగా ప్రాజెక్టు వ్యయం రూ.720 కోట్లుతో పాటు మరో రూ.70 కోట్లు అదనంగా వెచ్చించాల్సిన అవసరం నెలకొంది. తాజాగా సంబంధిత ఉన్నతాధికారులు కూడా ఈ మొత్తం చెల్లించేందుకు హామీ ఇవ్వడంతో నాలుగో ప్యాకేజీ పనులకు టెండర్లు ఆహ్వానించారు. ఫిబ్రవరి 15 నుంచి భూగర్భ విద్యుత్ పనులు ప్రారంభా నికి సంబంధిత కాంట్రాక్ట్ సంస్థలు సన్నాహా లు చేస్తున్నాయి. విశాఖ పరిధిలో సుమారు 20 సబ్‌స్టేషన్లు కలుపుతూ ఆయా భూగర్భ విద్యుత్ పనులు చేపట్టనున్నారు.

పనులు ప్రారంభానికి సన్నాహాలుః ఏపీఈపీడీసీఎల్ సిఎండి హెచ్‌వై దొర

ఏపీఈపీడీసీఎల్ పరిధిలో రూ.720 కోట్లతో భూగర్భ విద్యుత్ కేబుల్ పనులు ఫిబ్రవరి 15 నుంచి ప్రారంభం కానున్నాయని సంస్థ సిఎండి హెచ్‌వై దొర తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు లభించాయని ఆయన వివరించారు. మరో వైపు మూడు ప్యాకేజీల టెండర్లు ఖరారు చేయడం జరిగిందని , రూ.130 కోట్లతో నాలుగో ప్యాకేజీ పనులకు టెండర్లు ఆహ్వానిస్తున్నామన్నారు. 20 సబ్‌స్టేషన్ల పరిదిలో జరిగే ఈ పనులు పూర్తి కావస్తే విశాఖలో ఎటువంటి విపత్తులు సంభవించిన విద్యుత్‌కు ఎటువంటి అంతరాయం కలగదని , ఇదే సమయంలో సంబంధిత సంస్థకు కూడా నష్టం చేకూరదని దొర తెలిపారు. ఈ ప్రాజెక్టుకు అదనంగా మరో రూ.70 కోట్లు అవసరం కానుండగా ఉన్నతాధికారులు అనుమతులు ఇవ్వడంతో పనులు ప్రారంభానికి అన్ని చర్యలు చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టును 18 నెలల్లో పూర్తి చేయాలని నిర్ణయించామన్నారు.

కొలంబో పారా ఒలింపిక్
ఛాంపియన్‌షిప్‌లో ఏపీకి 15 పతకాలు



విశాఖ స్పోర్ట్స్, ప్రభన్యూస్ : శ్రీలంక కొలంబోలో జరిగిన పారా ఒలింపిక్‌లో ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతుల క్రీడాకారులకు 15 పతకాలు సాధించారు. ఈ పోటీలకు భారతదేశం నుంచి 58 మంది క్రీడాకారులు పాల్గొనగా వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు 11 మంది ఉన్నారు. వీరిలో ఆంధ్రా విశ్వ విద్యాలయంలో చదువుతున్న విభిన్న ప్రతిభావంతులు ఉన్నారు. వారు వివిధ కేటగిరీల్లో ఈ పతకాలు సాధించారు. వై .బి. భార్గవి వంద మీటర్ల పరుగులో బంగారు పతకం, యు. తేజశ్వరి రెండు పతకాలు.. డిస్కస్ త్రో, వంద మీటర్లు రన్, ఆర్. రవి షాట్‌పుట్, వందమీటర్లు రన్‌లో రెండు పతకాలు వచ్చాయి. సురేంద్రనాథ్‌కు షాట్‌పుట్ , డిస్కస్ త్రో బంగారు, వెండి పతకాలు వచ్చాయి. టి. రాము వందమీటర్లు రన్ గోల్డ్, వి. రామస్వామి జావిలిన్‌లో బంగారుపతకం వచ్చింది. పి. పైడమ్మకు కాంస్య పతకం డిస్కస్ త్రోలోను, బి మంగారావుకు కాంస్య పతకం లాంగ్ జంప్‌లోను వచ్చాయి. వి. గణేష్ సిల్వర్ లాంగ్ జంప్‌లో వచ్చింది. కె శంకరరావు రెండు కాంస్య పతకాలు షాట్‌పుట్‌లోను, డిస్కస్ త్రోలోను, సిహెచ్ ధన్‌రాజ్ ఒక బ్రాంజ్ మెడల్ లాంగ్ జంప్‌లో వచ్చింది. జట్టు కోఆర్డినేటర్ గాకె. సాయి ముర్గాదోష్ వ్యవహరించారు.

తిరుపతి-విశాఖ-సికింద్రాబాద్ మధ్య
68 ప్రత్యేక రైళ్లు



తిరుపతి - విశాఖ - సికింద్రాబాద్ మధ్య 68 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : విశాఖపట్టణం - సికింద్రాబాద్, తిరుపతి - విశాఖపట్టణం మధ్యన 68 ప్రత్యేక రైళ్లను తిప్పాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. ఈ మార్గాల్లో ప్రయాణికుల రద్దీ పెరగడంతో విశాఖ- సికింద్రాబాద్ మధ్యన 34, తిరుపతి - విశాఖ మధ్యన 34 ప్రత్యేక రైళ్లు నడిపించబోతున్నారు. విశాఖ- సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్లు విశాఖ నుండి ఫిబ్రవరి 6, 13, 20, 27, మార్చి 3,10,17,24, ఏప్రిల్ 1, 8, 15, 22, 29, మే 5, 12, 19, 26, జూన్ 5, 12, 19, 26 తేదీల్లో 23.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 12.00 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటాయి. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్ నుండి మార్చి 7, 14, 21, 28, ఏప్రిల్ 4,11, 18, 25, మే 2, 9, 16, 23, 30, జూన్ 6, 13, 20, 27 తేదీల్లో 16.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 04.50 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటాయి. విశాఖ - తిరుపతి ప్రత్యేక రైళ్లు విశాఖలో మార్చి 5, 12, 19, 26 తేదీల్లో, ఏప్రిల్ 2, 9, 16, 23, 30 తేదీల్లో, మే 7, 14, 21, 28 తేదీల్లో, జూన్, 11, 18, 25 తేదీలలో 22.55 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 13.25 గంటలకు తిరుపతి చేరుకుంటాయి. తిరుగు ప్రయాణంలో తిరుపతి నుండి మార్చి 6, 13, 20, 27, ఏప్రిల్ 3, 10, 17, 24, మే 1, 8, 15, 22, 29, జూన్ 5, 12, 19, 26 తేదీలలో 15.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 06.50 గంటలకు విశాఖ చేరుకుంటాయి. ప్రత్యేక రైళ్లను అన్ని ప్రధానమైన స్టేషన్లలో నిలుపుదల చేయడం జరుగుతుంది.

రైల్వే స్టేషన్లలో వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు

దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని అన్ని ప్రధానమైన రైల్వే స్టేషన్లలో వికలాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వికలాంగులకోసం ప్రత్యేకర్యాంపు, పార్కింగ్, పార్కింగ్ స్థలం నుండి రైల్వే స్టేషన్‌లోనికి ప్రత్యేక ప్రవేశ మార్గం, మరుగు దొడ్లు, మంచినీటి సౌకర్యం, సహాయకులు తదితర సౌకర్యాలను అందుబాటులోకి తేవడం జరుగుతుంది. సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ, విజయవాడ, తిరుపతి ఏ వన్ కేటగిరి స్టేషన్లతో పాటుగా 38 బి కేటగిరి స్టేషన్లో ఈ సదుపాయం అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుంది. ర్యాంప్, టాయిలెట్స్, మంచినీరు, వాక్ వే అందుబాటులోకి తీసుకురావడంతో దివ్యాంగులు పార్కింగ్ నుండి స్టేషన్‌లోనికి సునాయసంగా వెళ్లడానికి వీలవుతుంది. స్టేషన్ నుండి రైలులోకి ప్రవేశించడానికి కూడా కొరుకున్న వారికి వీల్ ఛైర్‌ను సమకూర్చబోతున్నారు. ఇప్పటికే అన్ని స్టేషన్లలో వీల్ ఛైర్ అందుబాటులో ఉంచారు.

బీసీ ఉద్యోగుల డైరీని ఆవిష్కరించిన జనరల్ మేనేజర్

దక్షిణ మధ్య రైల్వే ఓబీసీ ఉద్యోగుల డైరీని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ మంగళవారం రైల్ నిలయంలో ఆవిష్కరించారు. ఓబీసీ ఉద్యోగులు తొలి సారిగా సమగ్ర సమాచారంతో డైరీని తీసుకురావడం అభినందనీయం అని జనరల్ మేనేజర్ కొనియాడారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు డి. పద్మనాభం, ప్రధాన కార్యదర్శి బి.వి.ఎన్. సత్యనారాయణతో పాటుగా పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

మరికొద్ది గంటల్లో మేడారంలో
మహాఘట్టం...

● కన్నెపల్లి నుంచి నేడు సారలమ్మ తల్లిరాక



భూపాలపల్లి, ప్రభన్యూస్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా, తాడ్వాయి మండలంలోని మేడారం లో మరికొన్ని గంటల్లో సమ్మక్క - సారలమ్మ వేడుకలకు సంబంధించిన మహా ఘట్టం ప్రారంభంకానుంది. మేడారానికి సమీపంలోని కన్నెపల్లి నుంచి వరాలతల్లి సారలమ్మ తల్లి బుధవారం సాయంత్రం 5 గంటలకు బయలుదేరి మేడారంలోని గద్దెల పై కొలువుదీరనుంది. సారలమ్మ తల్లిని పూజారి కాక సారయ్య తో పాటు మరికొందరు పూజారులు గిరిజన సంప్రదాయాల ప్రకారం గద్దెలకు తీసుకువస్తారు. అంతకు మందు కన్నెపల్లిలో వరాలు పట్టిన మహిళలు , భక్తులు సారలమ్మను సాగనంపే సమయంలో పోర్లు దండడాలు పెడతారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారాన్ని తన్మయత్వంతో మునిగితేలుతారు. సారలమ్మ జంపన్న వాగు దాటే క్రమంలో శివసత్తులకు పూనకాలతో హోరెత్తుతుంది. తల్లి వచ్చే క్రమంలో ఎదురుకోళ్లు ప్రారంభమైతాయి. సారలమ్మ రాక సమయంలో కన్నెపల్లి నుంచి మేడారం గద్దెల ప్రాంగణం వరకు భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం సారలమ్మ రాక సందర్భంగా చేపట్టవల్సిన చర్యలను పోలీసులకు జిల్లా ఎస్పీ ఆర్ భాస్కరన్ వివరించారు. కన్నెపల్లి నుంచి మేడారం వరకు ఐదారు సెక్టార్లుగా నియమించి డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణ చేపడుతున్నారు. సారలమ్మ రాక సందర్భంగా తల్లి రాకను తనివీతీరా చూడాలని లక్షలాది మంది భక్తులు ఇప్పటికే అతృతతో ఎదిరిచూస్తున్నారు.

-మేడారం చేరిన 25 లక్షల మంది భక్తులు

మేడారం జాతరకు మంగళవారం సాయంత్రం వరకే 25 లక్షల మంది భక్తులు చేరారు. ఇంకా నిరంతరాయంగా వాహనాలు వస్తూనే ఉన్నాయి. సోమవారం నుంచే వన్‌వే ట్రాఫిక్ అమలులోకి రావడంతో ట్రాఫిక్‌కు పెద్ద అంతరాయం జరుగలేదు. ములుగు మండలంలోని గట్టమ్మ వద్ద రెండు పర్యాయాలు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. గురువారం నాడు సాయంత్రం 5 గంటలకు చిలుకలగుట్ట నుంచి సమ్మక్కను గిరిజన పూజలు కుంకుమ భరణి రూపంలో గద్దెలకు తీసుకువస్తారు. శుక్రవారం వన దేవతలు గద్దెల ఆసీనులయి ఉండగా లక్షలాది మంది భక్తులు తల్లులను తనివితీరా దర్శించి మొక్కులు చెల్లించనున్నారు. శనివారం సమ్మక్క - సారలమ్మ తిరిగి వారి వారి స్థానాలకు పంపిస్తారు.

గచ్చిబౌలిలో మహిళ దారుణహత్య

● ముక్కలు ముక్కలుగా నరికి.. గోనెసంచిలో పెట్టి రోడ్డుపై పడేశారు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: నగరంలోని గచ్చిబౌలి బొటానికల్ గార్డెన్ సమీపంలో ఓ గొనెసంచిలో మహిళ మృతదేహం కలకలం రేపింది. ఆమెను అత్యంత కిరాతకంగా హత్య చేశారు దుండగులు. మహిళ శరీరాన్ని ముక్కలు ముక్కలుగా చేసి గోనెసంచిలో పెట్టి రోడ్డుపై పడేశారు. అక్కడ పనిచేసే పారిశుద్ధ్య సిబ్బంది ఈ విషయాన్ని గమనించి మంగళవారం ఉదయం పోలీసులకు సమాచారం అందిం చారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

పోస్టుమార్టం పూర్తి..

ఎనిమిది నెలల గర్భిణీ కడుపులో మగశిశువు, వైద్యులు, పోలీసులు షాక్...

మంగళవారం సాయంత్రం మహిళ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయింది. కాగా, మహిళను తీవ్రంగా కొట్టిన తర్వాతే ముక్కలుగా నరికినట్లు రిపోర్టులో వెల్ల డైంది. శరీరంలో అనేక ప్రాంతాల్లో ఎముకలు విరిగిన ఆనవాళ్లను పోస్టు మార్టంలో వైద్యులు గుర్తించారు. సదరు మహిళ ఎనిమిది నెలల గర్భిణి అని ఆమె కడుపులో మగశిశువుని వైద్యులు గుర్తించారు. మహిళ గర్భిణీ అని తెలియ డంతో వైద్యులతో పాటు పోలీసులు కూడా ఒకింత షాక్‌కు గురయ్యారు. హత్యకు గురైన మహిళ నార్త్ ఇండియన్ అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనపై సంఘ టనాస్థలంలో సీసీ కెమెరాల పుటేజీని పోలీసులు సేకరించారు. ఆ మహిళను ఎవరు చంపారు? ఎందుకు చంపాల్సి వచ్చింది? హత్యగావింపబడ్డ మహిళ ఎవరు? అని అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అంతకు ముందు క్లూస్‌టీం, జాగి లాలు ఘటనాస్థలికి పోలీసులు రప్పించారు. మాదాపూర్ ఏసీపీ శ్యాంప్రసాద్, గచ్చి బౌలి ఇన్‌స్పెక్టర్ గంగాధర్‌లు సంఘటనాస్థలిని పరిశీలించి వివరాలు సేకరించారు.

అత్యంత కిరాతకం...

కాగా, మహిళను అత్యంత కిరాకతంగా హత్య చేసినట్లు పోస్టుమార్టం నివేదిక తేటతెల్లం చేసింది. దీంతో, సదరు మహిళను ఎవరు హత్య చేసి ఉంటారు? ఎక్కడో హత్య చేసి ఇక్కడ పడవేశారా? అంత దారుణంగా హత్య చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? ఇత్యాది అంశాలపై పోలీసులు దృష్టి సారించారు. ఘటనకు సంబం ధించి ఘటనాస్థలం వద్ద ఉన్న స్థానికులను సైతం పోలీసులు విచారించారు. అయి తే, ఈ కేసులో అన్నికోణాల్లో దర్యాప్తు చేపడుతున్నామని, త్వరలో ఈ కేసును ఛేదించగలమని పోలీసులు చెబుతున్నారు.

టాలీవుడ్‌లో కలకలం

● దొంగతనం కేసులో నటుడు సామ్రాట్‌రెడ్డి అరెస్ట్
● 14 రోజుల రిమాండ్ చర్లపల్లి జైలుకు తరలింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నటుడు సామ్రాట్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేయడం టాలీవుడ్‌లో కలకలం రేపుతోంది. భార్య ఫిర్యాదు మేరకు మాదాపూర్ పోలీసులు అతడ్ని అరెస్టు చేశారు. ఇంట్లో దొంగతనం చేసినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. నటుడు సామ్రాట్ పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కడం ఇది రెండోసారి. గతంలో భార్య వరకట్నం కేసు పెట్టగా, ఈ సారి దొంగతనం కేసు పెట్టింది. ఆ కేసు విచారణ జరు గుతుండగా ఈ కేసు నమోదు కావడం గమనార్హం. కాగా, ప్రస్తుత కేసులో ప్రాథమిక సాక్ష్యాలు ఉన్నాయని పోలీసులు నిర్ధారించారు. దీంతో మంగళవారం ఉద యం అతడిని అరెస్ట్ చేశారు. సామ్రాట్‌రెడ్డితో పాటు అతడి సోదరి సాహితీరెడ్డిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, నటుడు సామ్రాట్ రెడ్డి పంచాక్షరి సినిమాలో అనుష్కకు భర్తగా నటించాడు. ఆయన నటించిన సినిమాల్లో తకిట తకిట, బావా, దేనికైనా రెడీ తదితర సినిమాలున్నాయి. 2015లో నటుడు సామ్రాట్‌కు, హర్షితకు వివాహమైంది. కాగా కొంతకాలంగా సామ్రాట్‌కు అతడి భార్యతో విభేదాలు ఉన్నాయి. దీంతో రెండు నెలలుగా ఇరువురు వేర్వేరుగా ఉంటున్నారు. తాను ఇంట్లో లేని సమయంలో సామ్రాట్ వచ్చి పలు విలువైన వస్తువులను తీసుకు వెళ్లాడని ఆమె ఫిర్యాదు చేశారు.

సామ్రాట్ దుర్మార్గుడు, సైకో .... హర్షిత

తన భర్త చాలా దుర్మార్గుడని, తప్పనిసరి పరిస్థితుల్లో తాను కేసు పెట్టానని హర్షిత చెప్పింది. ఎంతో సహనంగా, ఎన్ని కష్టాలు పెట్టినా మౌనంగా ఉన్నానని, ఓ సైకోలా మారి హింసించేవాడని తెలిపింది.

క్రీడాప్రభ

ఆరోసారి.. ఫైనల్లో యువభారత్

● సెమీస్‌లో పాక్‌పై భారత్ ఘన విజయం ● 203 పరుగులతో దాయాది జట్టు చిత్తు ● శుభ్‌మన్ గిల్ అజేయ సెంచరీ
● నాలుగు వికెట్లతో రాణించిన పోరెల్ ● 3న ఆసీస్‌తో ఫైనల్ మ్యాచ్

క్రైస్ట్‌చర్చ్ (న్యూజిలాండ్): అండర్-19 వన్డే యువభారత్ మరోసారి దుమ్మురేపింది. మంగళవారం జరిగిన సెమీఫైనల్లో చిరకాల ప్రత్యర్థి పాక్‌ను 203 పరుగులతో చిత్తుగా ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. భారత బౌలర్ల ధాటికి పాక్ కేవలం 69 పరుగులకే కుప్పకూలింది. 273 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన పాక్ ఆరంభంలోనే బెదిరింది. 10 పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయిన పాక్, తర్వాత ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. ఇషాన్ పోరెల్ నిప్పులు చెరిగే బంతులతో టాపార్డర్‌ను కుప్పకూల్చాడు. మొదటి నాలుగు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి పతనాన్ని శాసించాడు. శివసింగ్, పరాగ్ రెండేసి వికెట్లతో భారత్ విజయాన్ని సునాయాసం చేశారు. అభిషేక్ శర్మ, అనుకూల్ రాయ్ చెరో వికెట్ దక్కించుకున్నారు. పాక్ ఆటగాళ్లలో రొహైల్ నజీర్(18), సాద్ ఖాన్(15), మొహమ్మద్ మూసా(11) మాత్రమే రెండంకెల స్కోరు సాధించారు. మిగతా ఆటగాళ్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. కీలక ఆటగాడు షహీన్ అఫ్రిది డకౌటయ్యాడు. అండర్ 19 క్రికెట్‌లో పాకిస్థాన్‌కు ఇదే అతి పెద్ద ఓటమి కావడం గమనార్హం. అజేయ సెంచరీతో భారత్ విజయానికి బాటలు వేసిన గిల్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

పాక్ వెన్ను విరిచిన పోరెల్

యువ బౌలర్ పోరెల్ ధాటికి పాక్ బ్యాట్స్‌మెన్ విలవిల లాడారు. 69 పరుగులకే ఆ జట్టు కుప్పకూలిందంటే భారత్ బౌలింగ్ ఏ స్థాయిలో సాగిందో అర్ధం చేసుకోవచ్చు. పోరెల్ ఆరు ఓవర్లకు 17పరుగులిచ్చి నాలుగు వికెట్లు తీశాడు. ఓపెనర్లు ఇమ్రాన్ షా, మహమ్మద్ జైద్‌తో పాటు జర్యబ్ ఆసిఫ్ సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరారు. మరో బౌలర్ పరాగ్ కూడా చెలరేగిపోయాడ. రొహైల్ నజీర్(18), హసన్ ఖాన్(1)ను త్వరత్వరగా పెవిలియన్ చేర్చాడు. 25 ఓవర్ల సమయానికి 8 వికెట్లు కోల్పోయి 48 పరుగులు మాత్రమే చేసింది. దీంతో కనీసం 50పరుగులైనా సాధిస్తుందా అన్న అనుమానం కలిగింది. షాద్ ఖాన్(15)కాసేపు నిలబడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. అర్షద్ ఇక్బాల్‌ను అభిషేక్ శర్మ ఔట్ చేయడంతో పాక్ పతనం సంపూర్ణం అయింది.

తొలుత టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 272 పరుగులు చేసింది. ఓపెనర్లు కెప్టెన్ పృథ్వీ షా, మన్‌జోత్ కల్రా జోడి తొలి వికెట్‌కు 89 పరుగులు జోడించి శుభారంభం ఇచ్చారు. ధాటిగా ఆడే



క్రమంలో షా 41 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రనౌట్ అయ్యాడు. 17ఓవర్‌లోనే మరో ఓపెనర్ కల్రా 47 పరుగులు వద్ద అవుటయ్యాడు. దీంతో భారత్ 94 పరుగులకు రెండు వికెట్లు కోల్పోయింది. వన్‌డౌన్‌లో వచ్చిన శుభ్‌మాన్ గిల్ సెంచరీ(102)తో చెలరేగాడు.గిల్‌కు అండగా నిలిచిన దేశాయ్ ఇన్నింగ్స్ నిలబెట్టే ప్రయత్నం చేశాడు. కానీ జట్టు స్కోరు 148 వద్ద ఔటయ్యాడు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన రాయ్ 45 బంతుల్లో 33 పరుగులు సాధించాడు. అర్ధశతకం దిశగా అడుగులు వేస్తున్న క్రమంలో మహమ్మద్ ముసా చేతికి చిక్కాడు. 45 ఓవర్లో రాయ్ అవుట్ కావడం, తర్వాత బ్యాట్స్‌మెన్ నుంచి సరైన సహకారం లేకపోవడంతో భారత్ స్కోరు 272/9కే పరిమితమైంది. పాక్ బౌలర్లలో మొ హమ్మద్ మూసా 4, అర్షల్ ఇక్బాల్ 3 వికెట్లు పడగొట్టారు. షహీన్ ఆఫ్రిది ఒక వికెట్ దక్కించుకున్నాడు.టోర్నీలో వరుస విజయాలతో ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్, శనివారం ఆస్ట్రేలియాతో ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. కాగా, భారత్ యువ జట్టు ప్రపంచకప్ ఫైనల్‌కు చేరడం ఇది ఆరోసారి. ప్రపంచ కప్‌ను చెరో మూడుసార్లు గెలుచుకుని సమవుజ్జీలుగా ఉన్న భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఫైనల్ ఫైట్ ఆసక్తిగా ఉంటుందనడంలో సందేహం లేదు.

క్యాష్ ప్రైజ్‌తో సత్కరిస్తాం: బీసీసీఐ

ప్రపంచకప్ ఫైనల్ చేరిన యువజట్టుకు బీసీసీఐ అభినందనలు తెలిపింది. జట్టు సభ్యులను క్యాష్ ప్రైజ్‌తో సత్కరిస్తామని తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా చెప్పారు. ద్రావిడ్ శిక్షణలో కుర్రాళ్లు రాటుతేలారు. అతని చొరవ కారణంగా అండర్ -19 జట్టులో ప్రతిభావంతులైన క్రికెటర్లు తయారయ్యారని ఖన్నా పేర్కొన్నారు.



స్కోరు బోర్డు

భారత్ ఇన్నింగ్స్: పృథ్వీ షా (రన్‌అవుట్) - మూసా (41), మన్‌జోత్ కల్రా (సి) నజీర్ (బి) మూసా 47, శుభ్‌మన్ గిల్ (నాటౌట్) 102, దేశాయ్ (సి) ఖాన్ (బి) ఇక్బాల్ 20, పరాగ్ (సి) నజీర్ (బి) ఇక్బాల్ 2, అభిషేక్ శర్మ (సి)నజీర్ (బి) ఇక్బాల్ 5, రాయ్ (సి) నజీర్ (బి) మూసా 33, నాగర్ కోటి (బి) ఆఫ్రిది 1, శివమ్ మావి (సి) షా (బి) మూసా 10, శివ సింగ్ ఎల్‌బీడబ్ల్యూ (బి) మూసా 1, పోరెల్ (నాటౌట్) 1, ఎక్స్‌ట్రాలు 9. మొత్తం స్కోరు : 272/9 (50 ఓవర్లు)

పాక్ బౌలింగ్: మూసా 10-0-67-4, అర్షద్ ఇక్బాల్ 10-0-51-3, ఆఫ్రిది 10-0-62-1, హసన్ ఖాన్ 10-0-46-0, మెహమ్మద్ తాహా 7-0-35-0, అలీ జరియబ్ ఆసిఫ్ 3-0-11-0

పాకిస్థాన్ ఇన్నింగ్స్: ఇమ్రాన్‌షా, (సి) పి.షా (బి) పోరెల్ 2, జైద్ ఆలమ్ (సి) మావి (బి) పోరెల్) 7, రోహేల్ నజీర్ (సి) గిల్ (బి) పరాగ్ 18, అలీ జరియబ్ ఆసిఫ్ (సి) షా (బి) పోరెల్ 1, అహ్మద్ అలమ్ (సి) మావి (బి) పోరెల్ 4, తాహా (సి) నాగర్‌కోటి (బి) శివసింగ్ 4, షాద్ ఖాన్ (సి) దేశాయ్ (బి) రాయ్ 15, హసన్ ఖాన్ (సి) గిల్ (బి) పరాగ్ 1, ఆఫ్రిది (సి), (బి) శివసింగ్ 0, మూసా (నాటౌట్) 11, ఇక్బాల్ (సి) పోరెల్ (బి)శర్మ 1, ఎక్స్‌ట్రాలు 5. మొత్తం స్కోరు : 69 (29.9 ఓవర్లకు ఆలౌట్)

భారత్ బౌలింగ్: పోరెల్ 6-2-17-4, ఎస్ మావి 4-3-6-0, నాగర్‌కోటి 5-1-7-0, శివసింగ్ 8-0-20-2, పరాగ్ 4-1-6-2, రాయ్ 2 - 0 - 1 1 - 1 , అభిషేక్ శర్మ 0.3-0-0-1

అండర్-19 ప్రపంచ కప్ టోర్నీలో ఇండియా జట్టు ఫైనల్‌కు చేరడం ఇది ఆరోసారి. ఇంతకు ముందు ఐదు సార్లు ఫైనల్లో తలపడిన యంగ్ ఇండియా మూడుసార్లు ప్రపంచకప్ నెగ్గింది. రెండుసార్లు రన్నరప్‌గా నిలిచింది. అయితే, ఈసారి అద్భుతమైన ప్రతిభావంతులతో కూడిన జట్టు ఆసీస్‌ను నెగ్గుతుందన్న అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. గతంలో 2000 లో మహ్మద్ కైఫ్, 2008లో కోహ్లీ, 2012లో ఉన్ముక్త్ కెప్టెన్సీలలో ఇండియా ప్రపంచకప్ టైటిల్ సొంతం చేసుకుంది. కాగా, 2006, 2016లలో పుజారా, ఇషన్ కిషన్ నాయకత్వంలో తుదిమెట్టుపై చతికిల పడింది. కాగా, ద్రవిడ్ శిక్షణలో యువ భారత్ ఫైనల్ చేరడం వరుసగా రెండోసారి.



యంగ్ హీరో గిల్

యంగిండియా క్రికెట్ జట్టులో శుభ్‌మాన్ గిల్ హీరో అయ్యాడు. అండర్ -19 ప్రపంచకప్ టోర్నీలో ఇండియాను ఫైనల్ చేర్చడంలో ఈ యువ బ్యాట్స్‌మన్ కీలకపాత్ర పోషించాడు. మంగళవారం జరిగిన సెమీఫైనల్లో పాక్ బౌలర్ల భరతం పట్టాడు. హీరోచిత సెంచరీతో నాటౌట్‌గా నిలిచాడు. 94 బంతులు ఎదుర్కొని 7 ఫోర్లతో 102 పరుగులు సాధించాడు. టోర్నీలో భారత్ తరపున అత్యధిక పరుగులు (341) సాధించిన ఆటగాడిగా నిలిచాడు. వైస్ కెప్టెన్‌గా కూడా వ్యవహరిస్తున్న శుభమాన్ గిల్ ప్రతిభకు రాహుల్ సానబడుతున్నాడు. కాగా, తన ఆటతీరును సచిన్, లక్ష్మణ్ లాంటి దిగ్గజ క్రికెటర్లు మెచ్చుకుంటూ ట్వీట్లు పెడుతున్నారు.ఈ టోర్నీలో జింబాబ్వే, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లపై 90, 86, 102 పరుగులతో ఆకట్టుకున్న గిల్.. తాను క్రికెట్ ఆడటానికి సచిన్, ద్రవిడ్, లక్ష్మణ్‌లే కారణమని చెబుతున్నాడు. బ్యాటింగ్ చేసేప్పుడు ఎలాంటి ఒత్తిడికి గురికాను. పాక్‌తో మ్యాచ్ అంటే ఒత్తిడి సహజమే. అయితే నేను నిన్న రాత్రి మంచి భోజనం చేసి హాయిగా నిద్రపోయా. ఈ క్రెడిట్ అంతా నా తండ్రి, సోదరునికే చెందుతుంది. ఆస్ట్రేలియాతో ఫైనల్ కోసం ఎదురుచూస్తున్నా అని మ్యాచ్ అనంతరం గిల్ చెప్పాడు.

ఇక శుభ్‌మన్ ప్రదర్శన పట్ల అతని తల్లితండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. క్రికెట్ పట్ల శుభ్‌మన్‌కు ఉన్న నిబద్ధతే అతన్ని ఈస్థాయికి తీసుకొచ్చిందని చెబుతూ మురిసిపోతున్నారు. శుభ్‌మన్ తండ్రి లక్విందర్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. శుభమన్‌కు మూడేళ్ల నుంచే క్రికెట్ అంటే పిచ్చని, దాన్ని గుర్తించి ప్రోత్సాహించమన్నారు. చిన్నప్పుడు ఏ బొమ్మ కొనిచ్చిన తీసుకునేవాడు కాదని, బ్యాట్, బంతినే ఇష్టపడేవాడని పేర్కొన్నారు. పడుకునేటప్పుడు సైతం బ్యాట్, బంతిని పక్కన పెట్టుకొని పడుకునేవాడని గుర్తు చేసుకుంటూ సంబరపడ్డారు.

కుర్రాళ్లకు ప్రశంసల వెల్లువ..

అప్రతిహత విజయాలతో దూసుకెళ్తున్న భారత జట్టుకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. సెమీస్‌లో పాక్‌పై భారీవిజయం అనంతరం ప్రముఖులు ట్వీట్ల వర్షంకురిపించారు. అద్భుతం చేశారంటూ పొగడ్తలతో ముంచెత్తారు. శనివారం ఆస్ట్రేలియాతో జరగబోయే తుదిపోరుకు గుడ్‌లక్ చెప్పారు. అన్ని విభాగాల్లో ఆధిపత్యాన్ని చూపించి నాణ్యమైన ప్రదర్శన ఇచ్చారు.. ఫైనల్‌కు ఆల్ ది బెస్ట్ అని సచిన్ టెండుల్కర్ ట్వీట్ చేశారు. వీరూ, వీవీఎస్, కైఫ్, రైనా, యూసుఫ్ పఠాన్ తదితరులు యువజట్టుకు కంగ్రాట్స్ చెప్పారు. పాకిస్థాన్‌ను ఎలా ఎదుర్కొంటే భారతీయులు ఇష్టపడతారో ఈ మ్యాచ్ ద్వార కోచ్ రాహుల్ ద్రవిడ్ చూపించారని ఐసీసీ ట్వీట్ చేసింది. ఇక బీసీసీఐ కూడా కుర్రాళ్లను పొగడ్తలతో ముంచెత్తింది. చివరి మెట్టుపై విజయ పతాక ఎగురవేయాలని సూచించింది.

ఛ్ఛ్... మాకు ద్రవిడ్ లేడు

టీమిండియా ఆటతీరును మెచ్చుకుంటూ పలువురు ప్రముఖులు వరుస ట్వీట్లు పెడుతున్నారు. ఈ జాబితాలోకి ఇప్పుడు పాక్ అభిమానులు కూడా చేరిపోయారు. రాహుల్‌ను పొగుడుతూ ట్వీట్లు పెడుతున్నారు.

'భారత్ గెలవడానికి వారి వెనక రాహుల్ ద్రవిడ్ శిక్షణ ఉంది. మరి మా పాకిస్థాన్ జట్టు వెనక అలాంటి వారు ఎవరూ లేరు. అందుకే మేం ఓడాం.' అంటూ పాక్ అభిమానులు ట్విటర్‌లో పేర్కొంటున్నారు. పాక్ జట్టు ప్రధాన కోచ్‌గా ఉన్న మన్సూర్ రాణాకు ఎలాంటి అనుభవం లేదని తిట్టిపోసున్నారు. 'మన్సూర్ రెండు వన్డేలు మాత్రమే ఆడాడు. 15 పరుగులే చేశాడు. వికెట్లు ఏమీ తీయలేదు. టెస్టు మ్యాచ్ ఆడిన అనుభవం అసలే లేదు' అంటూ పాక్ అభిమానులు దుమ్మెత్తిపోస్తున్నారు. సీనియర్ ఆటగాళ్లు ఎవరూ యువ పాక్ జట్టుకు సహాయపడేందుకు ముందుకురాకపోవడంపై కూడా వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

టీ20 ఫైనల్స్‌కు వేదిక ఎంసీజీ




దుబాయ్: 2020 పొట్టి క్రికెట్ ప్రపంచకప్ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌కు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ) వేదిక కానుందని ఐసీసీ స్పష్టం చేసింది. పురుషులు, మహిళలు రెండు విభాగాల్లోనూ ఫైనల్ వేదిక ఇదేనని తెలిపింది. మహిళల టీ20 ఫిబ్రవరి 21 నుంచి మార్చి 8 వరకు, పురుషుల టోర్నీ అక్టోబర్ 18 - నవంబర్ 15 వరకు ఆస్ట్రేలియాలో జరగనుంది. మొత్తం సిరీస్‌కు ఎనిమిది మైదానాలు ఆతిథ్యం ఇవ్వబోతున్నాయి. ఇందులో అడిలైడ్, బ్రిస్బేన్, కాన్‌బెర్రా, గీలాంగ్,హోబార్ట్ మెల్‌బోర్న్, పెర్త్, సిడ్నీ నగరాలున్నాయి. మహిళా క్రికెట్‌లో 10 అంతర్జాతీయ జట్లు, పురుషుల విభాగంలో 16 జట్లు మెగా టోర్నీలో పాల్గొంటాయి. మహిళల సెమీఫైనల్ సిడ్నీలోనూ, పురుషుల సెమీస్ అడిలైడ్ ఓవల్‌లో జరుగుతాయని ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డేవిడ్ రిచర్డ్సన్ చెప్పారు.

'ధోనిలా సిక్స్‌లు బాదేస్తా'

మంజూర్ ధార్

న్యూఢిల్లీ: ఐపీఎల్ అనామక క్రికెటర్ల జీవితాల్లో వెలుగు నింపుతోంది. ప్రతి సీజన్‌లో ఓ కొత్త క్రికెటర్ జీవితాన్ని కెరీర్ పరంగా.. ఆర్థికపరంగా వారు ఊహించనంతలా మార్చేస్తుంది. ఒకప్పుడు రూ.60 రోజు కూలి పొందిన కశ్మీర్ యువ ఆటగాడు మంజూర్ ధార్ ఈ సారి జరిగన వేలంలో రూ.20లక్షలు పలికి కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్టుకు ఎంపికయ్యాడు. దీంతో కశ్మీర్ నుంచి ఐపీఎల్‌కు ఎంపికైన తొలి క్రికెటర్‌గా గుర్తింపు పొందాడు. ఈ ఎంపికతో కశ్మీర్ వ్యాప్తంగా మంజూర్ ధార్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. ఇక అతని సొంత గ్రామ ప్రజలు నాట్యం చేస్తూ పండుగ చేసుకున్నారు.



రెక్కాడితేగాని డొక్కాడని జీవితం మంజూర్ ధార్‌ది. నలుగురు చెల్లెల్లు, ముగ్గురు తమ్ముళ్లతో కుటుంబ బాధ్యత తనపై ఉన్నా ఆటపై ఉన్న మక్కువతో ఒకవైపు సెక్యూరిటీ గార్డ్‌గా రాత్రి వేళలో పనిచేస్తూ.. పగలు లోకల్ కోచ్ సాయంతో క్లబ్ క్రికెట్ ఆడేవాడు. 2008 నుంచి 2012 వరకు ఇలా క్లబ్ క్రికెట్ ఆడిన మంజూర్ రాష్ట్ర జట్టులో చోటు కోసం ప్రయత్నించాడు. అనంతరం 2017లో కశ్మీర్ తరపున తొలి మ్యాచ్ ఆడాడు. సహజసిద్ధమైన ఆటతో అలవోకగా సిక్సులు బాదేవాడు. దీంతో ప్రత్యేక గుర్తింపు పొందాడు. ఈ

ధోనిలా సిక్స్‌లు బాదడమే తనకిష్టమని చెప్పుకొచ్చాడు. తనపై నమ్మకం ఉంచిన పంజాబ్ యజమాని ప్రీతిజింతాకు ధన్యవాదాలు తెలిపాడు. నా జీవితంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొంటూ వచ్చా.. ఇప్పుడు ఐపీఎల్ వేలంలో ఎంపికవడం సంతోషంగా ఉందన్నాడు. ఒకప్పుడు రూ.60 కూలీకి పని చేసానని, క్రికెట్ ఆడే రోజుల్లో తనకి కనీసం షూ కూడా లేవని గుర్తు చేసుకున్నాడు. తన అభిమాన క్రికెటర్ యువరాజ్‌తో డ్రెస్సింగ్ రూమ్ పంచుకునే అవకాశం రావడం మరింత సంతోషాన్నిస్తుందన్నాడు. కొత్త ఇల్లు ప్రారంభించి మూడేళ్లు అవుతుందని, దానికి కనీసం తలుపులు, కిటికీలు కూడా లేవని ఇప్పుడు ఈ డబ్బుతో అది పూర్తి చేస్తానని, మా చెల్లెల్లు, తమ్ముళ్లను బాగా చదివిస్తానని చెప్పుకొచ్చాడు. తన తల్లి ఆరోగ్యం సైతం బాలేదని, ఆమెకు మెరుగైన చికిత్స అందిస్తానని పేర్కొన్నాడు.

కామన్వెల్త్‌కు 27 మంది షూటర్లు



న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో జరగనున్న కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొనే భారత షూటర్ల ఎంపిక పూర్తయింది. జితూ రాయ్, గగన్ నారంగ్, అపూర్వి , హీనా, చండేలాతో కూడిన 27 మంది బృందాన్ని మంగళవారం నేషనల్ రైఫిల్ అసోసి యేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఆర్ఏఐ) ప్రకటించింది. 2014 కామన్వెల్త్‌లో 30 మంది పాల్గొనగా, ఈసారి కోటాను తగ్గించింది. గ్లాస్కో పోటీల్లో ఇండియా నాలుగు స్వర్ణాలతో సహా మొత్తం 17 పతకాలు సాధించింది. ఏప్రిల్ 8 నుంచి 14 వరకు బ్రిస్బేన్‌లో మూడు విభాగాల్లో (రైఫిల్, పిస్టల్, షాట్‌గన్) షూటింగ్ పోటీలు జరుగుతాయి. పురుషుల విభాగంలో సంజీవ్ రాజ్‌పుత్, మాన్విజిత్ సింగ్ సంధు, మహ్మద్ అసబ్ వంటి టాప్ షూటర్లు కామన్వెల్త్ బృందంలో ఉన్నారు. మహిళల విషయానికొస్తే, అనుభవజ్ఞులైన హీనా సింధుతోపాటు ప్రతిభావంతులైన యువతులు మెహుల్‌ఘోష్, మను భకర్‌లు ఉన్నారు. ప్రతిభ ఆధారంగా ఎంపిక జరిగిందని ఎన్ఆర్ఏఐ అధ్యక్షుడు రణిందర్ సింగ్ తెలిపాడు.

యార్క్‌షైర్‌కు పుజారా



లండన్: ఐపీఎల్ వేలంలో ఫ్రాంచైజీల విశ్వాసాన్ని పొందలేకపోయిన టీమిండియా బ్యాట్స్‌మన్ పుజారా భవిష్యత్ కార్యాచరణకు బాటలు వేసుకుంటున్నాడు. కొద్ది మాసాల్లో జరగనున్న ఇంగ్లండ్ సిరీస్‌ను దృష్టిలో ఉంచుకుని సన్నాహక ఏర్పాట్లకు సిద్ధమవుతున్నాడు. బ్రిటన్‌లోని యార్క్‌షైర్ క్లబ్ తరపున ఆడేందుకఽ ఒప్పందం కుదుర్చుకున్నాడు. కాగా, యార్క్‌షైర్‌కు ప్రాతినిధ్యం వహించడం అతనికిది రెండోసారి. న్యూజీలాండ్ కెప్టెన్ కానే విలియమ్సన్‌తో కలిసి ఇంగ్లండ్ క్లబ్ క్రికెట్ ఆడనున్నాడు. చివరిసారిగా 2015లో ఇదే క్లబ్‌కు ఆడినపుజారా, తర్వాత టీమిండియా తరపున చెప్పుకోదగ్గ స్థాయిలో రాణించాడు.

గడువులోగా వెళ్లిపోవాల్సిందే..

సిడ్నీ: కామన్వెల్త్ క్రీడాకారులు గడువులోగా తిరిగి స్వదేశాలకు వెళ్లిపోవాలని ఆస్ట్రేలియా స్పష్టం చేసింది. వీసా గడువు ముగిసిన తర్వాత ఇక్కడ ఉన్నవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ మేరకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని క్రీడాకారులు, కోచ్‌లు, సిబ్బందికి రెండు నెలల ముందుగానే సూచనలు చేసింది. సరిహద్దు భద్రత విషయంలో తమదేశం కఠినంగా వ్యవహరిస్తుంది. ఉల్లంఘనుల వీసాలు రద్దుచేసేందుకు సైతం వెనుకాడబోం అని ఆ దేశ హోంశాఖ మంత్రి పీటర్ డుట్టన్ వెల్లడించారు.



ఢిల్లీ: ఇండియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో నవ్వులు చిందిస్తున్న ఇండియన్ షట్లర్స్ సైనా నెహ్వాల్, పి.వి. సింధు, కిదాంబి శ్రీకాంత్ , స్పానిష్ క్రీడాకారిణి కరోలినా మారిన్.



ఢిల్లీ: భారతీయ ఓపెన్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో లైట్ వెయిట్ కేటగిరీలో ఇలాహి ఇంగాటాన్‌పై విజయం సాధించిన భారత బాక్సర్ కె. శ్యామ్‌ను విజేతగా ప్రకటిస్తున్న దృశ్యం.



ఢిల్లీ: కామెరూన్‌కు చెందిన క్రీడాకారిణి క్లాటిల్డే ఎస్సియాన్‌పై విజయం సాధించిన భారత క్రీడాకారిణి పూజా రాణి

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.

Lively
Interaction
For
Ever
లైఫ్
ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
బుధవారం 31 జనవరి 2018



నేను-నా ప్రజలు

భారత దేశ చరిత్రలోనే తొలిసారిగా మహిళల భద్రత కోసం.. పోలీసు శాఖలో షీ టీమ్స్ పేరుతో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదే! 2014 అక్టోబర్ నెలలో ప్రారంభమై..అక్టోబర్ 2017లో మూడు వసంతాల వేడుకలు జరుపుకున్న షీటీమ్స్....అనతికాలంలోనే ఆశించిన ప్రగతి సాధించాయనే చెప్పాలి. లైంగికంగా వేధింపులకు గురయ్యే మహిళల కోసం షీ టీమ్స్‌లో భాగంగా.. 2016లో భరోసా కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో అత్యాచార బాధితుల కోసం మొదటిసారిగా వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. బాధితులు ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయస్థానంలోని జడ్జి ముందు వాంగ్మూలం ఇవ్వవచ్చు. ఇక 2017 డిసెంబర్‌లో ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రెన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ యాక్ట్ క్రింద చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టులు ప్రారంభించారు. అయితే షీటీమ్స్ ద్వారా మహిళలకు మేమున్నామన్న భరోసాను కల్గించిన ఘనత మాత్రం ఆ విభాగం చీఫ్ స్వాతిలక్రాదే అనడం అతిశయోక్తి కాదు. మహిళలకు సురక్షితమైన, భద్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడంలో చేసిన అవిశ్రాంత కృషికి ఫలితంగా ఇటీవలే యూఎస్ ప్రభుత్వం నుంచి హంపరీ లీడర్ షిప్ అవార్డు అందుకున్నారు స్వాతి లక్రా! ఈ అవార్డుకోసం పది దేశాల నుంచి ఎంట్రీలు రాగా..మన దేశం నుంచి ఇద్దరు అధికారుల పేర్లను రికమెండ్ చేశారు. అయితే యూఎస్ కాన్సులేట్ స్వాతి లక్రా పేరును అవార్డుకు నామినేట్‌చేసిందంటే పోలీసు అధికారిగా ఆమె ప్రతిభ ఎంతటిదో అర్థంచేసుకోవచ్చు. ప్రస్తుతం మహిళల రక్షణ అనగానే గుర్తొచ్చేది షీటీమ్స్... మరి షీటీమ్స్ అంటే గుర్తొచ్చేది ఐపీఎస్ అధికారిణి స్వాతి లక్రా. 1995 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి స్వాతి లక్రా తన సర్వీసు కాలంలో ... ప్రజలతో ఎలా మమేకం అయ్యారో, ఎలాంటి సేవలు అందించారో వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...!

అతనికి భయం...ఆమెకు భరోసా!

అవసరం అనుకుంటే పీడీ యాక్టు

మహిళలకు మేమున్నామన్న భరోసా ఇవ్వడంలో షీటీమ్స్ విజయం సాధించింది. అదే సమయంలో మహిళలను వేధించేవారిలో మా నిఘా ఉందనే భయం కూడా కల్గించాము. వాస్తవానికి పబ్లిక్ ప్లేస్‌లలో వేధింపులకు గురవుతున్న మహిళలకోసం ఏర్పాటైన ఒక ప్లాట్ ఫామ్ షీటీమ్స్. గతంలోను మహిళలను వేధించేవారిపై పోలీసులు చర్యలు తీసుకునే వారు. కాని లా అండ్ ఆర్డర్ పోలీసులకు సమయం అంతా ఆ కేసుల పరిష్కారానికే సరిపోయేది. దీంతో వేధింపుల కేసులను అంత సీరియస్‌గా తీసుకునేవారు కాదు. బాధిత మహిళలు కూడా పోలీస్ స్టేషన్లకు వచ్చి ఫిర్యాదుచేసేందుకు వెనకాడేవారు. ప్రస్తుతం తమ రక్షణ కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు కావడంతో మహిళల్లో ఒక విధమైన నమ్మకం కలిగింది. న్యాయం కోసం ముందుకు వస్తున్నారు. ఫిర్యాదులు చేస్తున్నారు. లైంగికవేధింపులకు గురై వచ్చేవారిలో స్లమ్ ఏరియా మహిళల నుంచి సెలబ్రిటీల వరకు ఉంటున్నారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతాము. ఆ నమ్మకం కూడా బాధిత మహిళల్లో కలిగించాము. పర్యవసానంగా ఇంతకాలం వేధింపులకు గురై ఎవరికి చెప్పుకోవాలో తెలియక, పదిమందికి తెలిస్తే పరువు పోతుందన్న భయంతో ముందుకు రానివారు సైతం ఇప్పుడు ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. తమ బాధలు చెప్పుకుంటున్నారు. వేధింపులకు పాల్పడిన వారిపై అసరమైతే పీడీ యాక్టు పెడుతున్నాము. అందుకే మహిళలను వేధించాలంటే పురుషులు, ముఖ్యంగా యువకులు హడలి పోతున్నారు. వారిలో భయమే మహిళలకు భరోసాగా మారింది.

20శాతానికి పైగా వేధింపు కేసులు తగ్గాయి

ఆ మధ్య ఒక వ్యక్తి ఎడ్యుకేషన్ కన్సల్టెంట్ పేరుతో 300మంది మహిళలను లైంగికంగా వేధించాడు. అతను సంబంధిత విద్యా సంస్థ నుంచి ఇంటర్ విద్యార్థుల పేర్లు, ఫోన్ నెంబర్లను సేకరించి,..ఒక రిజిష్టర్ ఏర్పాటు చేసుకున్నాడు. దాదాపు30 మొబైల్ ఫోన్‌లు,30 సిమ్ కార్డులు అక్రమంగా కొనుగోలు చేసి, వాటిద్వారా అమ్మాయిలకు ఫోన్‌లు చేసి తాను విద్యాపరంగా మంచి భవిష్యత్తు కల్పిస్తానని నమ్మించేవాడు. ఈ ఫోన్ తతంగం అంతా చాలా నమ్మకంగా నెలరోజులు సాగించాడు. నమ్మిన వారిని నగర శివారుల్లో ఏర్పాటు చేసిన కార్యాలయానికి రప్పించి లైంగికంగా వేధించేవాడు. షీ టీమ్స్ మీది నమ్మకంతో ముగ్గురు ఇంటర్ విద్యార్థులు ముందుకు వచ్చి ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా ముగ్గురిని వేధించింది ఒకరేనని తేలింది. తీగలాగితే వాడి బండారం బయటపడింది. కేసు తీవ్రత దృష్ట్యా అతనిపై నిర్భయ, పీడీ యాక్టు కింద కేసు నమోదు చేశాము. దాంతో ఓ మృగాడి బారి నుంచి 300మంది మహిళలను రక్షించామనే తృప్తి మిగిలింది. ఇది ఛాలెంజ్‌గా తీసుకుని విచారణ జరిపిన కేసు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. షీటీమ్స్ పథకం మహిళలకు భద్రత, సురక్షితమైన వాతావరణం కల్పించడంలో సక్సెస్ అయిందనే చెప్పాలి. వేధింపులు ఎదుర్కొంటున్న మహిళలు ఇంకా ముందుకు రావాల్సి ఉంది. ప్రస్తుతం తెలంగాణలో 20 శాతానికి పైగా వేధింపు కేసులు తగ్గాయి. అది షీ టీమ్స్ కృషి ఫలితమే. సంఘటన జరుగుతున్నప్పుడు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడం..దానిని వీడియో రికార్డు చేసి, నిందితులను కోర్టు ముందు హాజరు పరచడం ఇదే షీటీమ్స్ ప్రథమ కర్తవ్యం. నగరంలో వంద షీ బృందాలు పనిచేస్తున్నాయి. అందరి దగ్గరా సీసీ కెమెరాలుంటాయి. బహిరంగ ప్రదేశాల్లో వేధింపులపైనే కాదు,సోషల్ మీడియాలో వేధింపులపైనా చర్యలు తీసుకుంటున్నాము. ఇప్పటి వరకు 3,779 మంది బాధిత మహిళల నుంచి ఫిర్యాదులు అందాయి. అందులో 1061 కేసుల్లో నిందితులకు వార్నింగ్ ఇచ్చి వదిలేసాము. 390 మందిపై పెట్టీ కేసులు నమోదు చేశాము. కేసు తీవ్రతను బట్టి పిడీయాక్టు,పోస్కో యాక్టు, నిర్భయ యాక్టు, ఐటీ యాక్టులకింద కేసులు నమోదయ్యాయి. 79మంది జైలు శిక్ష అనుభవిస్తున్నారు.



త్వరలో నిర్భయ ఫండ్స్

షీటీమ్స్ చీఫ్‌గా తెలంగాణ ప్రభుత్వ ప్రోత్సాహంతో కేంద్రం నుంచి నిర్భయ నిధుల కోసం ప్రయత్నిస్తున్నా. దీని కోసం ఢిల్లీ చుట్టు తిరుగుతున్నాను. ఫిబ్రవరి మొదటి వారంలో మళ్లీ వెళుతున్నాను. నిర్భయ నిధులు వస్తే తెలంగాణలో షీ టీమ్స్ సేవలు మరింత విస్తృతం అవుతాయి. మహిళలకు మరింత భద్రత కల్పించగలుగుతాము. త్వరలోనే షీ టీమ్స్ విభాగానికి నిర్భయ నిధులు వస్తాయన్న విశ్వాసం ఉంది. అది సాధిస్తే షీ టీమ్స్ మరో ముందడుగు వేసినట్లే!... ఇప్పటికే కేసుల విచారణలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తున్నాము. మూడో వార్షికోత్సవం సందర్భంగా ఇ-లెర్నింగ్ యాప్, షి టీమ్స్ ఫర్ మి.. వెబ్ సైట్ ప్రారంభించాము.



> లా అండ్ ఆర్డర్ విభాగంలో పనిచేసినా... షీటీమ్స్ చీఫ్‌గా ఉన్నా.. నేను ఇప్పటి వరకు ప్రజలకు ఏమి చేయగలిగాను...ఇక ముందు ఏమి చేయగల్గుతాను..అనేదే నా ఆలోచన!

- షీటీమ్స్ చీఫ్, అడిషనల్ పోలీస్ కమిషనర్ స్వాతిలక్రా!

నాకు ప్రజల ప్రయోజనమే ముఖ్యం

నా వరకు నాకు ప్రజలకు మేలు చేసేది.. చిన్న పనైనా.. పెద్దపనైనా..ఎంతో తృప్తినిస్తుంది. పని ముఖ్యం కాదు.. ప్రజలకు చేకూరిన ప్రయోజనం ముఖ్యం.. ఐపీఎస్ ట్రైనింగ్ పూర్తి అయిన తర్వాత నన్ను బీహార్‌కు కేటాయించారు. కాని మా వారు ఏపీలో ఉన్నందున నేను ఏపీకి వచ్చాను. ప్రప్రథమంగా నర్సీపట్నంలో ఎఎస్పిగా విధుల్లో చేరాను. ఆతర్వాత విజయనగరం, వరంగల్,హైదరాబాద్‌లలో ఎస్పీగా, విశాఖపట్నం, హైదరాబాద్‌ల్లో డీఐజీగా పనిచేశాను. లా అండ్ ఆర్డర్ విభాగంలో పనిచేసిన ప్రతిచోట.. దొమ్మీలు,దోపిడీలు, మర్డర్లు,మానభంగాలు.. యాక్సిడెంట్స్...కేసు ఏదైనా ప్రజలకు న్యాయంజరిగేలా ప్రయత్నించాను తప్ప..కేసు చిన్నదా? పెద్దదా? అని ఎప్పుడు ఆలోచించలేదు, ఆలోచించను కూడా!

నర్సీపట్నంలో ...

నర్సీపట్నం ఎస్పీగా పనిచేసినప్పుడు ..నక్సల్స్ ప్రభావం నుంచి అమాయక

స్వాతి లక్రా కృషి ఫలితం

ప్రజలు బయట పడేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించాను. ప్రజల్లో అవగాహన కోసం మీటింగ్‌లు నిర్వహించాను. మెడికల్ క్యాంప్‌లు కండక్ట్ చేశాను. పాఠశాలల్లో పిల్లలకు ఆటల పోటీలు నిర్వహిం చాను.పోలీసులు అంటే ప్రజలకు స్నేహితులు అనే భావన కల్గించగలిగాను. ఏదో క్షణికావేశంతో నక్సల్స్‌లో చేరిన యువతను జనజీవన ప్రవంతిలో కలిపే లక్ష్యంతో కార్యక్రమాలు నిర్వహిం చాను. నా ప్రయత్నం ఫలించింది. చాలా మంది నక్సల్స్ సరెండర్ అయ్యారు.

భాష విషయంలో ..

ప్రజల్లోకి వెళ్లి కార్యక్రమాలు నిర్వహించినప్పుడు భాష విషయం లో ఇబ్బందులు ఎదుర్కొన్నా. తెలుగు రాక పోవడంతో పీఏల ద్వారా భావమార్పిడి జరిగేది. నా భాష వారికి, వారి భాష నాకు అర్థం అయ్యేది కాదు. నేను అనుకున్నది సాధించాలంటే భాష నేర్చు కోవడం తప్పని సరి. అందుకే చాలా కష్టపడి తెలుగు నేర్చుకు న్నా.. నేను తెలుగులో మాట్లాడినప్పుడు అక్కడి ప్రజల్లో నాపట్ల ఒకవిధమైన ప్రేమ కనిపించేది. మనం ప్రజలకు దగ్గర కావాలంటే వారి భాషలో మాట్లాడడం ముఖ్యం. భాషలేకుండా ప్రజల్లోకి వెళితే ఏదో లోటుగా ఫీల్ అయ్యేదాన్ని. వృత్తిలో తృప్తి ఉండేది కాదు. ఇప్పుడు తెలుగులో బాగానే మాట్లాడు తున్నా..కాని ఇంకా నేర్చు కోవాలి... నేర్చుకుంటా!

విజయనగరంలో ..

నేను విజయనగరం ఎస్పీగా పనిచేసినప్పుడు ఒక కిడ్నాప్ కేస్ విషయంలో చాలా రిస్క్ తీసుకున్నాను. ఒడిషాలో బాలుణ్ణి కిడ్నాప్‌చేసి విజయనగరం తీసుకు వచ్చారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా బాలుణ్ణి చంపేస్తామని కిడ్నాపర్ల బెదిరింపు. గడువు తక్కువగా ఉంది. అంతటా ఉద్విగ్న వాతావరణం. ఏమాత్రం తేడా వచ్చినా బాలుని ప్రాణాలు పోవడం ఖాయం.



అప్పుడు చాకచక్యంగా కిడ్నాపర్ల చెరనుంచి బాలుణ్ణి కాపాడి వారి తల్లిదండ్రులకు అప్పగించా. అప్పుడు వారి కళ్లల్లో చూసిన ఆనందం ఎప్పటికి మరువలేను.

పోలీసు శాఖలో మహిళలకు 33శాతం రిజర్వేషన్

మహిళలకు మరింత భద్రత కోసం స్త్రీలు అధికంగా పోలీసు ఉద్యోగాల్లోచేరాలి. పోలీసు శాఖలో కానిస్టేబుల్ స్థాయినుంచి డిఎస్పీ స్థాయివరకు అన్ని స్థాయిల్లోని పోస్టులలో మహిళలకు 33.3 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఆడా,మగ అనే తేడా చూపకుండా పెంచాలి.మా నాన్న సుబోధ్ లక్రా..రైల్వే ఉద్యోగి. ఆయన ఎప్పుడూ నన్ను ,నా సిస్టర్‌ను ఆడపిల్ల అనే భావనతో పెంచలేదు.అందుకే ఈరోజు ఈస్టేజ్‌లో ఉండగలిగాను. తల్లి దండ్రులు అంతా ఆడా,మగ తేడా లేకుండా పిల్లలను పెంచితేనే ..వారిలో మానసిక దృఢత్వం పెరుగుతుంది. అప్పుడు టీజింగ్ సమస్యే ఉండదు!

- చొల్లేటి వేంకటేశ్వరా చారి

కొంపలు కూల్చే కొలువులు

భర్త చెప్పినట్లు భార్య వినాలి. ఇది ఒకనాటి మాట. ఇప్పుడు ఇద్దరూ సంపాదిస్తున్నారు. ఎవరి అభిరుచులు వారివి..ఎవరి వ్యక్తిత్వాలు వారివి. ఒకరిని ఒకరు అర్థం చేసుకుని సర్దుకు పోతేనే దాంపత్య బంధం కొనసాగుతుంది. లేదంటే ఎవరి దారి వారిది. అందుకే ఇటీవల విడాకుల కేసులు పెరిగిపోతున్నాయి. కారణాలు చూస్తే బాధేస్తుంది కూడా. తాను చెప్పిన మాట వినలేదనో.. తన అభిరుచికి అనుకూలంగా ఉండడం లేదనో...చిన్న చిన్న కారణాలతో ..ఇగోలకు పోయి...పచ్చని సంసారాల్లో నిప్పులు పోసుకుంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే మనీ విషవలయంలో మానవ సంబంధాలు చిక్కి శల్యమవుతున్నాయి. ఇక అసలు విషయానికి వస్తే..కొన్ని ఉద్యోగాలు కూడా విడాకులకు కారణం అవుతున్నాయి... అవును... యూఎస్ సెన్సెస్ బ్యూరో ఐదు సంవత్సరాలు నిర్వహించిన ఓ సర్వేలో ఈ విషయం వెల్లడైంది. కొన్ని రకాల ఉద్యోగాలే విడాకులకు దారితీస్తున్నాయన్న నగ్నసత్యాన్ని ఆ సర్వే తేల్చి చెప్పింది. ఇంతకూ ఆ ఉద్యోగాలేంటి?



గేమింగ్ మేనేజర్...

గేమింగ్ చాలా సరదాగా ఉంటుంది ఆడేవాళ్లకు..చూసేవాళ్లకు. కాని స్టార్ హోటళ్లు, రిసార్టులలో ఆ ఆటల నిర్వహణ బాధ్యతలు మోసే మేనేజర్లకు మాత్రం అదో తలనొప్పి. ఉద్యోగ ధర్మం తప్పదు భరించాల్సిందే. అంతేకాదు ఉద్యోగ స్వభావ రీత్యా... ఇంటికి వెళ్లినా వారు తమ భాగస్వామికి అధిక సమయం కేటాయించలేరట. దీంతో దంపతుల మధ్య దూరం పెరిగిపోయి విడాకులకు దారితీస్తోంది. సర్వే ప్రకారం ఈ ఉద్యోగం చేస్తున్నవారిలో అధికంగా 52.9 శాతం మంది విడాకులు తీసుకుంటున్నారట.



బార్‌టెండర్స్ ..

బార్ టెండర్స్‌గా కొనసాగేవారిలో కూడా విడాకుల సమస్య తీవ్రంగానే ఉంది. ఇలాంటి వృత్తిలో ఉన్నవారిలో 52.7శాతం మంది విడాకులు తీసుకుంటున్నట్లు సర్వేలో తేలింది. అర్థరాత్రి దాటిన తర్వాత కూడా బార్లలో పనిచేయడం ఒక కారణమైతే...,రెండో కారణం ఆల్కహాల్‌కు అలవాటు పడడం. వీరు ఉద్యోగరీత్యా బార్లోకి వచ్చే కష్టమర్లతో స్నేహంగా మెలగాలి. వాడు తాగి వాగినా సహనంతో భరించాలి. అన్నీ భరించి అర్థరాత్రి దాటాక ఇంటికి వస్తే .. అలసిన శరీరం విశ్రాంతి కోరుతుంది. దీంతో ఇలాంటి వారు కూడా తమ భాగస్వామితో అన్యోన్యంగా ఉండలేక పోతున్నారు. ఉండాలనుకన్నా సమయం చిక్కదు మరి!



విమాన సహాయకులు...

విమాన సహాయకుల జీవితం ఆకర్షణీయమైనదే. కాని మోడళ్లు,సెలబ్రిటీల అంత మాత్రం కాదు. ఈ ఉద్యోగం చేస్తే ప్రపంచంలోని అనేక ప్రదేశాలు చూడవచ్చు. అపాయింట్ మెంట్ తీసుకుంటే తప్ప మనం కలువలేని ..ప్రముఖులను,సెలబ్రిటీలను కలిసే అవకాశం లభిస్తుంది. అదో థ్రిల్లింగ్ కూడా. కాని అదే ఉద్యోగం వారి వైవాహిక జీవితానికి మాత్రం ప్రతిబంధకంగా మారుతుంది. వారి ప్రయాణాల కారణంగా భాగస్వామితో ఎక్కువ సమయం గడిపే అవకాశం దొరకదు. అదే విడాకులకు దారితీస్తుంది. సర్వే ప్రకారం విమాన సహాయకుల్లో 50.5శాతం మంది విడాకులు తీసుకుంటున్నారట.

టెలీమార్కెటర్స్...

టెలీకమ్యునికేషన్స్ రంగంలో పనిచేసే వారిలో మానసిక ఒత్తిడి అధికం. ఈ రంగంలో పనిచేసే వారిలో 49.7 శాతం మంది విడాకుల బారిన పడుతున్నారని సర్వేలో తేలింది. టెలీమార్కెటర్స్ ఉద్యోగం కష్టమర్ల ఫోన్ కాల్స్‌తో ప్రారంభమవుతుంది. కష్టమర్ల ఫిర్యాదులు స్వీకరించడం.,. పరిష్కారం చూపడంతోనే తెల్లారుతుంది. అయితే కాల్ చేసే కష్టమర్లు అంతా ఒకేలా ఉండరుగా. వారు ఎలామాట్లాడినా, దురుసుగా ప్రశ్నించినా..



మాటల్లో చిరునవ్వు ప్రదర్శిస్తూ...వచ్చే కోపాన్ని దిగమింగుకుని, చిరాకు తెలీకుండా మాట్లాడడం అనేది కత్తిమీది సాము. అందుకే వీరు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై.. ఇంటికి వెళ్లినా భాగస్వామితో అన్యోన్యంగా గడపలేరు. అలా దంపతుల మధ్య దూరం పెరిగి విడాకులకు దారితీస్తోంది.

ఇదీ యూఎస్ సర్వే రిపోర్ట్. విడాకులకు దారితీస్తున్న ఉద్యోగాలు చేసేవారి జీవితాలను గమనిస్తే... ఒక కామన్ పాయింట్ కనిపిస్తుంది. పైన చెప్పిన ఏ ఉద్యోగమైనా.. భాగస్వామితో ఎక్కువ సమయం గడపలేక పోవడం..లేదా అన్యోన్యంగా ఉండలేక పోవటం...

అనేదే విడాకులకు కారణం అవుతోంది. అంటే ఉద్యోగం ఏదైనా ఇంటికి వచ్చాక భాగస్వామితో అన్యోన్యంగా ఉండక పోతే విడిపోక తప్పదు. ఆవిషయం గుర్తు పెట్టుకుని తగిన జాగ్రత్తలు తీసుకుంటే... దాంపత్య బంధం నిండు నూరేళ్లు వర్ధిల్లుతుంది. లేదంటే....అంతే సంగతులు.. తస్మాత్ జాగ్రత్త!



ఆకు కూరలతో బ్రెయిన్ స్ట్రోక్‌కు చెక్!

ఆకుకూరలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇది అందరికి తెలిసిందే. కాని అదే ఆకుకూరలు ..మానసిక ఒత్తిడిని తగ్గించడానికి.. బ్రెయిన్ స్ట్రోక్ రాకుండా నిరోధించడానికి ఎంతగానో దోహదం చేస్తాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అమెరికన్ స్ట్రోక్ అసోషియేషన్స్ ఇంటర్నేషనల్ స్ట్రోక్ కాన్ఫరెన్స్ -2018.. ఈ మేరకు ఓ పరిశోధన నివేదికను వెల్లడించింది. నైజీరియా, ఘనా దేశాల్లో జరిపిన పరిశోధనల్లో ఎక్కువ సమయం పనిచేసే వయోధికులు, అధిక రక్తపోటు ఉన్న వారిలో 90శాతంకు పైగా స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఉన్నాయని తేలింది. అయితే ఆకుకూరలు తినడం వల్ల ఈ రిస్క్ 64 శాతం వరకు తగ్గిపోతుందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. సగటున 53 సంవత్సరాల వయస్సున్న 682 మంది బ్రెయిన్‌లో రక్తస్రావం అవుతున్న బాధితులపై ఈ అద్యయనం చేశారు. పరిశోధనల ప్రకారం....రక్తస్రావం వల్ల 32.2 శాతం మంది స్ట్రోక్‌కు గురవుతున్నారు. ఇందులో కూడా 93.9 శాతం మంది అధిక రక్తపోటు కారణంగా స్ట్రోక్ బారిన పడుతున్నారు.7.2 శాతం రక్తనాళాలు ఉబ్బడం,మెడిసిన్ వాడకం కారణంగా కూడా స్ట్రోక్ కు గురవుతున్నారు. అధిక రక్తపోటు, బ్రెయిన్‌లో రక్తస్రావం ఉన్నవారికంటే డయాబెటీస్ పేషెంట్లు 2.33 రెట్లు, ఇంటా , బయటా అధిక ఒత్తిడికి గురయ్యేవారు 2.22రెట్లు, ఆల్కహాల్ ఎక్కువగా తీసుకునే వారు 1.69 రెట్లు, పొగతాగేవారు 10.01 రెట్లు అధికంగా స్ట్రోక్ బారిన పడే అవకాశాలు ఉన్నాయి.



వయసు మీరితే..

కాబోయే అమ్మల్లో కలత నిద్ర!

అరవై నాలుగుశాతం మంది గర్భిణుల్లో ఆరునెలల తరువాత ,,,అంటే గర్భధారణలో చివరి మూడు నెలల్లో నిద్రలేమి సమస్య ఉంటున్నదని...స్పెయిన్ దేశపు పరిశోధకులు ఒక అధ్యయనంలో తేల్చారు. అధికబరువు ఉన్నవారిలో, ఆలస్యంగా గర్భం ధరించినవారిలో ఈ సమస్య మరింతగా ఉన్నట్టుగా వారు గమనించారు. ఒక యూరప్ వైద్యపత్రికలో ఈ వివరాలు ప్రచురించారు. అరవై నాలుగు శాతం అంటే ...సమస్య చాలా తీవ్రంగా ఉన్నట్టుగా భావించాలని...దీనికి ఒక నిర్దిష్టమైన పరిష్కారాన్ని కనుగొనాల్సి ఉంటుందని వారు భావిస్తున్నారు. సాధారణంగా గర్భధారణకు ముందు నిద్రకు సంబంధించిన సమస్యలుంటే అవి ఈ సమయంలో మరింతగా పెరగటం, కొత్త సమస్యలు ఏర్పడటం లాంటివి చూస్తుంటామని వారు చెబుతున్నారు.

గర్భిణుల్లో నిద్రలేమి వలన డిప్రెషన్, గర్భధారణ లో వచ్చే మధుమేహం, అధిక రక్తపోటు, నెలలు నిండాకుండానే ప్రసవం లాంటి సమస్యలు రావచ్చని... అందుకే నిద్రలేమి సమస్య ఉన్న వారు గర్భధారణకు ముందే దానిని పరిష్కరించుకోవాలని వారు సలహా ఇస్తున్నారు. గర్భధారణ సమయంలో వైద్యుల సలహామేరకు వ్యాయామం చేయాలని, అలా చేసినప్పుడు నిద్రలేమి ఉండదని ...ఈ అధ్యయన నిర్వాహకులు అంటున్నారు.

సర్వార్థ సాధకం మాఘ స్నానం



మాఘ మాసంలోని పర్వాలలో మాఘ పూర్ణిమ ఒకటి. ఈ రోజు చేసే స్నానాన్ని మాఘ స్నానం అంటారు. ఈ రోజు సముద్ర, పుణ్య నదీ స్నానాలు చెప్పబడ్డాయి. ఉత్తర భారతంలో ఈ రోజుతో మాఘ మాసం ముగిసినట్టుగా భావిస్తారు. ఈ పర్వం సందర్భంగా ప్రయాగలో ప్రతి ఏటా మాఘ మేళా నిర్వహిస్తారు. ఈ మేళా సందర్భంగా వేలాది మంది పవిత్ర త్రివేణీ సంగమంలో స్నానాలు చేస్తారు. ఈ రోజున గంగా, యమున, గోదావరి, నర్మద, కావేరి, కృష్ణ తపతి వంటి పుణ్యనదుల్లోను, కన్యాకుమారి, రామేశ్వరాల్లో సముద్ర స్నానాలు చేయడానికి దూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తారు. ఇక రాజస్థాన్‌లోని పుష్కర్ సరస్సులోను, తమిళనాడులోని కుంభకోణంలోగల సారంగ పాణి, నాగేశ్వర దేవాలయాల సమీపంలో ఉన్న పెద్ద కొలనులోను పుణ్య స్నానాలు చేస్తుంటారు. ఆ రోజు గంగానదిలోని పుణ్యజలం ఈ సరస్సులోకి వచ్చి చేరుతుందని నమ్ముతారు. అటు వంటి ప్రదేశాలకు వెళ్లలేనివారు దగ్గరలోని నదులు, చెరువులు వంటి వాటిలో మాఘ స్నానాలు ఆచరిస్తారు. ఇక ఎక్కడికీ వెళ్ళలేనివారు ఇంటిలోనే **గంగే చైయమునేచైవ గోదావరి సరస్వతీ నర్మదే సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధిం కురు** అని ఆయా నదుల పుణ్య జలాలు తాను స్నానం చేసే జలంలోకి వచ్చినట్లు భావించి స్నానం చేస్తే ఆ పుణ్యం లభిస్తుందని పెద్దలు చెబుతారు. సూర్యోదయానికి ముందే లేచి భగవన్నామ స్మరణ చేస్తూ స్నానం చేయాలి. ఇది పాపాలు తొలగించడమే కాదు పుణ్యప్రదం కూడా. ఇక స్నానం గురించి చెప్పాలంటే సూర్యోద యానికి అరగంట ముందు చేసే స్నానాలు శ్రేష్ఠం. ఈ స్నానాలకు అధిష్ఠాన దైవం సూర్యుడు. ఈ స్నానానికే కాదు ఏ స్నానానికైనా ప్రవహించే జలం శ్రేష్ఠం. ఇక మాఘ స్నానం చేసే టప్పుడు చదవాల్సిన సంకల్ప శ్లోకం ఇది అని పెద్దలు చెబుతారు. అది



దుఃఖ దారిద్ర్య నాశాయ
శ్రీవిష్ణోస్తోష ణాయచ
ప్రాతఃస్నానం కరోమ్యద్య
మాఘే పాప వినాశనమ్

దుఖ దారిద్ర్యాలు తొలగేందుకు, విష్ణు ప్రీత్యర్థం, ప్రాతః కాలంలో సర్వ పాపాలను తొలగించే ఈ మాఘ స్నానం చేస్తున్నామని దీని అర్థం.

మాఘ స్నానం ఉత్కృష్టతను తెలిపే పలు కథలు ఉన్నాయి. బ్రహ్మ వైవర్త పురాణం ప్రకారం మాఘ మాసంలో శ్రీమహావిష్ణువు గంగానదిలో కొలువై ఉంటాడు. అటువంటి మాసంలో పౌర్ణమి రోజున గంగా స్నానం పుణ్యప్రదమని చెబుతారు. ఆ నది నీరు ఒక్క చుక్కను తాకినా పాపాలు, రోగాలు నశిస్తాయని చెబుతారు. మరో కథనం ప్రకారం విష్ణువు పవళించి ఉండే క్షీర సాగరమే గంగ అని ఆ నదిలో విష్ణు ప్రీతికరమైన ఈ రోజు స్నానం చేయడం పుణ్యప్రదమని చెబుతారు. బ్రహ్మర్షి విశ్వామిత్రుడు ఒకప్పుడు కుంభమేళా సమయంలో మాఘ పూర్ణిమ రోజునే గంగా నదిలో స్నానమాచరించాడని అంటారు. ఇంతటి పవిత్రమైన మాఘ మాసంలో ఎంతో పవిత్రమైన పౌర్ణమి రోజున మాఘ స్నానం ఎంతో పుణ్యప్రదమైనది.

మాఘ పౌర్ణమి రోజున ఉపవాసం చేయడం, పితృదేవతలకు తర్పణాలు వదలడం వంటివి కూడా చేసే ఆచారం ఉంది. కొందరు విష్ణు ప్రీత్యర్థం సత్యనారాయణ వ్రతం కూడా చేస్తారు.


బౌద్ధులు కూడా ఈరోజు హిందువులకే కాదు బౌద్ధులకూ ప్రముఖమైనదే. గౌతమ బుద్ధుడు తన మరణం గురించి ముందుగా ఈ రోజునే ప్రకటించారని చెబుతారు. ఈ రోజున వారి విహారాలపై తెల్లవారు జామునే పతాకాలు నిలిపి త్రిపిటకాల పఠనం చేస్తారు.

సేకరణ: జి.పి

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

స్వప్న దర్శనాలు



(గత సంచిక తరువాయి భాగం)

భగవాన్ చిరునవ్వుతో ''ఏమో ఎవరికి తెలుసును. వారన్నారంతే''నన్నారు. మరొక భక్తులందుకొని ''కే.కే. నంబియారు నోటు పుస్తకం గూడా ఈ విధంగానే వచ్చింది గాబోలే?'' అన్నారు. ''అవునవును. అప్పుడు మాధవుడిక్కడున్నాడు, రమణగీతకు మళయాళంలో తాత్పర్యం వ్రాసి సరిగా కాపీ చేద్దామని పొడుగ్గా వుండే నల్లఅట్ట నోటుబుక్కు బీరువాలో వున్నది. తీసి ఇవ్వమని వాడితో చెపుతూ వచ్చాను. వాడు ఇస్తాఇస్తానంటూ నాలుగైదు రోజులు మరచి పోయినాడు. ఇంతలో నంబియారిక్కడికి వస్తూ, సరిగ్గా నేను ఎటువంటి నోటుబుక్కు అడుగుతున్నానో అటువంటిదే తెచ్చి ఇచ్చారు. 'ఇదేమయ్యా, సరిగ్గా నేనడుగుతున్న పుస్తకం వంటిదే తెచ్చారే? అంటే 'భగవాన్ నాకు స్వప్నంలో కనుపించి, ఇన్ని పేజీలూ, ఇంత వెడల్పూ, పొడుగూ గల పుస్తకం కావాలని అడిగారు. అంగడికి వెడితే సరిగ్గా అటువంటిదే దొరికింది. తెచ్చా'నన్నారు. ఇంతలో మాధవుడు వచ్చాడు. ''ఏమోయ్? ఇదుగో పుస్తకం. నీవే ఇచ్చావు గదూ?'' అన్నాను. వాడు ఆశ్చర్యపడి వెనక విషయం తెలుసుకొని ఇక్కడున్న పుస్తకం తీసి చూస్తే రెండూ ఒకే సైజుగా వున్నవి. రమణగీత, శ్లోకసహితంగా తాత్పర్యమంతా ఆ పుస్తకంలో ఇమిడిపోయింది. అది వ్రాసి ముగించగానే నంబియారు వచ్చి 'అచ్చువేయిస్తా'నని తీసుకొని వెళ్లి 'భగవాన్ అక్షరం ప్రెస్సుకు పంపటమా;' అని వేరొక కాపీ వ్రాసి ప్రెస్సుకి పంపి ఆ పుస్తకం వారి వద్దనే దాచి పెట్టుకున్నారు. ఇప్పటికీ వారి వద్దనే వుండాలి. అడుగో ఆ రాజగోపాలం అట్లాగే చేశాడొకసారి. నేనిక్కడ సిరా అయిపోవటం చూచి 'అయిపోయిందయ్యా' అని వీరితో ఒకటి రెండుసార్లన్నాను. మరుదినమో మూడవనాడో వీరు ఊరి నుండి వస్తూ ఇంత పొడుగు సిరా సీసా తెచ్చారు. 'మేం సిరా అయిపోయిందనుకోటం నీకెట్లా తెలిసిందయ్యా! అంటే 'భగవాన్ నాకు స్వప్నంలో కనుపించి సిరా కావాలన్నారు. తెచ్చా' నన్నాడు. ఇట్లాగే ఒక్కొక్కటీను''అన్నారు భగవాన్.

''అట్లా చెప్పారు భగవానని అంటారు గదా. అవన్నీ నిజమేనా?'' అన్నారా భక్తులు, ''ఏమో నాకేం తెలుసును. వారట్లాగని చెప్పారు. అంతే''నన్నారు భగవాన్. ''పోనీ భగవాన్ ఇక్కడ లేదనుకున్న వస్తువే అక్కడ వారికి స్వప్నంలో కావాలన్నట్లు తోచటం చిత్రమే గదా?'' అన్నారా భక్తులు. ''ఊ, ఊ'' అంటూ పలక్కుండా ఊరుకున్నారు భగవాన్.

దివ్యదర్శనాలు

శ్రీరమణాశ్రమం
18-4-47

ఈ ఉదయం ఎనిమిది గంటలకు వయోవృద్ధులొకరు భగవాన్ ఉన్న హాలులోకి వస్తూ వుంటే భగవాన్ నా వైపు చూచి ''ఈ వచ్చేదెవరో తెలుసునా?'' అన్నారు. తెలియదన్నాను. ''నా పినతల్లి కూతురు ఒకామె నాతోపాటు అమ్మవద్ద పాలు త్రాగిందని చరిత్రలో వ్రాసి ఉన్నదే ఆమె భర్త'' అన్నారు భగవాన్. (వారి పేరు మానామధుర రామస్వామి అయ్యర్) ఆమె పేరేమి?'' అన్నాను. ''మీనాక్షి'' అన్నారు భగవాన్. ''అప్పుడప్పుడు వీరిని చూస్తున్నాను గాని ఈ సంబంధం తెలియదు'' అని సమీపస్థులగు మరొక భక్తులను చూచి ''మీరెరుగుదురా?'' అన్నాను. ''ఎరుగకేమి. ఆమెకు మరణ సమయంలో భగవాన్ దర్శనమిచ్చారని కూడా విన్నాను''అన్నారా భక్తులు. ఆశ్చర్యంతో భగవాన్ వైపు చూచి ''అట్లాగా?'' అన్నాను. భగవాన్ అందుకొని ''అవును. తిరువత్తూరులో నాయనగారికి జరిగినట్లే ఆమె విషయంలో జరిగింది. నేను దగ్గరకు వెళ్లి ఆమెను తాకాను. ఆమె ఉలిక్కిపడి ''ఎవరూ తాకింది?'' అన్నది. అంతే. వెంటనే మెలకువ కలిగింది. వెనక విచారిస్తే అదే సమయానికి ఆమె చరమదశలో వున్నదని తెలిసింది''అన్నారు.

(తరువాయి భాగం వచ్చే సంచికలో)

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

ఒక్కొక్కరికి ఒక్కో బలం

ప్రతివానికి ఒక బలహీనత ఉన్నట్టే ప్రతి వ్యక్తికి ఒక బలం కూడా ఉంటుంది. బలం అంటే శారీరక బలమే కాదు. రక్షణ కోసం ఏమి చేస్తాడో అది. ఏది అతనికి క్షేమకరమో అది. ఏది అక్కరకు వస్తుందో అది. ఈ బలం గురించి ఒక సంస్కృత సుభాషితం ఉంది. అది

దుర్బలస్య బలం రాజా
బాలానాం రోదనం బలం
బలం మూర్ఖస్య మౌనిత్వం
చోరాణాం అనృతం బలం

దుర్బలస్య బలం రాజా అనేది మొదటిది. అన్ని విధాలా బలహీనుడికి రాజే బలం. అంటే బలహీనుణ్ని బలవంతుడు మోసం చేసినపుడు అతను ఎక్కడికి వెళ్ళాలి. పాలకుని దగ్గరకు గాని, న్యాయస్థానానికి గాని, రక్షణ కల్పించే అధికారుల వద్దకు గాని వెళితే వారు అతనికి న్యాయం చేస్తారు. పూర్వం రాజులు ప్రజల బాగోగులు చూసేవారు. రక్షణ కల్పించేవారు. ఆ శక్తి అధికారాలు ఆ రోజుల్లో రాజుల చేతుల్లోనే ఉండేవి. అందువల్ల బలహీనుడు తనకు అన్యాయం జరిగితే, రక్షణ లోపిస్తే రాజు వద్దకు వెళ్లి రక్షణ పొందేవాడు కనుక అతని బలం రాజు అని చెప్పారు.

ఇక పిల్లలకు రోదనం బలం అన్నారు. అంటే వారికి ఏడుపు బలం. నడవలేని శిశువు దగ్గర నుంచి కొన్ని ఏళ్ల వరకూ రోదనమే బాలల బలం. ఉయ్యాలలో ఉన్న శిశువు కూడా తన వద్దకు ఎవరైనా రావాలి అంటే తనకేదైనా కావాలి అంటే ఏడుపు లంకించుకుంటాడు. అప్పుడు ఎవరో వస్తారు అని శిశువుకు తెలుసు.

ఒక వయసు వచ్చిన బాలుడు కూడా తనకు కావలసింది సాధించుకునేందుకు రోదనతో కూడిన మారాంనే ఆశ్ర యిస్తాడు. అందువల్ల బాలలు కార్యసాధనకు ఉప కరించేది రోదనం కనుక అదే వారికి బలం అని చెప్పారు.

మూర్ఖుల విషయానికి వస్తే వారు మౌనంగా ఉండటమే మంచిది. ఎందుకంటే వారు మాట్లాడితే వారి మూర్ఖత్వం బయటపడుతుంది. మాటల వల్ల అవతలివారు ఎలాంటి వారో అవగతమవుతుంది. అందువల్ల మాట్లాడకుండా మౌనంగా ఉండటం ఉత్తమం. ఆ విధంగా వారి మూర్ఖత్వం బయటపడకుండా ఉంటుంది.

ఇక దొంగలు, నేరస్థులు తప్పు చేసి తప్పించుకోడానికి ఆశ్రయించేది అబద్ధాన్ని. తప్పు చేసిన వారు నిజం చెబితే శిక్ష పడుతుంది కనుక రక్షణ కోసం వారు అబద్ధాన్ని ఆశ్రయిస్తారు. ఇది సర్వ సాధారణంగా జరిగేదే. అందరూ సత్య సంధులైతే ఇన్ని కోర్టు కేసులు ఉండవు. తప్పులు చేసేవారు, దాని నుంచి తప్పించుకోవాలనుకునేవారు అన్ని కాలాల్లోనూ ఉంటారు. వారి సంఖ్యలో ఎక్కువ తక్కువలు మాత్రం ఉంటుంటాయి.






అన్నిటికి మూలం కర్మఫలం

ధర్మం-మర్మం

సకల ప్రాణకోటి ఆయుష్షు, వారి జీవన విధానము, సుఖదుఃఖాలు, నివాస ప్రదేశము, ఇతరుల సాంగత్యము అన్నీ కర్మ ఫలితమే. ఈ సత్యం తెలిసిన వారు అప్రయత్నంగానే పరమాత్మ విశ్వరూపాన్ని, అనంత నామాలను స్మరించినవారవుతారు. భగవంతుని నామాన్ని స్మరించక హిమాలయాలు, నదులు వంటి ప్రకృతి సంపద గురించి తెలుసుకోవాలన్న ఉత్సాహం కలవారు ఇవన్నీ ఆ పరమాత్మ యొక్క దివ్యమైన, అద్భుతమైన లీలాకల్పనే అన్న భావన కలిగిన నాడు మేధావులకు కూడా అందని విశ్వ రహస్య వైభవం, మాటలకి అందని మహాద్భుత పరిణామాలు పదే పదే తెలుసుకుంటే అప్రయత్నంగానే పరమాత్మ యందు భక్తి కలుగుతుంది. మన స్వరూపం, స్వభావం మారి ఉత్తమ జీవనం, ఉత్తమ ఆనందం, ఉత్తమ లోకాలు లభిస్తాయి. తుదకు పరమాత్మ రూపాంతరాలు కాకుండా పరమాత్మ అసలు రూపమే కావాలన్న కోరిక కలుగుతుంది. భూగోళ, ఖగోళ విజ్ఞానానికి అంతిమ ఫలం ఇదే.

ఈ విధంగా భూలోకములోని సకల ద్వీప, వర్ష, సముద్ర, నదీ, పర్వత, అరణ్య, దేవ, దానవ, యక్ష, రాక్షస, కిన్నెర, కింపురుష, ఆది, ప్రాణ, వస్తు, ప్రదేశ భేదాలు ఉన్న భూలోకము లోకాలోకాచల పర్వతము వరకు ఉన్నదని తెలుసుకున్నాము. అటు తర్వాత ఉన్నది ఏమిటో యోగీశ్వరుడైన పరమాత్మకు, తమ యోగ ప్రభావంతో పర మాత్మ కృపతో వెళ్లే వారికి మాత్రమే తెలియాలి.



- డా॥ కందాడై రామానుజాచార్య

దినఫలాలు

వేషరాశి: పనులలో శ్రమ తగ్గుతుంది. ఆరోగ్యంలో అనుకూల మార్పులు చేకూరుతాయి. ఆర్థిక చిక్కులు మెల్లమెల్లగా పరిష్కరింపబడతాయి. శత్రుభీతి తగ్గుతుంది.

వృషభరాశి: అనుకూల పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ప్రయాణాల ద్వారా అనుకూలత ఉంటుంది. ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు పొందుతారు. కుటుంబ వ్యవహారాల్లో సమస్యలు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

మిథునరాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు కలసి వస్తాయి. మానసిక ధైర్యం తగ్గుతుంది. ఆర్థిక అవమాన పరిస్థితులు కొనసాగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గతంలోని ఒప్పులు ఇప్పుడు తప్పులుగా మారతాయి. అధిక ప్రయత్నాలతో ఆదాయ పరంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి.

కర్కాటకరాశి: దూరప్రయాణాలు కలసి వస్తాయి. అభివృద్ధి కుటుంబరీత్యా ఆనందాన్ని కలిగిస్తుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. ఆలోచనదోషాల ద్వారా సమస్యలు, అవమానాలు ఉంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆదాయ మార్గాలు అనుకూలం.

సింహరాశి: ఆర్థిక ప్రయత్నాలు అనుకూలం. వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం పర్వాలేదు. ఆర్థిక విషయాల్లో సులువుగా అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో ఆశాజనకమైన వాతావరణం ఉంటుంది.

కన్యారాశి: ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆహ్లాద పరిస్థితులు గృహ రీత్యా ఉంటాయి. సంబంధ, బాంధవ్యాల విషయంలో మనస్పర్ధలు చోటు చేసుకుంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు కొనసాగుతాయి. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి

తులారాశి: విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. కళారంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది. ముఖ్యమైన పనులలో జాప్యాలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

వృశ్చికరాశి: వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ఉద్యోగ వ్యవహారాల్లో ఆశించిన ఫలితాలు లభిస్తాయి. మానసిక చిరాకులు తగ్గుతాయి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యాలలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో అనుకూల/ప్రతికూలతలు ఉంటాయి.

ధనూరాశి: ఉద్యోగ వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆదాయంలో ప్రతికూలత ఉంటుంది. వేగంగా నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. గతంలోని పొరపాట్లు సరిదిద్దుకోగలుగుతారు. కుటుంబ వ్యవహారాల్లో ఆచితూచి వ్యవహరించాలి.

మకరరాశి: ఆరోగ్య రీత్యా అనుకూలత ఉంటుంది. విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. ఆదాయానికి అనుకూల పరిస్థితులు ఉంటాయి. సంబంధ బాంధవ్యాలు మెరుగవుతాయి. ఆర్థిక వ్యవహారాలు అనుకూలం.


కుంభరాశి: సంబంధ బాంధవ్యాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గృహకార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. ఆరోగ్య క్రమశిక్షణ తప్పనిసరి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. వ్యాపార అనుకూలత ఉంటుంది.

మీనరాశి: విద్యా ప్రయత్నాలు అనుకూలం. నూతన స్నేహాలు అనుకూలిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆరోగ్య ఖర్చులు తగ్గుతాయి. కోర్టు వ్యవహారాల్లో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

భగవద్గీత



భగవంతుని పూజించిన వారికే భగవద్ధామం

అధ్యాయం 7

శ్లోకం 23

అంతవత్తు ఫలం తేషాం
తద్భవత్యల్పమేధసామ్।
దేవాన్ దేవయజో యాంతి
మద్భక్తా యాంతి మామపి॥

తాత్పర్యం

అల్పబుద్ధి కలిగిన మనుజులు దేవతలను పూజిస్తారు. ఆ దేవతలు ఒసగే ఫలాలు అల్పములు, తాత్కాలికములై యున్నవి. దేవతలను పూజించువారు దేవతాలోకములు చేరగా, నా భక్తులు మాత్రము అంత్యమున నా దివ్యలోకాన్ని చేరుతారు.

భాష్యం

కొంతమంది భగవద్గీత పై వ్యాఖ్యానము చేస్తూ ఎవరిని పూజించినా దేవాదివేవుడినే చేరు కోవచ్చు అని చెబుతారు. కాని ఈ శ్లోకములో ఆ అవగాహన తప్పని నిరూపించబడినది. దేవతలను పూజించినవారు ఆ దేవతల లోకాలకు మాత్రమే వెడతారు. ఇంద్రుణ్ని పూజించిన వారు ఆయన ఉండే లోకానికే వెళతారు. అలాగే భగవంతుణ్ణి పూజించిన వారు మాత్రమే భగవద్ధామానికి వెళ్ళే అవకాశాన్ని పొందుతారు. దేవతలు భగవంతుని శరీరంలో భాగాలే. వేరు వేరు దేవతలు భగవంతునికి సమానులు గాని స్వతంత్రులు గాని ఎన్నటికీ కాలేరు. అంతేకాక దేవతలను పూజిస్తే వచ్చే ఫలితాలు అశాశ్వతమైనవి. దేవతలు, వారి లోకాలే అశాశ్వతమైనపుడు వారిచ్చే వాటి గురించి చెప్పనేల? అయితే భగవంతుని భక్తి ద్వారా వచ్చే ఫలితాలు శాశ్వతమైనవి, అపరిమితమైనవి. భగవంతుడు తరగని దీవెనలను కృపను ఇవ్వగలడు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

ప్రత్యేకం



కళ్ల ఎదుట అన్యాయం జరుగుతుంటే అందరిలా ఆమె ఊరుకోలేకపోయింది. తన కళ్లముందు ఆడపిల్లల జీవితాలు అధోగతిపాలవుతుంటే చూస్తూ ఉండలేకపోయింది. అన్యాయాన్ని ఎదిరించడానికి ధైర్యంగా ముందడుగు వేసింది. ఆ నేరం చేసేది ఊరి పెద్దలే అని తెలిసినా వెనుకంజ వేయలేదు. ధైర్యంగా వారిని ఎదిరించి, నేటికీ న్యాయం కోసం వారితో పోరాటం కొనసాగిస్తూనే ఉంది. ఆమే భన్వారీదేవి.



అరాచకాలపై అలుపెరగని పోరాటం!

భన్వారీ దేవి రాజస్థాన్‌కి చెందినది. ఆమె వయసు 57సంవత్సరాలు. ఆమె రాజస్థానీ లెహంగా వేసుకుని సాంప్రదాయక దుస్తులలో కనబడుతుంది. ఆమె కేవలం వారి ప్రాంతానికి చెందిన భాషనే మాట్లాడగలదు. వేరే ఏమీ రావు. 1992సం.లోనే లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని మొట్టమొదటిసారిగా లేవనెత్తిన మహిళ ఆమె. ఈ ఉద్యమం వల్ల నేటికీ లక్షలాది మంది మహిళలు లైంగికవేధింపుల బారి నుండి రక్షింపబడుతున్నారు. ఆమె చేసిన చట్టం వల్ల మహిళలు ఆఫీసులలో ఆత్మ విశ్వాసంతో పనిచేయగలుగుతున్నారు. పనిచేసే చోట ఎటువంటి వ్యతిరేకత లను ఎదుర్కోవటం లేదు. మినిస్ట్రీ ఆఫ్ ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్ మెంట్ సర్వే ప్రకారం భారతదేశంలో రోజుకి లైంగిక వేధింపుల విషయంలో ఒక్క కేసైనా నమోదవుతుందని, 2014 వరకు 1971 కేసులు నమోదు అయినట్టు సమాచారం. లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా చట్టాన్ని సాధించగలిగామంటే దానికి కారణం భన్వారీదేవి సాహసమే. ఆమె చేసిన పోరాటస్ఫూర్తే మహిళలకు రక్షణ కవచంగా నిలిచింది.



ఆమె చేసిన పనికి శిక్ష విధించారు

1985సం.లో రాజస్థానీ స్టేట్ గవర్నమెంట్ ఉమెన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో ఆమె ఒక ఉద్యోగి. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఆమె చర్యలు తీసుకోవాలి. కేవలం వీటిపట్ల ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా పై అధికారులకు ఈ వివాహాల గురించి, సంఘటనల గురించి ఎప్పటికప్పుడు రిపోర్టు చేయాలి. ఈవిషయాల గురించి ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసేది. మహిళలు ఫ్యామిలీ ప్లానింగ్ పాటించాలని, బాలికా విద్యను ప్రోత్సహించాలని, భ్రూణహత్యలు, లింగ నిర్ధారణ హత్యలు, వరకట్న వేధింపుల, బాల్యవివాహాలను అరికట్టాలని అందరికీ చెప్పేది.

1992లో ఆమె తొమ్మిది నెలల పిల్లకు పెళ్లిచేయడాన్ని వ్యతిరేకించింది. వాళ్ల తల్లి దండ్రులకు ఈ వివాహం గురించి అవగాహన కల్పించడానికి ప్రయత్నించింది. మీ నిర్ణయం తప్పని చెప్పింది. ఆమె వివాహం కూడా ఆరుసంవత్సరాల వయసులోనే అయ్యింది. బాల్యవివాహం వల్ల ఏర్పడే ఇబ్బందులేమిటో ఆమెకు తెలుసు కాబట్టి ఆ వివాహం ఆపడానికి ప్రయత్నించింది. కాని వాళ్లు ఉన్నత కులస్థులైన గుజ్జార్ వర్గానికి చెందినవారు. వారు ఆమె మాట వినకుండా వివాహానికి సిద్ధమయ్యారు. ఉన్నత వర్గాన్ని ఎదిరిస్తే ఎటువంటి సమస్యలొస్తాయో ఆమెకు తెలిసినా తన కళ్లముందు అమ్మాయి జీవితం అన్యాయం అయిపోతుందని ఎదిరించింది. ఈ వివాహం గురించి పోలీసులకు సమాచారమందించింది. తక్కువ కులానికి చెందిన మహిళ కావడంతో ఆమె చెప్పిన మాటలు ఎవరూ నమ్మలేదు. అయినా ఆమె పట్టుబట్టడంతో ఒక పోలీసు ఆ గ్రామానికి తనిఖీకి వచ్చాడు. ఆ ఊరిపెద్దలు అతనికి డబ్బులు ఇచ్చి కేసును తారుమారు చేశారు. స్టేషన్‌కి వెళ్లిన పోలీస్ పై అధికారులకు భన్వారీ తప్పుడు సమాచారమిచ్చిందని, అక్కడ అటువంటిదేమీ జరగటం లేదని రిపోర్టు ఇచ్చాడు. ఆమె ఆశ్చర్యంతో మౌనంగా నిలబడిపోయింది. ఆ పెళ్లయిన మరుసటిరోజు నుండి ఆమె మీద హింస మొదలైంది. తక్కువ కులానికి చెందిన మహిళ ధైర్యంగా మామీద కంప్లయింట్ ఇవ్వడమేమిటని ఊరి పెద్దలు తీవ్రంగా చర్చించటమే కాకుండా ఆమెకు వ్యతిరేకంగా గ్రామస్తులను తయారుచేశారు. ఊరి ప్రజలు కూడా ఆమె అలా కంప్లయింట్ చేయడం తప్పని ఆరోపించారు.

1992, సెప్టెంబర్22న భన్వారీ దేవి గ్యాంగ్ రేప్‌కి గురయ్యింది. ఆమె భర్త కళ్ల ముందరే ఆమెను ఐదుగురు వ్యక్తులు బాగా కొట్టి బలాత్కరించారు. కళ్లముందు ఇంత ఘోరం జరుగుతున్నా గ్రామస్థులంతా మౌనం వహించారు. ఏ ఒక్కరూ ఈ ఘోరాన్ని ఆపడానికి ముందుకు రాలేకపోయారు అని భన్వారీదేవి బాధపడింది. ఆమె, భర్త ఇద్దరూ పోలీసులను కలిసి ఈ విషయంపై కంప్లయింట్ చేశారు.

పోలీసులు అసలు కేసు నమోదు చేయడానికి కూడా అంగీకరించలేదు. ఆమెను వ్యంగ్యమైన మాటలతో హింసించారు. అయినా సరే తనకు న్యాయం జరిగే వరకు పోరాడుతూనే ఉంటానని భన్వారీ ఇప్పటికీ కూడా తనకు జరిగిన ఘోరం గురించి ఎనిమిది ఇన్వెస్టిగేటింగ్ ఏజెన్సీలకు వివరాలను అందజేసింది. విచారణ నేపథ్యంలో డాక్టర్స్ నుండి, పోలీసు అధికారుల నుంచి, న్యాయాధికారుల నుంచి ఎంతో వ్యతిరేకతను ఎదుర్కొంది. ఈ న్యాయస్థానాల వల్ల జరిగేది ఏమీ లేదని గ్రహించింది. తనకు న్యాయం కావాలని ప్రజల్లోకి వెళ్లింది. 26సంవత్సరాల నుంచి ఈ పోరాటం సాగుతూనే ఉంది. ఆమె మొదటిరోజు ఏ అంశంమీదైతే పోరాటం మొదలుపెట్టిందో దానిమీదే ఇప్పటికీ పోరాటం చేస్తుంది. ఆమె కేసులో తీర్పు ఇచ్చే జడ్జీలు ఇప్పటివరకు ఐదుగురు మారారు.

భన్వారీ ఎవరిమీదైతే కేసు పెట్టిందో వారిని జడ్జి వివిధ రకాల కారణాలు చూపించి నిర్దోషులుగా బయటకు పంపించేశారు. ఆ విషయాలేమిటంటే...

- ఒక గ్రామపెద్ద ఎప్పటికీ బలాత్కారమనే నేరానికి పాల్పడడు.
- భిన్న కులాలకు సంబంధించిన వ్యక్తులు కలిసి కట్టుగా ఈ నేరానికి ఎప్పటికీ పాల్పడరు.
- 60-70 సంవత్సరాల వ్యక్తి బలాత్కారం చేయలేడు.
- ఏ వ్యక్తి అయినా బంధువుల మధ్యలో ఇలా అఘాయిత్యాలకు పాల్పడరు. ఈమె కేసులో నిందితులు ఇద్దరే. వారు కూడా ఒకే కుటుంబానికి చెందినవారు. వారెవరంటే మేనమామ, మేనల్లుడు.
- ఉన్నత కులానికి చెందిన వ్యక్తి తక్కువ కులానికి చెందిన మహిళపై ఇలాంటి నేరాలు ఎప్పటికీ చేయడు.

ఇలాంటి కారణాలు చూపించి కేసు తప్పుదోవ పట్టించారు. ఈ తీర్పు వెలువడిన తరువాత ఎంతోమంది ఆమెకు మద్దతుగా నిలబడ్డారు. ఎన్‌జీవో సంస్థలు, మహిళాసంఘాలు తీర్పుకు నిరసనగా ఆమె తరపున ర్యాలీలు నిర్వహించి న్యాయం కోసం రాజస్థాన్ హైకోర్టును డిమాండ్ చేయడంతో ఇప్పటివరకు ఒకసారి మాత్రమే కేసు విచారణ జరిగింది.

''నేను నా పోరాటాన్ని నా చివరి శ్వాస వరకు కొనసాగిస్తాను. నా పోరాటం సమాజం మీద. ఇప్పటికీ బాల్యవివాహాలు జరుగుతూనే ఉన్నాయి. బాల్యవివాహాలు చట్టవిరుద్ధమని తెలిసినా అలాగే చేస్తున్నారు. చట్టం ఉంటే ఒక్కటి సరిపోదు.



మహిళలు, సమాజం తమ సహకారాలను అందిస్తేనే ఈ పోరాటానికి విజయం చేకూరుతుంది. సామాజిక నేరాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాటం చేసేలా మారాలి'' అని సమాజానికి పిలుపునిచ్చారు.

2002, 2011 సెన్సస్ లెక్కల ప్రకారం భారతదేశంలోని 20 శాతం మహిళలు, 15.3మిలియన్ బాలికలకు 18సంవత్సరాలు నిండకుండానే వివాహాలు జరుగుతున్నాయి. ఇవన్నీ2006, బాల్యవివాహ వ్యతిరేక చట్టానికి విరుద్ధంగా జరుగుతున్నవే. చట్టవ్యతిరేకమైనవే. భన్వారీదేవి ఉంటున్న రాజస్థాన్‌లోనే ఎక్కువ బాల్య వివాహ కేసులు నమోదు కావడం గమనించాల్సిన అంశం.

కొత్త చట్టాలకు పునాది

ఈ ఉద్యమంతో కొత్తచట్టాలకు పునాది ఏర్పడింది. ఉద్యోగం చేసే మహిళకు భద్రత ఎక్కడుందీ? అనే నినాదాన్ని లేవదీశారు. ఉద్యోగసమయంలో ఇటువంటి అఘాయిత్యాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. భన్వారీ దేవి కేసులో గ్రామసభ్యులు, ఊరి ప్రజలు బాధ్యత లేదని చెప్పారు కదా. మరి ఇక్కడ ఎవరు బాధ్యతవహిస్తారని భారత్ జ్ఞ్యాన్ విజ్ఞాన్ సమితి వాలంటీర్ కోమల్ శ్రీ వాస్తవ ప్రశ్నించారు. ఆమె 20 సంవత్సరాల నుండి భన్వారీ దేవితో పోరాటంలో కొనసాగుతున్నారు. పనిచేసే ప్రదేశంలో ఇటువంటి ఘోరాలు జరిగితే దానికి బాధ్యత అక్కడున్నవారే స్వీకరించాలని ఢిల్లీకి చెందిన ఎన్‌జీవో సంస్థలు, ఉద్యమకారిణిలు, మహిళాసంఘాలు సుప్రీం



కోర్టులో పిటీషన్ వేశారు. మహిళ భద్రతే మా లక్ష్యం అనే స్లోగన్‌తో ఎన్నో ర్యాలీలు నిర్వహించారు.

జీవిత పోరాటం కొనసాగుతూనే ఉంది

26 సంవత్సరాలు గడిచినా భన్వారీదేవి కేసు ఇప్పటికీ రాజస్థాన్ హైకోర్టులో పెండింగ్ కేసుల్లో ఉంది. ఆమె ఇప్పటికీ జైపూర్‌కి 30 కిలోమీటర్ల దూరంలో భటేరీ గ్రామం లోనే నివసిస్తున్నారు. 1992లో ఆమె పట్ల జరిగిన సంఘటన తరువాత జరిగిన పోరాటం వల్ల నేడు రాజస్థాన్‌లో గృహహింసలో గానీ, బాల్యవివాహాల నిరోధం పట్ల ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుంటుంది. రాజస్థాన్‌కి చెందిన వెల్ఫేర్ ఆఫ్ ఉమెన్ అండ్ చిల్డ్రన్‌కి సంబంధించిన కార్యక్రమంలో పనిచేస్తూ తన జీవనాధారానికి కావలసిన ధనాన్ని సమకూర్చుకుంటుంది. గ్రామంలో ఎంబ్రాయిడరీ పని, దుపట్టాలకు డిజైనింగ్ పనిచేయడం, డ్రస్సులు కుట్టడం లాంటివి చేస్తుంది. వచ్చిన డబ్బులతోనే జీవనం కొనసాగిస్తున్నారు.

ఇన్నిసంవత్సరాల న్యాయపోరాటంలో ఆమె ధైర్యాన్ని మెచ్చుకుంటూ వివిధ సంస్థల నుంచి ఎన్నో అవార్డులను అందు కున్నారు. 2017 మార్చి8వతేదీన ది ఢిల్లీ కమిషన్ ఫర్ ఉమెన్ ఆమెను ఉత్తమ మహిళగా గుర్తించి అవార్డు ప్రదానం చేశారు. 1994లో నీర్జా భానోత్ మెమోరియల్ అవార్డు అందుకున్నారు.

''ఈ పోరాటంలో నాకేమీ జరిగినా పరవాలేదు. నేనేమీ భయపడను. నేను న్యాయంకోసం పోరాడుతూనే ఉంటాను. నాకోసమే కాదు ఈ పోరాటం. లింగవివక్ష ఉండకూడదని, బాల్యవివాహాలు నిరోధించాలని, అన్నకు చెల్లికి ఒకేవిధంగా రోటీలు లభించేలా సమానత్వం పాటించేలా సమాజం మారాలన్నదే నాఆశ. ఇది జరిగే వరకూ నా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది'' అని భన్వారీదేవి చెప్పింది.

ఆమెలోని ఆత్మస్థైర్యం నేటికీ తగ్గలేదు. ఈ సంఘటన జరిగి 26 సంవత్సరాలు గడిచినా న్యాయంకోసం ఆమె పోరాడుతూనే ఉంది. చట్టాలు కొద్దిగా ఆలస్యంగా స్పందించినా న్యాయమే గెలుస్తుందని ఆమె నమ్మకం.

''మనం న్యాయం తప్పకుండా పొందుతాం. నా పోరాటం ఈనాటికోసం కాదు. నేను ముసలిగా అయిపోయాను. కొన్నిరోజుల్లో చనిపోతాను. కాని భవిష్యత్తులో ఏ ఆడపిల్లకు కూడా నాలాంటి పరిస్థితిని ఎదురు కాకూడదు. దీనికోసమే నా పోరాటం'' అని ఆమె ఎంతో ఆత్మవిశ్వాసంతో చెబుతుంది.

'అక్షర జ్యోతులు' వెలిగిస్తున్న సుశీల కోలి

దానాలలో కెల్లా విద్యాదానం మహత్తరమైనదని పండితులు చెబుతారు. అన్నదానం ఆకలిని తీర్చి ప్రాణాన్ని నిలబెడితే విద్యాదానం జీవితాన్ని నిలబెడుతుంది. మనిషిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ప్రతి ఒక్కరిలో బతకడానికి కావలసిన ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యంగా సాగుతోన్న మహిళ సుశీల కోలి.

స్ఫూర్తి



ఆమె మహారాష్ట్రలోని కొల్హాపూర్ గ్రామంలో లక్ష్మీనగర్ బస్తీలో ఉంటుంది. ఆ గ్రామంలో ఆమె నిస్వార్థంగా చేస్తున్న పనులను చూస్తే ఎవరికైనా స్ఫూర్తి కలగాల్సిందే. ఆ గ్రామానికే ఆమె నమ్మకంలా మారింది. ఆమె చూపిస్తున్న అసమాన ప్రతిభా పాటవాలకు ఎవరైనా ఆకర్షితులు కావాల్సిందే. విద్య విలువ తెలిసిన ఆమె దానిని నిరుపేద పిల్లలకు అందజేయాలన్న తపనతో జీవిస్తుంది. విద్యాదానమే ఒక ఉద్యమంగా ముందుకు నడుస్తోంది. సుశీల కోలి తన గ్రామంలో అంగన్‌వాడీలు లేకపోవడం వల్ల పిల్లలకు సరైన విద్య అందటం లేదని గమనించింది. ప్రీస్కూల్ చదువు అయిపోయాక పిల్లలు పొలాల్లో పనిచేసేవారికి సాయమందించే పనులకు వెళ్లడం కళ్లారా చూసింది. ఆ క్షణమే ఆమె నిర్ణయం తీసుకుంది ఈపిల్లల గురించి ఏమైనా చేయాలని. ఆమె స్వంతంగా అంగన్‌వాడీని బస్తీలో ప్రారంభించింది. అయితే గ్రామంలో ఎవరూ కూడా ఆమెకి సహాయమందించలేదు. ఆమె ప్రయత్నానికి కొద్దిలోకొద్దిగా ప్రభుత్వ సహాయం అందింది. అందుకనే ముందుగా అంగన్‌వాడీని తన ఇంటిలోనే ప్రారంభించింది. అప్పటి నుండి ఆమె రెండు సంవత్సరాల వరకు నడిపింది. ఆ తరువాత అంగన్‌వాడీని గుడికి దగ్గరలో ఉన్న ప్రదేశంలోకి మార్చింది.

అక్కడున్న పరిస్థితుల్లో పిల్లలు అంగన్‌వాడీకి రావడానికి ఇష్టపడేవారు కాదు. ఎందుకంటే తల్లిదండ్రులు వాళ్లని పొలాలకు తమవెంట తీసుకువెళ్లేవారు. అయినా ఆమె ఆగిపోలేదు. ప్రతి ఇంటికీ వెళ్లి చదువు విలువను తెలియజేస్తూ పిల్లలను తన దగ్గరికి పంపిస్తే మంచి విద్యాబుద్ధులు నేర్పుతానని అడిగేది. ఆమె చెప్పేది మొదట్లో గ్రామస్తులకు అర్థంకాకపోయినా నెమ్మదినెమ్మదిగా అర్థమయ్యింది. ఆ తరువాత వాళ్లే తమ పిల్లలను అంగన్‌వాడీకి పంపించడం మొదలుపెట్టారు. 1991లో ఆమె ప్రారంభించిన అంగన్‌వాడీ 2002 వరకు నిరంతరాయంగా నడిచింది. ఒక్కరి ఆధ్వర్యంలో మొదలుపెట్టిన ఈ ప్రాజెక్ట్ పదకొండు సంవత్సరాలు ఇలా కొనసాగడం నిజంగా ఒక రికార్డుగానే చెప్పవచ్చు. 11సంవత్సరాలు ఆమె ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఇప్పటివరకు 250మంది పిల్లలకు తన విద్యను అందించింది. అదీ ఉచితంగానే. ఆమె దగ్గరకు వచ్చే పిల్లలు తక్కువ ఆదాయం గల కుటుంబాలకు చెందినవారు కావడంతో ఫీజు గురించి ఎప్పుడూ ఆలోచించలేకపోయింది. ఒకొక్కప్పుడు తల్లిదండ్రులు వాళ్ల సంతృప్తికోసం ఆహారధాన్యాలు తెచ్చి ఇచ్చేవారు. అంతేకాని ఆమెప్పుడూ డబ్బును వారి నుంచి ఆశించలేదు. ఈ అంగన్‌వాడీ ప్రభుత్వ స్కూల్ కింద 2003-2004లో బస్తీకి దగ్గరలోనే 'బాల్‌వాడీ విద్యామందిర్' గా మారింది.

సుశీల బాబురావ్ కోలిని వివాహం చేసుకుంది. అతను రైతుకూలీ. అతనికి రెండవ వివాహమిది. మొదటి భార్యకు ఇద్దరు కొడుకులున్నారు. ఇద్దరు పిల్లల తండ్రిని సుశీల పెళ్లి చేసుకోవడం ఆమె తల్లిదండ్రులకు ఇష్టంలేదు. అయినా ఆమె చేసుకుంది. ఆమెలోని ఆత్మవిశ్వాసం, ధైర్యం, పట్టుదలను గమనించిన బాబురావ్ తన కుటుంబానికి ఆమె అవసరమెంతో ఉన్నదని గమనించాడు. ఆమెనే వివాహం చేసుకున్నాడు. ఆమె వచ్చాక అతని జీవితం పూర్తిగా మారిపోయింది. నాల్గవ తరగతి నుంచి ఇంటి ఆర్థికపరిస్థితులు అస్తవ్యస్తంగా మారడంతో స్కూలుకి వెళ్లడం మానివేశాడు. చదువుకోవాలని మనసులో ఎంత తపన ఉన్నా బాధ్యతలు అవకాశాలు కల్పించలేదు.

''నా పిల్లలను రైతుకూలీల్లా చూడకూడదని నేనెప్పుడూ అనుకునేవాడ్ని. వారికైనా మంచి చదువులు చెప్పించాలని మనసులో కోరుకునేవాడిని. సుశీల కోలి రాకతో నా కలనెరవేరింది. ఈరోజు నా పిల్లల్ని చూసి గ్రామంలో అందరూ ఆశ్చర్యపోతున్నారు. రైతుకూలీ పిల్లలు ఇంత బాగా ఎలా చదువుకోగలిగేరా సంశయంగా చూస్తున్నారు. మా పెద్దకొడుకు దగ్గరలో ఉన్న గ్రామంలో టీచర్‌గా పనిచేస్తున్నాడు. చిన్నాయన థానేలో అసిస్టెంట్ పోలీసాఫీసర్‌గా పనిచేస్తున్నాడు. వీరిద్దరే కాకుండా సుశీలకు,తనకు పుట్టిన బాబు జియోగ్రఫీ ఇన్ చాల్‌కారంజీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడని, పిహెచ్‌డి కూడా కంప్లీంట్ చేశాడు'' అని ఎంతో సంతోషంగా చెబుతున్నాడు బాబురావు. పిల్లలకు చదువు నేర్పుతుంటే వచ్చే ఆనందం నాకు ఏ విషయంలోనూ లభించలేదని ఆమె ఎంతో సంతోషంగా అన్నారు. విద్య వినయంతో పాటు మనిషిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ప్రతి ఒక్కరూ కూడా ఈ వృత్తినే ఆశ్రయించి ఎంతోమంది విద్యావంతులను తయారుచేయాలని ఆమె చిరునవ్వుతో పిలుపునిస్తున్నారు. ఎవ్వరి సహాయం కోసం ఎదురుచూడకుండా తను అనుకొన్న లక్ష్యాన్ని ఒంటరిగా చేరుకున్న సుశీల కోలికి అభినందనలు తెలియజేయాల్సిందే.

భారతదేశంలో నిర్మల్ భారత్ అభియాన్ కార్యక్రమంలో ప్రతి ఇంటిలో మరుగుదొడ్ల నిర్మాణం యుద్ధప్రాతిపదికన జరుగుతోంది. పరిసరాల పరిశుభ్రతే ధ్యేయంగా సాగుతోంది ఈ కార్యక్రమం. ప్రజలుకూడా ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. స్వచ్ఛభారత్ మిషన్‌కింద పనులు ప్రతిచోట చాలా వేగంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగానే కర్ణాటకలో కేవలం బాలికలు, మహిళలకు సంబంధించిన టాయిలెట్లను ప్రత్యేకంగా నిర్మిస్తున్నారు. ఈ టాయిలెట్లను వారు సులభంగా గుర్తించే విధంగా ఉండేటట్టు వీటికి పింక్ కలర్ పెయింట్ వేస్తున్నారు. పింక్ కలర్ అంటే మహిళా సంరక్షణ గుర్తు. ఇలా నిర్మించాలని నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్‌రైట్స్(ఎన్‌సిపిసిఆర్)సూచించింది. ఈ కమిషన్ కర్ణాటక రాష్ట్రం మొత్తం ఈవిధంగా టాయిలెట్స్‌ను నిర్మించాలని ఆదేశాలు జారీచేసింది. ఈ టాయిలెట్స్ మహిళల

పింక్ మహిళా శౌచాలయ్

నూతనం



సౌకర్యార్థం ఇండియన్ స్టైల్, వెస్టర్న్ స్టైల్‌లో నిర్మిస్తున్నారు. పిల్లలకు తక్కువ ఎత్తు ఉన్న టాయిలెట్స్‌ను, బేసిన్ టాయిలెట్స్‌ను నిర్మిస్తున్నారు. దీని పరిశుభ్రతా బాధ్యతలను పర్యవేక్షించడానికి ఫీమేల్ కేర్‌టేకర్‌ని సూపర్‌వైజర్‌గా నియమిస్తున్నారు. 24గంటలూ ఇవి అందుబాటులో ఉండేవిధంగా ఈ కార్యక్రమాన్నిచేపడుతున్నారు. ఇటువంటి ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటే బాలికలు, మహిళలు ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడకుండా కాపాడవచ్చని కృపా అల్వా చైర్‌పర్సన్ ఆఫ్ ది కర్ణాటక స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్‌రైట్స్ అన్నారు. ఈ పింక్ టాయిలెట్స్‌ని మహిళల కోసమే ప్రత్యేకంగా ప్రభుత్వ ఆఫీసులలోను, డిపార్ట్‌మెంట్స్‌లలోనూ నిర్మించేలా చర్యలు తీసుకుంటామని కర్ణాటక ప్రభుత్వం చెబుతుంది. ఈ టాయిలెట్లలో సానిటరీ నాప్‌కిన్స్ అమ్మే మిషన్లు, వాటిని కాల్చివేసే మిషన్లను ఏర్పాటుచేసే విధంగా ఆదేశాలు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి వినతి పత్రాలు పంపామని కృపా అల్వా అన్నారు.

ఎవరితోనైనా మల్టీస్టారర్‌కు రెడీ

- రవితేజ



ప్రేక్షకుల అభిరుచిలో మార్పు వచ్చింది. ఒకప్పుడు ఆదరించినట్టుగా ఫీల్‌గుడ్ సినిమాలను, ప్రయోగాత్మక సినిమాలను మళ్లీ ఆదరిస్తున్నారు. గతంలో నేను చేసిన నా ఆటోగ్రాఫ్ స్వీట్ మెమొరీస్ చిత్రం ఇప్పుడొచ్చినట్లయితే చాలా గొప్పగా ఆడేదేమో అన్న అభిప్రాయాన్ని హీరో రవితేజ వ్యక్తంచేశారు. తాను కథానాయకుడిగా నటించిన టచ్ చేసి చూడు చిత్రం విడుదలకు సిద్ధమైన నేపథ్యంలో పాత్రికేయులతో రవితేజ కొద్దిసేపు ముచ్చటించారు.

నా ఆటోగ్రాఫ్ తరహా సినిమా చేయబోతున్నా

నా ఆటోగ్రాఫ్, శంభో శివశంభో, ఈ అబ్బాయి చాలా మంచోడు నాకు నచ్చిన చాలా మంచి సినిమాలు. అయితే అంచనాలకు తగ్గట్టుగా అవి ఆడలేదు. ఆ సినిమాలొచ్చినప్పటి పరిస్థితులు వేరు. ఇప్పుడైతే ఆ సినిమాలను ప్రేక్షకులు చాలాబాగా ఆదరించేవారనిపిస్తోంది. నేను ఎక్కువగా యాక్షన్, కమర్షియల్ ఎంటర్‌టైనర్ చిత్రాలు చేస్తున్నప్పటికీ తప్పకుండా మంచికథలు లభిస్తే ఆ తరహా సినిమాలు చేయాలనుకుంటున్నాను. ఈ మధ్య నా ఆటోగ్రాఫ్ తరహా మంచికథను విన్నాను. ఆ కథతో సినిమా చేయబోతున్నా.

సంఖ్యతో నిమిత్తం లేదు

ఏడాదికి ఇన్ని సినిమాలే చేయాలని నేను ఎలాంటి నియమం కానీ లక్ష్యంగానీ పెట్టుకోలేదు. మంచికథలు లభించడాన్ని బట్టి ఎన్ని వీలైతే అన్ని చేసుకుంటూపోతాను. లోగడ ఏడాది గ్యాప్ తీసుకున్న తర్వాత నూతన సినిమాలు చేసుకుంటూ వెళ్లాను. అయితే సినిమా విడుదలైన తేదీని గుర్తుపెట్టుకుని చాలామంది రెండేళ్లు గ్యాప్ తీసుకున్నానని అనుకుంటున్నారు. కానీ అది కరెక్ట్ కాదు. గ్యాప్ తర్వాత చేసిన సినిమాలే ఇప్పుడు వరుసగా వస్తున్నాయి.



మంచి అవకాశం వస్తే హిందీలోనూ చేస్తా

ఉత్తరాదిలో ఏదైనా ఫంక్షన్‌కు వెళ్లినపుడు అక్కడ నా సినిమాలను చూసినవాళ్లు చూపిస్తున్న ప్రేమాభిమానాలు నన్నెంతో ఆశ్చర్యానికి గురిచేశాయి. తప్పకుండా హిందీలో మంచి అవకాశం వస్తే తప్పకుండా నటిస్తాను.

ఎవరితోనైనా కలిసి నటిస్తా

మల్టీస్టారర్ సినిమాలు చేసేందుకు నేను రెడీ. ఎవరితోనైనా చేయడానికి నాకెలాంటి సమస్యలేదు. ఇంతవరకు నా దగ్గరకు అలాంటి కథలేవీ రాలేదు. కథ నచ్చితే ఎప్పుడైనా సిద్ధమే. తెలుగులో మల్టీస్టారర్ ఒరవడి సీతమ్మవాకిట్లో...సిరిమల్లెచెట్టుతో మొదలై, అడపాదడపా ఆ తరహా ప్రయత్నాలకు పరిశ్రమ ఆసక్తి కనబరచడం ఆనందదాయకం.

దర్శకత్వం వహిస్తా...కానీ ఇప్పట్లో కాదు

దర్శకత్వశాఖ నుంచి ఆర్టిస్టుగా మారిన నేను ఎప్పటికైనా దర్శకత్వం వహించాలన్న ఆలోచనైతే ఉంది. ప్రస్తుతం ఆర్టిస్టుగా చాలాబాగా ఎంజాయ్ చేస్తున్నాను. అందుకే ఇప్పట్లో దర్శకత్వం గురించి ఆలోచించడం లేదు. భవిష్యత్‌లో తప్పకుండా డైరెక్షన్ చేస్తాను. అయితే ఆ చిత్రంలో నేను మాత్రం నటించను.

కల్యాణ్ కృష్ణ, శ్రీను వైట్ల చిత్రాలలో...

ప్రస్తుతం కల్యాణ్‌కృష్ణ దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తున్నాను. చిత్రీకరణ దశలో ఉన్న ఆ చిత్రం 25 శాతం పూర్తయింది. దీని తర్వాత శ్రీను వైట్ల దర్శకత్వంలో కూడా ఓ సినిమా చేయబోతున్నాను.

టచ్ చేసి చూడు ప్యాకేజ్‌డ్ చిత్రం

టచ్ చేసి చూడులో యాక్షన్, ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్ వంటి అన్ని అంశాలున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే యూత్, ఫ్యామిలీస్‌ను అందరినీ ఆకట్టుకునే ప్యాకేజ్‌డ్ చిత్రమిది.

గతంలో చేసిన పోలీస్ ఆఫీసర్ పాత్రలకు భిన్నంగా

గతంలో నేను చేసిన పోలీస్ ఆఫీసర్ పాత్రలకు భిన్నంగా టచ్ చేసి చూడు చిత్రంలోని పోలీస్ ఆఫీసర్ పాత్ర మలచబడింది. లోడగ నేను చేసిన పోలీస్ ఆఫీసర్ పాత్రలు సీరియస్‌గా ఉంటే...ఈ చిత్రంలోని పాత్ర వృత్తికి అంకితమై సీరియస్‌గా ఉంటూనే చాలా వినోదంతో రూపొందించబడింది. వాస్తవానికి నేను ఎంటర్‌టైన్‌మెంట్ అభిమానిని. ప్రేక్షకుడు సినిమా ఆనందించేలా ఉండాలని కోరుకుంటుంటాను. దర్శకుడిగా విక్రమ్‌కు తొలి చిత్రమైనప్పటికీ, రచయితగానే కాకుండా దర్శకత్వశాఖలోనూ పనిచేసి ఉండటం వల్ల ఈ చిత్రాన్ని అతనెంతో బాగా మలిచాడు. ఇందులో నాకు పంచ్ డైలాగులున్నాయి. అయితే అవి దర్శకుడు విక్రమ్ శైలిలో కొత్తగా ఉంటాయి. వాస్తవానికి అతను వేరొక కథ చెప్పాడు. ఆ కథను తర్వాత చేద్దామని అనుకున్నాం. అంతలోనే వక్కంతం వంశీ ఇచ్చిన కథతో ఈ సినిమాను చేశాం. జామ్ 8 అంటే సంగీతానికి చెందిన ఓ గ్రూప్ సభ్యులు. ఆ గ్రూప్ అలా పేరు పెట్టుకున్నారు. మణిశర్మ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కూడా చిత్రానికి ఓ ఆకర్షణగా నిలుస్తుంది. నిర్మాణపు విలువలు బావున్నాయి. చాలాకాలంగా ఈ బేనర్‌లో సినిమా చేయాలనుకున్నప్పటికీ ఇప్పటికి కుదిరింది అంటూ రవితేజ ఇంటర్వ్యూ ముగించారు.



రష్మిక మండన్న

ఛలో చిత్రం యూత్‌తో పాటు ఫ్యామిలీస్‌ను ఎంతగానో ఆకట్టుకుంటుందన్న అభిప్రాయాన్ని హీరోయిన్ రష్మిక మండన్న వ్యక్తంచేశారు. నాగశౌర్య, రష్మికమండన్న నాయకానాయికలుగా వెంకీ కుడుముల దర్శకత్వంలో శంకర్‌ప్రసాద్ ముల్పూరి సమర్పణలో ఉష ముల్పూరి నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో హీరోయిన్ రష్మిక మండన్న కొద్దిసేపు పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ వివరాలేమిటో ఆమె మాటల్లో...

అందరికీ కనెక్ట్ అయ్యే పాత్ర

కర్ణాటకలో పుట్టి పెరిగిన నేను అక్కడి కూర్గ్‌లో పదవ తరగతి వరకు చదువుకున్నాను. ఆ తర్వాత మైసూర్‌లో నా విద్యాభ్యాసం కొనసాగింది. బెంగళూరులో డిగ్రీ చదువుతున్న సమయంలో ఫ్రెష్‌ఫేస్ సంస్థ నిర్వహించిన పోటీలో పాల్గొన్నాను. ఇక అప్పట్నుంచి మోడలింగ్, సినిమా అవకాశాలు రావడం మొదలుపెట్టాయి. కన్నడంలో కిర్రాక్‌పార్టీ చిత్రం ద్వారా నా సినీరంగ ప్రవేశం జరిగింది. ఆ తొలి సినిమానే అద్భుత విజయం సాధించడంతో వెంట వెంటనే హీరోయిన్ అవకాశాలు వచ్చేశాయి.

కిర్రాక్‌పార్టీ తర్వాత కన్నడంలో అంజనీపుత్ర, చమక్ సినిమాలు చేశాను. ఈ నేపథ్యంలోనే తెలుగులో ఛలో సినిమాలో నాకు అవకాశం లభించింది. కిర్రాక్‌పార్టీ చిత్రం కోవలో ఛలోలో కూడా కాలేజీ స్టూడెంట్‌గా నటించాను. కిర్రాక్‌లో 60 శాతం పాత్ర నా నిజజీవితానికి దగ్గరగా ఉంటే...ఛలో చిత్రంలోని పాత్ర 40 శాతం దగ్గరగా ఉంటుంది. కన్నడంలో ఆ చిత్రం కోవలో తెలుగులో ఈ తొలి చిత్రం కూడా పేరు తెచ్చిపెడుతుందన్న నమ్మకం ఉంది. ఛలో చిత్రంలో బబ్లీగా నా పాత్ర రెగ్యులర్‌గా అనిపించినా దర్శకుడు చాలాబాగా మలిచారు. అందరికీ కనెక్ట్ అయ్యేలా నా పాత్ర ఉంటుంది. చక్కటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అలరింపజేస్తుంది.చిత్రం ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. ఇందులో నా పాత్ర పేరు ప్రస్తుతానికి సస్పెన్స్. సినిమా చూసే తెలుసుకోవాలి. సమష్టికృషికి దర్పణంగా నిలిచే చిత్రమిది. నాగశౌర్య మంచి సహ నటుడు. సంస్థ నిర్మాణ విలువలకు అత్యంత ప్రాధాన్యమిచ్చి ఈ చిత్రాన్ని నిర్మించింది. నా పాత్రకు నేనే తెలుగు డబ్బింగ్ చెప్పాను. దర్శక, నిర్మాతల ప్రోత్సాహమే ఇందుకు కారణం. మొదట్లో వచ్చీరాని తెలుగుతో డబ్బింగ్ ఎలా చెబుతానోనన్న భీతి కలిగింది. అయితే చిత్రబృందం సహకారంతో డబ్బింగ్ బాగా చెప్పగలిగాను. ఇకపై తెలుగులో నేను చేసే, చేయబోయే సినిమాలకు నేనే డబ్బింగ్ చెప్పుకోవాలని అనుకుంటున్నాను. ఏ తరహా సినిమా అయినా చేస్తాను కానీ అయితే కథ, నేను చేయబోయే పాత్ర నచ్చాలి. నటీమణులలో అనుష్క నాకు స్ఫూర్తి. ప్రస్తుతం కన్నడంలో ఓ చిత్రం చేస్తున్నాను. తెలుగులో విజయ్ దేవరకొండ కథానాయకుడిగా పరశురామ్ దర్శకత్వంలో గీతా ఆర్ట్స్ నిర్మిస్తున్న చిత్రంలో నటిస్తున్నాను. తెలుగులో నూతన చిత్రాలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. మూడవ చిత్రానికి సంబంధించి ఇంకా ఏదీ అంగీకరించలేదు అంటూ ముగించారు.



నివేద థామస్



విశ్వదేవ్ రాచకొండ, ప్రియాంక జైన్

ప్రేమతో చల్తే చల్తే

విశ్వదేవ్ రాచకొండ (పిట్టగోడ ఫేమ్) హీరోగా, ప్రియాంక జైన్ హీరోయిన్‌గా తెరకెక్కుతున్న చిత్రం చల్తే చల్తే. ప్రదీప్ కె.కె. దర్శకత్వంలో అమేజింగ్ ఆర్ట్స్ పతాకంపై శ్రీనివాసరావు పొట్లూరి, ప్రదీప్‌కుమార్ కోనేరు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం టీజర్ మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో విడుదలైంది. టీజర్‌ను నటుడు ఉత్తేజ్ విడుదలచేయగా, టైటిల్ లోగోను, బేనర్ లోగోను నిర్మాతలలో ఒకరైన శ్రీనివాసరావు పొట్లూరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు ప్రదీప్ మాట్లాడుతూ, ఈ చిత్రం టైటిల్ గురించి అనుకుంటున్నప్పుడు నటుడు ఉత్తేజ్ చల్తే చల్తే అంటూ సాధారణంగా మాటల్లో మాటగా సరదాగా అన్నారు. కానీ మా చిత్రకథకు ఆ టైటిల్ అన్నివిధాలా సరిపోవడంతో దానినే టైటిల్‌గా నిర్ణయించాం. ఓ అమ్మాయి, ఓ అబ్బాయి ప్రేమలో పడిన నేపథ్యంలో కలవడాలు..విడిపోవడాలతో ఎలాంటి పరిణామాలు జరిగాయన్న ఆసక్తికర కథాంశంతో కొత్తరకమైన ప్రేమకథతో ఈ చిత్రాన్ని మలిచాం. ఇందులో ఐదు పాటలున్నాయి. వాటిలో రెండు పాటలను మలేషియాలో చిత్రీకరించాం. నరేష్, రావు రమేష్ వంటి సీనియర్ నటుల పాత్రలు కూడా హైలైట్‌గా ఉంటాయి. యూత్‌క ు నచ్చే అంశాలతో పాటు సెంటిమెంట్‌కు అధిక ప్రాధాన్యమిచ్చి ఫ్యామిలీ ప్రేక్షకులను సైతం ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాం. కొత్త లొకేషన్లలో షూటింగ్ చేశాం అని చెప్పారు. హీరో విశ్వదేవ్ రాచకొండ మాట్లాడుతూ, ఆకట్టుకునే అన్ని అంశాలుండే ప్రేమకథాచిత్రమిది. నాకు మంచిపేరు తెచ్చిపెడుతుందన్న నమ్మకం ఉంది అని అన్నారు. హీరోయిన్ ప్రియాంకజైన్ మాట్లాడుతూ, మా స్వస్థలం బెంగళూరు. ఇందులో ఎన్.ఆర్.ఐ. పాత్రలో కనిపిస్తాను. టామ్ అండ్ జెర్రీ మాదిరిగా హీరోకు, నాకు మధ్య పాత్రల చిత్రణ ఉంటుంది అని అన్నారు. నటుడు ఉత్తేజ్ మాట్లాడుతూ, స్క్రిప్ట్, డైలాగ్స్ వంటివన్నీ పూర్తయిన తర్వాతే ఈ చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకుని వచ్చారని అన్నారు. ఇందులో ఓ చక్కటి పాత్రను పోషించానని చెప్పారు. నిర్మాతలలో ఒకరైన శ్రీనివాసరావు పొట్లూరి మాట్లాడుతూ, త్వరలోనే చిత్రం ఆడియోను విడుదల చేస్తామని చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో పలువురు చిత్రబృందం పాల్గొన్నారు.

కుటుంబకథా చిత్రం



సీనియర్ తారలు సుమన్, భానుచందర్, సుహాసిని ముఖ్యపాత్రధారులుగా, శ్రీకాంత్, హేమలత హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం నిన్నే చూస్తు. వీరభద్ర క్రియేషన్స్ పతాకంపై వి.ఎస్. ఫణీంద్ర దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. హేమలతా రెడ్డి నిర్మిస్తున్నారు. ఇటీవలే మొదటి షెడ్యూల్ పూర్తయింది. తాజాగా రెండవ షెడ్యూల్ చిత్రీకరణ మొదలైంది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేస్తున్నారు.

నిర్మాత హేమలతా రెడ్డి చిత్ర విశేషాలు తెలుపుతూ నిన్నే చూస్తు మంచి కుటుంబకథా చిత్రం. సీనియర్ నటులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. సుహాసినిగారు నటించడం మా అదృష్టం. మొదటి షెడ్యూల్ రష్ చూశాక సినిమా విజయంపై నమ్మకం మరింత పెరిగింది అన్నారు. ఇతర పాత్రల్లో కిన్నెర, కాశీవిశ్వనాథ్, నిహాల్, వేణు, మహేష్, ఫణి, జోతిరెడ్డి తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం రమణ్ రాథోడ్, ఛాయాగ్రహణం ప్రసాద్ ఈదర, మాటలు కరణ్ గోపిని, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వి.ఎస్. ఫణీంద్ర.



చెన్నై చిన్నోడు టీజర్ విడుదల

జీవీ ప్రకాష్ కుమార్, నిక్కీ గల్రానీ జంటగా నటించిన తమిళ చిత్రం తెలుగులో చెన్నై చిన్నోడు పేరుతో అనువాదమవుతోంది. వీడి లవ్‌లో అన్నీ చిక్కులే అనేది ఉపశీర్షిక. శాలిని దుర్గా ప్రొడక్షన్స్ పతాకంపై వి. జయంత్ కుమార్ ఈ చిత్రాన్ని టాలీవుడ్‌లోకి తీసుకొస్తున్నారు. యశ్వంత్ సాయికుమార్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. ఎం రాజేష్ దర్శకత్వం వహించిన చెన్నై చిన్నోడు టీజర్, ఫస్ట్ లుక్ విడుదల కార్యక్రమం హైదరాబాద్ ఫిలిం ఛాంబర్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్మాత కేవీవీ సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ...తమిళ్‌లో పెద్ద హిట్ అయిన చిత్రమిది. తెలుగులో మంచి టైటిల్‌తో జయంత్ అనువదిస్తున్నారు. నిర్మాతగా ఆయనకు తొలి సినిమా ఇది. నేను కూడా అనువాద చిత్రాలతో నిర్మాతగా ప్రయాణం మొదలుపెట్టాను. జయంత్ భవిశ్యత్‌లో మంచి సినిమాలు నిర్మించి పెద్ద నిర్మాతగా పేరు తెచ్చుకోవాలి. అన్నారు. నిర్మాత జయంత్ కుమార్ మాట్లాడుతూ...తమిళ సినిమా బాగా నచ్చడంతో ఇలాంటి మంచి సినిమాను తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాను. ఆద్యంతం కడుపుబ్బా నవ్వించే వినోదాత్మక చిత్రమిది. ప్రకాష్ రాజ్ పోలీసు పాత్ర చిత్రానికి ప్రధాన ఆకర్షణ అవుతుంది. జీవీ ప్రకాష్ కథానాయకుడిగా నటించడంతో పాటు మంచి సంగీతాన్ని అందించారు. అన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎన్ కృష్ణ పాటల రచయిత సి హెచ్ పూర్ణాచారి తదితరులు పాల్గొన్నారు.

మాస్ మహారాజాతో..

మాస్ మహరాజా రవితేజ నటిస్తున్న తాజా చిత్రం టచ్ చేసి చూడు ఫిబ్రవరి మొదటివారంలో ప్రేక్షకుల ముందుకువస్తోంది. ఈ చిత్రం విడుదలకు ముందుగానే రవితేజ నేల టికెట్ అనే సినిమాలో నటిస్తున్నారు. దీనికి కల్యాణ్ కృష్ణ దర్శకుడు మాళవిక హీరోయిన్‌గా నటిస్తోంది.

ఏడాదికి కనీసం రెండు సినిమాల్లో నటించే రవితేజ ఒక చిత్రం నిర్మాణంలో ఉండగానే మరో చిత్రం షూటింగ్ మొదలుపెడతారనే విషయం తెలిసందే. ఆ విధంగా నేల టికెట్ తర్వాత చిత్రం కూడా కమిటయ్యారు. శ్రీను వైట్ల దర్శకత్వంలో నటించడానికి అంగీకరించారు. వీరిద్దరి కాంబినేషన్‌లో నీ కోసం, వెంకి, దుబాయ్ శ్రీను వంటి చిత్రాలు వచ్చాయి. ఇవి మంచి విజయం సాధించాయి. అదే సెంటిమెంట్‌తో రవితేజ, శ్రీను వైట్ల కలయికలో మైత్రి మూవీ మేకర్స్ సంస్థ చిత్రాన్ని నిర్మించనుంది. వేసవిలో షూటింగ్ మొదలవుతుందని తెలిసింది. ఇందులో హీరోయిన్‌గా నివేద థామస్ నటించనుందని తెలిసింది. ఇంకా అధికారికంగా మాత్రం ప్రకటించలేదు. ఇకపోతే ఈ చిత్రం కోసం అనేక టైటిల్స్ పరిశీలిస్తున్నారు. వాటిలో అమర్ అక్బర్ ఆంథోని అనే టైటిల్ కూడా ఉందని తెలిసింది. అమితాబ్ నటించిన సూపర్‌హిట్ సినిమా టైటిల్ ఇది. రవితేజ అమితాబ్ అభిమాని అనే విషయం తెలిసిందే. టైటిల్‌లో ముగ్గురి పేర్లు ఉన్నాయి కాబట్టి ఈ చిత్రంలో రవితేజ మూడు పాత్రలు అంటే త్రిపాత్రాభినయం చేస్తున్నారని అంటున్నారు. అయితే దీనిపై స్పష్టతరావాల్సి ఉంది.